సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+8 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 42
శనివారం 4-5-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'


పుష్కర కాలం తర్వాత..
ముంబై వేదికలో ముంబై జట్టుపై 12 ఏళ్ల తర్వాత కోల్‌కతా గెలుపు - స్పోర్ట్స్‌లో


రికార్డు గరిష్టం నుంచి వెనక్కి..
నిఫ్టీ 172 పాయింట్లు పతనం.. 74 వేల స్థాయి దిగువకు సెన్సెక్స్ - బిజినెస్‌లో

పెంఛన్ ఎత్తేశారు!

బాబు సూపర్ సిక్స్‌లో మాయం.. అవ్వాతాతల పెన్షన్లపై పాపిష్టి కళ్లు

నరసాపురం, క్రోసూరు, కనిగిరి ఎన్నికల సభల్లో సీఎం జగన్ ధ్వజం



- బాబు కడుపుమంట ఇంకా చల్లారక పండుటాకులను బ్యాంకుల చుట్టూ తిప్పుతున్నాడు
- ఒక్క నెల ఓపిక పట్టండి.. మీ బిడ్డ తొలి సంతకం అవ్వాతాతల కోసమే
- మళ్లీ మనం రాగానే మీ ఇంటికే పెంఛన్లు.. పెరుగుదల కూడా కనిపిస్తుంది.. మన ఐదేళ్ల పాలనలో లంచాలు లేని సమాజాన్ని ఆవిష్కరించాం
- గ్రామ, వార్డు సచివాలయాలతో 600 సేవలు మన ఇంటికే నడిచి వస్తున్నాయి.. పేదల ఖాతాల్లోకి నేరుగా రూ.2.70 లక్షల కోట్లు
- నా తమ్ముళ్లు, చెల్లెమ్మలకు 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం
- ఈ మంచిని కొనసాగించేందుకు రెండు ఓట్లు ఫ్యాన్‌కే వేయండి
- విలువలు, విశ్వసనీయతలను గెలిపించండి

8లో

వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు 'ఫ్యాన్'ను ప్రజలకు చూపిస్తున్న సీఎం జగన్

రాకముందే అవ్వాతాతలకు అవస్థలు

14 ఏళ్లు అధికారంలో ఉండీ ఏ పేదవాడికీ, ఏమీ చేయని చంద్రబాబు ఈనాడులో ఇచ్చిన ప్రకటన చూశారా? సూపర్ సిక్స్‌లో అవ్వాతాతల పెన్షన్‌ను అప్పుడే ఎత్తేశారు. సూపర్ సిక్స్‌లో అవ్వాతాతల పెన్షన్ మీకు ఎక్కడైనా కనిపించిందా? చంద్రబాబు రాకముందే అవ్వాతాతలు బ్యాంకుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ ఎండనకా వాననకా తిరగాల్సిన పరిస్థితులు వచ్చేశాయి. ఇక పొరపాటున చంద్రబాబు పాలన వస్తే చంద్రముఖి మళ్లీ నిద్రలేస్తుంది. అవ్వాతాతలు ప్రతి ఒక్కరూ ఇది జ్ఞాపకం పెట్టుకోమని కోరుతున్నా.. - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాయంత్రం 4.15 గంటలకు..
ప్రకాశం జిల్లా కనిగిరిలో సీఎం జగన్ సభకు హాజరైన అశేష జనసందోహంతో నిండిపోయిన మూడు రోడ్ల కూడలి

కందికుంట అడ్డంగా దొరికినా..

పురోగతి లేని రూ.2 కోట్ల కేసు

- కేసును పోలీసులు తాత్సారం చేస్తుండటంపై సర్వత్రా చర్చ.. ఈ నెల 2న ఆర్వోకి సమాచారమిచ్చామన్న సీఐ క్రాంతికుమార్
- తనకు ఇప్పటికీ వివరాలు ఇవ్వలేదని 3వ తేదీన చెప్పిన ఆర్వో.. దీన్నిబట్టి చూస్తే.. కేసు నుంచి కందికుంటను తప్పించే యత్నం
- ఆధారాలున్నా చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు
- ఆర్వోకు ఆధారాలివ్వకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారో?

7లో


కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ కారు నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న డబ్బులు



కుటుంబంలో చిచ్చుపెట్టారు

- అయినా భయపడేది లేదు
- నా కుమార్తెతో ఆమె మామ, జనసేన నేతలు మాట్లాడించారు
- పెళ్లయ్యాక ఆమె మెట్టినింటి మనిషి
- జగన్‌కు తోడుగా ఉండటానికే వైఎస్సార్‌సీపీలో చేరా
- సీఎం సంక్షేమ పథకాలు పేదలకు ఊపిరి పోశాయి
- కుమార్తె క్రాంతి విడుదల చేసిన వీడియోపై ముద్రగడ

14లో



ఈ దొంగల్ని నమ్మొద్దు

వలంటీర్ల పేరుతో టీడీపీ కొత్త మోసం

కొత్త వలంటీర్లంటూ కొందరు యువకులను ఇంటింటికీ పంపిస్తున్న టీడీపీ

టీడీపీకి ఓటు వేయాలని వారి ద్వారా ప్రలోభాలు

చిత్తూరు రూరల్‌లో వెలుగులోకి నయా మోసం

7లో



వెస్టిండీస్ టి20 జట్టులో షమర్ జోసెఫ్

వచ్చే నెలలో జరిగే పురుషుల టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో పాల్గొనే వెస్టిండీస్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన వెస్టిండీస్ జట్టుకు రోవ్‌మన్ పావెల్ సారథ్యం వహిస్తాడు. మెకాయ్, ఒషానె థామస్, కైల్ మేయర్స్‌లకు స్థానం దక్కలేదు. విండీస్ పేస్ బౌలింగ్ కొత్త సంచలనం షమర్ జోసెఫ్‌కు తొలిసారి టి20 జట్టులో చోటు లభించింది. ఈ ఏడాది ఆస్ట్రేలియా పర్యటనలో 24 ఏళ్ల షమర్ బ్రిస్బేన్ టెస్టులో 8 వికెట్లు పడగొట్టి 27 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై విండీస్‌కు టెస్టు విజయాన్ని అందించి అందరి దృష్టిని ఆకర్షించాడు. టి20 ప్రపంచకప్ టోర్నీకి జూన్ 2 నుంచి 29 వరకు వెస్టిండీస్–అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనుంది.

వెస్టిండీస్ జట్టు: రోవ్‌మన్ పావెల్ (కెప్టెన్), అల్జారి జోసెఫ్ (వైస్ కెప్టెన్), జాన్సన్ చార్లెస్, రోస్టన్ చేజ్, షిమ్రన్ హెట్‌మైర్, జేసన్ హోల్డర్, షై హోప్, అకీల్ హొసీన్, బ్రాండన్ కింగ్, గుడకేశ్ మోతీ, నికోలస్ పూరన్, ఆంద్రీ రసెల్, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్, రొమారియో షెఫర్డ్, షమర్ జోసెఫ్.

ఆరో ర్యాంక్‌లో గుకేశ్

ప్రపంచ చెస్ ర్యాంకింగ్స్



గుకేశ్‌కు కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ సన్మానం

చెన్నై: గత నెలలో క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్, తమిళనాడు టీనేజర్ దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ చెస్ ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించాడు. గత నెలలో 16వ స్థానంలో ఉన్న గుకేశ్ తాజా ర్యాంకింగ్స్‌లో ఏకంగా 10 స్థానాలు ఎగబాకి 6వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. క్యాండిడేట్స్ టోర్నీ ప్రదర్శనతో గుకేశ్ 21 రేటింగ్ పాయింట్లు సాధించాడు. ప్రస్తుతం గుకేశ్ ఖాతాలో 2764 రేటింగ్ పాయింట్లున్నాయి. తెలంగాణకు చెందిన గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 2761 రేటింగ్ పాయింట్లతో తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచాడు. భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ 2751 రేటింగ్ పాయింట్లతో 11వ స్థానంలో ఉన్నాడు. భారత ఇతర గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద 14వ ర్యాంక్‌లో, విదిత్ 28వ ర్యాంక్‌లో, పెంటేల హరికృష్ణ 37వ ర్యాంక్‌లో ఉన్నారు. మహిళల చెస్ ర్యాంకింగ్స్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి 5వ ర్యాంక్‌లో, ద్రోణవల్లి హారిక 11వ ర్యాంక్‌లో, వైశాలి 13వ ర్యాంక్‌లో ఉన్నారు.

రన్నరప్ అర్జున్



మాల్మో (స్వీడన్): టెపె సెజెమన్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ రన్నరప్‌గా నిలిచాడు. ఎనిమిది మంది గ్రాండ్ మాస్టర్ల మధ్య ఏడు రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో పీటర్ స్విడ్లెర్ (రష్యా), అర్జున్, నొదిర్‌బెక్ అబ్దుసత్తొరోవ్ (ఉజ్బెకిస్తాన్) 4.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచారు. విజేతను నిర్ణయించడానికి ఈ ముగ్గురి మధ్య బ్లిట్జ్ గేమ్ టైబ్రేక్ నిర్వహించారు. టైబ్రేక్‌లో అర్జున్, నొదిర్‌బెక్ చేతిలో స్విడ్లెర్ ఓడిపోయాడు. దాంతో అర్జున్, నొదిర్‌బెక్ టైటిల్ కోసం తలపడ్డారు. అర్జున్, నొదిర్‌బెక్ మధ్య రెండు గేమ్‌లు నిర్వహించగా... తొలి గేమ్‌ను అర్జున్ 'డ్రా' చేసుకొని, రెండో గేమ్‌లో ఓడిపోవడంతో నొదిర్‌బెక్ చాంపియన్‌గా అవతరించాడు.

పుష్కర కాలం తర్వాత...

ముంబైలో ముంబై ఇండియన్స్‌పై కోల్‌కతా విజయం

24 పరుగులతో నెగ్గిన నైట్‌రైడర్స్ • రాణించిన వెంకటేశ్ అయ్యర్, స్టార్క్


ముంబై: వాంఖెడే మైదానంలో 12 సంవత్సరాల తర్వాత కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) మెరిసింది. 2012లో చివరిసారిగా ఈ వేదికపై ముంబై ఇండియన్స్ జట్టును ఓడించిన కోల్‌కతా ఇప్పుడు మళ్లీ గెలుపు బావుటా ఎగురవేసింది. శుక్రవారం జరిగిన ఈ పోరులో కేకేఆర్ 24 పరుగుల తేడాతో ముంబైని ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 19.5 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌటైంది. వెంకటేశ్ అయ్యర్ (52 బంతుల్లో 70; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... మనీశ్ పాండే (31 బంతుల్లో 42; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం ముంబై 18.5 ఓవర్లలో 145 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది. సూర్యకుమార్ యాదవ్ (35 బంతుల్లో 56; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా, కోల్‌కతా పేసర్ స్టార్క్‌కు 4 వికెట్లు దక్కాయి.

ఆదుకున్న వెంకటేశ్...

కోల్‌కతా ఇన్నింగ్స్‌లో 6.1 ఓవర్లు ముగిసేసరికే సగం జట్టు అవుట్! తుషార బౌలింగ్ జోరుతో మొదలైన జట్టు పతనం వేగంగా సాగింది. తన తొలి ఓవర్లోనే సాల్ట్ (5)ను అవుట్ చేసి శుభారంభం అందించిన తుషార... రెండో ఓవర్లో రఘువంశీ (13), శ్రేయస్ అయ్యర్ (6)లను వెనక్కి పంపాడు. పాండ్యా తొలి ఓవర్లోనే నరైన్ (8) కూడా పెవిలియన్ చేరగా, రింకూ సింగ్ (9) విఫలమయ్యాడు. ఈ దశలో వెంకటేశ్, పాండే కలిసి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఆశించిన స్థాయిలో భారీ షాట్లు కొట్టకపోయినా ఇన్నింగ్స్ కుప్పకూలిపోకుండా వీరు కాపాడారు. ఆరో వికెట్‌కు 62 బంతుల్లో 83 పరుగులు జత చేసిన అనంతరం పాండే వెనుదిరిగాడు. సమన్వయ లోపంతో రసెల్ (7) రనౌట్ కావడం చివరి ఓవర్లలో కేకేఆర్ స్కోరింగ్ అవకాశాలను దెబ్బ తీసింది. 36 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న వెంకటేశ్ తర్వాతి 16 బంతుల్లో 20 పరుగులే చేయగా... ఆఖరి 5 ఓవర్లలో 41 పరుగులే చేసి నైట్‌రైడర్స్ 5 వికెట్లు చేజార్చుకుంది.

సూర్యకుమార్ అర్ధసెంచరీ...

ఛేదనలో ముంబై కూడా తడబడింది. కేకేఆర్ బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించడంతో పవర్‌ప్లే ముగిసేసరికి ఇషాన్ కిషన్ (13), నమన్ (11), రోహిత్ శర్మ (11) వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత 10 పరుగుల వ్యవధిలో తిలక్ వర్మ (4), నేహాల్ వధేరా (6), హార్దిక్ పాండ్యా (1) కూడా వెనుదిరిగారు. అయితే ఈ దశలో సూర్యకుమార్ దూకుడైన బ్యాటింగ్ ముంబై విజయంపై ఆశలు రేపింది. అరోరా వేసిన ఓవర్లో 3 ఫోర్లు, సిక్స్ బాదిన సూర్య 30 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. విజయానికి 28 బంతుల్లో 50 పరుగులు కావాల్సిన స్థితిలో సూర్య అవుట్ కావడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. చివర్లో టిమ్ డేవిడ్ (20 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్) కొంత పోరాడినా లాభం లేకపోయింది. 19వ ఓవర్లో స్టార్క్ 3 వికెట్లు తీసి మ్యాచ్‌ను ముగించాడు.



స్టార్క్

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) తిలక్ (బి) తుషార 5; నరైన్ (బి) పాండ్యా 8; రఘువంశీ (సి) సూర్యకుమార్ (బి) తుషార 13; శ్రేయస్ (సి) డేవిడ్ (బి) తుషార 6; వెంకటేశ్ (బి) బుమ్రా 70; రింకూ సింగ్ (సి అండ్ బి) చావ్లా 9; పాండే (సి) (సబ్) బ్రెవిస్ (బి) పాండ్యా 42; రసెల్ (రనౌట్) 7; రమణ్‌దీప్ (సి) కొయెట్జీ (బి) బుమ్రా 2; స్టార్క్ (బి) బుమ్రా 0; అరోరా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 169. వికెట్ల పతనం:** 1–7, 2–22, 3–28, 4–43, 5–57, 6–140, 7–153, 8–155, 9–155, 10–169. **బౌలింగ్:** తుషార 4–0–42–3, బుమ్రా 3.5–0–18–3, కొయెట్జీ 2–0–24–0, పాండ్యా 4–0–44–2, నమన్ 3–0–25–0, చావ్లా 3–0–15–1.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (బి) స్టార్క్ 13; రోహిత్ శర్మ (సి) పాండే (బి) నరైన్ 11; నమన్ (బి) వరుణ్ 11; సూర్యకుమార్ (సి) సాల్ట్ (బి) రసెల్ 56; తిలక్ (సి) నరైన్ (బి) వరుణ్ 4; వధేరా (బి) నరైన్ 6; పాండ్యా (సి) పాండే (బి) రసెల్ 1; డేవిడ్ (సి) శ్రేయస్ (బి) స్టార్క్ 24; కొయెట్జీ (బి) స్టార్క్ 8; చావ్లా (సి) నరైన్ (బి) స్టార్క్ 0; బుమ్రా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (18.5 ఓవర్లలో ఆలౌట్) 145. వికెట్ల పతనం:** 1–16, 2–38, 3–46, 4–61, 5–70, 6–71, 7–120, 8–144, 9–144, 10–145. **బౌలింగ్:** అరోరా 3–0–35–0, స్టార్క్ 3.5–0–33–4, వరుణ్ 4–0–22–2, నరైన్ 4–0–22–2, రసెల్ 4–0–30–2.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వెంకటేశ్ అయ్యర్

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	10	8	2	16	0.622
కోల్‌కతా	10	7	3	14	1.098
లక్నో	10	6	4	12	0.094
హైదరాబాద్	10	6	4	12	0.072
చెన్నై	10	5	5	10	0.627
ఢిల్లీ	11	5	6	10	-0.442
పంజాబ్	10	4	6	8	-0.062
గుజరాత్	10	4	6	8	-1.113
ముంబై	11	3	8	6	-0.356
బెంగళూరు	10	3	7	6	-0.415

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు × గుజరాత్

వేదిక: బెంగళూరు

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

పదేళ్ల తర్వాత దక్షిణాఫ్రికాతో టెస్టు

- వచ్చే నెలలో భారత్‌లో దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్టు పర్యటన
- వన్డే, టి20 సిరీస్‌లు కూడా ఆడనున్న సఫారీ బృందం



బెంగళూరు: భారత్‌లో దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్టు పర్యటన ఖరారైంది. వచ్చే జూన్, జూలైలో పూర్తిసాయి ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా భారత్‌తో దక్షిణాఫ్రికా ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టి20 మ్యాచ్‌లు ఆడుతుంది. ముందుగా బెంగళూరులో జూన్ 16న వన్డే సిరీస్ మొదలవుతుంది. 19న రెండో వన్డే, 23న మూడో వన్డేతో 50 ఓవర్ల ఫార్మాట్ ముగుస్తుంది. వన్డే సిరీస్ ముగిశాక ఏకైక టెస్టు పోరు జూన్ 28 నుంచి చెన్నైలో జరుగుతుంది. భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఇది కేవలం మూడో టెస్టు కానుంది. దక్షిణాఫ్రికాలోని పార్ల్ వేదికగా ఈ రెండు జట్ల మధ్య తొలి టెస్టు 2002లో... భారత్‌లోని మైసూరు వేదికగా రెండో టెస్టు 2014లో జరిగాయి. ఆ తర్వాత ఈ రెండు జట్లు టెస్టు ఫార్మాట్‌లో మరో మ్యాచ్ ఆడలేదు. దక్షిణాఫ్రికాతో ఆడిన రెండు టెస్టుల్లోనూ భారతే నెగ్గింది. ఏకైక టెస్టు ముగిశాక బెంగళూరులో ఈ రెండు జట్ల మధ్య జూలై 5, 7, 9 తేదీల్లో మూడు టి20ల సిరీస్ జరుగుతుంది.

టెస్టుల్లో టాప్ ర్యాంక్ కోల్పోయిన భారత్

- మళ్లీ అగ్రస్థానానికి ఆస్ట్రేలియా
- ఐసీసీ టీమ్ ర్యాంకింగ్స్



రోహిత్, కమిన్స్ (ఫైల్)

దుబాయ్: మూడు ఫార్మాట్లలో అగ్రస్థానంలో కొనసాగిన భారత క్రికెట్ జట్టు ఆధిపత్యానికి టెస్టుల్లో గండిపడింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టెస్టు ర్యాంకింగ్స్‌లో ప్రపంచ టెస్టు చాంపియన్ ఆస్ట్రేలియా టాప్ ర్యాంక్‌కు ఎగబాకడంతో టీమిండియా రెండో ర్యాంక్‌కు పడిపోయింది. వార్షిక ర్యాంక్‌ల సవరణ వల్ల భారత్ ర్యాంక్ మారింది. ప్రస్తుతం భారత్ 120 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, 124 పాయింట్లతో ఆస్ట్రేలియా అగ్రస్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్ (105), దక్షిణాఫ్రికా (103) వరుసగా మూడు, నాలుగో ర్యాంకుల్లో ఉన్నాయి. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లలో టీమిండియా టాప్ ర్యాంక్ పదిలంగా ఉంది. సొంతగడ్డపై వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆసీస్ చేతిలో ఓడినప్పటికీ భారత్ 122 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఆస్ట్రేలియా (116), దక్షిణాఫ్రికా (112) వరుసగా రెండు, మూడో స్థానాల్లో ఉన్నాయి. టి20 ర్యాంకింగ్స్‌లో భారత్ 264 పాయింట్లతో నంబర్‌వన్‌గా కొనసాగుతోంది. ఇంగ్లండ్ (252)ను అధిగమించిన ఆస్ట్రేలియా (257) రెండో స్థానానికి ఎగబాకగా, డిఫెండింగ్ వరల్డ్ చాంపియన్ ఇంగ్లండ్ మూడో ర్యాంక్‌కు పడిపోయింది.

హింసను ప్రేరేపించేలా పవన్ వ్యాఖ్యలు

చంద్రబాబు, పవన్, ఎల్లో మీడియాపై ఈసీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపరిచేలా బహిరంగ సభల్లో చంద్రబాబు, పవన్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఎన్నికల సంఘాన్ని కోరారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సీఈవో హరిందిరప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మల్లాది విష్ణు మీడియాతో మాట్లాడుతూ.. స్వార్థ ప్రయోజనాల కోసమే సీఎం జగన్‌పై కూటమి నేతలు చౌకబారు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. పాలకొండ, విశాఖ సభల్లో జనసేన అధినేత పవన్ చేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయనే విషయాన్ని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నేతలు గూండాలంటూ.. వారి కాళ్లు విరగ్గొడతానని, తోలు తీస్తానంటూ పవన్ మాట్లాడారన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

రాయచోటి సభలో చంద్రబాబు మాటలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని మల్లాది విష్ణు పేర్కొన్నారు. బాబాయి.. గొడ్డలి అంటూ కోర్టు పరిధిలో ఉన్న అంశాన్ని పదేపదే బహిరంగ సభల్లో ప్రస్తావిస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌ను సైకో అంటున్నారని, వీటిపైనా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. ఏలూరు అభ్యర్థులపై ఎల్లో మీడియాలో వచ్చిన కథనాన్ని, టీడీపీ పెయిడ్ ఆర్టికల్‌గా పరిగణించి చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్టు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ దూకుడు

- 47 వేల పోలింగ్ బూత్‌ల పరిధిలో 'జగన్ కోసం సిద్ధం' పేరుతో ఇంటింటా ప్రచారానికి శ్రీకారం
- ప్రచారంలో పాల్గొన్న 4.70 లక్షల మందికి పైగా బూత్ కన్వీనర్లు, కమిటీ సభ్యులు
- ప్రభుత్వంవల్ల మంచి జరిగి ఉంటే మీరే స్టార్ క్యాంపెయినర్లు కావాలని సీఎం జగన్ పిలుపు

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో విజయమే లక్ష్యంగా ప్రచారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు దూసుకెళ్తున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార సభలకు జనం సునామీలా పోటెత్తుతూ నీరాజనాలు పలుకుతుంటే.. కూటమి ప్రధానంగా టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న ప్రచారానికి జనస్పందన కన్పించడంలేదు. కానీ, ఇంటింటా ప్రచారాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతుంటే.. కూటమి అభ్యర్థుల ప్రచారానికి ప్రజా స్పందన లభించడంలేదు. ఇది కూటమి కార్యకర్తలను నైరాశ్యానికి గురిచేస్తే.. వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కదనోత్సాహాన్ని నింపాయి. ఈ క్రమంలోనే శుక్రవారం నుంచి 'జగన్ కోసం సిద్ధం' పేరుతో ఇంటింటా ప్రచారానికి పార్టీ శ్రేణులు శ్రీకారం చుట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా 175 శాసనసభ స్థానాల్లోని 47 వేల పోలింగ్ బూత్‌ల పరిధిలో బూత్ కమిటీల కన్వీనర్లు, అందులోని సభ్యులు మొత్తం కలిపి 4.70 లక్షల మంది ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ సీఎం వైఎస్ జగన్ అమలుచేశారని వివరిస్తున్నారు. ఈ ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వివరిస్తూ.. నవరత్నాలు ప్లస్ ద్వారా పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా చేసేందుకు సీఎం జగన్ తీసుకుంటున్న చర్యలను వివరించారు. 'మీ బిడ్డ ప్రభుత్వంవల్ల మీ ఇంట్లో మీకు మేలు జరిగి ఉంటే.. మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలబడండి.. స్టార్ క్యాంపెయినర్లుగా మారి ప్రభుత్వం చేసిన మంచిని వంద మందికి వివరించి, ప్రతి ఒక్కరితో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయించండి' అని సీఎం జగన్ ఇచ్చిన పిలుపును గుర్తుచేస్తున్నారు.



ప్రజలు బ్రహ్మరథం

ఇదిలా ఉంటే.. తొలిరోజున స్వచ్ఛందంగా తొమ్మిది లక్షల మంది సీఎం జగన్‌కు, వైఎస్సార్‌సీపీకి స్టార్ క్యాంపెయినర్లుగా మారుతామని తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. ప్రచారపర్వం ముగిసే వరకూ 'జగన్ కోసం సిద్ధం' పేరుతో ఇంటింటా ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిర్వహించనున్నాయి.

గ్యారంటీ, ష్యూరిటీల పేరుతో వ్యక్తిగత లబ్ధి ప్రచారానికి బ్రేక్

- ఆ ప్రచారంపై తక్షణ చర్యలు తీసుకోండి
- జిల్లా ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు



సాక్షి, అమరావతి: వచ్చే ఐదేళ్లలో మీకు వ్యక్తిగతంగా ఇంత లబ్ధి చేకూరనుంది అంటూ గ్యారంటీలు, ష్యూరిటీల పేరిట ప్రచారం చేస్తున్న రాజకీయ పార్టీలపై తక్షణం చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. తాము ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ద్వారా వ్యక్తిగతంగా ఇంత లభిస్తుందంటూ గ్యారంటీ కార్డులు ఇవ్వడం, ఫోన్ల ద్వారా సమాచారం ఇవ్వడాన్ని ఎన్నికల సంఘం తప్పుబట్టింది. ఈ విధంగా ప్రచారం చేస్తున్న రాజకీయ పార్టీలపై నిబంధనలకు అనుగుణంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులకు తాజా మార్గదర్శకాలు జారీ చేసింది. పలు రాజకీయ పార్టీలు ఈ విధమైన ప్రచారానికి ఒడిగడుతున్నాయంటూ పెద్దఎత్తున ఆరోపణలు రావడంతో ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ టీడీపీ మేనిఫెస్టో డాట్ కామ్ పేరిట ప్రత్యేకంగా ఒక వెబ్‌లింక్, యాప్‌ను డెవలప్‌చేసి అందులో వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి బాబు ఆరు ష్యూరిటీల పేరిట మీ కుటుంబానికి ఇంతమొత్తం లబ్ధిచేకూరుతుందంటూ గ్యారంటీ కార్డులు, మెసేజ్‌లు పంపుతుండటంపై కేంద్ర ఎన్నికల సంఘానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. వీటిని పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా ఈ విధంగా మార్గదర్శకాలు జారీ చేసింది.

1. ఓటర్లు మిస్డ్ కాల్, మొబైల్ నంబర్, టెలిఫోన్ నంబర్లను ఇవ్వడం ద్వారా నమోదు అవ్వండి అంటూ పత్రికా ప్రకటనలివ్వరాదు.
2. కరపత్రాల రూపంలో గ్యారంటీ కార్డులను పంచుతూ ఓటర్ల నుంచి పేరు, వయసు, మొబైల్ నంబర్, ఎపిక్ నంబర్, నియోజకవర్గం పేరు సేకరించరాదు.
3. ప్రభుత్వ పథకాల లబ్ధి పేరుతో రేషన్‌కార్డు, బూత్ నంబర్, బ్యాంకు అకౌంట్ నంబర్, నియోజకవర్గం పేరు వంటి వివరాలు తీసుకోరాదు.
4. రాజకీయ పార్టీలు వెబ్ ప్లాట్‌ఫాం, యాప్‌ల ద్వారా వ్యక్తిగత సమాచారం సేకరించరాదు.
5. ప్రస్తుతం లబ్ధి పొందుతున్న పథకాల వివరాలతో పత్రికా ప్రకటనలు, కరపత్రాలు ఇవ్వరాదు.

మద్యం సరఫరా, విక్రయాలపై నిరంతర నిఘా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని డిస్టిలరీలు, రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్‌కు చెందిన ఐఎంఎల్ మద్యం డిపోలు, మద్యం దుకాణాల్లోని మద్యాన్ని ఎన్నికల అక్రమాలకు వినియోగించకుండా ఎక్సైజ్ శాఖ పటిష్ట కార్యాచరణను అమలు చేస్తున్నది. అందుకోసం రాష్ట్రంలోని 37 డిస్టిలరీలు, 4 బ్రూవరీలలో తయారైన మద్యాన్ని 29 ఐఎంఎల్ డిపోలకు సరఫరా.. డిపోల నుంచి మద్యం దుకాణాలు, బార్లకు సరఫరా వరకు పటిష్ట నిఘాను ఏర్పాటు చేసింది. మద్యం సరఫరా చేసే అన్ని వాహనాలను జీపీఎస్ ద్వారా పర్యవేక్షిస్తుంది. ఇక రాష్ట్రంలోని డిస్టిలరీలు, బ్రూవరీలు, మద్యం డిపోలు, మద్యం దుకాణాల్లో 363 సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నిశితంగా పర్యవేక్షిస్తుంది.



ప్రధాన నగరాలు, పట్టణాల్లో శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్ఠం	కనిష్ఠం
రెంటచింతల	47.5	30.8
కడప	46.2	32.6
మార్కాపురం	46.0	29.0
కర్నూలు	45.9	31.2
గుంటూరు	44.0	30.0
నెల్లూరు	43.5	30.1
విజయనగరం	42.0	36.0
విజయవాడ	42.0	30.0
తిరుపతి	42.0	27.0
రాజమహేంద్రవరం	41.0	28.0
తాడేపల్లిగూడెం	40.0	28.0
విశాఖపట్నం	38.4	29.4

ఎండ ప్రచండం

48 డిగ్రీల దిశగా పయనం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఉగ్రరూపం దాలుస్తూనే ఉన్నాయి. అసాధారణ ఎండలు జనాన్ని అల్లాడిస్తున్నాయి. కొద్దిరోజులుగా కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలు (సాధారణం కంటే 4–7 డిగ్రీలు అధికంగా) నమోదవుతుండగా.. ఇప్పుడు 48 డిగ్రీలకు చేరువగా పయనిస్తున్నాయి. శుక్రవారం రాష్ట్రంలోనే అత్యధికంగా నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు, గోస్పాడుల్లో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ సీజన్‌లో అత్యధిక ఉష్ణోగ్రత ఇదే. ఇంకా అర్ధవీడు (ప్రకాశం)లో 47.3, చిన్నచెప్పలి (వైఎస్సార్) 47.2, వి.అక్కమాంబపురం (నెల్లూరు) 47.1, పెద్దకన్నాలి (తిరుపతి) 46.9, పంచలింగాల (46.8), తవణంపల్లె (చిత్తూరు), రావిపాడు (పల్నాడు)ల్లో 46 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇంకా 15 జిల్లాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. 63 మండలాలు తీవ్ర వడగాడ్పులతో అల్లాడిపోగా.. 208 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. శనివారం 58 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 169 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఆదివారం మరింత తీవ్ర రూపం దాల్చి 78 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 273 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.



పులివెందుల మండలంలోని ఈ.కొత్తపల్లెలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్ భారతీరెడ్డి

చంద్రబాబు నమ్మదగిన వ్యక్తి కాదు

వైఎస్ భారతీరెడ్డి

పులివెందుల: తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నమ్మదగినవ్యక్తి కాదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డి చెప్పారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలం ఈ.కొత్తపల్లె గ్రామంలో శుక్రవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ.. పింఛన్లు ఇంటివద్దకు వెళ్లి పంపిణీ చేయకూడదని ఈసీకి తెలుగుదేశం పార్టీ లేఖ రాయడం దారుణమన్నారు. దీనివల్ల మండుటెండలో వృద్ధులు చాలా కష్టపడుతున్నారని చెప్పారు. పింఛన్లను వృద్ధులు, దివ్యాంగుల బ్యాంక్ ఖాతాల్లో జమచేసినా కూడా బ్యాంక్ వద్దకు వెళ్లి ఎండలో పింఛన్లు తెచ్చుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో గురించి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నమ్మదగిన వ్యక్తి కాదని, ఈ విషయం ప్రజలందరికీ తెలుసని ఆమె చెప్పారు.

కార్మికులతో చర్చలు కొనసాగించండి

గంగవరం పోర్టు యాజమాన్యానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న కార్మికులతో చర్చల్ని కొనసాగించాలని గంగవరం పోర్టు యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆ చర్చల పురోగతి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కూడా ఆదేశించింది. ఇదే సమయంలో పోర్టు నుంచి బొగ్గు, ఇతర సరుకుల తరలించే విషయంలో ఎలాంటి ఆటంకాలు కలిగించవద్దని కార్మికులను ఆదేశించింది. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 24వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గంగవరం పోర్టులో కార్మికుల సమ్మె వల్ల విశాఖ స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా జరగడం లేదని, దీనివల్ల ప్లాంట్ మూతపడే ప్రమాదం ఉందని, బొగ్గు సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలంటూ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై జస్టిస్ జయసూర్య శుక్రవారం మరోసారి విచారణ జరిపారు. పోర్టు తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చింతల సుమన్ వాదనలు వినిపించారు.

'బాబు వస్తే మూడు నెలలకోసారి జీతాలు, పెన్షన్లు'

సాక్షి, అమరావతి: చంద్రబాబు పొరపాటున అధికారంలోకి వస్తే ఉద్యోగులు మూడు నెలలకోసారి జీతాలు, పెన్షన్లు తీసుకోవాల్సిన దుస్థితి వస్తుందని ఏపీ జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కోన దేవదాసు అన్నారు. పెన్షనర్ సంఘాల పేరుతో కొందరు చంద్రబాబుకు భజన చేయడం ఆశ్చర్యంగా ఉందంటూ ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'టీడీపీకి భజన చేసే నాయకులారా అంగన్‌వాడీ వర్కర్లను చంద్రబాబు గుర్రాలతో తొక్కించిన విషయం మర్చిపోయారా? ఎమ్మార్వోనే ఇబ్బంది పెట్టడం మీకు గుర్తుందా? సీపీఎస్ ఉద్యోగులు, ఆశా వర్కర్ల మీద చంద్రబాబు పెట్టిన కేసులు సంగతి మర్చిపోయారా? అన్నింటికి మించి అధికారులపై డీపీ కేసులు పెట్టించి వేధించిన సంగతి మర్చిపోయారా? చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 173 మందిపై కేసులు పెట్టారు. అందులో కాపులు, ఎస్సీ, ఎస్టీ, రెడ్డి కులాలకు చెందిన వారే 130 మంది వరకు ఉన్నారు. ఇంత దారుణంగా చంద్రబాబు ఉద్యోగులను ఏడిపిస్తే మీరు ఏ ముఖం పెట్టుకుని చంద్రబాబును సమర్థిస్తున్నారు?' అని కోన దేవదాసు మండిపడ్డారు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+8 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 42
శనివారం 4-5-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | CHENNAI | DELHI | BANGALORE | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

క్లీన్‌స్వీప్ ఖాయం

టైమ్స్ నౌ ఇంటర్వ్యూలో సీఎం వైఎస్ జగన్

అన్నదాతల ఇంట సిరుల పంట

నాడు దైన్యం.. నేడు ధైర్యం

భ'జనసేన' మాకొద్దు

- ప్రత్యేక కథనాలు జైత్రయాత్రలో..





నాలుగో విడతలో 1,717 మంది

ఈ నెల 13న జరిగే నాలుగో విడత లోక్‌సభ పోలింగ్‌లో 1,717 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

వివరాలు 6లో ▸



రాయ్‌బరేలీ నుంచి రాహుల్

ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నామినేషన్ దాఖలు చేశారు.

వివరాలు 6లో ▸



పీవోకేలో బస్సు ప్రమాదం

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్గిట్–బల్టిస్తాన్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో 20 మంది మరణించగా.. 21 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



ప్రజ్వల్‌పై కిడ్నాప్ కేసు

కర్ణాటకలో జేడీ(ఎస్) ఎంపీ ప్రజ్వల్‌తో పాటు ఆయన తండ్రి, ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణపై తాజాగా కిడ్నాప్ కేసు నమోదైంది.

వివరాలు 6లో ▸


కళ్లు చల్లబడ్డాయా బాబూ!

ఎర్రటి ఎండలో విలవిల్లాడుతున్న పండుటాకులు

- మిగతా పథకాల్లానే పింఛన్ల డబ్బు ఖాతాల్లో వేయాలన్న చంద్రబాబు
- ఆయన వదిన, దత్తపుత్రుడు, నిమ్మగడ్డ రమేశ్... అందరిదీ ఇదే మాట
- చివరకు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి మరీ సాధించిన తీరు
- పాపం... దూరంగా ఉన్న బ్యాంకులకు వెళ్లలేక వృద్ధుల అవస్థలు
- చాలా గ్రామాలకు బ్యాంకులు దూరం... ఏటీఎంలూ దగ్గర్లో లేవు
- డబ్బులు పడ్డా... చాలామంది ఖాతాలు నిర్వహణలో లేక ఇబ్బందులు
- కేవైసీ చేయాలని బ్యాంకుల షరతు.. ఎలా చేయాలో తెలియక ఇక్కట్లు
- సమయానికి డబ్బులు రాక తంటాలు
- చంద్రబాబును నానా శాపనార్థాలూ పెడుతున్న సామాజిక పింఛనర్లు
- ఎన్నికల రోజు తమ తడాఖా చూపిస్తామంటూ పలుచోట్ల తిట్లు

2 లో





అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద సొమ్మసిల్లిన వృద్ధురాలు

- వణుకుతున్న బాబు; దీనికి జగనే కారణమంటూ ఎల్లో మీడియా స్టోరీలు
- అసలు మొదటి నుంచీ వలంటీర్ల వ్యవస్థనే టార్గెట్ చేసిన బాబు ముఠా
- వాళ్ల మగాళ్లు లేనపుడు వెళ్లి ఇళ్ల తలుపులు కొడుతున్నారన్న బాబు
- ఉమెన్ ట్రాఫికింగ్‌లో వలంటీర్ల పాత్ర ఉందన్న దత్తపుత్రుడు పవన్
- తీవ్రమైన ఆరోపణలు చేసి... ఇపుడు వలంటీర్లపై ప్రేమ నటిస్తూ కబుర్లు
- బాబు ప్రచార యావ; గ్రాఫిక్స్ మాయలు తమకు తెలుసంటున్న అవ్వాతాతలు

పింఛన్లపై లోకేశ్ మాట్లాడొద్దని అన్నాడు



- ఏం మాట్లాడినా నెగిటివ్ అవుతుందన్నాడు
- గుంటూరు ఎంపీ అభ్యర్థి అనుచరుడితో టీడీపీ కార్యాలయ ఉద్యోగి సంభాషణ లీక్.. పింఛనర్లు ఎక్కడ పడితే అక్కడ నిలదీస్తున్నారని వాపోయిన పెమ్మసాని అనుచరుడు
- ఇంత ఖర్చుపెడుతున్నాం.. మా పరిస్థితి ఏమిటంటూ ఆందోళన
- ఏం చేయలేమని చేతులెత్తేసిన టీడీపీ కార్యాలయం

13 లో

కేజ్రీవాల్ బెయిల్ అంశాన్ని పరిశీలిస్తాం



- మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టై ప్రస్తుతం తిహార్ జైలులో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఈ నెల 7న వాదనలు వింటామని తెలిపింది. ఢిల్లీలో ఈ నెల 25న పోలింగ్ జరుగనుందని, తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు.

- వివరాలు 6లో

మహిళా ఉద్యోగితో అనుచితంగా ప్రవర్తించారు



- బెంగాల్ గవర్నర్‌పై సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణ
- అంతా డ్రామా అంటూ కొట్టిపారేసిన ఆనంద్ బోస్
- తనపై మరిన్ని ఆరోపణలు రావొచ్చని వ్యాఖ్యలు

- వివరాలు 6లో

నిందితుడిని హంతకుడని

ఎలా ముద్ర వేస్తారు?

కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న కేసు గురించి ఎలా మాట్లాడతారు?

- హంతకుడిని సీఎం రక్షిస్తున్నారని ఎలా చెబుతారు?
- ఇలా చెప్పడం తప్పు కాదా? ఇది నేరపూరిత చర్య కాదా?
- ఐదేళ్ల క్రితం ఘటనపై ఇప్పుడెందుకు ఇంతలా మాట్లాడుతున్నారు?.. ఎందుకు మసాలా జోడిస్తున్నారు?
- షర్మిల, సునీత, బీటెక్ రవిని నిలదీసిన హైకోర్టు ధర్మాసనం

13 లో



- మధ్యంతర ఉత్తర్వుల ఎత్తివేతకు దాఖలైన పిటిషన్లను పరిష్కరించండి
- 8లోగా నిర్ణయం వెలువరించండి
- కడప జిల్లా కోర్టుకు హైకోర్టు ఆదేశం

చెప్పుతో కొడతా..!

మహిళపై టీడీపీ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి దాష్టీకం

- ఎన్నికలప్పుడే గుర్తొస్తామా అని నిలదీసిన ప్రజలు
- నిగ్రహం కోల్పోయి దూషణకు దిగిన బుచ్చయ్య చౌదరి
- రాజమహేంద్రవరంలో ఘటన

13 లో



తనను నిలదీసిన మహిళను దూషిస్తున్న టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి

చంద్రబాబుకు మా ఉసురు తగలకపోదు



నా వయసు 80 సంవత్సరాలు. నేను లేచి నడవలేను. ప్రతినెలా 1వ తేదీన ఇంటివద్దే వలంటీర్ ద్వారా నేరుగా పింఛన్ సొమ్ము అందుకునే వాడిని. సజావుగా జరుగుతున్న ఈ కార్యక్రమంపై కుళ్లు, కుతంత్రం పెంచుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు కోర్టుకు వెళ్లి ఇళ్ల వద్ద పంపిణీ చేసే విధానాన్ని అడ్డుకున్నారు. దీంతో మాకు కష్టాలు మొదలయ్యాయి. మాలాంటి వాళ్ల ఉసురు చంద్రబాబుకు తగలకపోదు.
– అరిగి తిరుపాలు, కోటితీర్థం, నెల్లూరు జిల్లా

చంద్రబాబు వల్ల ఇబ్బంది పడుతున్నాం



ఎలాంటి కష్టాలు లేకుండా నెలనెలా వలంటీర్ల ద్వారా ఇంటివద్దే పింఛన్ తీసుకునేవాళ్లం. గత నెల సచివాలయంలో ఇచ్చారు. ఈ నెల బ్యాంకులో ఇస్తామన్నారు. బ్యాంకుకు వస్తే రద్దీ ఎక్కువగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఎంతో మేలు చేయగా.. చంద్రబాబు వల్ల ఇబ్బంది పడుతున్నాం. మాలాంటి వృద్ధులను ఇబ్బందులకు గురి చేయడం తగదు. పింఛన్లు ఇంటి వద్దనే పంపిణీ చేయాలి.
– సంజీవమ్మ, మారెమ్మగుడి ఏరియా, రాయదుర్గం, అనంతపురం జిల్లా

చంద్రబాబు వల్లే మాకీ కష్టాలు



పింఛన్ సొమ్ము కోసం దేవరాపల్లి బ్యాంకుకు ఉదయం 8 గంటలకు వచ్చి లైన్‌లో ఉన్నాను. మండుటెండలో మధ్యాహ్నం భోజనం చేయకుండా పడిగాపులు కాస్తే సాయంత్రం 4 గంటల సమయంలో బ్యాంక్ టైమ్ అయిపోయింది రేపు రావాలని తిరిగి పంపేశారు. గత్యంతరం లేక ఇంటికి చేరుకున్నాను. ఎండ తీవ్రంగా ఉంటంతో నరకయాతన అనుభవించాను. అగ్నిగుండంలా ఉన్న ఇంతటి ఎండల్లో చంద్రబాబు ఇలా ఇబ్బందులకు గురి చేయడం అన్యాయం. మా ఉసురు తగులుతుంది.
– ముచ్చు నాగమయ్య, రైవాడ, దేవరాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా

చంద్రబాబు నాశనమైపోతాడు



రెండు నెలలుగా పెన్షన్ డబ్బులు తీసుకునేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ వయసులో సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ మండుటెండలో ఎలా తిరగ్గలం. మా ఉసురు చంద్రబాబుకు తగులుతుంది. ఆయన సీఎంగా ఉండే సమయంలోనూ పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయించేవాడు. ఇప్పుడు ఎన్నికల వేళ.. మాకు కష్టాలు పెడుతున్నాడు. నాశనమైపోతాడు.
– జి.పెంటయ్యదొర, గంగన్నపాడు, తెర్లాం మండలం

చంద్రబాబుకు పుట్టగతులుండవు



మాలాంటి వికలాంగులపై కక్ష సాధింపు చేస్తున్న చంద్రబాబుకు పుట్టగతులుండవు. నేను ఈ మండుటెండలో ఇంటికి ఎలా చేరుకుంటాను. పింఛన్ కోసం సుమారు 40 కిలోమీటర్ల దూరం నుంచి ఆమదాలవలస ఆంధ్రాబ్యాంక్‌కు వచ్చాను. ఆటోచార్జీలు రూ.600 అయ్యాయి. ఇదంతా చంద్రబాబు చేసిన పనేనని బ్యాంకులో పెన్షన్‌దారులంతా చర్చించుకుంటున్నారు.
– సైలాడ లక్ష్మీకాంతం, పెద్దకోట, ఎల్ఎన్ పేట మండలం, శ్రీకాకుళం జిల్లా

చంద్రబాబు కుట్రకు బలైపోయాం



రెండు నెలలుగా పింఛన్ కష్టాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఈ నెల పింఛన్ కోసం ఒకరి సాయంతో బ్యాంకుకు వస్తే బ్యాంక్ అకౌంట్ రన్నింగ్‌లో లేదని చెప్పారు. చేతిలో చిల్లిగవ్వ లేదు. మాత్రలు కొనుక్కునేందుకు డబ్బుల్లేక అల్లాడుతున్నా. రెండు రోజులుగా మాత్రలు కూడా వేసుకోలేదు. చంద్రబాబు పన్నిన కుట్రకు ముసలోళ్లం బలైపోయాం. సీఎంగా మళ్లీ జగనయ్య కావాలి. వలంటీర్లు రావాలి.
– కర్లపూడి లక్ష్మయ్య, వాకాడు, తిరుపతి జిల్లా

చంద్రబాబుకి ఓటేస్తే మమ్మల్ని చంపేస్తాడు



అధికారంలో లేనప్పుడే ముసలోళ్లను ఇలా రోడ్డు పాల్జేశాడు చంద్రబాబు. రేపు ఓట్లేసి గెలిపిస్తే మమ్మల్ని బతకనిస్తాడా. ఈ ఐదేళ్లూ జగన్‌బాబు మమ్మల్ని అడుగు బయట పెట్టనివ్వకుండా పింఛన్‌సొమ్ము ఇంటి గుమ్మంలోకే పంపించి మాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నాడు. చంద్రబాబు మాత్రం వలంటీర్లను ఇంటికి రానివ్వకుండా చేసి మమ్మల్ని రోడ్డు మీదికి ఈడ్చాడు.
– నుంకర వెంకటేశ్వరరావు, కొమరవరం, తణుకు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా

చంద్రబాబు వల్ల ముప్పుతిప్పలు పడుతున్నాం



వలంటీర్లు ఇంటికొచ్చి ఇస్తున్న పింఛన్లను చంద్రబాబు రానివ్వకుండా చేశాడు. మేము ఏం పాపం చేశాం . చంద్రబాబు వల్ల ముప్పుతిప్పలు పడుతున్నాం. సచివాలయానికి వెళితే బ్యాంక్ దగ్గరకు వెళ్లండని చెప్పారు. మోటుమాల నుంచి కొత్తపట్నం కెనరా బ్యాంక్‌కు వచ్చాను. తోడు రమ్మని అడిగితే ఎవరూ రాలేదు. ఎండలో ఒక్కదాన్నే అవస్థలు పడుతూ వచ్చాను. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం చేసినంత కాలం ఇంటి దగ్గరకు వచ్చి పింఛన్ ఇచ్చేవారు. మళ్లీ జగనే రావాలి.
– చినిగే మంగమ్మ, మోటుమాల, కొత్తపట్నం మండలం, ప్రకాశం జిల్లా

చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది



80 ఏళ్ల వయసులో నడిచే ఓపిక లేక మనవడితో పాటు మరో మహిళను వెంటబెట్టుకొని కొలిమిగుండ్లలోని మినీ బ్యాంక్‌కు వచ్చా. చల్లగా నీడపట్టున సేదతీరే బతుకులను ఎండల పాలు చేశారు. పింఛన్ తీసుకునేందుకు రెండు నెలల నుంచి నరకం చూస్తున్నాం. చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది.
– లక్షుమ్మ, ఇటిక్యాల, కొలిమిగుండ్ల మండలం, నంద్యాల జిల్లా

ఈ బాధలు పగోళ్లకు కూడా రావొద్దు



పింఛన్ తీసుకోవడానికి రెండు రోజులుగా బ్యాంకు దగ్గరకు తిరుగుతున్నాను. వాళ్లు ఆధార్ లింకు కాలేదని చెబుతున్నారు. పోనీ లింకు చేయండి అంటే పట్టించుకోవడం లేదు. గతంలో తెల్లవారుతూనే మా ఇళ్లకు వలంటీర్లు పింఛన్ తెచ్చి ఇచ్చేవారు. రెండు నెలలుగా పింఛన్ తీసుకోవాలంటేనే భయం వేస్తోంది. ఈ బాధలు పగోళ్లకు కూడా రాకూడదు.
– పి.ఫజీలా, పింఛన్‌దారు, నందిగామ, ఎన్టీఆర్ జిల్లా

ఇంటివద్దే పింఛన్ ఇవ్వాలి



నాకు ఇంటి వద్దనే గ్రామ వలంటీర్ వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఈ నెల పింఛన్ సొమ్ము బ్యాంకులో జమ చేశామని అధికారులు చెప్పారు. ఆ డబ్బులు తీసుకునేందుకు పెరుమాళ్లపురం నుంచి ఎండలో 20 కిలోమీటర్లు ప్రయాణం చేసి రూ.120 ఖర్చుతో గోపాలపట్నం బ్యాంక్‌కు వచ్చాను. ఇది ఎంతో ఇబ్బంది అయ్యింది. గతంలో మాదిరిగా ఇంటి వద్దనే పింఛన్ అందజేయాలి.
– గరికిన అప్పారావు, రామారావుపేట, తొండంగి మండలం, కాకినాడ జిల్లా

కళ్లు చల్లబడ్డాయా బాబూ!

ఎర్రటి ఎండలో విలవిల్లాడుతున్న పండుటాకులు | దూరంగా ఉన్న బ్యాంకులకు వెళ్లలేక వృద్ధుల అవస్థలు



పల్నాడు జిల్లా గణపవరంలో పింఛను తీసుకునేందుకు బ్యాంకు వద్ద వృద్ధుల పడిగాపులు



పశ్చిమగోదావరి జిల్లా తణుకు ఎస్‌బీఐ వద్ద పింఛన్ కోసం అవ్వాతాతల వెతలు

సాక్షి, అమరావతి: పింఛన్ల కోసం ఎర్రటి ఎండలో వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్య బాధితులు బ్యాంకుల వెంట, ఏటీఎంల వెంట, సచివాలయాల వెంట తిరుగుతున్నారు. కొందరు సొమ్మసిల్లి పడిపోతున్నారు. కొందరైతే ప్రాణాలే కోల్పోతున్నారు. ఇప్పుడు నీ కళ్లు చల్లబడ్డాయా చంద్రబాబు నాయుడూ? ఇప్పుడు నీ మనసు శాంతించిందా? ఐదేళ్లుగా ప్రతి నెలా 1వ తేదీనే నేరుగా అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు... ఈ ఒకటి రెండు నెలల్లోనే ఓటర్లను ప్రభావితం చేసేస్తారా? ఒకవేళ ప్రభావితం చేయగలిగి ఉంటే ఇప్పటికే చేసి ఉండేవారు కదా!!. ఐదేళ్లలో లేనిది... కొత్తగా ఈ రెండు నెలల్లో మారింది.. ఏంటి చంద్రబాబు నాయుడూ నీ కుట్ర బుద్ధి తప్ప? మీరే గనక పనిగట్టుకుని కోర్టుల్లో పిటిషన్లు వేసి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి వలంటీర్లను ఈ కార్యక్రమానికి దూరం చేయకుండా ఉంటే అవ్వాతాతలకు ఈ కష్టాలుండేవా? వాళ్లు ఈ రెండు నెలలు కూడా ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇచ్చి ఉంటే పండుటాకులు ఇంత వేదన పడేవారా? ఇదెక్కడి రాజకీయం బాబూ?

బ్యాంకుల్లో వెయ్యమన్నదీ మీరేగా?

ప్రతి పథకాన్నీ నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేస్తున్న ప్రభుత్వం పింఛన్లను మాత్రం ఎందుకు వేయటం లేదు? వలంటీర్లు నేరుగా ఇవ్వాల్సిన అవసరం ఏముంది? చంద్రబాబు నాయుడు నుంచి... ఆయన వదిన, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు పురందేశ్వరి, దత్త పుత్రుడు పవన్.. వీళ్లు చెప్పినట్టల్లా ఆడే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ వీళ్లంతా అడిగిన ప్రశ్న ఇదే. అక్కడితో ఆగలేదు వీళ్లెవరూ. కోర్టులకెక్కారు. వలంటీర్లు పింఛన్లు ఇవ్వటానికి ఈ మూడు నెలలూ వీల్లేదన్నారు. నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాల్లోనే నగదు వెయ్యాలని ఎన్నికల కమిషన్‌కు నిమ్మగడ్డ రమేశ్ స్వయంగా చెప్పారు. చంద్రబాబు, పురందేశ్వరి, పవన్ కల్యాణ బహిరంగ సభల్లో కూడా ఇదే చెప్పారు. బ్యాంకు ఖాతాల్లో వేసేలా ఈసీపై ఒత్తిడి తెచ్చారు. నిజానికి బ్యాంకు ఖాతాల్లో వేస్తే ఏమవుతుందో ప్రభుత్వానికి తెలియదా? ప్రతి పథకాన్నీ పైసా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకే చేరుస్తున్న వైఎస్ జగన్‌కు ఇదంతా తెలియదా? కానీ పింఛన్లు తీసుకుంటున్న వాళ్లంతా వృద్ధులు, దివ్యాంగులు, వివిధ వ్యాధులతో బాధపడుతూ మంచానికి పరిమితమైన వాళ్లు. బ్యాంకు ఖాతాల్లో వేస్తే తీసుకోవటం వాళ్లకంత సులువేమీ కాదు. బ్యాంకులు ఎక్కడో ఊళ్లకు దూరంగా ఉంటాయి. అన్ని గ్రామాల్లోనూ ఏటీఎంలు అందుబాటులో లేవు. పైపెచ్చు ఖాతాల్లోని డబ్బులు ఎలా తియ్యాలో కూడా కొందరికి తెలియదు. కొందరికి ఖాతాలే లేవు. ఇంకొందరిదైతే ఇల్లు కదల్లేని పరిస్థితి. అందుకే బ్యాంకుల్లో వేయకుండా... ఆ నగదును బ్యాంకుల్లో డ్రా చేసి నేరుగా వలంటీర్లు ఇళ్లకు పట్టుకెళ్లి వాళ్లకు ఇస్తున్నారు. ఒకరకంగా ఖాతాల్లో వేయటానికన్నా అడ్వాన్స్‌డ్ ప్రక్రియ ఇది. అలాంటి ప్రక్రియను నిలిపేయించడానికి నీకు మనసెలా ఒప్పింది చంద్రబాబూ? ఖాతాల్లో వెయ్యమని చెప్పేటప్పుడు వీళ్లు ఇన్ని కష్టాలు పడతారన్న సంగతి నీకు తెలియనిది కాదు కదా? మండుటెండల్లో విలవిల్లాడుతున్న వృద్ధుల శాపాలిపుడు ఊరికే పోవు కదా?



కర్నూలు జిల్లా కోసిగిలో మొదటి అంతస్తులోని బ్యాంకుకు వెళ్లడానికి మెట్లు ఎక్కేందుకు అవ్వ అవస్థలు

బాబు రక్షణకు ఎల్లో మీడియా...

ఎండలకు విలవిల్లాడుతూ వృద్ధులు పెడుతున్న శాపనార్థాలకు తానెక్కడ కొట్టుకుపోతాడోనన్న భయం చంద్రబాబునిపుడు నిలువెల్లా వణికిస్తోంది. దీంతో పింఛన్లు ఇవ్వటానికి సచివాలయ సిబ్బందిని వినియోగించాలని, వాళ్ల ద్వారా ఇంటింటికీ పంచాలని కథలు చెబుతున్నారు. నిజానికి సచివాలయ సిబ్బందిని కూడా మొదట్లో అడ్డుకున్నది చంద్రబాబే. పైపెచ్చు ప్రతి ఇంటినీ అడ్రస్ పట్టుకుని వెతకటం, ఆ చిరునామాలో ఉన్న వారికి ఇవ్వటం ఎవరో కొత్తవారిని చెయ్యమంటే సాధ్యం కాదు. అయితే ఈసీ ఆదేశాల మేరకు 80 ఏళ్ల దాటిన వృద్ధులు, మంచానికి పరిమితమైన వారి విషయంలో సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లే పింఛన్లు ఇస్తున్నారు. దారుణమేంటంటే ఇలా పింఛన్లిచ్చేటపుడు కొందరు చిరునామాలు దొరక్క వలంటీర్ల సాయం తీసుకుంటున్నారు. కానీ వారు వలంటీర్ల సాయం తీసుకున్నారన్న ఒకే ఒక్క కారణంతో 'ఈనాడు' దాని తోక మీడియా దౌర్భాగ్యపు రాతలు రాసి ఆయా సచివాలయ సిబ్బందిని సస్పెండ్ చేసేదాకా వెంటాడుతున్నాయి. చంద్రబాబు మాత్రం సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి ఇస్తే బాగుంటుందని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. పైపెచ్చు చేసిందంతా చేసి... ఇలా వృద్ధులు మండుటెండల్లో బయటకు రావటానికి ముఖ్యమంత్రి జగనే కారణమని 'ఉల్టా చోర్...' తరహాలో నిందిస్తున్నారు. ఈ మాటలు ఎవరూ నమ్మటం లేదని తెలిసి... ఎల్లో మీడియానూ రంగంలోకి దింపారు. 'ఈ పాపం జగన్‌దే' అంటూ శుక్రవారం 'ఈనాడు' పతాక శీర్షికల్లో వండి వార్చిన కథనం ఉద్దేశం చంద్రబాబును రక్షించటమే.

మొదటి నుంచీ వలంటీర్లంటే కక్షే...

కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన ఏపీ వలంటీర్ల సైన్యాన్ని ప్రశంసించని వారు లేరు. కానీ చంద్రబాబు ముఠాకు మొదటి నుంచీ ఈ వ్యవస్థంటే ఇష్టం లేదు. వలంటీర్ల సేవల కారణంగా వైఎస్ జగన్ ప్రభుత్వానికి పేరొస్తుండటమే దీనికి కారణం. ఈ వ్యవస్థను ఎలాగైనా దెబ్బతీయాలన్న ఉద్దేశంతో వలంటీర్లంతా మగవాళ్లు లేనపుడు ఇళ్లకు వెళ్లి తలుపులు కొడుతున్నారని, వీళ్లది మూటలు మోసే ఉద్యోగమని చంద్రబాబు నాయుడు నానా మాటలూ అన్నారు. ఇక ఈయన గారి దత్తపుత్రుడైతే మూడడుగులు ముందుకేసి.. వలంటీర్లు అమ్మాయిలను ఎత్తుకుపోతున్నారని, ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఈ వ్యవస్థను రద్దు చేయాలంటూ తమ వాళ్లచేత కేసులూ వేయించారు. కానీ వీళ్ల పథకాలేవీ పారకపోవటంతో... తాము వలంటీర్లకు వ్యతిరేకం కాదంటూ, తాము గెలిస్తే వారి పారితోషికాన్ని పెంచుతామంటూ రకరకాల మాటలు మాట్లాడుతున్నారు. చేసిన పనికి కూలీ ఇవ్వనివాడు ఫ్రీగా బిరియానీ పెట్టిస్తానంటే నమ్మేదెవరు బాబూ?

> **97.91% మందికి పంపిణీ**
>
> రాష్ట్రంలో 97.91 శాతం మందికి పెన్షన్ల పంపిణీ పూర్తయినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 65,49,864 మందికి ఈ నెల పెన్షన్ పంపిణీకి ప్రభుత్వం రూ.1,945.39 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి 64,13,200 మందికి పెన్షన్ డబ్బులు నేరుగాను, బ్యాంకు ఖాతాల్లో జమచేయడం ద్వారాను ఇచ్చినట్లు పేర్కొన్నారు.

బాబు యావ తెలియనిదెవరికి?

బాబుకు పని చేయటం చేతకాదు. కానీ చేయని పనిని కూడా అందంగా చెప్పుకోవటంలో మాత్రం పెద్ద బిడ్డే. అమరావతిలో ఒకటిరెండు భవనాలు కూడా కట్టకుండానే అదో పెద్ద సింగపూర్‌లా అయిపోయినట్లు అంతర్జాతీయంగా ప్రచారం చేసుకున్న ఘనత బాబుది. నిజానికి అమరావతిని గురించి తెలిసిన వారు... బయటి వారెవరైనా ఆ ప్రాంతమెలా ఉందని అడిగితే, పేరు తప్ప అక్కడేమీ లేదని చెప్పటానికి సిగ్గుపడాల్సిన పరిస్థితి. ఇక 2015లో గోదావరి నదిని ఈయనే కనిపెట్టినట్టు పుష్కరాల సందర్భంగా భారీ ప్రచార వీడియోను షూట్ చేయబోయి ఏకంగా 29 మంది అమాయక భక్తుల్ని బలితీసుకున్నాడు. ఏడాదిన్నర కిందట కూడా... ఎక్కువ మంది జనం వచ్చినట్లుగా చూపించుకోవాలన్న తాపత్రయంలో ఇరుకు సందులో సభ నిర్వహించి, జనాన్ని రప్పించడం కోసం తాయిలాలు కూడా ఇవ్వటంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇలా చెబుతూ పోతే బాబు ప్రచారపిచ్చికి ఎంతైనా చాలదు.

అప్పుడు ప్రభావితం చేస్తారా..!!

వలంటీర్లను రాజకీయాలకు సంబంధం లేకుండా, అందరి వద్ద నుంచి నిర్ణీత సమయంలో దరఖాస్తులు స్వీకరించి, అధికారులు ఇంటర్వ్యూలు చేసి వారిని ఎంపిక చేశారు. అలాంటి వలంటీర్లు ఇప్పుడు పింఛన్ల పంపిణీకి లబ్ధిదారుల ఇంటింటికి వెళితే, వాళ్లు అధికార పార్టీకి అనుకూలంగా లబ్ధిదారులను ప్రభావితం చేస్తారనేది చంద్రబాబు అండ్ కో విపరీత బుద్ధి. కేంద్ర ఎన్నికల సంఘానికి ఇదే అంశంపై ఫిర్యాదు చేసి వలంటీర్లను అడ్డుకున్నారు. 'అయినా నిత్యం ఆ 50 ఇళ్ల మధ్య ఉండే వలంటీర్లు... పింఛన్ల పంపిణీకి లబ్ధిదారుల ఇంటికి వెళ్లిన పది నిమిషాలు లేదా పావుగంట సమయంలోనే రాజకీయంగా ప్రభావితం చేస్తారా? వాళ్లు గనక చెయ్యాలనుకుంటే మిగిలిన రోజులన్నీ వాళ్ల పక్కనే ఉంటూ ప్రభావితం చేసే అవకాశం ఉండదా?' అనేది పింఛనుదార్ల మాట.

బాబూ... అచ్చెన్నాయుడు చేత ఫిర్యాదు చేయించలేదా?

వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచాలని చంద్రబాబు తన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో ఈ ఏడాది మార్చి 1న ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయించారు. ఆ ఫిర్యాదులో.. 'ప్రభుత్వం పింఛన్ల పంపిణీ, రేషన్ల పంపిణీలో వలంటీర్లను ఉపయోగిస్తోంది. వలంటీర్లు తమ గ్రామాల్లో, వార్డుల్లో రాజకీయ కార్యకలాపాల్లో నిమ్నగమయ్యే అవకాశం ఉంది. వలంటీర్లకు ప్రభుత్వ ఖజానా నుంచే గౌరవ వేతనాలు చెల్లిస్తున్నందున సెక్షన్ 32 ఆర్‌పీ చట్ట ప్రకారం ప్రభుత్వ సేవకులకు వర్తించేలా శాఖపరమైన క్రమశిక్షణ, నిబంధనలను వీళ్లకూ వర్తింపజేయాలి. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేందుకు వలంటీర్లపై చర్యలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు. తర్వాత చంద్రబాబు మనిషి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఈసీని కలిసి ''బ్యాంకు ఖాతాలున్న లబ్ధిదారులకు పింఛను డబ్బులు వాళ్ల ఖాతాల్లోనే జమ చేయాలి'' అని సూచించారు. ఈ విషయాన్ని ఈటీవీకిచ్చిన ఇంటర్వ్యూలో ఆయనే చెప్పారు. దీంతో ఈసీ 'బ్యాంకు ఖాతాలున్న లబ్ధిదారులకు డీబీటీ విధానంలో పింఛన్ల పంపిణీ చేయాలని నిర్ణయించింది.

ఇవీ... వలంటీర్లపై బాబు, పవన్ మాటలు

'వలంటీర్లతో ఏంటి లాభం? 5వేల రూపాయలతో ఏం ఉద్యోగం అది. గోనె సంచులు మోసే ఉద్యోగమా? బియ్యం సంచులు మోస్తూ ఎప్పుడంటే అప్పుడు ఇళ్లకు వెళ్లడం, డిస్టర్బ్ చేయడం. పగలు మగవాళ్లు ఉండరు.. వలంటీర్లు పోయి తలుపులు కొడుతున్నారు. ఎంత నీచం ఇది'
– 2019, సెప్టెంబర్ 27వ తేదీన చంద్రబాబు

'ఊళ్లలో వలంటీర్లు పెద్ద న్యూసెన్స్ అయ్యారు. బ్రిటిష్ ఏజెంట్లలా వీళ్లు ప్రభుత్వానికి ఏజెంట్లుగా మారారు. ప్రజలను బెదిరిస్తూ, అవినీతికి పాల్పడుతున్నారు. రేపు ఎన్నికలకు కూడా వీరే వస్తారు'
– 2021, అక్టోబర్ 30న కుప్పంలో చంద్రబాబు

'వలంటీర్లు కొంపలు కూల్చే పనులు చేస్తున్నారు. ఇంటి లోపలికి వస్తున్నారు. వీళ్లు ఎవరండీ ఇళ్లలోకి రావడానికి? వచ్చి మీ ఆయనకు ఏమైనా వేరే సంబంధాలు ఉన్నాయా? ఏమైనా అనుమానం ఉందా? అని ప్రశ్నిస్తున్నారు. అంటే కొంపల్ని కూల్చే మార్గం ఇది. మగవాళ్ల దగ్గరకు వెళ్లి మీ ఆడబిడ్డలు ఏమైనా బయట తిరుగుతున్నారా? అని అడుగుతున్నారు. చెప్పుతో కొట్టేవారు లేకపోతే సరి. ఈ వివరాలతో వలంటీర్లకేంటి సంబంధం'
– 2023, జూలై 14న టీడీపీ మహిళా సదస్సులో చంద్రబాబు.

'వలంటీర్లు ఒంటరి మహిళల సమాచారాన్ని సంఘ విద్రోహ శక్తులకు ఇస్తున్నారు. ప్రతి గ్రామంలో ఆ కుటుంబంలో ఎంత మంది ఉన్నారు? వారిలో మహిళలు ఎందరు? వితంతువులున్నారా? అని ఆరా తీస్తున్నారు. మహిళల అదృశ్యం వెనుక వలంటీర్ల హస్తం ఉంది'
– 2023, అక్టోబర్ 7న ఏలూరులో పవన్‌కళ్యాణ్

పింఛన్ కోసం వెళ్లి 12 మంది మృతి

- రెండు రోజుల్లో 16 మంది మృత్యువాత

సాక్షి, నెట్‌వర్క్: చంద్రబాబు వికృత రాజకీయానికి రాష్ట్రవ్యాప్తంగా అవ్వాతాతలు బలవుతున్నారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛను కార్యక్రమంపై చంద్రబాబు తన మనుషులతో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయించి పంపిణీని అడ్డుకున్న సంగతి తెలిసిందే. దీంతో వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని కేంద్ర ఎన్నికల సంఘం నిలిపివేసి, బ్యాంకుల ద్వారా ఇవ్వాలని ఆదేశించింది. ఇప్పుడు అవ్వాతాతలు మండుటెండలు, వడగాడ్పుల్లో బ్యాంకులకు వెళ్లి పింఛన్ డబ్బులు తెచ్చుకోవడం వారి ప్రాణాల మీదకు తెస్తోంది. ఇలా గురువారం పింఛను కోసం వెళ్లి వడదెబ్బకు నలుగురు మరణించగా, శుక్రవారం 12 మంది మృతి చెందారు. తిరుపతి జిల్లా నాగలాపురం మండలం జంబుకేశవపురానికి చెందిన జి.నాగయ్య (68), పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం వల్లూరుకు చెందిన ఇంజేటి మంగతాయారు (69), గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజండ్లకు చెందిన వితంతు మహిళ చొప్పర లక్ష్మి (49), బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం వెల్లల చెరువుకు చెందిన చాగంటి సుబ్బాయమ్మ (68), ప్రకాశం జిల్లా దర్శి మండలం బొట్లపాలేనికి చెందిన తానికొండ రమణమ్మ (65), ఏలూరు జిల్లా పోలవరం బాపూజీ కాలనీకి చెందిన కస్తూరి కడెమ్మ, పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం వంతరాంకు చెందిన కె.పోలినాయుడు (70), కర్నూలు జిల్లా మాచాపురం గ్రామానికి చెందిన ఆనంద్ (61), వైఎస్సార్ జిల్లా బద్వేలులో నాగిపోగు యల్లమ్మ (64), రామయ్య (68), పల్నాడు జిల్లా చిలకలూరిపేటకి చెందిన మాట నాగేశ్వరరావు (65), అనంతపురం జిల్లా ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన ఎరుకుల సుంకన్న (72) వడదెబ్బకు మృతి చెందారు.

లబ్ధిదారులకు డీబీటీనీ అడ్డుకొన్న బాబు

- వివిధ పథకాల డీబీటీ చివరిదశ చెల్లింపులకు మోకాలడ్డు
- ఈసారి చెల్లింపులకు ఇప్పటివరకూ రాని అనుమతి
- దీని వెనుక చంద్రబాబు ఒత్తిళ్లు ఉన్నాయన్నది సుస్పష్టం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి అందకుండా చంద్రబాబు నీచ రాజకీయానికి ఒడిగట్టారు. పేదల పొట్ట కొట్టేందుకు కుట్ర పన్నారు. ఇప్పటికే వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద పింఛను ఇవ్వకుండా అడ్డుకుని అవ్వాతాతల మరణాలకు కారణమైన బాబు.. ఇప్పుడు ఇతర పథకాలూ ప్రజలకు అందకుండా అడ్డుకొంటున్నారు. నేరుగా నగదు బదిలీ (డీబీటీ) ద్వారా అందుతున్న పథకాల నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా మోకాలడ్డారు. బాబు దుశ్చర్య కారణంగా రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఆర్థిక వనరులున్నా, ఈ పథకాల చివరి దశ చెల్లింపులకు ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి కోసం ఎదురు చూడాల్సివస్తోంది. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లోనే నిధులు కేటాయించి, మార్చిలో ఎన్నికల కోడ్ రాకముందే సీఎం జగన్ ఈ డీబీటీ పథకాలను బటన్ నొక్కడం ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు విడుదల చేశారు. కొన్ని పథకాల డీబీటీ చెల్లింపులు 70 నుంచి 80 శాతం ఎన్నికల కోడ్ రాకముందే పూర్తయ్యాయి. మిగతా 20 నుంచి 30 శాతం చెల్లింపులు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిలిచిపోయాయి. ఈ చెల్లింపులు చేయనీయకుండా వివిధ మార్గాల్లో టీడీపీ బృందం ఒత్తిళ్లు తెస్తోంది. వాస్తవానికి ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందు అమల్లో ఉన్న పథకాలకు, బడ్జెట్‌లో నిధులు కేటాయించిన కార్యక్రమాలకు ఎన్నికల కోడ్ వర్తించదు. ఎన్నికల నియమావళి దీనిని స్పష్టంగా చెప్పింది. ఈ పథకాలకు కొత్త లబ్ధిదారులను మాత్రం ఎంపిక చేయకూడదు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్ రాకముందే ఆ పథకాల లబ్ధిదారులకు చెల్లింపులు ప్రారంభించింది. వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన పథకాలకు చెల్లింపులు దాదాపుగా కొలిక్కి వచ్చాయి. ఈ దశలో ఎన్నికల కోడ్ అంటూ టీడీపీ బృందం ఎన్నికల సంఘంపై ఒత్తిడి చేయడంతో మిగిలిన లబ్ధిదారులకు చెల్లింపులు నిలిచిపోయాయి. డ్వాక్రా చెల్లింపులనూ నిలిపివేయడంతో మహిళలకు అన్యాయం జరిగింది. విద్యా దీవెన పథకంలోని కొందరు విద్యార్థులకు చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో కాలేజీలకు ఫీజులు చెల్లించలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇనుపుట్ సబ్సిడీ, వైఎస్సార్ చేయూత, ఈబీసీ నేస్తం చెల్లింపులను కూడా టీడీపీ బృందం పూర్తిగా అడ్డుకుంది.

అనుమతించాలంటూ 15 రోజుల క్రితమే ఈసీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ

ఈ పథకాలన్నీ గత ఐదేళ్లుగా అమల్లో ఉన్నాయని, లబ్ధిదారుల ఎంపికా ఐదేళ్ల క్రితమే జరిగిందని, ఇప్పుడు కొత్తగా ఎవ్వరినీ ఎంపిక చేయలేదని, కొనసాగుతున్న పథకాలను అమలు చేయడానికి అనుమతి ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల క్రితమే కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. పథకాలు ఆగిపోవడం వల్ల లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లి, వెంటనే అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి రాగానే ఈ పథకాలకు చెల్లింపులు చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది. లేఖ రాసి 15 రోజులైనా కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి రాలేదంటే.. దీని వెనుక పింఛన్ల పంపిణీ తరహాలోనే టీడీపీ బృందం ఒత్తిళ్లున్నాయనేది స్పష్టమవుతోంది. పేదల పథకాలను అడ్డుకోవడం ద్వారా చంద్రబాబు బృందం పేదలకు వ్యతిరేకులమని మరో సారి నిరూపించుకుంది. సీఎం పేర్కొంటున్నట్లు చంద్రబాబు బృందం పెత్తందారులేనని నిరూపించుకుంది.

చంద్రబాబు నరహంతకుడు

వలంటీర్లను అడ్డుకుని వృద్ధుల ప్రాణాలతో ఆడుకుంటున్నాడు : మంత్రి బొత్స




సాక్షి ప్రతినిధి, విజయనగరం: వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకుని వృద్ధుల ప్రాణాలతో ఆడుకుంటున్న చంద్రబాబు నరహంతకుడని మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. పింఛన్ కోసం అల్లాడిపోతున్నారని, అనేకమంది చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. విజయనగరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. గత ఐదేళ్లలో ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే అవ్వాతాతల చేతుల్లో పింఛన్ పెట్టి వారి ముఖాల్లో చిరునవ్వు చూసేవాళ్లం. ఇది జీర్ణించుకోలేక చంద్రబాబు అండ్ కో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదులిచ్చి వలంటీర్లను సేవలకు దూరం చేశారు. ఇప్పుడెన్నో ఇబ్బందులు పడుతూ ప్రాణాలు కోల్పోతున్న వృద్ధుల ఉసురుకు వారు కొట్టుకుపోవడం ఖాయం. పెత్తందార్లకు నాయకుడిగా వ్యవహరిస్తున్న చంద్రబాబు ఎన్నికల్లో లబ్ధికోసం చిత్ర విచిత్ర విన్యాసాలన్నీ చేస్తున్నాడు. సినీనటులను రంగంలోకి దింపుతున్నాడు. ఒకరేమో (పవన్‌కళ్యాణ్) ఆవేశంతో ఊగిపోతూ రెచ్చిపోతుంటే, మరొకరు (బాలకృష్ణ) తెలుగుభాషను ఖూనీ చేస్తున్నారు.

బాలకృష్ణ బుర్రాబుద్ధీ లేనోడు..

చీపురుపల్లి, విజయనగరంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన బాలకృష్ణ సినిమాలో స్క్రిప్ట్ చదివినట్లే రాజకీయ ప్రసంగం కూడా కిందపడి మీద పడి చూసుకుంటూ చదవడం చాలా హాస్యాస్పదంగా ఉంది. ఉత్తరాంధ్ర భౌగోళిక, రాజకీయ, సామాజిక పరిస్థితులపై బాలకృష్ణకు ఏమాత్రం అవగాహనలేదని అర్థమైంది. గోడలకు రంగులేసినంత మాత్రాన పిల్లలకు చదువొస్తుందా? అని అడుగుతున్నాడంటే సీఎం జగన్ ప్రభుత్వం విద్యా సంస్కరణల గురించి ఆయనకు ఏమాత్రం అవగాహనలేదని స్పష్టమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఐబీ విధానాన్ని అమల్లోకి తెస్తాం. రాష్ట్రంలో సీబీఎస్ఈ సిలబస్‌తో నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలు 130 ఉన్నాయి. కానీ, రాష్ట్రంలోని 10వేల ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం వెయ్యిచోట్ల సీబీఎస్ఈ సిలబస్‌తో నడిపించాలని సీఎం సంకల్పించారు.. అందుకే సీబీఎస్ఈ బోర్డు రీజనల్ కార్యాలయం కూడా మన రాష్ట్రంలో పెడుతున్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి

అధికారులకు సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డా.కేఎస్ జవహర్‌రెడ్డి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో తాగునీరు, ఉపాధి హామీ పథకం పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో తాగునీటి సమస్య ఉన్న ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి. జూన్ నెలాఖరు వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకూడదు. ఎప్పటికప్పుడు భూగర్భ జల మట్టాలను అంచనా వేయాలి. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి పనుల ప్రగతిని సీఎస్ సమీక్షించారు. షెల్ఫ్ ఆఫ్ ప్రాజెక్టులకు స్క్రీనింగ్ కమిటీ ఆమోదం తెలిపినందున వేగంగా పనులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పీఆర్ అండ్ ఆర్డీ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ.. 281 ఆవాసాలకు ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. మొత్తం 3,075 ఆవాసాలకు జూన్ వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు అనుమతులిచ్చినట్లు వెల్లడించారు. కరువు ప్రభావిత మండలాల్లో వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలు కోసం రూ.39 కోట్లకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిందన్నారు. గురువారం రాష్ట్రంలో 28 లక్షల 56 వేల మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేశారని తెలిపారు. సమావేశంలో ఉన్నతాధికారులు ఎస్.ఎస్.రావత్, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, ఆనందరావు, చిన తాతయ్య, ఎస్.రవీంద్ర, జాన్ సత్యరాజ్, విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ రామలింగేశ్వరరావుకు హైకోర్టు ఘన నివాళి

సాక్షి, అమరావతి: ఇటీవల కన్నుమూసిన ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావుకు హైకోర్టు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించింది. ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ నేతృత్వంలో న్యాయమూర్తులందరూ మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ రామలింగేశ్వరరావు న్యాయవ్యవస్థకు అందించిన సేవలను సీజే కొనియాడారు. జస్టిస్ రామలింగేశ్వరరావు మరణం న్యాయవ్యవస్థకు తీరని లోటన్నారు. అనంతరం అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం మాట్లాడుతూ జస్టిస్ రామలింగేశ్వరరావు సేవలను గుర్తు చేసుకున్నారు. జస్టిస్ రామలింగేశ్వరరావు ఆత్మకు శాంతి చేకూరాలంటూ అందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

అవ్వాతాతల మృతికి కారకుడు నిమ్మగడ్డ కాదా?

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్

సాక్షి, అమరావతి: పింఛనర్లను ఇప్పటికే ఇబ్బందులకు గురిచేస్తున్న చంద్రబాబు, రాధాకృష్ణ, రామోజీ, పవన్, పురందేశ్వరి అనుకున్నంత పని చేశారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ మండిపడ్డారు. పండుటాకులు సొమ్మసిల్లి పడిపోయేందుకు, వారు మృతి చెందేందుకు కారకులయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎల్లో మీడియా, ఎల్లో పత్రికల్లో ఈ పాపం జగన్ దే అంటూ రాశారని, కానీ ఈ పాపం మీ నిమ్మగడ్డదే రామోజీ, రాధాకృష్ణా.. అని ప్రజలంటున్నారని తెలిపారు. నిమ్మగడ్డే పింఛన్ డబ్బులు బ్యాంకు అకౌంట్లలో వేయమన్నారని, కోర్టు కాపీలే అందుకు ఆధారాలని చెప్పారు. ఇంత బహిరంగ విషయాన్ని దాచే ప్రయత్నం చేయటం రామోజీ, రాధాకృష్ణ, బాబులకు తగునా? అని ప్రశ్నించారు.

ఏ విధంగానైతే సాలెపురుగు తన (కడుపు) నుండి గూడు అల్లుకుంటుందో, తిరిగి దాన్ని తన (కడుపు)లోకి మింగివేసుకుంటుందో, అదే విధంగా ఆ అనశ్వర (పరబ్రహ్మ) తత్వం నుండి ఈ సృష్టిలోని సర్వస్వమూ ఉత్పన్నమవుతుంది.

– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 4 మే 2024

రగులుతున్న క్యాంపస్‌లు!

గాజాలో ఇజ్రాయెల్ అమానుష హత్యాకాండ మొదలైనప్పటినుంచీ అమెరికన్ విద్యాసంస్థల్లో అలుముకున్న అశాంతి ఈ వారం తీవ్ర రూపం దాల్చింది. ప్రపంచంలోనే పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాలు విద్యార్థి ఉద్యమాలతో అట్టుడుకుతున్నాయి. వియత్నాంను వల్లకాడు చేస్తున్న అమెరికా సైనిక దురాక్రమణకు వ్యతిరేకంగా 1968లో తిరుగుబాటు జెండా ఎగరేసిన విద్యార్థుల పోరాటాన్నీ, 1980ల్లో దక్షిణాఫ్రికా జాత్యహంకార ప్రభుత్వం నెల్సన్ మండేలాను దీర్ఘకాలం చెరసాలలో బంధించటాన్ని నిరసిస్తూ సాగిన ఉద్యమాలనూ గుర్తుచేస్తున్నాయి. అప్పటిమాదిరే ఈ ఉద్యమాలు అట్లాంటిక్ మహా సముద్రం ఆవలితీరాల్లోని యూనివర్సిటీ క్యాంపస్‌లకు సైతం విస్తరించాయి. ఫ్రాన్స్, బ్రిటన్ తదితర దేశాల్లో మాత్రమేకాదు... పశ్చిమాసియాలోని బీరూట్, కువైట్, లెబనాన్, ట్యునీసియా యూనివర్సిటీలు కూడా రగులుతున్నాయి. లాఠీచార్జిలు, బాష్పవాయు గోళాలు ఎవరినీ భయపెట్టడం లేదు. వేలాదిమంది విద్యార్థులను అరెస్టుచేస్తూ ఉద్యమాలను చల్లార్చాలని పోలీసులు ప్రయత్నిస్తున్నా సాగటం లేదు. వీటి తీవ్రత పెరుగుతున్నదే తప్ప తగ్గటం లేదు. ప్రజాస్వామ్యం గురించి ప్రపంచానికి ప్రవచనాలు చెప్పే అమెరికా తన క్యాంపస్‌లను ప్రస్తుతం పోలీసు శిబిరాలుగా మార్చింది. అక్టోబర్ 7న ఇజ్రాయెల్ భూభాగంలోకి ప్రవేశించిన హమాస్ మిలిటెంట్‌లు 1,200 మంది పౌరులను కాల్చిచంపి, దాదాపు 250 మందిని బందీలుగా తీసుకెళ్లిన ఉదంతాన్ని ప్రపంచ వ్యాప్తంగా అందరూ తీవ్రంగా ఖండించారు. స్వతంత్ర పాలస్తీనా కోసం సాగుతున్న ఉద్యమాలను ఇలాంటి దుందుడుకు చర్యలు బలహీనపరుస్తాయని హెచ్చరించారు. దాన్ని సాకుగా తీసుకుని ఇజ్రాయెల్ గత ఆర్నెల్లుగా సాగిస్తున్న మారణహోమం తక్కువేమీ కాదు. ఇంతవరకూ 35,000 మంది పాలస్తీనా పౌరులు ఇజ్రాయెల్ సైనిక దళాల దాడుల్లో మరణించారని చెబుతున్నారు. ఇందులో అత్యధికులు నిరాయుధులైన స్త్రీలు, పిల్లలే. చివరికి బాంబుదాడుల్లో శిథిలమైన జనావాసాల్లో బాధితులకు అండగా నిలబడుతున్న ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలను సైతం ఇజ్రాయెల్ సైన్యం వదిలిపెట్టడం లేదు. కావాలని ఉద్దేశపూర్వకంగా వారిని కాల్చిచంపుతూ పాలస్తీనా పౌరులకు బాసటగా నిలబడాలన్న సంకల్పంతో వచ్చేవారిని భయభ్రాంతుల్ని చేసేందుకు ప్రయత్నిస్తోంది. మరోపక్క అనేకమంది హమాస్ ఉగ్రవాదులను మట్టుబెట్టామని చెప్పుకుంటోంది.

ఇజ్రాయెల్‌కు ఎడాపెడా మారణాయుధాలు సరఫరా చేస్తూ, భద్రతామండలి వంటి అంతర్జాతీయ వేదికలపై అది సాగిస్తున్న నరమేథాన్ని నిలువరించే అన్ని రకాల ప్రయత్నాలకూ మోకాలడ్డుతూ మద్దతుగా నిలబడుతున్న అమెరికా అప్పుడప్పుడు కోమానుంచి నిద్రలేచిన రోగి మాదిరిగా శాంతి వచనాలు వల్లిస్తోంది. ఇది సబబేనా? నిరాయుధ సాధారణ పౌరులను కాల్చిచంపటం ప్రపంచమంతా మౌనంగా వీక్షిస్తూ ఉండాల్సిందేనా? ఈ ప్రశ్నలే విశ్వవిద్యాలయాల విద్యార్థులను కలవరపరిచాయి. తాము మూగసాక్షులుగా మిగిలిపోలేమంటూ ఆ విద్యార్థులు గొంతెత్తటం వెనకున్న నేపథ్యం ఇదే. జార్జి వాషింగ్టన్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా లాస్ ఏంజెలస్ (యూసీఎల్ఏ), కొలంబియా యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా వగైరా ఉన్నతశ్రేణి విద్యాసంస్థలు నినాదాలతో మార్మోగుతున్నాయి. పేరెన్నికగన్న హార్వర్డ్, బర్క్‌లీ, యేల్ వర్సిటీలు సైతం రణక్షేత్రాలయ్యాయి. అమెరికా ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తున్నాయి. ఈ విశ్వవిద్యాలయాలు సాధారణమైనవి కాదు. పేరెన్నికగన్న ప్రపంచశ్రేణి సంస్థలు. ఉదాహరణకు యూసీఎల్ఏ 16 మంది నోబెల్ బహుమతి గ్రహీతలను తయారుచేసింది. ఆ సంస్థనుంచి ఇంతవరకూ 15 మంది మెక్‌ఆర్థర్ ఫెలోషిప్‌లను అందుకున్నారు. అసాధారణ ప్రతిభాపాటవాలున్నవారికి ఈ ఫెలోషిప్‌లు ఇస్తారు. ఇక్కడి పట్టభద్రుల్లో క్రీడల్లో రాణించి ఒలింపిక్స్‌లో పతకాలు అందుకున్నవారెందరో! ఎన్నో దేశాలు అందుకునే పతకాల సంఖ్యతో పోలిస్తే ఈ యూనివర్సిటీ పట్టభద్రులు సాధించే పతకాలే ఎక్కువంటారు. ఇలాంటిచోట చదువుకునే పిల్లలు సమాజ పరిణామాలపట్ల ఇంతగా కలవరపడటం బహుశా మన దేశంలో చాలామందిని ఆశ్చర్యపరిచి వుండొచ్చు. విద్యార్థి ఉద్యమ కేంద్రాలుగా ముద్రపడిన ఢిల్లీలోని జేఎన్‌యూ, జమియా మిలియా, కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీలను ఛీత్కరించటం అలవాటు చేసుకున్న మర్యాదస్తులకు ప్రపంచశ్రేణి విశ్వవిద్యాలయాల వర్తమాన పోకడలు మింగుడుపడకపోవచ్చు. అయోమయానికి గురిచేయవచ్చు. కానీ అమెరికా తదితర దేశాల విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు ఎప్పుడూ ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహిస్తూనే వున్నాయి. ఇప్పుడు సాగుతున్న విద్యార్థి ఉద్యమాలతో ప్రొఫెసర్లు సైతం గొంతు కలపటం, అరెస్టుకావటం యాదృచ్ఛికం కాదు. ఈ నిరసనలను యూదు వ్యతిరేక ఆందోళనలుగా చిత్రించి అధికారుల, రిపబ్లికన్ పార్టీ శ్రేణుల ప్రాపకంతో పోటీ ఉద్యమాలను నిర్వహిస్తున్న విద్యార్థులు లేక పోలేదు. పాలస్తీనా సంఘీభావ ఉద్యమకారులపై వారు దాడులకు కూడా వెనకాడటం లేదు. ఇది విచారకరం.

పిల్లి కళ్లు మూసుకుని పాలుతాగుతూ ఎవరూ చూడటంలేదని భ్రమపడుతుంది. అమెరికా ప్రభుత్వం ఈ ధోరణిని విరమించుకోవాలి. తన ఆయుధ పరిశ్రమ లాభార్జనకు తోడ్పడుతున్నాయన్న ఏకైక కారణంతో ఇజ్రాయెల్, ఉక్రెయిన్ తదితర దేశాలకు అమెరికా భారీగా సైనిక సాయం అందించటం అనైతికం, అమానుషం. విద్యార్థి ఉద్యమాలు పంపుతున్న సందేశాన్ని సక్రమంగా అర్థం చేసుకుని ప్రపంచశాంతికి దోహదపడటం అగ్రరాజ్యంగా తన బాధ్యతని ఇప్పటికైనా ఆ దేశం గుర్తించాలి. లేకుంటే ముమ్మందు ఈ ఉద్యమాలు మరింత విస్తరిస్తాయి.

కోడ్ ఉల్లంఘిస్తే గట్టి చర్యలుండాలి!

విశ్లేషణ



అశోక్ లవాసా

ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అభ్యర్థుల నైతిక వర్తన నియమావళి (మోరల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)ని తొలిసారి 1960లో రూపొందించారు. ఈ కోడ్‌ను ఎన్నికల సందర్భంగా అన్ని పార్టీలకు జారీ చేయడం 1979 నుంచి ఆనవాయితీగా మారింది. 1991లో పార్టీలన్నింటి అనుమతితో దీన్ని మరింత బలపరిచారు. కానీ రాజకీయ వాతావరణం పదును తేలినకొద్దీ, ఉల్లంఘనలు పెరిగాయి. కోడ్‌కు కట్టుబడి ఉండటం కంటే తప్పించుకునే మార్గాలను అన్వేషించేందుకే నేతలు ఇష్టపడుతుంటారు. కాబట్టి, వీలైనంత పారదర్శకంగా నిబంధనల ఉల్లంఘనలకు ఎలాంటి శిక్షలుంటాయో స్పష్టం చేయాలి. అదే సమయంలో, ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా కోడ్‌ను మార్చాలి. ప్రజాజీవితంలో గౌరవ మర్యాదలను కొనసాగించేందుకు ఇది చాలా ముఖ్యం.

‘చాలాసార్లు ఎన్నికలు ఒక మనిషిలోని చెడ్డతనపు పార్శ్వాన్ని బయటికి తెస్తాయి, అవి ప్రతిసారీ మంచి మనిషి విజయానికి దారితీయవనేది కూడా నిశ్చయం’ అన్నారు భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. ఆయన రాసిన ‘డిస్కవరీ ఆఫ్ ఇండియా’ పుస్తకంలోని ఈ పేరా ఎన్నికలు, ప్రజాస్వామ్య వ్యవస్థల్లోని లోటుపాట్లను ఎత్తిచూపుతుంది. అప్పటికి ఎన్నికల కమిషన్ లేదు... మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ– నైతిక వర్తన నియమావళి) కూడా లేదు. రాజకీయ నేతలు, వ్యవస్థలన్నింటి ప్రత్యేక సమ్మతితో ఏర్పడిందీ ఎంసీసీ. మార్పులు, చేర్పులతో కాలంతోపాటు ఎదుగుతూ వచ్చింది. ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే ఎంసీసీపై ఒత్తిడి విపరీతంగా పెరిగిపోతుంది. పార్టీలతో సహా నేతలు, అభ్యర్థులు... ఎన్నికల కమిషన్‌కు సవాళ్లు విసురుతూనే ఉంటారు. ఇదంతా కూడా మీడియా నిఘా, న్యాయ వ్యవస్థ కీలక డేగ కన్ను మధ్యలోనే జరుగుతూంటుంది.

కేరళతో మొదలు...

గతాన్ని కొంచెం తరచి చూద్దాం. కేరళ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొన్ని విధివిధానాలతో మొదలైందీ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్. ప్రచార సభలు, ప్రదర్శనలు, ప్రసంగాలు, నినాదాలు, పోస్టర్లు, ప్లకార్డుల వంటివి ఎలా ఉండాలో ఈ విధి విధానాల్లో పొందుపరిచారు అప్పటి (1960) ఎన్నికల ప్రధాన అధికారి కేవీకే సుందరం.

1968లో ఎస్పీ సేన్ వర్మ ప్రధానాధికారిగా ఉండగా ఎన్నికల కమిషన్ దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపింది. కేరళ ఎన్నికల సందర్భంగా రూపొందించిన విధి విధానాలను అందరికీ జారీ చేస్తూ, ఎన్నికలు సజావుగా జరిగేందుకు (ఫ్రీ అండ్ ఫెయిర్) కనీస మర్యాదలను పాటించాలని కోరింది. తరువాతి కాలంలో అంటే 1979 నుంచి ఈ కోడ్‌ను సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అన్ని పార్టీలకు జారీ చేయడం ఆనవాయితీగా మార్చారు అప్పటి సీఈసీ ఎస్.ఎల్. శక్‌ధర్. అంతేకాకుండా, రాజకీయ పార్టీల సమ్మతితో ఈ కోడ్‌ను మరింత విశదంగా రూపొందించారు. అధికార పార్టీకి కొన్ని పరిమితులు విధించడం, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవడం వంటి చర్యలు అమల్లోకి వచ్చింది అప్పుడే. 1991లో టీఎన్ శేషన్ ఎన్నికల ప్రధానాధికారిగా ఉండగా మరో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పార్టీలన్నింటి అను మతితో ‘కోడ్’ను మరింత బలపరిచారు. అయితే అప్పటినుంచి ఇప్పటివరకూ రాజకీయ వాతావరణం మరింత పదును తేలింది. ఫలితంగా మోడల్ కోడ్ సామర్థ్యం మొద్దుబారింది. ఉల్లంఘనలు పెచ్చుమీరి పోయాయి.

ఉల్లంఘనల పరిణామాలు స్పష్టం చేయాలి...

ప్రస్తుతం అమల్లో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో ఉన్న ప్రధాన లోపం కోడ్‌ను ఉల్లంఘిస్తే ఎటువంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందీ? అన్నది లేకపోవడం. అందుకే ఈ కోడ్... నిబంధనల ఉల్లంఘనలకు అడ్డు కావడం లేదు. కాబట్టి వీలైనంత పారదర్శకంగా నిబంధనల ఉల్లంఘనలకు ఎలాంటి శిక్షలు ఉంటాయో స్పష్టం చేయాల్సి ఉంటుంది. విద్వేషపూరిత ప్రసంగాలు, కుల మతాలను అడ్డం పెట్టుకుని ఓట్లు అడగడం వంటి విషయాల్లో మరీ కఠినంగా వ్యవహరించాల్సిన అవసరముంది. ఓట్ల కోసం పెట్టే ప్రలోభాలు, ప్రత్యర్థి పార్టీలు, నేతల గురించి అసభ్యకరమైన సంభాషణలు, భారత సాయుధ దళాలను పొగుడుతూ లేదా విమర్శిస్తూ, చర్యలను ప్రశ్నిస్తూ చేసే ప్రసంగాల గురించి ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఏ రకమైన ఉల్లంఘనలకు ఎలాంటి శిక్షలు ఉంటాయో స్పష్టంగా, బహిరంగంగా ప్రకటించాలి. ఉదాహరణకు విద్వేషపూరిత ప్రసంగాల వంటి వాటికి ప్రచారంపై నిర్దిష్ట కాలం నిషేధం విధించడం, మరింత తీవ్రమైన ఉల్లంఘనలకు నిషేధ సమయాన్ని పొడిగించడం, అప్పటికీ ఉల్లంఘనలు మానకపోతే మోడల్ కోడ్ అమల్లో ఉన్నంత కాలం నిషేధాన్ని కొనసాగించడం చేయవచ్చు. ఇది కేవలం ప్రచార సభలకు మాత్రమే పరిమితం కాకుండా... మీడియాలో కనిపించడం, ఇంటర్వ్యూలు ఇవ్వడం వంటి వాటికీ వర్తించేలా నిబంధనలు రూపొందించాలి. ‘ఉల్లంఘనులు’ స్టార్ క్యాంపెయినర్లు అయితే తరువాతి ఎన్నికల్లో ఆ గుర్తింపు రద్దు చేయడం కూడా చేయవచ్చు.



అయితే వీటి నుంచి తప్పించుకునేందుకు నేతలు సర్వశక్తులూ ఒడ్డుతారు. యుక్తులు పన్నుతారు కూడా. ఒకప్పుడు కండబలం ఉపయోగిస్తే ఇప్పుడు ఆ స్థానాన్ని ధన బలం ఆక్రమించింది. టెక్నాలజీ ఈ ఆయుధానికి మరింత పదును పెట్టింది. కోడ్‌కు కట్టుబడి ఉండటం కంటే తప్పించుకునేందుకు ఉన్న మార్గాలను అన్వేషించేందుకు నేతలు మరింత ఎక్కువ ఇష్టపడుతూంటారు. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో ఎంసీసీని రీమోడల్ చేయాల్సిన అవసరముంది. అది కూడా వివక్షకు తావులేని విధంగా అమలు చేసేలా ఉండాలి. ప్రజాజీవితంలో కొద్దోగొప్పో గౌరవ మర్యాదలను కొనసాగించేందుకు ఇది చాలా ముఖ్యం.

పార్టీలకు నోటీసులు... కొత్త పంథా!

ఎన్నికల కమిషన్(ఈసీ) ఈ మధ్యకాలంలో ఓ కొత్త పంథాను ఎంచుకుంది. కోడ్ ఉల్లంఘించిన వ్యక్తులకు కాకుండా... ఆ వ్యక్తుల పార్టీలకు నోటీసులు పంపుతోంది. అయితే ట్రాఫిక్ ఉల్లంఘనలకు డ్రైవరే బాధ్యుడైనట్లు కోడ్ ఉల్లంఘనల బాధ్యత కూడా పార్టీది కాదన్నది గుర్తించాలి. పైగా ఈసీ నోటీసు ప్రాథమికంగా ఉల్లంఘనపై సంతృప్తి చెందిన తరువాతే వెళుతుందన్న విషయం ఇక్కడ మనం గుర్తుపెట్టుకోవాలి. పార్టీకి చెందిన స్టార్ క్యాంపెయినర్లు, కీలక వ్యక్తులు కోడ్‌ను ఉల్లంఘిస్తే ఈసీ ఆ పార్టీపై కఠిన చర్యలు తీసుకునేందుకు కూడా వెనుకాడరాదు. ఈ చర్యలు జరిమానా కావచ్చు లేదా పార్టీ గుర్తులకు సంబంధించినదైనా కావచ్చు. అవసరమైతే ఈ రెండు రకాల చర్యలు కూడా తీసుకునేలా మార్పులు చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా... ఉల్లంఘనలు జరిగిన 72 గంటల్లోపే చర్యలు తీసు కోవడం కూడా అవసరం. వీటికి సంబంధించి స్పష్టమైన పద్ధతి ఒకదాన్ని సిద్ధం చేయాలి. ఆలస్యంగా తీసుకునే తూతూ మంత్రపు చర్యల వల్ల ప్రజల్లో ఈసీపై నమ్మకం సడలుతుంది.

కోడ్ ఉల్లంఘనలు ఎన్ని జరిగాయో ఒక జాబితా సిద్ధం చేసి వాటిల్లో ఎన్నింటిపై చర్యలు తీసుకున్నారు? ఎన్ని అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి? వంటి వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలి.

కోడ్ ఉల్లంఘనలను నేరుగా ఇతర చట్టాలకు అనుసంధానించడం జరిగితే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై పడుతుంది. అయితే, ఈ చర్యలన్నీ రాజకీయ పార్టీలు కోడ్ విషయంలో స్వీయ నియంత్రణ పాటించేలా చేస్తాయా? ఇది మన రాజకీయ నేతల క్యారెక్టర్‌పై ఆధారపడి ఉంటుంది. అయితే ఈ వ్యవహారాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించే వారి విచక్షణాధికారాలకు పరిమితి విధిస్తుందనడంలో సందేహం లేదు. తద్వారా ఎన్నికల ప్రధానాధికారిపై వివక్ష, ఏకపక్ష ధోరణి వంటి ఆరోపణలు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. ఉల్లంఘనలపై తీసుకునే చర్యలు నిర్దిష్ట కాలావధిలోగా పూర్తవుతాయన్న భరోసా ఎన్నికల కమిషన్ ప్రజలకు కల్పించడం కూడా అవసరమే. వీటన్నింటికంటే ముఖ్యమైన విషయం ఇంకోటి ఉంది. నాయకత్వం వహిస్తున్న వారు ఆదర్శప్రాయంగా వ్యవహరిస్తే ఎలాంటి మోడల్ కోడ్‌లూ అవసరం ఉండదు.

వ్యాసకర్త ఎన్నికల మాజీ ప్రధాన అధికారి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

అతడిని నిలపాలా?



ఎన్డీయే కూటమి 400 ఫైచిలుకు స్థానాలను గెలుచుకుంటుందన్న ఆత్మవిశ్వాసం బీజేపీకి ఉన్నప్పుడు, అది బ్రిజ్‌భూషణ్ కొడుకును అభ్యర్థిగా నిలపవలసింది కాదు. అది మన ఒలింపిక్ అమ్మాయిలదే కాదు, లైంగిక దుర్వర్తనకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి అమ్మాయి నైతిక స్థైర్యాన్ని దెబ్బకొడుతుంది.

– ప్రీతిష్ నంది, మాజీ ఎంపీ, జర్నలిస్ట్

తెలిసే అడుగుతున్నారా?



యూరప్ మీకు ఉచిత విద్య ఇచ్చింది. ఉచిత ఆరోగ్య సేవలు ఇచ్చింది. ఉచిత ఇల్లు ఇచ్చింది. మిగతా ఇస్లామిక్ ప్రపంచం మిమ్మల్ని కాదనుకున్నప్పుడు మీకు సురక్షితమైన ఆశ్రయం ఇచ్చింది; ఇప్పుడు యూరప్‌ను తిరిగి ఇస్లామిక్ నియంతృత్వంగా మార్చాలని కోరడం ద్వారా మీరు మీ రుణం తీర్చుకుంటున్నారా? ఈ జనాలకు ఏమైంది?

– లుయీ అహ్మద్, స్వీడన్ కాలమిస్ట్

కొట్టలేకుండా వేస్తే...



ఫోర్లకు అవార్డుంది, సిక్సులకు అవార్డుంది, ఆఖరికి అత్యధిక స్ట్రైక్ రేటుకు కూడా ఉంది. బ్యాట్స్‌మన్ ఏది చేసినా మనం గుర్తిస్తాం. బౌలర్లు వేసే డాట్ బాల్స్‌ను గుర్తించాల్సిన సమయం ఇదే. ఈ ఫార్మట్ (టీ20)లో ఇది అత్యంత విలువైనది.

– రాహుల్ రవీంద్రన్, నటుడు

ఎవరిది కుట్ర?



కొన్నేళ్ల క్రితం, కోవిడ్ టీకాలు రక్తాన్ని గడ్డకట్టిస్తాయని (బ్లడ్ క్లాట్స్) హెచ్చరించినవాళ్లను ‘కుట్ర సిద్ధాంతకారులు’ అని ముద్ర వేయడం గుర్తుందా? ఇప్పుడు ఆస్ట్రాజెనెకా కంపెనీ కోర్టులో దాన్నే అంగీకరించింది. కుట్ర సిద్ధాంతకారులు మరోసారి నిజమే అని తేలింది.

– పీటర్ స్వీడన్, జర్నలిస్ట్

ఎండల్లో హాయ్



బెంగళూరుకు బయట నివసించే ప్రతి ఒక్కరికీ తెలియజేయునది ఏమనగా, ఇక్కడ వర్షం పడుతోంది! సందేహం లేదు. ఈ అప్‌డేట్ కోసం మీరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలుసు.

– రమేశ్ శ్రీవత్స, వ్యంగ్య వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

ప్రజాస్వామ్యమే ఎజెండా

‘ఏ దేశ భవిష్యత్తు అయినా ఆ దేశ విద్యావంతుల మీద ఆధారపడి ఉంటుంది’ అంటారు బాబా సాహెబ్ అంబేడ్కర్. ప్రస్తుతం దేశంలో భిన్న సమూహాలు లేకుండా కేవలం ఒకే ఒక్క మతం మాత్రం ఉండాలి, ఒకే ఒక్క భాష మాత్రమే ఉండాలి, ఒకే ఒక్క సంస్కృతి మాత్రమే ఉండాలి అనే దుర్మార్గం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఇవాళ బీజేపీ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తామని ప్రగల్భాలు పలుకుతోంది. అందుకోసం ఎంతకైనా తెగించడానికి సిద్ధమవుతోంది. ముఖ్యంగా హిందూ మతాన్ని అందుకు ఆధారం చేసుకుంటోంది. బహుళ మతాలు, జాతులు, సంస్కృతులు ఉన్న ఈ దేశంలో మూడువేల యేండ్ల క్రితమే మనువాదం కులవ్యవస్థ రూపంలో మనుషులను విభజించింది. దానిని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఇవాళ దళితులు, మైనారిటీల మీద జరుగుతున్న దాడులు ఇందులో భాగంగానే చూడాలి.

మనది ఆధునిక రాజ్యాంగం. ఇది అందరికీ విద్యాహక్కు, ఆస్తి హక్కు, పాలించే హక్కు ఉండాలని చెబుతోంది. దీనిని పక్కన పెట్టి మానవ హక్కులను కాలరాసే మూడువేల యేండ్ల నాటి మనుస్మృతి రాజ్యాంగాన్నే మన పాలకులు అమలుచేసే పనిలో ఉన్నారు. అందులో భాగంగానే మనం జనం తినే తిండి మీద, ధరించే బట్ట మీద వాళ్లు ఆంక్షలు పెడుతున్నారు.


ఒక వైపు వేలకోట్ల రూపాయలను కార్పొరేటు శక్తుల జేబులు నింపుతోంది మోదీ–షా ద్వయం. మరోవైపు కార్పొరేటు శక్తులు మతోన్మాదానికి పెట్టుబడిని అందిస్తున్నాయి. దీనంతటికీ కారణం మతమే రాజ్యంగా అవతరించడమూ, అలాగే మతమే కార్పొరేటు శక్తిగా ఆవిర్భవించడం అనే పరిణామం ఈ దేశంలో ప్రస్తుతం ఏకకాలంలో సంభవించడం.

ప్రగతిశీల ప్రజాస్వామికవాదులంతా ఐక్యంగా నిలబడాల్సిన ఒక సందర్భం ముందుకు వచ్చింది. ముఖ్యంగా విద్యావంతులు, మేధావులు ప్రజలను మేల్కొలిపే బాధ్యతను స్వీకరించాలి. ప్రజలు కూడా ఫాసిస్ట్ పాలకుల ద్వంద్వ విలువలను అర్థం చేసుకోవాలి. ప్రజలను తమ స్వార్థ ప్రయోజనాలకు బలిచేసిన వారికి ఓటుతోనే బుద్ధి చెప్పాలి.

– డా॥ పసునూరి రవీందర్
కవి, రచయిత । 77026 48825

దశ దిశ మార్చే విజన్ అంటే ఇదే కదా!

అభిప్రాయం



అడుసుమిల్లి జయప్రకాష్

అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి... రెండు పగ్గాలను ఒకే చేత్తో పట్టుకొని ప్రభుత్వాన్ని జనరంజకంగా నడపడం సాధారణ విషయం కాదు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నడకను చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. తాను పాలన చేపట్టేనాటికి ఉన్న అస్తవ్యస్తమైన పాలనను గాడిలో పెట్టడమే గాక ప్రతి పథకాన్నీ ఒక విజన్‌తో రూపొందించడం జగన్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. విద్య, వైద్యం, మౌలిక అవస్థాపనా సౌకర్యాల ఏర్పాటు, వ్యవసాయం, రైతు సంక్షేమం, బడుగు ప్రజలకు ఆవాసం... ఇలా ఏ కార్యక్రమాన్ని తీసుకున్నా వాటి వెనుక సంక్షేమం, అభివృద్ధి అనే రెండు కాన్సెప్టులూ పడుగు పేకల్లా కలిసే కనిపిస్తాయి.

రాష్ట్ర విభజన జరిగిన తర్వాత 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్ మాత్రమే మనకు మిగిలితే, ఆ సంఖ్యను రెట్టింపు చేసి 26 జిల్లాల రాష్ట్రంగా మార్చడంలో జగన్ విజన్ ఏమిటో మనకు స్పష్టమవుతుంది. అధికార వికేంద్రీకరణ జరిగితేనే ప్రజల వద్దకు పాలన అనే విజన్ కార్యరూపంలోకి వస్తుంది గనుక జిల్లాలను విభజించి కలెక్టర్లు, ఎస్పీలు ప్రజలకు మరింత దగ్గరయ్యేట్లు చేశారు. గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చారు.

ఏ శ్రేయో రాజ్యంలోనైనా ఉద్యోగ కల్పన అనేది చాలా ముఖ్యమైన అంశం. ప్రజలకు ఎంత ఎక్కువగా ఉపాధి సమకూరితే రాష్ట్రం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర విభజన తర్వాత మొదటి అయిదేళ్లలో టీడీపీ ప్రభుత్వం 34 వేల ఉద్యోగాలు మాత్రమే ఇవ్వగా, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు నాలుగు లక్షలకు పైనే ఉద్యోగాలు ఇచ్చింది. దీనికి అధికారికమైన లెక్కలు ఉన్నాయి. వాటిలో పర్మినెంట్ ఉద్యోగాలే 2.31 లక్షలు ఉన్నాయంటే యువతకు ఉద్యోగాల కల్పన అంశానికి జగన్ ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యమిచ్చిందో అర్థమవుతుంది. సరైన విజన్ అంటే ఇదేకదా!!

ఉద్యోగాలు ఇంత పెద్ద ఎత్తున ఇవ్వడమేకాదు, ముందు ముందు యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం వాటికి ‘నైపుణ్య శిక్షణ’ ఇచ్చే కార్యక్రమాలు రూపొందించడం మరింత ప్రత్యేకమైనదిగా చెప్పవచ్చు. ఇంజినీరింగ్, ఇతర విభాగాలలో విద్యార్థుల నైపుణ్యాలను మరింత మెరుగుపరచి వారిని వివిధ పరిశ్రమల్లో పనిచేయడానికి అర్హులుగా చేయడానికి ప్రతి పార్లమెంటు నియోజకవర్గ కేంద్రంలో స్కిల్ డెవలప్మెంట్ కాలేజీలు, తిరుపతి, విశాఖ నగరాల్లో స్కిల్ డెవలప్మెంట్ వర్సిటీలు కూడా సంకల్పించారు. విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు ఇవ్వాలనుకొనేవారు ఏ విధంగా ఆలోచిస్తారో దీనిని బట్టి తెలుసుకోవచ్చు. సమాజంలోని వివిధ ప్రాధాన్య వర్గాలను బేరీజు వేసుకొని వారికి సరిపోయే ప్రణాళిక రూపొందించాలనేది సరైన విజన్ ఉన్న నేతకే సాధ్యమవుతుందని కూడా దీనిని బట్టి అర్థమవుతుంది.

బడుగు ప్రజలు కూడా సమాజంలోని అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలనీ, అభివృద్ధి ఫలితాలు వారు కూడా అందుకోవాలనే లక్ష్యంతో జగన్ తమ మొదటి మేనిఫెస్టోలోనే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రకటించారు. ‘నవరత్నాల’ను ప్రజలందరికీ అందించారు. కొద్ది రోజుల క్రితం విడుదల చేసిన రెండో మేనిఫెస్టోలో... గతంలో ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చారో తెలియజేసి, కొత్తగా మరికొన్ని పథకాలను ప్రతిపాదించారు. వాటిలో ముఖ్యంగా పేద పిల్లల చదువులకు ముఖ్యమంత్రి ఎంత ప్రాధాన్యమిచ్చారో చూస్తే అర్థమవుతుంది. ఆడపిల్లలు బాగా చదువుకోవాలనీ, అన్ని రంగాలలో ముందుకు వెళ్ళాలనే లక్ష్యంతో ప్రాథమిక విద్య నుంచి అనేక పథకాలను ప్రవేశపెట్టారు. ‘అమ్మఒడి’, ‘విద్యా దీవెన’ ‘కళ్యాణమస్తు’, వంటి పథకాలు అందుకే ప్రజల ఆదరణను అంతగా చూరగొన్నాయి.



ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు... ఈ మూడు అంశాలలో రాష్ట్రం సాధించిన ప్రగతినే ‘వాస్తవ అభివృద్ధి’గా చెబుతారు. అందుకే ఈ అంశాలకు జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్కువ ప్రాధాన్యమిచ్చినట్లు కనిపిస్తుంది. మానవాభివృద్ధి పథకాలు ఎంత ఎక్కువగా అమలైతే, సంక్షేమం అంత అభివృద్ధిగా మారుతుంది. ఇది తెలియని చాలా మంది సంక్షేమాన్ని అభివృద్ధిని వేర్వేరుగా చూస్తుంటారు. సంక్షేమం ముందుకు వెళ్తే అభివృద్ధిగా మారుతుందనే సిద్ధాంతాన్ని జగన్ నమ్మారు కనుకనే జగన్ అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయగలుగుతున్నారు. ప్రజలు ఆరోగ్యవంతులైతేనే ఎన్ని పనులైనా చేయగలుగుతారు. దానిని దృష్టిలో ఉంచుకొనే ఆరోగ్యరంగాభివృద్ధికి ప్రభుత్వం పలు కొత్త పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. వైఎస్సార్ పేరిట, జగన్ పేరిట పలు పథకాలు అమలవు తున్నాయి. కొత్తగా పలువైద్య కళాశాలల ఏర్పాటుకు కృషి జరుగుతోంది.

‘ఆరోగ్య శ్రీ’ ద్వారా రూ. 25 లక్షల విలువైన వైద్య చికిత్స అందించడానికి జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశంలో పేరుపొందింది. పేదలు చికిత్స కోసం ఎలాంటి అప్పులు చేయరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరించడం, ఉచిత సేవలను ఎక్కువ ఆసుపత్రులకు విస్తరించడం, చివరకు కేన్సర్ చికిత్స కూడా ఉచితంగా అందించడం ఎంతో విశేషం. చికిత్స అనంతరం వైద్యులు సూచించిన విశ్రాంతి సమయంలో ‘ఆరోగ్య ఆసరా’తో ఆదుకుంటున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. వృద్ధాప్య పెన్షన్ పెంపు, ‘వైఎస్సార్ చేయూత’ వంటి పథకాల ద్వారా ఏ ఇంటిలోనూ ఎలాంటి సమస్యలు లేని వాతావరణం సృష్టించడంకంటే ‘శ్రేయోరాజ్య’నికి అసలైన అర్థం ఇంకేం ఉంటుంది?

పాలనలో పిరమిడ్ నమూనాను పక్కన పెట్టి, చతురస్ర నమూనాను స్వీకరించడం జగన్ ప్రత్యేకత. ప్రభుత్వ పథకాలు అమలు అన్ని వైపులకు విస్తరించడానికి (అధికార యంత్రాంగం సమాజంలోని ఏ వర్గాన్ని వదలకుండా పథకాల ప్రయోజనాలు అందరికీ అందేట్లు చేయడం) ఈ చతురస్ర నమూనాను అనుసరించడం ఒక చక్కని ప్రయోగం. ఇలా ఒకటి రెండు కాదు, ‘జగన్’ను తెర మీద పరచే కార్యక్రమాలు, పథకాలు అనేకానేకం. అన్నీ ప్రజాదరణ పొందడం ఒక విశేషం. వాటన్నిటితో పాటు మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే మరింత కొత్త ‘విజన్’తో ముందుకు వస్తానని జగన్ ప్రకటించడం ముదావహం.

వ్యాసకర్త ఏపీ మాజీ శాసనసభ్యులు । 98481 28844

నిజమైన జీవితం

ఓమారు ఓ వృద్ధుడు బుద్ధుడి వద్దకు వచ్చారు. ఆయన బోధనలు వింటూ కొంతకాలం ఆయనతోనే గడిపారు. బుద్ధుని సాంగత్య ప్రభావంతో ఆయన నిజమైన భిక్కుగా మారి పోయారు. ఓరోజు బుద్ధుడు ఆయనను పిలిచి మాట్లాడారు. అప్పుడాయన బుద్ధుడు అడిగిన ఓ ప్రశ్నకు జవాబిస్తూ తనకిప్పుడు అయిదేళ్ళు అని అన్నారు. బుద్ధుడికి విషయం అర్థమైనా పైకి మాత్రం ‘మీకిప్పుడు డెబ్బై ఏళ్లు ఉంటాయి కదా. కానీ అయిదేళ్ళంటారేంటీ’ అని అడిగారు.

జ్యోతిర్మయం

దానికి ఆ పెద్దాయన ‘ఎందుకిలా చెప్తున్నా నంటే, నిజమైన జ్ఞానం నాకు ఒంటబట్టి అయిదేళ్ళే అయ్యింది కనుక’ అన్నారు. ‘నా హృదయంలో ప్రేమ పుట్టిందీ ఈ అయిదేళ్ళలోనే. అంతకుముందు నేను జీవించిన కాలమంతా ఓ కల లాంటిదే. ఆ జీవితం ఎటువంటి ప్రయోజనం లేకుండా గడిపేశాను. అందువల్ల నాకిప్పుడు అయిదేళ్ల వయసే’.

ఆ వృద్ధుని అవగాహన సరైనదే. ఈ ప్రపంచంలో జీవిస్తున్న వారందరూ నిజమైన జీవితాన్ని గడుపుతున్నారని అనుకోవడానికి వీల్లేదు. తమిళులు దక్షిణ వేదంగా భావించే ‘తిరుక్కురళ్’ కర్త తిరువల్లువర్... ఆరోపణలు, ప్రత్యారోపణలు వంటి వాటికి అతీతంగా జీవించాలన్నారు. అదే నిజమైన జీవితమవుతుందన్నారు. ‘ఎదుటి మనిషికి సాయం చేయడంతో లభించే ఖ్యాతితో బతకాలి. అంతే తప్ప ఎవరికో ఒకరికి హాని చేసి దాని వల్ల మూట కట్టుకునే అపఖ్యాతితో బతికే బతుకు ఓ బతుకే కాదు.’

దుష్ట ఆలోచనలు రానీయక సదా మంచి ఆలోచనలతో మంచి చేతలతో బతకాలి. ఒకరికి ఉపకారం చేయకపోయినా పరవాలేదు అపకారం చేయకూడద’ని అనుభవజ్ఞులు చెప్పడం అందుకే.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.ఏకాదశి సా.5.58 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.7.51 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** ఉ.8.44 నుండి 10.13 వరకు, తిరిగి రా.1.54 నుండి 3.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.36 నుండి 7.13 వరకు, **అమృతఘడియలు:** ప.12.27 నుండి 1.56 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.37, **సూర్యాస్తమయం:** 6.16.



D Mart®
Daily Discounts Daily Savings

సెలవుల షాపింగ్ ఇప్పుడు బడ్జెట్‌లో

DMart ready

కిరాణా మరియు రోజువారీ అవసరాలు

₹41* మాత్రమే లూస్ చక్కెర 1 కిలో

₹32* మాత్రమే లూస్ గోధుమ పిండి 1 కిలో

₹51* మాత్రమే లూస్ సోనా మసూరి కర్నూల్ రైస్ 1 కిలో

₹48* మాత్రమే లూస్ సోనా మసూరి రాయచూర్ స్టీమ్ రైస్ 1 కిలో

₹89* మాత్రమే లూస్ బిర్యానీ రైస్ 1 కిలో

₹127* మాత్రమే లూస్ మినుములు 1 కిలో

₹165* మాత్రమే లూజ్ కందిపప్పు 1 కిలో

₹35* మాత్రమే లూస్ ఇడ్లీ రవ్వ 1 కిలో

₹59* మాత్రమే లూస్ వడియాలు 1 కిలో

₹170* మాత్రమే జీరా 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 274

₹349* మాత్రమే కాజు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 577

₹115* మాత్రమే ఇండియన్ కిస్మిస్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 176

₹289* మాత్రమే స్వాద్ బాదంపప్పు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 450

₹355* మాత్రమే స్వాద్ పిస్తా 400 గ్రాములు ఎంఆర్‌పి ₹ 564

₹599* మాత్రమే ప్రొ వి సెలెక్ట్ కాలిఫోర్నియా బాదంపప్పు 1 కిలో ఎంఆర్‌పి ₹ 1,349

₹139* మాత్రమే రాజాం గార్లిక్ మిక్స్చర్ 800 గ్రాములు ఎంఆర్‌పి ₹ 199

₹155* మాత్రమే లోట్టె చాకోపై బిస్కెట్ 504 గ్రాములు ఎంఆర్‌పి ₹ 220

₹80* మాత్రమే థమ్స్ అప్ 1.75 లీ ఎంఆర్‌పి ₹ 100

₹190* మాత్రమే టాంగ్ ఆరెంజ్ ఇన్‌స్టంట్ డ్రింక్ మిక్స్ 750 గ్రాములు ఎంఆర్‌పి ₹ 270

₹334* మాత్రమే గ్లూకాన్-డి టాంగి ఆరెంజ్ ఫ్లేవర్ 1 కిలో ఎంఆర్‌పి ₹ 399

₹130* మాత్రమే మీరా స్ట్రాంగ్ అండ్ హెల్తీ షాంపూ 180 మి.లీ ఎంఆర్‌పి ₹ 180

₹239* మాత్రమే పాండ్స్ డ్రీమ్‌ఫ్లవర్ టాల్క్ 400 గ్రాములు ఎంఆర్‌పి ₹ 370

కొనండి 1 పొందండి 1 ఉచితంగా మామ ఎర్త్ ఉబ్టాన్ ఫేస్ వాష్ 150 మి.లీ ఎంఆర్‌పి ₹ 375*

కొనండి 1 పొందండి 1 ఉచితంగా షవర్ టు షవర్ కొలోన్ టాల్క్ 150 గ్రాములు ఎంఆర్‌పి ₹ 145*

కొనండి 1 పొందండి 1 ఉచితంగా పార్క్ అవెన్యూ హోయేజ్ పెర్ఫ్యూమ్ స్ప్రే 220 మి.లీ ఎంఆర్‌పి ₹ 390*

₹170* మాత్రమే గోద్రెజ్ సింథాల్ లైమ్ డియో సోప్ 4x150 గ్రా ఒక్కొక్కటి ఎంఆర్‌పి ₹ 235

కొనండి 1 పొందండి 1 ఉచితంగా క్లినిక్ ప్లస్ స్ట్రాంగ్ అండ్ లాంగ్ షాంపూ 650 మి.లీ ఎంఆర్‌పి ₹ 660*

₹199* మాత్రమే రిన్ మాటిక్ లిక్విడ్ పౌచ్ 2 లీ ఎంఆర్‌పి ₹ 330

ఇల్లు మరియు వంటగది

₹99** మాత్రమే యెరా డాటెడ్ గ్లాస్ 6 పీస్‌ల సెట్ 210 మి.లీ ప్రతి ఎంఆర్‌పి ₹ 230

₹79** నుంచి ఐస్ ట్రే ఎక్స్‌ఎల్

₹69** మాత్రమే కుల్ఫీ మేకర్ 8 కోన్లు ఎంఆర్‌పి ₹ 80

₹329** మాత్రమే బకెట్ 25 లీ ఎంఆర్‌పి ₹ 380

₹249** మాత్రమే వెల్స్పన్ బాత్ టవల్ 70 సెం.మీ x 140 సెం.మీ ఎంఆర్‌పి ₹ 285

₹1,099** నుంచి సీలింగ్ ఫ్యాన్

ప్రయాణం మరియు క్రీడలు

₹299** నుంచి బ్యాడ్మింటన్ రాకెట్లు

₹349** మాత్రమే ఫుట్‌బాల్ ఎంఆర్‌పి ₹ 430

₹149** నుంచి స్టీల్ బాటిల్

₹699** మాత్రమే హైకింగ్ బ్యాగ్ ఎంఆర్‌పి ₹ 995

₹1,899** మాత్రమే వి.ఐ.పి - అరిస్టోక్రాట్ నెక్సన్ ట్రాలీ బ్యాగ్ 24 సెం.మీ x 37 సెం.మీ x 55 సెం.మీ ఎంఆర్‌పి ₹ 10,000

₹2,655** నుంచి వి.ఐ.పి ఇగ్నిస్ ట్రాలీ బ్యాగ్ 24 సెం.మీ x 39 సెం.మీ x 55 సెం.మీ

దుస్తులు

₹299** నుంచి గర్ల్స్ ఫ్రాక్

₹229** నుంచి గర్ల్స్ జీన్స్

₹199** నుంచి గర్ల్స్ టాప్

₹79** నుంచి బాయ్స్ మరియు గర్ల్స్ టీ-షర్ట్

₹199** నుంచి బాయ్స్ చొక్కా

₹249** నుంచి బాయ్స్ జీన్స్

పాదరక్షలు ఎంఆర్‌పిపై కనీసం 7% తగ్గింపు

Paragon walkmate Bata VKC RELAXO

₹199** నుంచి లేడీస్ ఎథినిక్ షార్ట్/లాంగ్ కుర్తా

₹99** నుంచి లేడీస్ దుపట్టా/స్టోల్

₹199** నుంచి లేడీస్ యాంకిల్ కాటన్ స్ట్రెచింగ్ లెగ్గింగ్

₹499** నుంచి లేడీస్ డ్రస్సులు

₹99** నుంచి లేడీస్ క్యాజువల్ లోయర్

₹99** నుంచి లేడీస్ టీ-షర్ట్

₹149** నుంచి లేడీస్ టాప్

₹349** నుంచి లేడీస్ డెనిమ్/జోగ్గింగ్

₹169** నుంచి లేడీస్ లాంగ్ నైటీ

₹199** నుంచి లేడీస్ పైజామా

₹99** నుంచి పురుషుల ఫ్యాన్సీ టీ-షర్ట్

₹199** నుంచి పురుషుల కాజువల్/ఫార్మల్ షర్ట్

₹349** నుంచి పురుషుల ఫార్మల్ ట్రౌజర్/జీన్స్

₹449** నుంచి పురుషుల కాటన్ చినోస్

₹99** నుంచి ఫ్యాషన్ క్యాప్

₹149** నుంచి పురుషుల ఫ్యాషన్ షర్ట్

ఎంఆర్‌పిపై కనీసం 25% తగ్గింపు అన్ని బ్రాండెడ్ పురుషుల అండర్ గార్మెంట్స్

©Disney

కనీసం 6%^ డిస్కౌంట్

విజయవాడ: 0866-2434671 • విజయవాడ - 2 ఎయిర్‌పోర్ట్ రోడ్: 0866-2841026 • బెంజ్ సర్కిల్: 0866-2473752 • గొల్లపూడి: 0866-2410021 • సున్నప్పు: 0866-2411080 • మచిలీపట్నం: 0867-2254001 • గుడివాడ: 9989903522 • కుంచనపల్లి గుంటూరు డీమార్ట్: 7794946598 • నాజ్ సెంటర్ గుంటూరు: 0863-2228329 • గుంటూరు రింగ్ రోడ్డు: 0863-2335002 • ఒంగోలు: 0859-2234057 • మధురవాడ (వైజాగ్ 1): 0891-2524270/275 • మురళీనగర్: 0891-2976630 • గాజువాక: 0891-2744230 • సూర్యబాగ్: 0871-2625188 • అగనంపూడి విజయనగరం ఏపీ డీమార్ట్: 8922294861 • కాకినాడ: 0884-2371630 • ఏలూరు (గోదావరి): 08812-242993 • రాజమండ్రి (సాయిపేట): 7416271451 • రామచంద్రపురం: 0883-2475777 • పెందుర్తి-వైజాగ్: 8985251174/9440552385 • భీమవరం: 8121206325 • ధనుకు: 08819-295903 • టురంగి, కాకినాడ: 088-2944895 • బండమీద, చిత్తూరు: 085-71351011 • కర్నూలు: 08518-256670 • అనంతపూర్: 0855-4249980 • కంచరపాలెం, వైజాగ్: 9154837509 • జోహరాపురం కర్నూలు-2: 8333998757 • అనకాపల్లి: 9063793582 • ప్రొద్దుటూరు కడప ఏపీ: 8712622605 • ఖమ్మం (తెలంగాణ): 08742-220003

**విజయవాడ మరియు విశాఖపట్నంలో మాత్రమే లభిస్తుంది

చిత్రాలు ప్రాతినిధ్య ప్రయోజనాల కోసం మాత్రమే • ఉత్పత్తి ఆఫర్లు స్టాక్‌లు ఉండే వరకు చెల్లుబాటు అవుతాయి • స్థానాలను బట్టి ధరలు మరియు ఆఫర్లు మారవచ్చు ప్రదర్శించబడే బ్రాండ్‌లు సంబంధిత బ్రాండ్ యజమానుల స్వంతం • ^ నిర్వహణ తన అభీష్టానుసారం ధరలను మార్చడానికి మరియు ఉత్పత్తులను విక్రయించే హక్కును కలిగి ఉంది. • నియమ నిబంధనలు వర్తిస్తాయి • *రిటైల్ విక్రయ ధర • #

1N

Impulse/05/24



శుక్రవారం రాయ్‌బరేలీలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రాహుల్ గాంధీ. చిత్రంలో సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ, రాబర్ట్ వాద్రా

రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ

అమేథీ నుంచి కిశోరీలాల్

- ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ కంచుకోటలపై ఉత్కంఠకు తెర
- సోనియా గాంధీ 20 ఏళ్లు ప్రాతినిధ్యం వహించిన స్థానం నుంచి తనయుడి పోటీ
- ఈసారి పోటీకి దూరంగా ప్రియాంకా గాంధీ

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ కంచుకోటలైన రాయ్‌బరేలీ, అమేథీ లోక్‌సభ స్థానాల్లో ఈసారి ఎవరు పోటీ చేస్తారన్న దానిపై కొన్నిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ రెండు స్థానాల్లో తమ అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం శుక్రవారం ఉదయం ప్రకటించింది. రాయ్‌బరేలీ నుంచి అనూహ్యంగా రాహుల్ గాంధీ పోటీకి దిగుతున్నారు. సోనియా గాంధీ కుటుంబానికి వీరవిధేయుడైన కిశోరీలాల్ శర్మ అమేథీ నుంచి పోటీ చేస్తున్నారు. రాహుల్, కిశోరీలాల్ శుక్రవారమే నామినేషన్లు దాఖలు చేశారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఐదో విడతలో భాగంగా ఈ నెల 20న పోలింగ్ జరుగనుంది.

రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ అభ్యర్థిత్వం ఖరారు కావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ స్థానంలో ఆయన సోదరి, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాను బరిలోకి దింపాలని పలువురు కాంగ్రెస్ సీనియర్లు పట్టుబట్టారు. కాంగ్రెస్ వారసత్వ రాజకీయాలు చేస్తోందని, ఆ పార్టీలో సోనియా గాంధీ కుటుంబానిదే అసలు పెత్తనం అంటూ బీజేపీ విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని ప్రియాంక గాంధీ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎవరూ ఊహించని విధంగా రాయ్‌బరేలీ నుంచి రాహుల్ పేరు తెరపైకి వచ్చింది. గత ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి ఎంపీగా గెలిచిన సోనియా గాంధీ ఈసారి పోటీ చేయడం లేదు. ఆమె ఇప్పటికే రాజస్తాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. రాయ్‌బరేలీ స్థానం ప్రస్తుతం ఖాళీగానే ఉంది. రాహుల్ గాంధీని పోటీ చేయించడం ద్వారా ఇక్కడ మరోసారి విజయకేతనం ఎగురవేయాలని, తమ పట్టు నిలుపుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. తన తల్లి సోనియా గాంధీ 20 ఏళ్లపాటు ప్రాతినిధ్యం వహించిన లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ పోటీకి దిగుతుండడం ఆసక్తికరంగా మారింది.

రాయ్‌బరేలీలో రాహుల్ నామినేషన్

ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఆమె భర్త రాబర్ట్ వాద్రాలతో కలిసి రాహుల్ తన నామినేషన్ పత్రాలను రాయ్‌బరేలీ జిల్లా మెజిస్ట్రేట్ హర్షితా మాథుర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీజేపీ కార్యకర్తలు 'గో బ్యాక్ రాహుల్' అంటూ నినాదాలు చేస్తూ కనిపించారు. ఈ ఎన్నికల్లో రాయ్‌బరేలీలో బీజేపీ అభ్యర్థిగా ఉత్తరప్రదేశ్ మంత్రి దినేష్ ప్రతాప్ సింగ్‌తో బరిలో నిలిచారు.

రూ.20 కోట్లకు పైగా ఆస్తులు

తనకు రూ.20 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు రాహుల్ తన నామినేషన్ పత్రాల్లో వెల్లడించారు. రూ.3.81 కోట్ల విలువైన షేర్లతో కలిపి రూ.9.24 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నట్లు తెలియజేశారు. రూ.26.25 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, రూ.15.21 కోట్ల విలువైన గోల్డ్ బాండ్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే రూ.11.15 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం చేతిలో రూ.55 వేల నగదు ఉందని, రూ.49.79 లక్షల అప్పులు ఉన్నాయని ప్రస్తావించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రాహుల్ వార్షికాదాయం రూ.1.02 కోట్లు.

మా కర్మభూమి రాయ్‌బరేలీ

రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తుండడం తనకు భావోద్వేగ సమయమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''మా కుటుంబానికి కర్మభూమి అయిన రాయ్‌బరేలీని మా తల్లి సోనియా గాంధీ ఎంతో నమ్మకంతో నాకు అప్పగించారు. ఇక్కడి ప్రజలకు సేవ చేసుకొనే భాగ్యం కల్పించారు. అమేథీ, రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానాలు నాకు వేర్వేరు కాదు. ఇవి రెండూ నా సొంత కుటుంబం లాంటివే. 40 ఏళ్లుగా అమేథీ నియోజకవర్గానికి సేవలందిస్తున్న కిశోరీలాల్ శర్మ ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం నాకు చాలా సంతోషంగా ఉంది. దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనేందుకు సాగుతున్న ఈ పోరాటంలో అందరూ నాకు అండగా నిలుస్తున్నారన్న విశ్వాసం ఉంది'' అని రాహుల్ వెల్లడించారు.

డరో మత్.. భాగో మత్

అమేథీలో పోటీచేసే ధైర్యం లేక రాయ్‌బరేలీకని ఎద్దేవా!

- రాహుల్ ఇకనైనా భయపడడం, పారిపోవడం ఆపాలి
- ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా కష్టమే
- ఆ పార్టీకి చరిత్రలోనే అత్యంత తక్కువ సీట్లు
- తేల్చిచెప్పిన ప్రధాని మోదీ
- పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారం

బర్ధమాన్/కృష్ణనగర్/చైబాసా: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి ఎన్నికల బరిలోకి దిగుతుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. డరో మత్.. భాగో మత్(భయపడొద్దు.. దూరంగా పారిపోవద్దు) అంటూ రాహుల్‌కు సూచించారు. కేరళలోని వయనాడ్‌లో పోలింగ్ పూర్తికాగానే కాంగ్రెస్ యువరాజు అక్కడి నుంచి పారిపోయి మరో స్థానం వెతుక్కుంటాడని ఇంతకుముందే చెప్పానని, తాను చెప్పినట్లే జరిగిందని అన్నారు. కాంగ్రెస్ యువరాజు వయనాడ్‌లో ఓటమి తప్పదని గ్రహించి రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తున్నాడని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో అమేథీలో ఓడిపోయిన రాహుల్ గాంధీ వయనాడ్‌కు పారిపోయాడని, ఇప్పుడు అక్కడినుంచి రాయ్‌బరేలీకి వచ్చాడని పేర్కొన్నారు. ఈసారి అమేథీలో పోటీ చేసే ధైర్యం లేక రాయ్‌బరేలీని ఎంచుకున్నాడని ఎద్దేవా చేశారు. భయపడొద్దు అంటూ కాంగ్రెస్ నాయకులు తరచుగా ప్రజలకు చెబుతుంటారని, తాను అదే మాట ఇప్పుడు వారికి చెబుతున్నానని అన్నారు. ఇకనైనా భయపడడం, దూరంగా పారిపోవడం ఆపేయాలని రాహుల్ గాంధీకి హితవు పలికారు. శుక్రవారం పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్–దుర్గాపూర్, కృష్ణనగర్, బీర్భూమ్, బోల్‌పూర్ లోక్‌సభ స్థానాల పరిధిలో ఎన్నికల ప్రచార సభల్లో, జార్ఖండ్‌లోని చైబాసాలో 'మహా విజయ్ సంకల్ప సభ'లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభ మసకబారుతోందని, ప్రజాదరణ కోల్పోతోందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి చరిత్రలోనే అత్యంత తక్కువ స్థానాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కనీసం 50 సీట్లయినా గెలుచుకోవడం కష్టమేనని చెప్పారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోతుందని చెప్పడానికి ఒపీనియన్ పోల్స్ గానీ, ఎగ్జిట్ పోల్స్ గానీ అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్ ఓటమి గురించి తాను గతంలోనే పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పానని గుర్తుచేశారు. ఆ పార్టీ సీనియర్ నాయకురాలు(సోనియా గాంధీ) లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదని ముందే గుర్తించి, రాజస్తాన్ నుంచి రాజ్యసభలో అడుగుపెట్టారని వెల్లడించారు. కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్న నమ్మకం ఆ పార్టీ నేతలకే లేదన్నారు. ఎన్నికల సభల్లో ప్రధాని మోదీ ఇంకా మాట్లాడారంటే..



మూడు సవాళ్లపై సమాధానమేదీ?

దేశంలో దళితులు, గిరిజనులు, ఓబీసీలు బీజేపీకి మద్దతుగా నిలుస్తుండడం చూసి కాంగ్రెస్ భరించలేకపోతోంది. అందుకే వారి రిజర్వేషన్లు లాక్కొని మైనార్టీలకు కట్టబెట్టాలని పథకం వేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 'జిహాదీ ఓటు బ్యాంక్' కోసం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు లాక్కోవడం తథ్యం. కాంగ్రెస్‌తోపాటు విపక్ష కూటమికి నేను 3 సవాళ్లు విసురుతున్నా. మొదటిది.. అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చబోమని లేదా మతం ఆధారం రిజర్వేషన్లు ఇవ్వబోమని దేశ ప్రజలకు లిఖిత పూర్వకంగా గ్యారంటీ ఇవ్వాలి. రెండోది.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను కాజేయబోమని, మతం ఆధారంగా ఆయా వర్గాల ప్రజలను విభజించబోమని రాతపూర్వకంగా హామీ ఇవ్వాలి. మూడోది.. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముస్లింలను ఓబీసీ కోటాలో చేర్చి రిజర్వేషన్లు కల్పించబోమని లిఖితపూర్వకంగా గ్యారంటీ ఇవ్వాలి. ఈ మూడు సవాళ్లపై ప్రతిపక్షాలు నోరుమెదపడం లేదు. నాకు సమాధానం ఇవ్వడం లేదు.

దశాబ్దాలుగా నిశ్శబ్దంగా 'ఓటు జిహాద్'

దేశంలో ఓటు జిహాద్ ఆట గత కొన్ని దశాబ్దాలుగా నిశ్శబ్దంగా కొనసాగుతూనే ఉంది. మోదీకి వ్యతిరేకంగా ఓటు జిహాద్ చేయాలని కొందరు పిలుపునిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రతిపక్షాలు నోరెత్తడం లేదు. అంటే ఈ పిలుపును ప్రతిపక్షాలు అంగీకరిస్తున్నట్లే లెక్క. ఓటు జిహాద్‌లో పాలుపంచుకున్నవారికి ప్రజల ఆస్తులను దోచిపెట్టాలని కాంగ్రెస్ కుట్రలు పన్నుతోంది. ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి బుజ్జగింపు తప్ప మరో విధానం లేదు. మతం ఆధారంగా ఇప్పటికే మన దేశాన్ని ముక్కలు చేశారు. సిక్కులు, క్రైస్తవులు, పార్శీలు అవతలి గట్టుపై చిక్కుకొని నానా కష్టాలూ పడుతున్నారు. వారికి న్యాయం చేకూర్చడానికి పౌరసత్వ సవరణ చట్టం తీసుకొచ్చాం. కానీ, విపక్షాలు మాత్రం ఓటు బ్యాంక్ రాజకీయాలతో ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాయి. దేశంలో వనరులపై, సందపపై ముమ్మాటికీ పేదలకే మొదటి హక్కు ఉంది. ఈ భూగోళంపై ఏ శక్తి కూడా మన రాజ్యాంగాన్ని మార్చేయలేదు. 15 సీట్లు కూడా నెగ్గలేని తృణమూల్ కాంగ్రెస్, 50 సీట్లయినా దక్కించుకోలేని కాంగ్రెస్ కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేవు. ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి స్థిరమైన, బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సత్తా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు మాత్రమే ఉంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హిందువులను రెండో తరగతి పౌరులుగా మార్చేసింది. విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోంది. ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలి. చిత్తుచిత్తుగా ఓడించాలి. ప్రజలను లూటీ చేసినవారిని శిక్షించకుండా వదిలిపెట్టబోమని గ్యారంటీ ఇస్తున్నా'' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

ఎవరీ కిశోరీ లాల్ శర్మ?



న్యూఢిల్లీ: అమేథీలో రాహుల్ బదులు బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి కిశోరీ లాల్ శర్మ ఎవరబ్బా? అని నెటిజన్లు ఆన్‌లైన్‌లో తెగవెతికేస్తున్నారు. రాహుల్ గాంధీనే మట్టికరిపించిన స్మృతి ఇరానీని ఎన్నికల రణక్షేత్రంలో ఈయన ఢీకొట్టగలరా? అన్న మీమాంస స్థానిక ఓటర్లలో మొదలైంది. గాంధీల కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా శర్మకు పేరుంది. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో ఈయన క్రియాశీలంగా పనిచేస్తున్నారు. శర్మ సొంత రాష్ట్రం పంజాబ్. లూథియానా పట్టణానికి చెందిన శర్మ మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీకి సన్నిహితుడు. 1983లో రాజీవ్‌గాంధీతో పాటు ఒకేసారి ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో అడుగుపెట్టారు. ఆనాటి నుంచి యూపీ రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగుతున్నారు. 1991 మే నెలలో రాజీవ్‌గాంధీ మరణానంతరం గాంధీల కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. 1999లో తొలిసారిగా సోనియాగాంధీ అమేథీలో ఘన విజయం సాధించడంలో శర్మ కృషి దాగిఉందని అక్కడి వాళ్లు చెబుతారు. అమేథీ, రాయ్‌బరేలీల్లో రాహుల్, సోనియా అందుబాటులో లేనపుడు నియోజకవర్గ సమస్యలపై పార్టీ అగ్రనాయకత్వానికి తెలియజేయడం వంటి పనులనూ ఈయన చక్కబెట్టేవారు. రాయ్‌బరేలీ ప్రజలకు ఈయన బాగా తెలుసు. గత ఎన్నికల్లో అమేథీలో రాహుల్ ఓడిపోయాక అప్పటి నుంచి నియోజకవర్గంలో కాంగ్రెస్ వ్యవహారాలను ఈయనే చూశారు. గతంలో కొంతకాలం బిహార్, పంజాబ్ రాష్ట్రాల వ్యవహారాలనూ శర్మ చూసుకున్నారు.

మోదీయే పారిపోయి వారణాసికి వచ్చారు..!

ఖర్గే ఎదురు దాడి

న్యూఢిల్లీ: అమేథీలో పోటీ చేసే ధైర్యం లేక రాహుల్ గాంధీ రాయ్‌బరేలీకి పారిపోయారంటూ ప్రధాని మోదీ, బీజేపీ నేతలు సాగిస్తున్న విమర్శల దాడికి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే దీటుగా బదులిచ్చారు. ప్రధాని మోదీ వేరే చోట్ల గెలుపుపై నమ్మకం లేకనే యూపీలోని వారణాసిలో పోటీ చేస్తున్నారు కదా అని వ్యాఖ్యానించారు. 'గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి ఎందుకు పారిపోయి వచ్చారో ఆయన్నే అడగండి' అంటూ ఖర్గే మీడియాతో పేర్కొన్నారు. మోదీ 2014 ఎన్నికల్లో గాంధీనగర్, వారణాసి సీట్లకు పోటీ చేసి, రెండు చోట్లా గెలుపొందారు. గాంధీనగర్‌కు తర్వాత రాజీనామా చేశారు. 2019 ఎన్నికల్లో వారణాసి నుంచి మాత్రమే పోటీ చేసిన విషయం తెలిసిందే.

'రహస్య వ్యూహం' ఏమిటో?

- ఎన్నికల నుంచి ప్రియాంక దూరంపై కాంగ్రెస్‌లో రకరకాల చర్చలు
- వారసత్వ పోకడ అన్న బీజేపీ విమర్శలకి చెక్ పెట్టేందుకే అంటూ కొందరి వ్యాఖ్య
- ఉప ఎన్నిక ద్వారా ఎంట్రీ ఇస్తారని మరికొందరు

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ రాయ్‌బరేలీ నుంచి నిష్క్రమించాక ఆమె కుమార్తె ప్రియాంకా గాంధీ రాజకీయ ఆరంగ్రేటం చేస్తారని గంపెడాశ పెట్టుకున్న స్థానిక నాయకత్వంపై ఏఐసీసీ నీళ్లు చల్లింది. రాయ్‌బరేలీ లేదా అమేథీలో ప్రియాంక కచ్చితంగా పోటీచేస్తారని తెగ ప్రచారం జరిగినా చివరకు ఆమె పోటీకి నిలబడకపోవడం పార్టీ శ్రేణుల్ని ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందించారు. ప్రియాంక పోటీలో ఉండకపోవడం వెనుక 'రహస్య వ్యూహం' ఉందంటూ చేసిన వ్యాఖ్యలతో అదేమిటన్న ఆసక్తి మరింత ఎక్కువైంది.

అరంగేట్రం వయా ఉప ఎన్నిక!

వాస్తవానికి ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేయకూడదని ప్రియాంక బలంగా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయినాసరే దశాబ్దాలుగా రాయ్‌బరేలీతో అనుబంధం పెంచుకున్న గాంధీలు కచ్చితంగా పోటీచేయాలని స్థానిక నేతల నుంచి డిమాండ్లు ఎక్కువయ్యాయి. విపక్షాల 'ఇండియా' కూటమిలో భాగస్వామ్య పార్టీ అయిన సమాజ్‌వాదీ సైతం ఇదే డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో చివరికి రాహుల్ పోటీకి అంగీకరించినట్లు చెబుతున్నారు. ఇప్పటికే రాజస్థాన్ నుంచి రాజ్యసభకు సోనియా ఎన్నికయ్యారు. రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక, అమేథీ నుంచి రాహుల్ పోటీ చేసి గెలిస్తే పార్లమెంట్‌లో ముగ్గురు గాంధీలు ఉంటారని, ఇది వారసత్వ రాజకీయాలను వ్యతిరేకిస్తున్న బీజేపీకి పెద్ద అస్త్రంగా మారుతుందన్న ఉద్దేశ్యంతో ప్రియాంక పోటీ నుంచి తప్పుకున్నారన్న విశ్లేషణలూ వినిపిస్తున్నాయి. రాయ్‌బరేలీ, వయనాడ్‌లలో రాహుల్ గెలిస్తే రాయ్‌బరేలీలో రాజీనామా చేస్తారని, ఆ స్థానానికి వచ్చే ఉప ఎన్నిక ద్వారా ప్రియాంక రాజకీయ అరంగ్రేటం చేస్తారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రస్తుత ఎన్నికల్లో పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా ప్రియాంకగాంధీ దేశమంతా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను ఒక్క రాయ్‌బరేలీ నియోజకవర్గానికే పరిమితం చేయకూడదన్న ఉద్దేశంతో పార్టీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందని విశ్వసనీయవర్గాలు చెబుతున్నాయి.

బెయిల్ అంశాన్ని పరిశీలిస్తాం

కేజ్రీవాల్ పిటిషన్‌పై 7న విచారణ: సుప్రీం

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టై ప్రస్తుతం తిహార్ జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు కొంత ఊరట కలిగించే పరిణామమిది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఢిల్లీలో ఈ నెల 25న పోలింగ్ జరుగనుందని, తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం పరిశీలించింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 7న వాదనలు వింటామని తెలియజేసింది. విచారణకు సిద్ధమై రావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరఫు న్యాయవాదికి సూచించింది. లిక్కర్ స్కామ్‌లో తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, అందుకే మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను విచారిస్తామని పేర్కొంది. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తామని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు చెప్పారు. ఇదే కేసులో గత నెలలో బెయిల్ పొంది బయటకు వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సంజయ్ సింగ్ చేస్తున్న వ్యాఖ్యలను గమనించాలని కోరారు. కేజ్రీవాల్‌కు కూడా బెయిల్ ఇస్తే అలాంటి వ్యాఖ్యలు చేసే అవకాశం ఉందని పరోక్షంగా వెల్లడించారు. ధర్మాసనం స్పందిస్తూ.. మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై కేవలం విచారణ జరుపుతామని, కేజ్రీవాల్‌కు కచ్చితంగా మధ్యంతర బెయిల్ ఇస్తామని తాము చెప్పడం లేదని, ఆయనకు బెయిల్ ఇవ్వొచ్చు, ఇవ్వకపోవచ్చు అని స్పష్టం చేశారు.

పీవోకేలో బస్సు ప్రమాదం.. 20 మంది దుర్మరణం

పెషావర్: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లోని గిల్గిట్–బల్టిస్తాన్‌లో శుక్రవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కనీసం 20 మంది మృత్యువాతపడ్డారు. రావల్పిండి నుంచి గిల్గిట్ వైపు 43 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు దియామెర్ జిల్లాలో కారకోరం హైవేపైని పర్వత ప్రాంతంలో అదుపు తప్పి నది ఒడ్డున పడింది. ఈ దుర్ఘటనలో 20 మంది చనిపోగా మరో 21 మంది గాయపడ్డారు. డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోయినందునే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

మహిళా ఉద్యోగితో అనుచితంగా ప్రవర్తించారు

- బెంగాల్ గవర్నర్‌పై సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణ
- అంతా డ్రామా అంటూ కొట్టిపారేసిన ఆనంద బోస్
- తనపై మరిన్ని ఆరోపణలు రావొచ్చని వ్యాఖ్యలు

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల వేళ తృణమూల్ కాంగ్రెస్ చీఫ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్‌ల మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. ఉద్యోగం కోసం వచ్చిన మహిళతో గవర్నర్ అసభ్యంగా ప్రవర్తించారంటూ మమత ఆరోపించారు. గత రాత్రి రాజ్‌భవన్‌కు వచ్చిన ప్రధాని మోదీ ఈ ఆరోపణలపై ఎందుకు మాట్లాడలేదంటూ ఆమె ప్రశ్నించారు. సీఎం మమత శుక్రవారం పూర్బ బర్ధమాన్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. 'రాజ్‌భవన్‌లో పనిచేసే ఓ యువతి నిన్న నా దగ్గరికి వచ్చింది. వేళకాని వేళ పిలిపించి గవర్నర్ అసభ్యంగా ప్రవర్తించారని చెప్పి కన్నీళ్లు పెట్టుకుంది. మళ్లీ రాజ్‌భవన్‌కు వెళ్లాలంటేనే భయం వేస్తోందంటూ వాపోయింది. అది చూసి నా గుండె పగిలింది. వీళ్లా తల్లులు, చెల్లెళ్ల మర్యాద, గౌరవం గురించి మాట్లాడేది?'అంటూ ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళను వేధించారంటూ గవర్నర్ సీవీ ఆనందబోస్‌పై గురువారం టీఎంసీ నేతలు కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపించాలని కోరారు. ఫిర్యాదును పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ పరిణామంపై గవర్నర్ ఆనందబోస్ స్పందిస్తూ..వారివన్నీ కట్టుకథలన్నారు. ఇదంతా డ్రామా అంటూ కొట్టిపారేశారు.

పోలీసుల బదిలీపై మమత ఆగ్రహం

పశ్చిమబెంగాల్‌కు చెందిన 1,500 మంది పోలీసు అధికారులను ఎన్నికల కమిషన్ ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల విధులకు పంపించడంపై మమత తీవ్రంగా స్పందించారు. ఇతర రాష్ట్రాలు సాయం అడగకుండానే ఇలాంటి నిర్ణయం ఎలా తీసుకుంటుందని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల నుంచి పోలీసులకు బదులుగా కేంద్రబలగాలను మాత్రమే బెంగాల్‌కు ఈసీ తీసుకువస్తోందన్నారు. రాష్ట్ర పోలీసులకు పోస్టల్ బ్యాలెట్‌ను వాడుకునే అవకాశం కూడా లేకుండా చేయమేంటంటూ ఈసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయపరమైన ముగింపు దొరికే వరకు పోరాడతామన్నారు.



ఎన్నికల విచిత్రం

లోక్‌సభ మూడో విడత ఎన్నికల వేళ గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు అధికారులు ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఇది

ఎలక్షన్ బీట్

నాలుగో విడత బరిలో 1,717 మంది: ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభకు నాలుగో విడతలో ఈ నెల 13వ తేదీన జరగనున్న పోలింగ్‌లో 1,717 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 96 సీట్లకు మొత్తం 4,264 నామినేషన్లు అందాయి. నామినేషన్ పత్రాల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలు ముగిసిన తర్వాత 1,717 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈ దశలో ఒక్కో స్థానానికి సగటున 18 మంది పోటీ పడుతున్నట్లు శుక్రవారం న్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాల్లో 979 మంది..

తెలంగాణలోని 17 పార్లమెంటు స్థానాలకు అత్యధికంగా 1,488 నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలన అనంతరం 625 ఆమోదం పొందగా 525 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇందులో మల్కాజ్‌గిరి స్థానానికి అత్యధికంగా 177 నామినేషన్లు, నల్గొండ, భువనగిరి స్థానాలకు 144 చొప్పున నామినేషన్లు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 25 ఎంపీ స్థానాలకు 1,103 నామినేషన్లు అందాయి. పరిశీలన అనంతరం 503 నామినేషన్లు ఆమోదం పొందగా మొత్తం 454 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

మిగతా రాష్ట్రాల్లో ..

నాలుగో విడత పోలింగ్ జరిగే బిహార్‌లోని 5 పార్లమెంట్ స్థానాలకు 55 మంది పోటీలో ఉన్నారు. జమ్మూకశ్మీర్‌లోని ఒక్క సీటుకు 24 మంది, జార్ఖండ్‌లోని 4 నియోజకవర్గాలకు 45 మంది, మధ్యప్రదేశ్‌లోని 8 సీట్లకుగాను 74, మహారాష్ట్రలోని 11 స్థానాలకు 298 మంది, ఒడిశాలోని 4 సీట్లకు 37 మంది, ఉత్తరప్రదేశ్‌లోని 13 స్థానాల్లో 130 మంది, పశ్చిమబెంగాల్‌లోని 8 సీట్లకు 75 మంది బరిలో నిలిచారు.

14న ప్రధాని మోదీ నామినేషన్

వారణాసి: ప్రధానమంత్రి మోదీ ఈ నెల 14న వారణాసి లోక్‌సభ స్థానానికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఆయన ముందు రోజు 13వ తేదీన వారణాసిలో భారీ రోడ్ షోలో పాల్గొంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ యూపీ చీఫ్ అజయ్ రాయ్‌ను పోటీలో ఉంచింది. 2014, 2019 సాధారణ ఎన్నికల్లోనూ మోదీపై పోటీకి దిగిన అజయ్ ఓటమి పాలయ్యారు. అదేవిధంగా, రాజస్తాన్‌కు చెందిన కమెడియన్, ప్రధాని మోదీ స్వరాన్ని అనుకరించడంలో సిద్ధహస్తుడు అయిన శ్యామ్ రంగీలా కూడా వారణాసి నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు.

కాంగ్రెస్ ఓటమిని అంగీకరించింది

అమేథీలో గాంధీలు పోటీచేయకపోవడంపై స్మృతి ఇరానీ వ్యాఖ్య

అమేథీ: అమేథీ నియోజకవర్గం నుంచి గాంధీల కుటుంబసభ్యులు పోటీ నుంచి తప్పుకుని కాంగ్రెస్ ఓటమిని పోలింగ్‌కు ముందే అంగీకరించారని అమేథీ బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ మహిళా ఎంపీ స్మృతి ఇరానీ వ్యాఖ్యానించారు. ''ఇక్కడ కాస్తయినా విజయావకాశాలు ఉన్నాయని భావిస్తే ఇతరుల బదులు గాంధీలే ఇక్కడ పోటీచేసేవారు'' అని ఎద్దేవాచేశారు.

రాహుల్‌కు పరాజయం తప్పదు: అమిత్ షా

హుక్కేరి: రాయ్‌బరేలీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి పరాజయం తప్పదని హోం మంత్రి అమిత్ షా అన్నారు. కుమారుడు రాహుల్‌ను గెలిపించుకునేందుకు సోనియా గాంధీ చేస్తున్న 21వ ప్రయత్నం కూడా విఫలమవక తప్పదని వ్యాఖ్యానించారు. శుక్రవారం అమిత్ కర్ణాటకలోని బెళగావి జిల్లా హుక్కేరిలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాట్లాడారు. 'చంద్రయాన్ మిషన్‌ను మోదీ జీ ఒకే విడతలో విజయవంతం చేయగలిగారు. సోనియా గాంధీ రాహుల్ బాబా(రాహుల్ గాంధీ) మిషన్‌ను విజయవంతం చేయడానికి 20 పర్యాయాలు ప్రయత్నించి, విఫలమయ్యారు. తాజాగా, 21వ ప్రయత్నంగా అమేథీకి బదులు రాయ్‌బరేలీలో ఆయనతో నామినేషన్ వేయించారు'అని పేర్కొన్నారు.

ప్రజ్వల్‌పై కిడ్నాపింగ్ కేసు

మైసూరు: కర్ణాటకలో మహిళలపై లైంగిక వేధింపులు, దౌర్జన్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీ(ఎస్) ఎంపీ ప్రజ్వల్‌పై తాజాగా అపహరణ కేసు నమోదైంది. ఆయన తండ్రి అయిన ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణపైనా కిడ్నాప్ కేసు నమోదైంది. బాధితురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం బాధితురాలు హొళెనరసీపురలోని రేవణ్ణ ఇంట్లో గతంలో ఆరేళ్లు పనిచేసింది. మూడేళ్ల క్రితం పనిమానేసి సొంతూరు వచ్చి కూలీ పనులు చేసుకుంటోంది. అయితే ఏప్రిల్ 29వ తేదీ రాత్రి నుంచి ఆమె జాడ కనిపించట్లేదు. ఒక మహిళను ప్రజ్వల్ కట్టేసి రేప్ చేసినట్లు వైరల్ అయిన ఒక వీడియోలో ఉన్నది నీ తల్లే అంటూ స్నేహితులు మే ఒకటో తేదీన కుమారుడికి ఫోన్‌చేసి చెప్పారు. దాంతో కుమారుడు మైసూరు జిల్లాలోని కృష్ణరాజనగర్ పట్టణంలోని కేఆర్ నగర పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదుచేశాడు. దీంతో రేవణ్ణ, అతని అనుచరుడు సతీశ్ బాబాన్నలపై కేసు నమోదు చేశారు.

బీజేడీ కీలక నేత భార్యపై ఈసీ బదిలీ వేటు

భువనేశ్వర్: ఒడిశాలోని అధికార బీజేడీ కీలక నేత వీకే పాండ్యన్ భార్య, సీనియర్ అధికారి సుజాతా కార్తికేయన్‌ను ఈసీ ఆదేశాల మేరకు ప్రభుత్వం అప్రాధాన్య శాఖకు బదిలీ చేసింది. సుజాత ప్రస్తుతం మిషన్ శక్తి శాఖలో కమిషనర్ కం సెక్రటరీగా ఒడియా భాష, సాహిత్యం, సాంస్కృతిక విభాగాలకు అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, బీజేడీ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారంటూ సుజాతపై ప్రతిపక్ష బీజేపీ ఈసీకి ఫిర్యాదు చేసింది. ఈసీ ఆదేశాల మేరకు ప్రభుత్వం శుక్రవారం సుజాతను ఆర్థిక శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా నియమించింది.

వర్సిటీల్లో 2,300 దాటిన అరెస్టులు

న్యూయార్క్: గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలంటూ అమెరికావ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతున్న నిరసనలు ఆగట్లేవు. పోలీసులు వర్సిటీల్లో ఆందోళనకారులను చెదరగొట్టి తాత్కాలిక శిబిరాలను ధ్వంసం చేస్తున్నారు. ఏప్రిల్ 17న కొలంబియా వర్సిటీలో మొదలై అమెరికాలో 44 విశ్వవిద్యాలయాలు/ కాలేజీలకు పాకిన ఈ విద్యార్థి ఉద్యమంలో ఇప్పటిదాకా 2,300 మందికిపైగా ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్‌చేశారు. శుక్రవారం న్యూయార్క్ యూనివర్సిటీలో టెంట్లను ఖాళీచేసి వెళ్లాలని నిరసనకారులను పోలీసులు హెచ్చరించారు. స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్‌లో 133 మందిని అరెస్ట్‌చేశారు.

● వైఎస్సార్‌సీపీకి ఇండియన్ ముస్లిం లీగ్(ఐఎంఎల్) పూర్తి మద్దతు ఇస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుస్సేన్‌బాషా వెల్లడించారు.

కందికుంట అడ్డంగా దొరికినా..

పురోగతి లేని రూ.2 కోట్ల కేసు

కేసును పోలీసులు తాత్సారం చేస్తుండటంపై సర్వత్రా చర్చ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: శ్రీసత్యసాయి జిల్లా కదిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ కారులో సుమారు రూ.2 కోట్ల నగదు పట్టివేత వ్యవహారంలో పోలీసుల తీరు చర్చనీయాంశంగా మారింది. నగదు తరలింపులో కందికుంట పాత్రపై పక్కా ఆధారాలు లభ్యమైనప్పటికీ ఆయనపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారు. ప్రస్తుత పరిణామాలను గమనిస్తే కేసును పక్కదోవ పట్టించి.. కందికుంటను తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కందికుంట వెంకటప్రసాద్ కారులో సుమారు రూ.2 కోట్ల నగదును అనంతపురం నుంచి కదిరికి తరలిస్తుండగా.. నాలుగు రోజుల కిందట అనంతపురం విద్యుత్ నగర్ సర్కిల్‌లో పోలీసులు పట్టుకున్న విషయం విదితమే. అది కందికుంట డబ్బేనని కారు డ్రైవర్ వాంగ్మూలం కూడా ఇచ్చారు. ఇదే కారుకు ఎన్నికల ప్రచారానికి అనుమతి తీసుకున్నారు. ఇన్ని ఆధారాలున్నప్పటికీ కందికుంటపై చర్యలు తీసుకోవడానికి జాప్యమెందుకన్నది అంతుచిక్కని విషయం. ఈ కేసును నీరుగార్చేందుకు కుట్ర జరుగుతోందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నో క్లిష్టమైన కేసులను ఇట్టే ఛేదించిన అనంతపురం పోలీసులు ఈ కేసు విషయంలో ఎందుకో దోబూచులాడుతున్నారు. కేసు నుంచి కందికుంటను తప్పించేందుకు ఏమైనా ప్లాన్ వేస్తున్నారా అన్న అనుమానాలు నెలకొన్నాయి. నాలుగు బైకులు పట్టుకుంటేనే హడావుడిగా ప్రెస్‌మీట్ పెట్టిమరీ వివరాలు వెల్లడించే పోలీసు అధికారులు.. సుమారు రూ.2 కోట్ల నగదు పట్టుబడిన విషయంలో మాత్రం ఎందుకు నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తున్నారో అర్థం కావడంలేదు.



రోజుకో మలుపు

భారీస్థాయిలో నగదు పట్టుబడిన ఈ కేసు మలుపులు తిరుగుతోంది. దీనిపై కిందిస్థాయి పోలీసులు ముందుకెళ్లకుండా పైస్థాయి అధికారులు బంధనాలు వేసినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే కదిరి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో)కి సమాచారం ఇచ్చామని పోలీసులు చెప్పారు. వాస్తవానికి వారు ఆర్వోకి సమాచారం ఇవ్వనేలేదు. కందికుంట ఎవరి ద్వారానైనా పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నారా? లేదా పోలీసులకే దీనిపై 'ప్రత్యేక శ్రద్ధ' ఉందా అన్నది తేలడం లేదు. అనంతపురం పోలీసు ఉన్నతాధికారుల వద్ద ఈ కేసు విషయంపై కిందిస్థాయి పోలీసులు చర్చించడానికి కూడా భయపడుతున్నట్టు తెలుస్తోంది. కందికుంట కారులో మూడు బ్యాగులు ఉన్నట్టు పలు టీవీ చానళ్ల విజువల్స్‌లో స్పష్టంగా కనిపిస్తుండగా, పోలీసులు మాత్రం రెండు బ్యాగులే ఉన్నట్లు చెబుతున్నారు. మూడో బ్యాగులోనూ డబ్బులు ఉన్నాయా, ఒకవేళ ఉంటే ఎక్కడికి వెళ్లాయన్నది తేలాల్సి ఉంది. గతంలో హైదరాబాద్‌–బెంగళూరు జాతీయ రహదారిపై భారీస్థాయిలో హవాలా నగదు పట్టుబడిన కేసులో రెండురోజుల్లోనే నిందితులను పట్టుకుని కోర్టులో హాజరుపరిచారు. అదే ఈ కేసులో మాత్రం 'అనంత' పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు కలుగుతున్నాయి. ఆర్వోకి సమాచారం ఇవ్వకుండానే ఇచ్చామని ఒక సీఐ చెప్పడం కూడా అనుమానాలకు తావిస్తోంది.

ఆర్వోకి సమాచారం ఇచ్చాం

డబ్బుకు సంబంధించి విచారణ చేస్తున్నాం. ఇందులో ఉన్నది రెండు బ్యాగులే. ఒకవేళ ఉంటే మూడో బ్యాగు బట్టల బ్యాగ్ అయి ఉండొచ్చు. ఆర్వో దగ్గరకు మా అధికారులు వెళ్లారు. ఆర్వో నిర్ణయాన్ని బట్టి తదుపరి చర్యలు ఉంటాయి. ఈలోగా మిగతా విచారణ జరుగుతూనే ఉంటుంది.

– ఈ నెల 2వ తేదీన అనంతపురం టూటౌన్ సీఐ క్రాంతికుమార్'సాక్షి'కి చెప్పిన వివరాలు

నాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు

కందికుంట వెంకటప్రసాద్‌కు సంబంధించి సీజ్‌చేసిన రూ.2 కోట్ల కేసు వివరాలు ఇప్పటివరకు నాకు అందలేదు. నేను కదిరి ఆర్వోగా ఉన్నాను. కేసు అనంతపురంలో బుక్ చేశారు. అయినా నేను పోలీసులను అడిగాను. కానీ ఇప్పటివరకు వివరాలు ఇవ్వలేదు. పోలీసులు ఇచ్చే వివరాలను బట్టి మాత్రమే చర్యలు తీసుకోగలం.

– ఈ నెల 3వ తేదీన కదిరి రిటర్నింగ్ అధికారి సన్నీ వంశీకృష్ణ వెల్లడి

ఈ దొంగలను నమ్మొద్దు..

వలంటీర్ల పేరుతో టీడీపీ కొత్త మోసం

చిత్తూరు రూరల్(కాణిపాకం): కొత్త వలంటీర్ల పేరుతో తెలుగుదేశం పార్టీ సరికొత్త మోసానికి తెరతీసింది. ఇటీవల రాజీనామా చేసిన వలంటీర్ల స్థానంలో తమ పార్టీకి చెందిన కొందరు యువకులను గ్రామాల్లోని పేదల ఇళ్లకు పంపిస్తోంది. వారి ద్వారా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తోంది. చిత్తూరు రూరల్ మండలంలో ఈ నయా మోసం వెలుగులోకి వచ్చింది. ఇటీవల చిత్తూరు మండలంలో చాలా మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. దీనిని ఆసరాగా చేసుకుని స్థానిక టీడీపీ నేతలు కొందరు యువకులను ఎంపిక చేసి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లుగా మిమ్మల్నే నియమిస్తామని నమ్మబలికారు. వారికి వలంటీర్లు ఎలాంటి సేవలు అందిస్తారనే విషయంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం 50 ఇళ్లకు ఒకరిని చొప్పున పంపించారు. ఇక వారు పేదల ఇళ్లకు వెళ్లి 'తాము కొత్త వలంటీర్లం. ఇక వచ్చేది టీడీపీ. కాబట్టి టీడీపీకి ఓటు వేయండి. లేకపోతే ఏ పథకం రాదు..' అని బెదిరిస్తున్నారు. టీడీపీ కరపత్రాలు చూపిస్తూ పింఛన్లు, ఇంటి స్థలం.. అంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు పేదల అవసరాలను గుర్తించి ఆర్థికంగా ప్రలోభాలకు గురిచేస్తున్నారు. టీడీపీ ఆడుతున్న ఈ కొత్త వలంటీర్ల డ్రామాపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు టీడీపీ ఎటువంటి మోసాలకైనా పాల్పడుతుందనేందుకు కొత్త వలంటీర్ల డ్రామా ఒకటని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇటువంటి దొంగలను నమ్మరాదన్న భావనను వారు వెలిబుచ్చారు. దీనిపై కొందరు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

హిందూపురం అభివృద్ధిని గాలికి వదిలేశాడు

రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి



హిందూపురం: హిందూపురం ప్రజలు బాలకృష్ణను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశాడని రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఈసారి ఎన్నికల్లో బాలయ్యను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్‌తో కలసి హిందూపురంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. హిందూపురం ప్రజలు ఎన్టీఆర్‌పై అభిమానంతో బాలకృష్ణకు రెండు సార్లు అవకాశం ఇచ్చారన్నారు. కానీ ఆయన షూటింగ్స్‌కు వెళ్లడం, అభిమానులు, కార్యకర్తలను కొట్టడం తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు.

పండుటాకులపై చంద్రబాబు పగబట్టారు

వైఎస్సార్‌సీపీ నేతలు రావెల, వాసిరెడ్డి ధ్వజం

సాక్షి, అమరావతి: పండుటాకులపై చంద్రబాబు పగబట్టారని వైఎస్సార్‌సీపీ నాయకులు వాసిరెడ్డి పద్మ, రావెల కిశోర్‌బాబు ధ్వజమెత్తారు. చేసిందంతా చేసి ఇప్పుడు చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. వారు శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విడివిడిగా మీడియాతో మాట్లాడారు. పెన్షన్‌దారులు ఈ రోజు ఇబ్బందులు పడటానికి కారణం చంద్రబాబు, నిమ్మగడ్డ కాదా? అని ప్రశ్నించారు. ఇప్పుడు ఎల్లో మీడియా ద్వారా చేసిన తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చంద్రబాబు చేసినా ప్రజలు నమ్మటం లేదన్నారు. చనిపోయిన వృద్ధుల పాపం చంద్రబాబును వెంటాడుతుందన్నారు. పెన్షన్ బ్యాంకుల ద్వారా ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌కి లేఖ రాసింది పురందేశ్వరి, నిమ్మగడ్డ కాదా? అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వస్తే వృద్ధులను ఇలానే చంపుతారని అన్నారు. బాబు రాసిచ్చిన స్క్రిప్టు చదవడమే తప్ప బుర్రాబుద్ధిలేనోడు పవన్ అని విమర్శించారు. మైనార్టీలకు రిజర్వేషన్‌ను తొలగించేందుకు చూస్తున్న బీజేపీతో కలిసిన చంద్రబాబు.. మైనార్టీల అభ్యున్నతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.



పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో సీఎం వైఎస్ జగన్ ఎన్నికల సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో సీఎం వైఎస్ జగన్ ఎన్నికల సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

పింఛన్ ఎత్తేశారు!

బాబు సూపర్ సిక్స్‌లో మాయం.. అవ్వాతాతల పెన్షన్లపై పాపిష్టి కళ్లు

నరసాపురం, క్రోసూరు, కనిగిరి ఎన్నికల సభల్లో సీఎం జగన్ ధ్వజం




ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌లను గెలిపించాలని కోరుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మన అభ్యర్థులను ఆశీర్వదించండి

వైఎస్సార్‌సీపీ నరసాపురం, పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థులు ముదునూరి ప్రసాదరాజు, గుడాల గోపి, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్ కుమార్ యాదవ్, కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని మీరంతా ఆశీర్వదించి గొప్ప మెజార్టీతో గెలిపించాలని ప్రార్థిస్తున్నా.

గతంలో ఇవి ఉన్నాయా?

- పిల్లలకు విద్యాకానుక, వారి చేతుల్లో ట్యాబ్‌లు గతంలో ఎప్పుడైనా చూశారా?
- రోజుకో రుచికరమైన మెనూతో పౌష్టికాహారంతో గోరుముద్ద చూశారా?
- తల్లులకు అమ్మఒడి, పూర్తి ఫీజులతో విద్యా దీవెన, వసతిదీవెన, ఓ ఆసరా, సున్నావడ్డీ, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల గృహ నిర్మాణాలు, ఇంటివద్దే అందించిన పౌర సేవలు, పథకాలను చూశారా?
- ఇంటికే రూ.3 వేల పెన్షన్ కానుక, ఓ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పగటిపూట 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, వాహనమిత్ర, నేతన్ననేస్తం, మత్స్యకార భరోసా, జగనన్న తోడు, చేదోడు, లా నేస్తం, రూ.25 లక్షలదాకా ఉచితంగా విస్తరించిన ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష గతంలో మీరు చూశారా?
- వీటన్నింటితో పాటు మీ ఊరిలోనే గ్రామ సచివాలయం, నాడు–నేడుతో బాగుపడిన ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, ఓ ఆర్బీకే, విలేజ్ క్లినిక్, ఫైబర్ గ్రిడ్, నిర్మాణంలో ఉన్న డిజిటల్ లైబ్రరీలు, మహిళా పోలీస్, అక్కచెల్లెమ్మల చేతుల్లో దిశ యాప్ గతంలో ఉన్నాయా?
- మీ జగన్ అధికారంలో ఉంటేనే మళ్లీ ఇవన్నీ సజావుగా కొనసాగి పథకాలు అందుతాయి.

సాక్షి ప్రతినిధి, ఏలూరు, సాక్షి ప్రతినిధి, గుంటూరు, సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

'ఈ ఎన్నికల యుద్ధంలో చంద్రబాబు తన బాణాన్ని నేరుగా పేద సామాజికవర్గాల మీద, నా అవ్వాతాతల మీద, వారి పెన్షన్ల మీద గురి పెట్టాడు. ఇవాళ పెన్షన్ల విషయంలో జరుగుతున్న రాజకీయాలు, చేస్తున్న అన్యాయాన్ని మీరంతా చూస్తున్నారు. అయ్యా చంద్రబాబూ...! 2019 ఎన్నికలకు రెండు నెలల ముందు వరకూ నీ హయాంలో అవ్వాతాతలకు నువ్వు ఇచ్చిన పెన్షన్ ఎంత? కేవలం వెయ్యి రూపాయలు కాదా? ఆ పెన్షన్‌ను రూ.3 వేలు చేసింది ఎవరు? ఆ అవ్వాతాతలకు పెన్షన్ ఇంటికే పంపుతున్నది ఎవరు? చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల్లో అవ్వాతాతల పెన్షన్‌ను అప్పుడే ఎత్తేశారు' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం మధ్యాహ్నం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు, సాయంత్రం ప్రకాశం జిల్లా కనిగిరిలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలివీ..

సాధ్యం కాని హామీలతో వల..

మరో 10 రోజుల్లో ఎన్నికల యుద్ధం జరగబోతోంది. ఈ ఎన్నికలు కేవలం ఎంపీ, ఎమ్మెల్యేలను ఎన్నుకునేవి కావు. ఐదేళ్ల మీ భవిష్యత్తు, ఇంటింటికీ పథకాల కొనసాగింపును నిర్ణయించే ఎన్నికలివి. మీ జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కొనసాగింపు. అదే పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలకు ముగింపు, మళ్లీ మోసపోవడమే! చంద్రబాబును నమ్మడం అంటే కొండచిలువ నోట్లో తలపెట్టడమే. సాధ్యం కాని హామీలతో వల వేస్తున్నాడు. వదల బొమ్మాళీ వదలా.. అంటూ పసుపు పతి మళ్లీ నిద్రలేచి వస్తాడు. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. చంద్రబాబుకు ఓటేస్తే మళ్లీ చంద్రముఖి మీ ఇంటి తలుపు తట్టి లకలకా అంటూ ఐదేళ్లు రక్తం తాగేందుకు వస్తుంది. మరోసారి మోసగించేందుకే చంద్రబాబు సాధ్యం కాని హామీలను ఇస్తున్నాడు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకునే ఆ పెద్దమనిషి పేరు చెబితే ఏ పేదవాడికైనా ఒక్కటంటే ఒక్క మంచి గుర్తుకొస్తుందా?

నాడు అవస్థలతో 39 లక్షలు.. నేడు ఠంఛన్‌గా 66 లక్షలు

ఓ అవ్వాతాతా.. చంద్రబాబు ఇచ్చిన సామాజిక పెన్షన్లు ఎన్నో తెలుసా? ఎన్నికలకు ఆర్నెల్ల ముందు వరకూ ఇచ్చింది కేవలం 39 లక్షలు. అది కూడా జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చుకుంటూ వివక్షకు లోనవుతూ అరకొరగా తీసుకున్న దుస్థితి. మీ బిడ్డ జగన్ హయాంలో ఏకంగా 66 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాడు. ఎక్కడా లంచాలు, వివక్ష లేదు. ఎవరి చుట్టూ తిరగాల్సిన పని లేకుండా రూ.3వేలు చొప్పున పెన్షన్ నేరుగా మీ ఇంటికే అందిస్తున్నాడు.

ఆ పాపిష్టి కళ్లు పడనంతవరకూ..

చంద్రబాబు పాపిష్టి కళ్లు ఆ అవ్వాతాతల మీద పడనంత వరకూ ఇంటికే పెన్షన్ సజావుగా అందేది. సూర్యోదయానికి ముందే, ఒకటో తేదీ ఉదయాన్నే అవ్వాతాతల ఇంటికే మనవళ్లు, మనవరాళ్ల రూపంలో వలంటీర్లు వచ్చి చిరునవ్వుతో పింఛను అందించి మంచి చేసిన కాలం మనదే. ఎప్పుడైతే చంద్రబాబు పాపిష్టి కళ్లు పడ్డాయో.. తన మనిషి నిమ్మగడ్డ రమేష్ ద్వారా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్లు ఇంటికి వెళ్లి పెన్షన్లు ఇవ్వకూడదంటూ ఉత్తర్వులు ఇప్పించాడు. చంద్రబాబు పాపిష్టి చేష్టలు అంతటితో ఆగలేదు. ఇంకా కడుపుమంట చల్లారక ఏం చేశాడో తెలుసా? అవ్వాతాతలు బ్యాంకుల చుట్టూ తిరిగేటట్టుగా వాళ్ల పెన్షన్ బ్యాంకుల్లో జమ చేయమని చెప్పాడు. దీంతో ఎన్నికల కమిషన్ అక్కడ నుంచి ఆదేశాలు ఇచ్చింది. అవ్వాతాతలు ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఇంత ఎండలో క్యూలలో నిలబడలేక చంద్రబాబును తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతూ ఉంటే ఆ దౌర్భాగ్యపు పని చేసిన చంద్రబాబు ఆ నెపాన్ని మీ బిడ్డపై వేస్తున్నాడు. చంద్రబాబు, దుష్ట చతుష్టయం, ఎల్లో మీడియా వీళ్లంతా కలిసి ఆ నెపాన్ని మీ బిడ్డ మీద వేస్తున్నారు. ఆ ఈనాడు కథనాలు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 చూస్తే.. వీళ్లంతా మనుషులేనా? అనిపించేంత దారుణమైన రాజకీయాలు చేస్తున్నారు. చంద్రబాబు పాలనను 14ఏళ్లు మీరంతా చూశారు. మీ బిడ్డ 59 నెలల పాలన కూడా చూశారు. పెన్షన్లు నేరుగా మీ ఇంటికే వచ్చిన పరిస్థితులు చూశారు. చంద్రబాబు ఏ ఒక్క రోజూ అవ్వాతాతల మీద ప్రేమ చూపించలేదు. పెన్షన్ ఇంటికి పంపిన పరిస్థితి అంతకంటే లేదు.

మీ కోసమే నా తొలి సంతకం..

నేను ఇవాళ ప్రతి అవ్వకూ, తాతకూ చెబుతున్నా. అవ్వాతాతా..! ఒక్క నెల ఓపిక పట్టండి. జూన్ 4వ తేదీ దాకా ఓపిక పట్టండి. మీ బిడ్డ మళ్లీ ప్రమాణ స్వీకారం చేస్తాడు. నా మొట్ట మొదటి సంతకం మీకోసం పెడతా అని అవ్వాతాతలకు మాటిస్తున్నా. మీ మనవళ్లు, మనవరాళ్లుగా వలంటీర్లు సూర్యోదయానికి ముందే ఇంటికే వచ్చి చిరునవ్వుతో పెన్షన్లు అందించే పరిస్థితులు మీ బిడ్డ మళ్లీ తెస్తాడు.

విద్యా విప్లవం.. మహిళా సాధికారత

గతంలో ఎప్పుడూ జరగని విధంగా గవర్నమెంట్ బడిలో చదివే పిల్లలకు స్కూళ్లు తెరిచే సమయానికే విద్యాకానుక, ఇంగ్లిష్ మీడియం, బైజూస్ కంటెంట్, మూడో తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, సబ్జెక్టు టీచర్లను అందుబాటులోకి తెచ్చాం. నాడు–నేడుతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాం. ఇంగ్లిష్ మీడియంతో వేసిన అడుగులు నుంచి సీబీఎస్ఈ, ఐబీ దాకా మన ప్రయాణం కొనసాగుతోంది. 8వ తరగతికి వచ్చేసరికి పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు కనిపిస్తున్నాయి. తొలిసారిగా 6వ తరగతి నుంచే క్లాస్‌రూమ్ లలో డిజిటల్ బోర్డులు, డిజిటల్ బోధన పేద పిల్లలకు అందుబాటులోకి వచ్చింది. పిల్లలు ఇబ్బంది పడకుండా బైలింగ్వువల్ టెక్స్ట్ బుక్స్ సమకూర్చాం. డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటి ఉన్నత చదువులు అభ్యసిస్తున్న 93శాతం మంది విద్యార్థులకు పూర్తి ఫీజులు చెల్లిస్తూ జగనన్న విద్యాదీవెనతోపాటు వసతి దీవెన కూడా అందిస్తున్నాం. తొలిసారిగా అంతర్జాతీయ వర్సిటీలు అందించే ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులను మన కాలేజీల్లో అందుబాటులోకి తెచ్చాం. పిల్లలను బడికి పంపిస్తే చాలు చదువులను ప్రోత్సహిస్తూ అమ్మఒడి ఇస్తున్నాం. అక్కచెల్లెమ్మలు సొంత కాళ్లపై నిలబడేలా చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ సున్నావడ్డీ, ఆసరా ఇస్తున్నాం. ఏకంగా 31 లక్షల ఇళ్ల పట్టాలు వారి పేరిటే రిజిస్ట్రేషన్ చేయడంతోపాటు 22 లక్షల ఇళ్లు కూడా కడుతున్నాం. గ్రామాల్లోనే మహిళా పోలీసు, దిశ యాప్, రాజకీయ సాధికారత కోసం మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకంగా చట్టం చేసింది మీ బిడ్డ ప్రభుత్వమే.

లంచాలు లేని సమాజం

గ్రామ స్వరాజ్యానికి అర్థం చెబుతూ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఏకంగా 600 రకాల సేవలు మీ ఇంటి వద్దకే వస్తున్నాయి. ప్రతి 60–70 ఇళ్లకు వలంటీర్ వ్యవస్థ, లంచాలు లేకుండా ఇంటికే పెన్షన్, పౌర సేవలు, పథకాలు.. ఇవన్నీ జరుగుతోంది ఈ 59 నెలల కాలంలోనే. మీ బిడ్డ ముఖ్యమంత్రి కాక ముందు గవర్నమెంట్ ఇచ్చే డబ్బులు లంచాలు లేకుండా నేరుగా మీ చేతికే అందుతాయని ఎవరైనా చెబితే నమ్మేవారా? మీ బిడ్డ 130 సార్లు బటన్లు నొక్కి అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు నేరుగా జమ చేశాడు.

నాకు ఓటు వేయని వారినీ కోరుతున్నా..

ఈ రోజు రాష్ట్రంలో జరుగుతున్నది కులాల మధ్య యుద్ధం కాదు. ఇది క్లాస్ వార్. పేదవాడు బాగుపడాలన్నా, పేదవాడి భవిష్యత్తు మారాలన్నా మీ ఓటు ఎంత కీలకమో ప్రతి ఒక్కరూ గమనించమని కోరుతున్నా. గత ఎన్నికల్లో నాకు ఓటు వేయని వారిని కూడా ఒక్కటే కోరుతున్నా. మీ ఇంటికి వెళ్లి అవ్వాతాతలు, భార్యాపిల్లలతో కూర్చుని మాట్లాడండి. ఎవరి హయాంలో, ఎవరి వల్ల మీకు మంచి జరిగింది? ఎవరు ఉంటే ఆ మంచి కొనసాగుతుందో ఆలోచన చేసి ఆ తర్వాతే ఓటు ఎవరికి వేయాలో నిర్ణయం తీసుకోండి. మీ జగన్ అధికారంలో ఉంటేనే మళ్లీ ఇంటికే పెన్షన్ వచ్చే కార్యక్రమం జరుగుతుంది. ఆ పెన్షన్‌లో పెరుగుదల కూడా కనిపిస్తుంది. మళ్లీ మీ జగన్ అధికారంలో ఉంటేనే పెంచిన అమ్మ ఒడి నా అక్కచెల్లెమ్మలకు అందుతుంది.

ఆ మోసాలు మీరంతా చూశారు..

మీ బిడ్డను నమ్మి మీరంతా అధికారం ఇచ్చినందువల్ల దేవుడి దయతో ఐదేళ్లలో ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తేగలిగాం. ఏకంగా 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు నా తమ్ముళ్లు, చెల్లెమ్మలకు ఇవ్వగలిగాం. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావిస్తూ 99శాతం హామీలను అమలు చేశాం. 2014లో ఒకసారి చంద్రబాబును నమ్మారు! ఆ కూటమిని నమ్మి ఓటు వేశారు! చంద్రబాబు మేనిఫెస్టో మాయలు, మోసాలు ఎలా ఉంటాయో మీరంతా చూశారు. ఈ 59 నెలల్లో మీ జగన్ పాలన చూస్తున్నారు. మీ బిడ్డ చెప్పిన దానికన్నా నాలుగు అడుగులు ముందుకు వేశాడు. కొత్త మోసాలతో అబద్ధాలకు రెక్కలు కట్టి ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్న వారికి, రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత లేని మనుషులకు తగిన గుణపాఠం చెప్పమని కోరుతున్నా. మంచి చేసిన ఫ్యాను ఇంట్లోనే ఉండాలి. చెడు చేసిన సైకిల్ ఇంటి బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాసింకులోనే ఉండాలి. వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, పేదవాడి భవిష్యత్తు మారాలన్నా, లంచాలు, వివక్ష లేని పాలన, పథకాలన్నీ కొనసాగాలన్నా, మన పిల్లల చదువులు, బడులు బాగుపడాలన్నా, ఆసుపత్రులు, వ్యవసాయం బాగుండాలన్నా రెండు బటన్లు ఫ్యాను మీద నొక్కాలి. 175కు 175 అసెంబ్లీ స్థానాలు, 25కు 25 ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా తగ్గకుండా గెలిపించాలి. చంద్రబాబు మోసాలను ఓడించడానికి, పేదలను గెలిపించడానికి, విలువలు విశ్వసనీయతకు మరోసారి ఓటు వేయడానికి మీరంతా సిద్ధమేనా?

2014లో బాబు ముఖ్యమైన మోసాలివీ..

- రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీ చేస్తానన్నాడు... జరిగిందా?
- రూ.14,205 కోట్ల పొదుపు సంఘాల రుణాల్లో ఒక్క రూపాయి అయినా మాఫీ చేశాడా?
- ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకుల్లో వేస్తామని ఏ ఒక్కరికైనా ఇచ్చాడా?
- ఇంటికో ఉద్యోగం లేదంటే నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి హామీ అమలైందా? ఐదేళ్లలో రూ.1.20 లక్షలు ఏ ఇంటికైనా ఇచ్చాడా?
- అర్హులందరికీ 3 సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇళ్లు అన్నాడు. ఏ ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చాడా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత పవర్ లూమ్స్ రుణాల మాఫీ జరిగిందా?
- ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా?
- సింగపూర్‌కు మించి అభివృద్ధి, ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మించాడా? నరసాపురం, పెదకూరపాడు, కనిగిరిలో ఎవరికైనా కనిపిస్తున్నాయా?
- ప్రత్యేక హోదా తీసుకురాకపోగా అమ్మేశాడు.
- ఇప్పుడు మళ్లీ అదే కూటమి పేరుతో మీ ముందుకొచ్చి సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, ఇంటింటికీ కేజీ బంగారం, బెంజ్ కార్ అంటూ మరోసారి వంచనకు సిద్ధమైన మోసగాళ్లతో రాజకీయ యుద్ధం చేస్తున్నాం.



ప్రకాశం జిల్లా కనిగిరిలోని పామూరు బస్టాండు సెంటర్‌లో బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్

నేడు సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచారం ఇలా..

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు హిందూపురంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జరిగే ప్రచార సభలో సీఎం జగన్ పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు చిత్తూరు లోక్‌సభ స్థానం పరిధిలోని పలమనేరులోని బస్టాండ్ సెంటర్‌లో జరిగే సభకు ముఖ్యమంత్రి హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు నెల్లూరు లోక్‌సభ స్థానం పరిధిలోని నెల్లూరు సిటీలో ఉన్న గాంధీ విగ్రహం సెంటర్‌లో జరిగే ప్రచార సభలో సీఎం జగన్ పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.



పలువురు నేతలు వైఎస్సార్‌సీపీలో చేరిక

సాక్షి, నరసరావుపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలు, సంఘాల ముఖ్య నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన బీసీ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రేలంగి శేఖర్, మూల్ నివాసి సంఘ్ జాతీయ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు, జనసేన పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్, నరసరావుపేట కాంగ్రెస్ పార్టీ నేత మారూరి రామలింగారెడ్డి, మార్వాడి కమ్యూనిటీ ప్రెసిడెంట్ తివారీకి సీఎం జగన్ వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.


సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన గుంటూరు నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్


మార్వాడీ కమ్యూనిటీ ప్రెసిడెంట్ తివారి


నరసరావుపేట కాంగ్రెస్ నేత మారూరి రామలింగారెడ్డి


మూల్ నివాసి సంఘ్ జాతీయ అధ్యక్షుడు కృష్ణారావు, బీసీ పోరాట సమితి నాయకుడు శేఖర్

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 4 । మే । 2024



బంగారు తాపడం పనులకు విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కట్ట శ్రీనివాస్‌రెడ్డి కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది.



వైఎస్సార్ సీపీలో చేరికలు

నందిగామ టౌన్: నందిగామకు చెందిన టీడీపీ నాయకులు ఎన్.మురళి, బడేహజరత్ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్సీ అరుణకుమార్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.



	కనిష్టం	గరిష్టం
నందిగామ	30	43.1
జగ్గయ్యపేట	32.3	44
మచిలీపట్నం	30	36
గుడివాడ	30	39

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో ఉన్నతాధికారులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, కార్యదర్శి కేవీవీ సత్యనారాయణలు శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అర్చకులు అమ్మవారి ప్రసాదాలను బహూకరించారు.

10న దుర్గమ్మ సన్నిధిలో మహాలక్ష్మీయాగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అక్షయ తృతీయను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో 10వ తేదీ శుక్రవారం మహాలక్ష్మీ యాగాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కేఎస్ రామరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం వద్ద మహాలక్ష్మీ యాగాన్ని నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది. యాగంలో పాల్గొనే ఉభయదాతలు రూ. 1000 టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సేవలో పాల్గొనే ఉభయదాతలకు శేష వస్త్రం, రవిక, పెద్ద లడ్డూ, చక్రపొంగలి, పులిహోర ప్యాకెట్‌ను ప్రసాదంగా అందజేస్తారు. ఇక 12వ తేదీ శంకర జయంతిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రావిచెట్టు వద్ద పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఆదిశంకరాచార్యుల విగ్రహానికి ఆలయ అర్చకులు అభిషేకాలు, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు నగరోత్సవ సేవ జరుగుతుంది.

జరిమానాలతో రైల్వేకు రూ.7.96 కోట్ల ఆదాయం

రైల్వే స్టేషన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ డివిజన్ పరిధిలో టికెట్ లేకుండా రైళ్లలో ప్రయాణిస్తున్న వారికి విధించిన జరిమానాల ద్వారా రైల్వేకు రూ.7.96 కోట్ల ఆదాయం వచ్చినట్లు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మండ్రూప్‌కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సౌత్‌సెంట్రల్ రైల్వే పరిధిలో ఈ ఏప్రిల్ నెలలో ఇది అత్యధిక ఆదాయమన్నారు. గత మార్చిలో జరిమానాల ద్వారా డివిజన్‌కు రూ.7.36 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. టికెట్ లేకుండా రైళ్లలో ప్రయాణించటం, ముందుగా బుకింగ్ చేసుకోకుండా లగేజీని రైళ్లలో తరలిస్తున్న వారికి విధించిన జరిమానాల ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

6వ తేదీన బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఈ నెల 6వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. 2008 జనవరి ఒకటో తేదీ తర్వాత పుట్టిన వారు, బాస్కెట్‌బాల్ కృష్ణాజిల్లా సంఘానికి అనుబంధంగా ఉన్న క్లబ్‌లలో రిజిస్టర్ అయిన క్రీడాకారులు మాత్రమే ఈ పోటీకి అర్హులన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించాలని సూచించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు మేరీస్ స్టెల్లా కాలేజీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

అక్కసుతో ఆపించి.. వికృతానందం

పండుటాకులకు తప్పని పింఛన్ పోరాటం

బాబు ముఠా నిర్వాకమే..



ఇన్నాళ్లూ ఇంటి వద్దే పెన్షన్ అందుకున్నాం. వలంటీర్లు వచ్చి పెన్షన్ డబ్బులు ఇచ్చేవారు. ఏ ఇబ్బందీ లేకుండా 58 నెలలు గడిచిపోయాయి. ఎన్నికల వేళ వలంటీర్ల సేవలు నిలిపివేశారు. చంద్రబాబు ముఠా పన్నిన కుట్ర వల్ల వలంటీర్లు దూరమయ్యారు. మా ఊరిలో బ్యాంకు లేదు. బ్యాంకు వెళ్లాలంటే పది కిలో మీటర్లు వెళ్లాలి. ఏనాడు బ్యాంకుకు వెళ్లిన దాఖలాలు లేవు. పెన్షన్ బ్యాంకుల ఖాతాల్లో జమ చేయడంతో పది మంది చొప్పున ఆటోలు మాట్లాడుకుని ఎండలోనే బ్యాంకుకు వెళ్లి పెన్షన్ డబ్బులు తెచ్చుకున్నాం.

– లింగాల రామయ్య, వి. అన్నవరం

- మండుటెండలో బ్యాంకుల వద్ద వృద్ధుల పడిగాపులు
- కుగ్రామాల నుంచి మండల కేంద్రాలకు రాలేక అవస్థలు
- ఆటోల్లో కిలో మీటర్ల మేర ప్రమాదకర ప్రయాణం
- వలంటీర్ ఉంటే ఈ బాధలుండేవి కాదని ఆక్రందన
- ఈ అవస్థలకు కారణం చంద్రబాబే అంటూ ఆగ్రహం

పండుటాకుల పింఛన్ పోరాటం కొనసాగుతోంది. ఇంటికే వచ్చి నగదు చేతిలో పెట్టే వలంటీర్ లేకపోవడంతో వారి అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వలంటీర్లపై అక్కసుతో చంద్రబాబు అండ్ కో వారిని విధుల నుంచి ఆపించారు. దీంతో గత నెలలో వృద్ధులు అవస్థలు పడ్డారు. ఈ నెలలో కూడా అదే వికృతానందం పొందేందుకు అవ్వాతాతలను కసితీరా వేధించారు. దీంతో వారు పడరాని పాట్లు పడుతున్నారు. బ్యాంకులకు రాలేక.. కష్టించి వచ్చినా అక్కడ క్యూలో నిలబడలేక.. ఎండ తీవ్రతకు తాళలేక విలవిలలాడారు. వృద్ధాప్యంలో తమపై ఎందుకు కక్షగట్టారంటూ ప్రతిపక్షాల తీరుపై భగభగమండారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పింఛన్ కానుక లబ్ధిదారులు నగదు తెచ్చుకునేందుకు ఎంతో శ్రమించారు.

– గాంధీనగర్(విజయవాడసెంట్రల్)



'అయ్యా ఈ ఎండకి తట్టుకోలేకపోతున్నా ఏదోలా నాకు పింఛన్ ఇప్పించండి. పింఛన్ తీసుకువెళదామని బ్యాంకు దగ్గరికి పొద్దున వచ్చాను. ఇప్పుడు మధ్యాహ్నమైంది. కళ్లు తిరిగి పడిపోతానేమో అని భయంగా ఉంది. నాకు పింఛన్ ఇప్పించండయ్యా..' అంటూ నందిగామ మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ముత్యాలు అనే వృద్ధురాలు శుక్రవారం మధ్యాహ్నం సమయంలో నందిగామలోని ఓ బ్యాంకు వద్ద పలువురిని ప్రాథేయపడుతూ వేడుకొంది.



బ్యాంకు బయట పడిగాపులు.. మైలవరం బ్యాంక్ వద్ద పెన్షన్‌ల కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు



బ్యాంకు లోపల కిక్కిరిసి.. నందిగామలోని ఓ బ్యాంకులో పింఛన్ కోసం బారులు తీరి కనిపిస్తున్న వృద్ధులు

పింఛన్ బహుదూరం..



వి. అన్నవరం నుంచి పెన్షన్ డబ్బుల కోసం ఆటోలో వెళ్తున్న లబ్ధిదారులు

ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలోని వైరాదరి అన్నవరం(వి. అన్నవరం) ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులోని కుగ్రామం. ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. గ్రామస్తులు ఎటు వెళ్లాలన్నా ఆటోలు, సొంత వాహనాలపై ఆధారపడాల్సిందే. ఊరిలో బ్యాంకు కూడా లేదు. బ్యాంకుకు వెళ్లాలంటే 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న వీరులపాడు మండల కేంద్రానికి వెళ్లాలి. గ్రామస్తులందరికీ వీరులపాడులోని సిండికేట్ బ్యాంకులోనే ఖాతాలు ఉన్నాయి. ఈ గ్రామంలో 286 మంది పెన్షనర్లు ఉన్నారు. ఈ నెల పెన్షన్ డబ్బులు బ్యాంకు ఖాతాలకు జమ చేయడంతో గ్రామంలోని పెన్షనర్లు డబ్బులు తెచ్చుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. ఒక్కో ఆటోలో పది మంది చొప్పున బ్యాంకుకు వెళ్లారు. అక్కడ క్యూలైన్‌లో ఇబ్బందులు పడ్డారు. ఇన్నాళ్లు ఇంటి పట్టునే పెన్షన్ తీసుకున్న వీరంతా మండుటెండలో ప్రమాదకర పరిస్థితుల్లో ఆటోల్లో ప్రయాణించి పెన్షన్ డబ్బులు తెచ్చుకోవాల్సి రావడంతో ఈ పరిస్థితి కారణమైన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా..

ఇది ఒక్క వి.అన్నవరం గ్రామంలో పరిస్థితి మాత్రమే కాదు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నుంచి జగ్గయ్యపేట వరకు ఉన్న ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు గ్రామాలలోని పెన్షనర్ల అందరి పరిస్థితి ఇదే. జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు, వీరులపాడు, గంపలగూడెం, తిరువూరు, మైలవరం .ఏ కొండూరు, జి కొండూరు మండలాలు చాలా గ్రామాలు తెలంగాణతో సరిహద్దు పంచుకుంటున్నాయి. ఈ మండలాల్లో మూడో వంతు గ్రామాల్లో బ్యాంకులు లేవు. సొంత ఊళ్లో బ్యాంకు లేక, బ్యాంకు ఉన్న గ్రామాలకు వెళ్లే సౌకర్యాలు లేక పెన్షనర్లు నరక యాతన అనుభవిస్తున్నారు. ఐదేళ్లలో పెన్షన్ కోసం ఏనాడు గడప దాటి వెళ్లలేదు. ఇంటి వద్దనే వలంటీర్లు పెన్షన్ అందించారు. ఈ రోజు కిలోమీటర్ల దూరం ప్రయాణించి పెన్షన్ డబ్బులు తెచ్చుకోవాల్సి వచ్చింది అంటూ ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. మంచి చేస్తున్న వలంటీర్లపై కుట్రలు పన్నిన చంద్రబాబు ముఠా నిర్వాకం వల్లే తమకీ దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక శివారు గ్రామాల పరిస్థితి సరేసరి. బ్యాంకులు లేని గ్రామాలు గుర్తించి ఇంటి వద్ద ఇచ్చే ఏర్పాటు చేయకపోవడం పట్ల మండిపడుతున్నారు. ఇంత పెద్ద వయసులో రోడ్ల పాల్జేసిన చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతామని పెన్షనర్లు అంటున్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల అవస్థలు..

పెన్షన్ పొందుతున్న వారిలో అధిక సంఖ్యలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులే ఉన్నారు. బీపీ, సుగర్, ఆస్తమా వంటి వ్యాధులతో బాధ పడుతూ వచ్చే పెన్షన్ డబ్బుతో మందులు కొనుగోలు చేస్తున్నారు. మే నెల కావడంతో ఎండలు తీవ్రత, వడగాడ్పులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకులు ఉదయం 10.30 గంటల నుంచి పనిచేస్తాయి. అయితే ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. పది గంటలకు అసలు బయటకు వచ్చే పరిస్థితి లేదు. వృద్ధులు పెన్షన్ డబ్బుల కోసం ఉదయాన్నే బ్యాంకుల వద్దకు చేరుకుని పడిగాపులు కాస్తున్నారు. అక్కడ క్యూలైనులోనూ అవస్థలు పడ్డారు. ఇక పెన్షన్ తీసుకుని మధ్యాహ్నం ఇంటికి చేరుకునే సరికి ఆ ఎండల తీవ్రతకు సొమ్మసిల్లారు.

వృద్ధులు భగభగ..

లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయటంతో బ్యాంకుల వద్ద అనేక ఆంక్షలతో ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో కాలంగా పనిచేయని ఖాతాలో నగదు జమ కావటంతో ఆ ఖాతా పనిచేయటం లేదని, చార్జీలు వసూలు చేయటంతో పాటు, మినిమమ్ బ్యాలెన్స్ కట్ చేసుకుని మిగిలిన నగదును అందజేస్తున్నారు. దీంతో ప్రతి నెల పింఛను సొమ్ముతో లబ్ధిదారులు వేసుకునే ప్రణాళిక ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల్లో ఉన్న బ్యాంక్ కరస్పాండెంట్ల ద్వారా వేలిముద్రలు సేకరించి పింఛను సొమ్ము ఇవ్వటంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వలంటీర్లు ఉంటే మాకు ఈ తిప్పలు ఉండేవి కాదని ఆనందంగా ఇంటి వద్దకే డబ్బులు వచ్చేవని వృద్ధులు అంటున్నారు.



అజిత్‌సింగ్ నగర్‌లో పింఛన్ కోసం వృద్ధుడిని తీసుకువస్తున్న మహిళ

వలంటీర్లు ఇస్తే మేలు..



సీఎం జగన్ ప్రతినెలా ఒకటో తేదీన ఉదయమే వలంటీర్ ద్వారా పెన్షన్ అందించేవారు. టీడీపీ నేతల ఫిర్యాదుతో వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ నిలిచిపోయింది. గత నెలలో సచివాలయాల వద్ద ఇచ్చారు. ఇప్పుడు బ్యాంకు ఖాతాల్లో వేయడంతో ఎండల్లో చాలా ఇబ్బంది పడుతున్నాం. మా బాధలను అర్థం చేసుకోకపోతే ఎలా?

– మస్తానమ్మ, కొత్తపేట

ఇంకా నగదు తీసుకోలేదు..



గతంలో ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చారు. రెండు నెలల నుంచి పింఛన్ తీసుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నాం. ఈ నెల బ్యాంకులో పింఛన్ డబ్బులు వేశారు. బ్యాంకు వారు చాలా ఇబ్బంది పెడుతున్నారు. పాన్, ఆధార్‌కార్డులు అడుగుతున్నారు. పింఛన్‌కు నిబంధనలు పెట్టడం వల్ల అవస్థలు పడుతున్నాం. అసలే తీవ్రమైన ఎండలు కాస్తున్నాయి. ఇప్పటి వరకు నేను పింఛన్ తీసుకోలేదు.

– జి. పాండురంగారావు, రామలింగేశ్వరనగర్

పోస్టల్ బ్యాలెట్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి మూడు రోజుల పాటు ఓటింగ్
- ఈ నెల 7, 8, 9 తేదీల్లో హోం ఓటింగ్
- జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ విధులతో పాటు, ఇతర విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందితో పాటు హోం ఓటింగ్ కలిపి మొత్తం 23 వేల మందికి పైగా ఓటర్లు బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. ఇందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న ఫెసిలిటేషన్ సెంటర్‌ను శుక్రవారం కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. అనంతరం ఎన్నికల సాధారణ పరిశీలకులు మంజూ రాజ్ పాల్, నరేందర్ సింగ్ బాలిలతో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే విధానం గురించి వివరించారు.

- కలెక్టర్ మాట్లాడుతూ హోం ఓటింగ్ కోసం 1052 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి ఈ నెల 7, 8, 9 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి 5 గంటలలోపు ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను నియమించామన్నారు.



ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

- జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పోస్టల్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో అత్యవసర సేవలకు చెందిన 706 మంది, 6,191 మంది పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, 5,115 మంది సెక్టార్ అధికారులు, బూత్ లెవెల్ అధికారులు, డ్రైవర్లు, 231 మంది మైక్రో అబ్జర్వర్లకు, 1304 మంది పోలీస్ సిబ్బంది, 452 మంది ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎక్స్‌సర్వీస్‌మెన్, ఇతర యూనిఫాం సర్వీసెస్‌లకు చెందిన వారు ఉన్నారన్నారు.
- ఇతర జిల్లాల్లో ఓటు హక్కు ఉన్న మరో 2,641 మంది ఎన్నికల అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు.
- ఈ నెల 4, 6 తేదీల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు వారికి కేటాయించిన నియోజకవర్గంలో ఎన్నికల విధులపై శిక్షణ ఇస్తారని.. శిక్షణ పొందే కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఎన్టీఆర్ జిల్లాతో పాటు సరిహద్దు జిల్లాలకు సంబంధించిన పీవోలు, ఏపీవోలు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

పోలీసులు, ఇతర సిబ్బంది

ఓపీవోలు, ఇతర ఎన్నికల సిబ్బంది, పోలీస్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, డ్రైవర్లు, క్లీనర్లు, ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, వెబ్‌క్యాస్టింగ్, మైక్రోఅబ్జర్వర్లు తదితర సిబ్బంది వారికి ఓటు హక్కు ఉన్న నియోజకవర్గంలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

దుర్గమ్మ ఆలయం.. ఇక స్వర్ణశోభితం

- పూర్తి ఆలయానికి బంగారు తాపడం
- సుమారు 70 కిలోల బంగారం అవసరం
- దాతల నుంచి విరాళాల సేకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయం ఇక స్వర్ణశోభితం కానుంది. 2008లో అప్పటి ఈవో చంద్ర కుమార్ నేతృత్వంలో 88 కిలోల బంగారంతో ఆలయ శిఖరానికి బంగారం తాపడం పనులు పూర్తి చేశారు. తాజాగా అమ్మవారి ఆలయాన్ని పూర్తి స్థాయిలో బంగారు తాపడం చేయించేందుకు ఈవో కె.ఎస్.రామరావు నడుం బిగించారు. ప్రస్తుతం అమ్మవారి శిఖరం రూఫ్ లెవల్ వరకు బంగారు తాపడం ఉంది. రూఫ్ లెవల్ నుంచి ఫ్లోరింగ్ లెవల్ వరకు బంగారు తాపడం చేయించాలని అధికారులు భావిస్తున్నారు. తాజాగా గత శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డోనర్ సెల్‌లో బంగారు తాపడం పనులకు విరాళాల సేకరణను చేపట్టారు. దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పోస్టర్‌ను ఆవిష్కరించి భక్తుల నుంచి విరాళాలు స్వీకరించారు. తొలి రోజే సుమారు రూ.13 లక్షల విరాళాలు అందాయి. ఆలయం పూర్తి స్థాయిలో బంగారు తాపడం చేయించేందుకు సుమారు 70 కిలోల బంగారం అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే మల్లేశ్వరస్వామి ఆలయ శిఖరానికి కూడా బంగారు తాపడం చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.




బంగారు తాపడం పోస్టర్‌ను ఆవిష్కరించిన కమిషనర్ సత్యనారాయణ, ఈఓ రామరావు(ఫైల్)



బ్యాంకుల్లో 195 కిలోల బంగారం..

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానానికి బ్యాంకుల్లో 195 కిలోల మేర బంగారు నిల్వలు ఉన్నాయి. ఆయా బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో ఉన్న ఈ బంగారం నుంచి ఏటా రూ.2 కోట్ల మేర వడ్డీ రూపేణా దేవస్థానానికి ఆదాయం లభిస్తోంది. మరో వైపు నిత్యం భక్తులు అమ్మవారికి ఆభరణాల రూపంలో బంగారాన్ని కానుకగా సమర్పిస్తున్నారు. ఇలా సమర్పించిన బంగారం మరో 8 కిలోలను దేవస్థాన లాకర్‌లో భద్రపరిచారు.





అల్ఫోన్సో.. కింగ్ ఆఫ్ మ్యాంగో

ఒక్కసారిగా ఈ చిత్రాలు చూసి యాపిల్స్ అనుకున్నారా? అనుకోవడంలో తప్పులేదు గానీ.. అవి యాపిల్స్ కాదు! మామిడికాయలు. ఏమిటీ ఆశ్చర్యపోతున్నారా? నిజమేనండి.. అవి కూడా మామూలు కాయలు కాదు. 'కింగ్ ఆఫ్ మ్యాంగో' అని పిలుచుకునే అల్ఫోన్సో రకం కాయలు. ఇతర మామిడి రకాల కంటే పూర్తి భిన్నంగా ఉండే ఈ కాయలు విజయవాడ పటమటలోని ఓ ఇంటి పెరట్లో కనిపించాయి. ఇది మామిడి పండ్లలో ఉత్తమమైనదని ఆ ఇంటి యాజమాని రమేష్ పేర్కొన్నారు. – చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్

ప్రచార పర్వం



మీతోనే.. విజయవాడ పశ్చిమంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం 53వ డివిజన్‌లో వీధి వీధి కలియ తిరిగారు. తోపుడు బండ్ల వ్యాపారులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

– వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ)



అవ్వా.. ఆశీస్సులు.. విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం 21వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరించి ఆశీస్సులు కోరారు.

– కృష్ణలంక(విజయవాడతూర్పు)

క్లుప్తంగా

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



పమిడిముక్కల: మండలంలోని తాడంకి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ జొన్నలగడ్డ వెంకట నారాయణ(54) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందారు. ఉయ్యూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటనారాయణ అస్వస్థతకు గురై గుండెపోటుతో మరణించారు. అతని భౌతికకాయాన్ని తాడంకిలోని స్వగృహానికి తరలించారు. కంకిపాడు సీఐ శ్రీనివాసరావు, ఉయ్యూరు రూరల్ ఎస్‌ఐ అవినాష్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్, ప్రతినిధులు బెనర్జీ బాబు, సురేంద్ర, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కూచిపూడి శ్రీలక్ష్మి తదితరులు కానిస్టేబుల్ వెంకటనారాయణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వెంకటనారాయణ భౌతికకాయానికి పోలీస్ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పోలీస్ అధికారుల సంఘం రూ.90 వేల ఆర్థిక సాయం చేసింది.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


గూడపాడు(మొవ్వ): భర్త, అత్తింటివారి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మొవ్వ మండలంలోని గూడపాడులో జరిగింది. కూచిపూడి ఎస్‌ఐ టి.శ్రీనివాస్ కథనం మేరకు.. గూడపాడుకు చెందిన ఈడే సాంబశివరావుకు దుర్గాభవాని(30)తో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త సాంబశివరావు, అత్త ఈడే దుర్గ, ఆడపడుచు సామ్రాజ్యం వేధింపుల కారణంగా గురువారం సాయంత్రం ఇంటిలోనే దుర్గాభవానీ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతిరాలి తల్లి కొండేటి లక్ష్మి ఫిర్యాదు మేరకు కూచిపూడి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రూ.38.40 లక్షల నకిలీ సిగరెట్లు పట్టివేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నకిలీ సిగరెట్లు నిల్వ చేసిన గోదాముపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. రూ.38.40 లక్షల విలువైన 64 కార్టన్ల నకిలీ సిగరెట్లను సీజ్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని ఏకలవ్య నగర్‌లో గుంటూరుకు చెందిన వ్యాపారి ఏటీసీ పేరుతో గోదాము నిర్వహిస్తున్నాడు. ఈ గోదాములో నకిలీ సిగరెట్లు నిల్వ చేశారన్న సమాచారంతో విజిలెన్స్ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి దాడి చేశారు. యజమాని అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడి తాళలు తెప్పించి గోదామును తెరిపించారు. 36 బోరాల్లో 64 కార్టన్లలో నకిలీ సిగరెట్లను గుర్తించారు. వాటిపై తయారు చేసిన తేదీ, తారు శాతం, నికోటిన్ శాతం వంటి వివరాలను ముద్రించలేదు. దీంతో అవి నకిలీవిగా భావించి భవానీపురం పోలీసులకు అప్పగించారు. దీనిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

సీఎం వైఎస్ జగన్ పాలనలో తగ్గిన పేదరికం

- బెజవాడ అంటే నాకు ప్రాణం
- మళ్లీ నేనే ఎంపీగా గెలుస్తా
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని



మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న కేశినేని నాని

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదరికం పూర్తిగా తగ్గిందని విజయవాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇందుకు కారణమన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడుతూ.. ప్రజల తలసరి ఆదాయం, వృద్ధిరేటు పెరిగాయని పేర్కొన్నారు. అభివృద్ధి లేదని ప్రతిపక్షాలు చేస్తున్న వాదనలో పసలేదని తేల్చిచెప్పారు. ఈ ఐదేళ్లలో అభివృద్ధి వికేంద్రీకరణకు అడుగులు పడ్డాయన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ అందుబాటులోకి వచ్చాయని వివరించారు. ఇది అభివృద్ధి కాదా అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు.

అభివృద్ధే జెండా.. అజెండా

బెజవాడ అంటే తనకు ప్రాణమని, తన జెండా, అజెండా విజయవాడ అభివృద్ధేనని కేశినేని నాని పేర్కొన్నారు. దుర్గగుడి, బెంజ్ సర్కిల్ మొదటి ఫ్లై ఓవర్ నిర్మాణానికి తాను కృషి చేశానన్నారు. నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మరో సంవత్సర కాలంలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తవుతుందన్నారు. ఇప్పటికే వెస్ట్ బైపాస్ పూర్తయిందని, ఈస్ట్ బైపాస్ నిర్మాణంపై సీఎం వైఎస్ జగన్‌తో చర్చించానని తెలిపారు. పదేళ్లుగా ప్రజలకు కేశినేని నానీ అంటే ఎమిటో తెలుసన్నారు. ఎంపీగా విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని వివరించారు. టాటా ట్రస్ట్ ద్వారా 11 లక్షల మందికి ఉచితంగా వైద్య సేవలు అందించామన్నారు. అమరావతిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేస్తానని చంద్రబాబు చెప్పారని, తాను ఆ రోజు ఆయనకు ఎదురు తిరిగి గన్నవరం ఎయిర్‌పోర్టు విస్తరణ చేయించానని పేర్కొన్నారు. తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, నిరూపించాలని సవాల్ విసిరారు. మళ్లీ విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

వలంటీర్ వ్యవస్థను అవమానించ లేదా?

2019లో సీఎం వైఎస్ జగన్ వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేస్తే ఇదే చంద్రబాబు వలంటీర్లను అవమానిస్తూ వ్యాఖ్యలు చేశారని కేశినేని నాని గుర్తు చేశారు. ఎన్నికల వచ్చే సరికి ఆ వ్యవస్థ భేష్ అంటూ పొగుడుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు చేస్తే సంసారం.. ఇతరులు చేస్తే ఏదో అన్నట్లుగా ఆయన తీరు ఉందని ఎద్దేవాచేశారు.

ఏ ఒక్క హామీ అమలు చేయని బాబు

'2014 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు 650 హామీలు ఇచ్చాడు. ఏ ఒక్కటీ అమలు చేయలేదు. అప్పుడు బీజేపీతో టీడీపీ పొత్తులోనే ఉంది. అందుకే వాళ్లు ఏనాడు చంద్రబాబును నమ్మలేదు. పైగా నరేంద్రమోదీని వ్యక్తిగతంగా దూషించాడు. టీడీపీని బీజేపీ నమ్మే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు, పవన్ విడుదల చేసిన మేనిఫెస్టోలో బీజేపీ భాగస్వామి కాలేదు' అని కేశినేని నాని అన్నారు.

ప్రజలు తిరస్కరించిన వ్యక్తి వారసుడా?

'నారా లోకేష్ 2014లో తండ్రి పదవిని అడ్డుపెట్టుకుని ఎమ్మెల్సీ అయ్యాడు. మంత్రి అయ్యాడు. పార్టీ వనరులు, పార్టీ, తాత, తండ్రుల పేర్లు వాడుకున్నాడు. అయినా 2019లో ప్రజలు లోకేష్‌ను తిరస్కరించారు. అటువంటి వ్యక్తిని తీసుకొచ్చి పార్టీలో నా వారసుడు అంటే ఎలా నడుస్తుంది' అని చంద్రబాబును కేశినేని నాని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాంగ్రెస్‌ను ఎదురించి నిలబడి ప్రజలను మెప్పించారని, 151 సీట్లతో ముఖ్యమంత్రిగా బాధ్యలు చేపట్టారని వివరించారు.

15 మంది చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్స



శస్త్ర చికిత్సలు చేసిన చిన్నారులతో యూకేకు చెందిన వైద్యుల బృందం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని ఆంధ్రా హాస్పిటల్‌లో ఏప్రిల్ 29 నుంచి మే నాలుగో తేదీ వరకు నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో 15 మంది చిన్నారులు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలను విజయవంతంగా చేశామని ఆస్పత్రి పీడియాట్రిక్ చీఫ్ డాక్టర్ పి.వి. రామారావు తెలిపారు. సూర్యారావుపేటలోని ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ రామారావు మాట్లాడుతూ.. అత్యంత క్లిష్టతరమైన గుండె సమస్యలు ఉన్న చిన్నారులకు యూకేకు చెందిన వైద్య నిపుణులతో శస్త్ర చికిత్సలు చేయించామని తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలను ఆంధ్రా హాస్పిటల్స్, హీలింగ్ లిటిల్ హార్ట్స్, యూకే చారిటీ సౌజన్యంతో ఉచితంగా చేశామని వివరించారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రత్యేక శిబిరంలో యూకేకు చెందిన పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ ఆంద్రూ పార్రీ, పీడియాట్రిక్ కార్డియాక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ డొరొతి లిడ్ బెటర్, డాక్టర్ ఒరిజిత్ బెనర్జీతో పాటు హెలీ ఫిట్జ్ పాట్రిక్, అలెగ్జాండ్రా టేలర్ వంటి సిబ్బంది పాల్గొని గుండె సర్జరీలను విజయవంతంగా చేశారని వివరించారు. ఇప్పటి వరకూ 29 ప్రత్యేక శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రా హాస్పిటల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ విక్రమ్ కుడుముల, డాక్టర్ సాయిరామ్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ జె.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాలలో సకల సదుపాయాలు



వేద విద్యార్థులతో మాట్లాడుతున్న ఈఓ రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేద పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ఈఓ కె.ఎస్.రామరావు తెలిపారు. పెనమలూరు మండలం, పోరంకిలోకి వేద పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. వేద పాఠశాల ఆవరణలో చలువ పందిళ్లు, విద్యార్థులకు అందిస్తున్న వేద విద్య, వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. త్వరలో కోర్సు పూర్తి చేసుకోనున్న విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతుల గురించి పురాణ పండిత్ సీహెచ్.వెంకటేశ్వరశాస్త్రిని అడిగి తెలుసుకున్నారు. వేసవి నేపథ్యంలో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కూలర్లు, అదనపు ఫ్యాన్ల వల్ల విద్యార్థులకు ఇబ్బందులు తప్పాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అనంతరం వంటశాలను దుర్గగుడి ఈఓ రామరావు పరిశీలించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం నిల్వచేసిన టీడీపీ నేతలపై కేసు



మద్యం అక్రమ నిల్వచేసిన టీడీపీ నాయకులు, మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ అధికారులు

తిరువూరు: ఎన్నికల సందర్భంగా ఓటర్లకు పంపిణీ చేయడానికి తెలంగాణ నుంచి మద్యం సీసాలు తెచ్చి నిల్వచేసిన తెలుగుదేశం పార్టీ నాయకులపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం మేరకు.. అక్కపాలెం గ్రామంలోని నెక్కళపూడి శ్రీనివాసరావు ఇంటి ఆవరణలోని గడ్డివామిలో తెలంగాణ మద్యం సీసాలను నిల్వ చేసినట్లు సమాచారం అందుకుని ఎస్ఈబీ సిబ్బంది దాడిచేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఈ మద్యం సీసాలు తెచ్చినట్లు గుర్తించామని పేర్కొన్నారు. అక్కపాలెంనకు చెందిన నెక్కళపూడి శ్రీనివాసరావు, కుక్కా దినేష్ గౌడ్ వీటిని నిల్వ చేసినట్లు నిర్ధారించామన్నారు. రోలుపడికి చెందిన కిలారు రమేష్ కొన్ని మద్యం సీసాలను తీసుకెళ్లినట్లు గుర్తించి ముగ్గురిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. 480 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని శ్రీనివాసరావు, దినేష్‌గౌడ్‌ను అరెస్టు చేశామని, కిలారు రమేష్ పరారీలో ఉన్నారని అశోక్ తెలిపారు. తెలంగాణ మద్యం ఎవరైనా నిల్వ చేసినా, విక్రయించినా తమకు సమాచారం ఇస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొనసాగుతున్న ఈవీఎంల కమిషనింగ్



పెనమలూరు: మండలంలోని గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో ఈవీఎంల కమిషనింగ్ కొనసాగుతోంది. కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.కె.బాలాజీ గురువారం ఇంజినీరింగ్ కాలేజీకి వచ్చి ఈవీఎంల కమిషనింగ్‌పై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో సిబ్బంది కమిషనింగ్ ప్రక్రియను వేగవతం చేశారు. పెనమలూరు నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అసెంబ్లీకి 306, పార్లమెంట్‌కు 306 చొప్పున మొత్తం 612 ఈవీఎంలు అవసరం. రెండింటికి 20 శాతం చొప్పున అదనంగా ఈవీఎంలను అందుబాటులో ఉంచుకోవాలి. అంటే అసెంబ్లీ, పార్లమెంట్‌కు కలిపి 110 ఈవీఎంలు అదనంగా అందుబాటులో ఉండాలి. సాంకేతిక పరమైన ఇబ్బందులు వచ్చినప్పుడు అందుబటులో (రిజర్వు) ఉన్న ఈవీఎంలు ఉపయోగిస్తారు. వీవీ ప్యాట్‌లు కూడా 306 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తారు. వాటికి 30 శాతం వీవీ ప్యాట్‌లు అందుబాటులో ఉంచుతారు. కమిషనింగ్‌లో భాగంగా ఈవీఎంలకు ఆయా పార్టీల ఎన్నికల గుర్తులు లోడ్ చేస్తారు. కమిషనింగ్ మరో రెండు రోజులు ఉంటుందని అధికారులు తెలిపారు. ఆర్‌ఓ డి.రాజు, ఏఆర్‌ఓలు ప్రసాద్, కుమార్‌బాబు పాల్గొన్నారు.

ముగిసిన ర్యాండమైజేషన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి తొలి సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ (బ్యాలెట్ యూనిట్లు), రెండో ర్యాండమైజేషన్ (బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు) ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. జిల్లా కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూంలో శుక్రవారం ఉదయం కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆధ్వర్యంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు మంజూ రాజ్‌పాల్, నరీందర్‌సింగ్ బాలితో పాటు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బీయూ, సీయూ, వీవీ ప్యాట్‌ల రెండో ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి 17 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. ఒక్కో బ్యాలెట్ యూనిట్‌లో 15 మంది అభ్యర్థులు, ఒక నోటా బటన్ మాత్రమే ఉంటాయని, దీంతో అదనంగా రెండో బ్యాలెట్ యూనిట్ అవసరమైందని తెలిపారు. ఇందుకోసం 2,147 బ్యాలెట్ యూనిట్లను అదనంగా కేటాయించామని పేర్కొన్నారు. జనరల్ అబ్జర్వర్లు మంజూ రాజ్‌పాల్, నరీందర్ సింగ్ బాలి మాట్లాడుతూ.. శాంతియుతంగా ఎన్నికల నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో వృద్ధులు విలవిల

- చంద్రబాబు వల్లే మాకీ కష్టాలు
- బ్యాంకుల వద్ద వృద్ధుల పడిగాపులు
- పింఛను కోసం వేచి ఉన్న వృద్ధులను కలిసిన అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): చంద్రబాబు నిర్వాకంతో వృద్ధులు విలవిల్లాడిపోతున్నారు. మండుటెండలో పింఛను నగదు కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి వలంటీర్లు పింఛను ఇచ్చే వాళ్లని, కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఆవేదన చెందుతున్నారు. బాబు చేసిన పనికి తాము అల్లాడిపోతున్నామని చెప్పారు. భగ్గుమంటున్న ఎండలో బ్యాంకుల వద్ద వృద్ధులు, వికలాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని ఇబ్బందులు పెట్టిన చంద్రబాబుకు మా ఉసురు తగులుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో కూడా ఇలాగే బ్యాంకుల వద్ద ఇబ్బంది పడ్డామని గుర్తు చేశారు. తూర్పు నియోజకవర్గంలోని పలు బ్యాంకుల వద్ద శుక్రవారం కూడా పింఛనుదారులు బారులు తీరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో బ్యాంకులు తెరవకముందే అక్కడకు చేరుకున్నారు. ఒక్కో బ్యాంకు వద్ద వంద మంది వరకూ ఉండటంతో తీవ్రమైన రద్దీ నెలకొంది. వారిలో కొందరికి నగదు జమ కాలేదని చెప్పడంతో తిరిగి వెళ్లి పోతున్నారు. ఆటోకు రూ.50 ఇచ్చి వచ్చామని, ఇదేమిటంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణలంకలోని ఓ బ్యాంకు వద్ద పింఛను కోసం వేచివున్న వృద్ధులను వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి అవినాష్ కలిశారు. తాము పడుతున్న ఇబ్బందుల గురించి వృద్ధులు ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా మొదటి తేదీనే ఇంటికి తీసుకెళ్లి ఫించన్ అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చూశారన్నారు. కానీ ఎన్నికలు రావడంతో తన మనిషి నిమ్మగడ్డ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, ఇంటింటికీ ఫించన్ పంపిణీని అడ్డుకున్నారని ఆరోపించారు. నేడు వృద్ధులు, వికలాంగులు ఇన్ని ఇబ్బందులు పడటానికి కారణం చంద్రబాబేనని అవినాష్ తెలిపారు. వృద్ధులను బాబు ఇబ్బందులు పెట్టాడని తెలిపారు.


కృష్ణలంకలోని ఓ బ్యాంకు వద్ద ఉన్న వృద్ధులతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

సీఎంగా జగనే కావాలి



మాలాంటి వృద్ధులకు వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ డబ్బులు అందించేవారు. ఎన్నికల నేపథ్యమని చెప్పి నిమ్మగడ్డ రమేష్ చేత చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్లను ఆపివేయించారు. గత 58 నెలలుగా మాకు ఎటువంటి ఇబ్బంది కలుగలేదు. గత నెలలో సచివాలయం వద్దకు నానా అవస్థలు పడుతూ మండుటెండలో వెళ్లి పింఛన్ సొమ్ము తీసుకున్నా. ఈ నెల బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. ఎక్కడో దూరంగా ఉన్న బ్యాంక్ వద్దకు ఆటోలో వెళ్లి క్యూలైన్‌లో గంటల కొద్ది నిల్చొని ఇబ్బందులు పడుతూ పింఛన్ తీసుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు మళ్లీ టీడీపీ పాలన గుర్తుకొస్తుంది. బాబు వస్తే మాకు కష్టాలు తప్పవు. అందుకుని మళ్లీ జగనే సీఎం కావాలి. ఆయనకే ఓట్లు వేస్తాం.

–బత్తుల మంగమ్మ, కృష్ణలంక


కృష్ణలంక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్యూలైన్‌లో నిల్చున్న లబ్ధిదారులు


పింఛన్ నగదు తీసుకునేందుకు కృష్ణలంక ఎస్‌బీఐలో పడిగాపులు కాస్తున్న వృద్ధులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపే ప్రాంతాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు):విద్యుత్ లైన్లు మరమ్మతుల నేపథ్యంలో మొగల్రాజుపురం సెక్షన్ మహాత్మాగాంధీ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. అందులో భాగగా రెవిన్యూ కాలజీ 11 కేవీ ఫీడర్ పరిధిలోని రెవిన్యూకాలనీ, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ రోడ్డు, కోనేరు లక్ష్మయ్యవీధి, ఫర్ట్యూన్ మురళీ పార్క్ రోడ్డు, రఘురామ్ స్ట్రీట్, ఏ రామారావు వీధుల్లో ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

- మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ సిద్ధార్థ నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సిద్ధార్థ నగర్ 1 నుంచి 5వ అంతర్గత రహదారి వరకు, మోడరన్ సూపర్ మార్కెట్ ఏరియా, సిద్ధార్థ కళాశాల జంక్షన్, నవోదయ కాలనీ, ఎస్‌బీహెచ్ కాలనీ, సున్నపుబట్టీల సెంటర్ పరిసర ప్రాంతల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీని గెలిపించండి



కృష్ణలంక(విజయవాడతూర్పు):త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర, కేశినేని నాని కుమార్తె కేశినేని హైమా అన్నారు. శుక్రవారం కృష్ణలంక, 22వ డివిజన్‌లోని మెట్లబజార్, పోస్టాఫీస్ రోడ్డు, కోతమిషన్ రోడ్డు ప్రాంతాలలో వారు పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గపడకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసి సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి వివరించారు. కరపత్రాలు అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సుధీర, హైమా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందాలన్నా, అభివృద్ధి కార్యక్రమాలు జరగాలన్నా వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా దేవినేని అవినాష్‌ను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బుద్ధి చెబుదాం

ముస్లిం మైనార్టీ నేత సయ్యద్ అలీం

లబ్బీపేట(విజయవాడతూర్పు):మతతత్వ పార్టీ బీజేపీతో కలిసిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుదామని ముస్లిం మైనార్టీ నేత, వీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా ముస్లిం మైనార్టీలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. లబ్బీపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముస్లింలకు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 4 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, ఇప్పుడు వాటిని రద్దు చేస్తామని బీజేపీ అంటుందని తెలిపారు. అలాంటి పార్టీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబుని చిత్తుగా ఓడిద్దామని తెలిపారు. ముస్లింలను ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా చేసి, ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు, అనేక నామినేటెడ్ పదవులు ఇచ్చిన వైఎస్ జగన్‌కు ఐక్యంగా మద్దతు తెలుపుదామన్నారు.

రవికుమార్ సాహిత్య సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: తల్లాప్రగడ రవికుమార్ సాహిత్య సేవలు వెలకట్టలేనివని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. రవికుమార్ మిత్రబృందం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కవి, రచయిత పరిశోధకుడు తల్లాపగడ రవికుమార్ సంస్మరణ సభను గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రవికుమార్ సామాజిక స్పృహ కలిగిన రచయిత అని చెప్పారు. కృష్ణా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు మాట్లాడుతూ రవి కుమార్ అనేక రేడియో కార్యక్రమాల్లో పాల్గొన్నాడని గుర్తుచేశారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి మాట్లాడుతూ రవికుమార్ అనేకమంది రచయితలకు ప్రోత్సాహం అందించినట్లు తెలిపారు. రవికుమార్ కుటుంబ సభ్యులు శశిధర్, తల్లా ప్రగడ శైలేష్ వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, చలపాక ప్రకాష్, జానపద గాయకుడు దామోదర గణపతిరావు, సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్ శర్మ, డాక్టర్ యశో పూర్ణచంద్రరావు, కళాసాగర్, డాక్టర్ వెన్నా వల్లభరావు, గోళ్ళ నారాయణ రావు ఆయనతో అనుబంధం గుర్తుచేసుకున్నారు. రవికుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

నలంద ఎన్‌సీసీ క్యాడెట్‌కు డీజీ అప్రిసియేషన్ అవార్డు



లబ్బీపేట(విజయవాడతూర్పు):నలంద డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ 4 ఆంధ్రా బాలికల బెటాలియన్ క్యాడెట్ బుగత సంధ్యకు డిజి అప్రిసియేషన్ అవార్డు లభించింది. ఇటీవల సికింద్రాబాద్‌లోని ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీడీజీ సికింద్రాబాద్ డైరెక్టరేట్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి, డీజీ లెఫ్టినెంట్ కల్నల్ గుర్బీర్పల్ సింగ్ చేతుల మీదగా సంధ్య అవార్డును అందుకుంది. ఏటా ఎన్‌సీసీలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ఈ అవార్డును అందచేస్తామని, ఇటీవల ఆగ్రాలో జరిగిన పారాజంప్‌కోర్సులో ఏపీ, తెలంగాణ నుంచి ముగ్గురు హాజరు కాగా, వారిలో తమ విద్యార్థి సంధ్య అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో అవార్డుకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు శుక్రవారం అభినందనలు తెలిపారు.

జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు):రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో నడిపిస్తూ జనరంజక పాలన అందిస్తున్న రథసారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ విజ్ఞప్తి చేశారు. కృష్ణలంక, 21వ డివిజన్‌లోని రణదీర్‌నగర్ కట్ట ప్రాంతం, లాల్‌బహదూర్‌శాస్త్రీ రోడ్డు, కొల్లావారివీధి, బీచ్‌రోడ్డు, పాతగుడ్ల బజార్, ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా మహిళలు ఆయనకు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కరపత్రాలు పంపిణీ చేసి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సుమారు రూ.2 వేలు కోట్లను ఖర్చు చేసిందన్నారు. ఇంటి వద్దకే అనేక సంక్షేమ పథకాలను మహిళల పేరు మీదనే అమలు చేస్తూ మహిళా పక్షపాతిగా సీఎం జగన్ నిలిచారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని పేర్కొన్నారు.


ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్న దేవినేని అవినాష్

బాబువి మోసపూరిత హామీలు....

2014లో ఎన్నికల్లో చంద్రబాబు డ్వాక్రా మహిళలు, రైతులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ ఎన్నికల్లోనూ మరలా మోసపూరిత హామీలు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు మాటలను ఎవ్వరూ నమ్మడం లేదన్నారు. ప్రజలు మనస్ఫూర్తిగా మళ్లీ జగన్ సీఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. నిమ్మగడ్డ రమేష్ ద్వారా చంద్రబాబు ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు చేసిన పాపం వలన బ్యాంకుల వద్ద వృద్ధులు, వికలాంగులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను ఛీదరించుకుంటున్నారని గ్రహించి ప్రచారం కూడా చేయడం లేదన్నారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులను అడ్డుకుంటూ ఉసురుపోసుకుంటున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ గద్దె రమేష్‌కు మంచి చేయాలనే పనులను అడ్డుకుంటున్నారని తెలిపారు. అతని వద్ద నుంచి తీసుకున్న డబ్బులతో గద్దె కాల్‌మనీ, బెట్టింగ్‌లు, సెక్స్ రాకెట్ నడుపుతున్నారని ఆరోపించారు. వీటిపై చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, దమ్ముంటే గద్దె రామ్మోహన్ చర్చకు రావాలని సవాల్ విసిరారు. తప్పుడు పనులు చేస్తూ ప్రజల వద్ద మాత్రం సౌమ్యంగా నటిస్తున్నారన్నారు.పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గంలో గద్దె రామ్మోహన్ చేసింది శూన్యమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాత్రమే అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలు జరిగాయని, ప్రజలందరూ ఆనందంగా ఉన్నారని తెలిపారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసిన వారిని ఆదరించండి

లబ్బీపేటలో దేవినేని సుధీర విస్తృత ప్రచారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తూ మంచి చేసిన వారిని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని దేవినేని అవినాష్ సతీమణి సుధీర కోరారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, పార్లమెంటు అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌ల విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం లబ్బీపేట పశువుల ఆస్పత్రి రోడ్డు, పోలీస్‌క్వార్టర్స్, ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్, కాల్వగట్టు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఏ సమస్య వచ్చినా అండగా ఉండే వారిని మంచి మనస్సుతో ఆదరించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో రెంటు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 19వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ రెహానా నాహీద్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, పార్టీ జిల్లా కార్యదర్శి చింతగుంట విజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బుర్రి జగ్జీవన్ రావు, రంగా, సుధాకర్, సుభానీ పాల్గొన్నారు.


లబ్బీపేటలో ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని సుధీర, ఇతర పార్టీ నేతలు

అభివృద్ధి చూసి ఓటేయాలని వినతి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయ్యాలని కేశినేని శ్రీనివాస్ కుమార్తె కేశినేని శ్వేత అన్నారు. శుక్రవారం ఆమె నగరంలోని సిద్ధార్థ అకాడమీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడారు. విజయవాడ నగరం గతం కంటే మెరుగ్గా అభివృద్ధి జరిగిందని తెలిపారు. మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌కు, తూర్పు ఎమ్మెల్యే దేవినేని అవినాష్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సర్జన్ డాక్టర్ మెహబూబ్ షేక్, వ్యాపారవేత్త శేగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

14వ డివిజన్‌లో...

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటును ఫ్యాన్‌పై వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల కుటుంబ సభ్యులు కోరారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ కుమార్తె హైమ, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సొదరి దేవినేని క్రాంతి పటమట 14వ డివిజన్‌లోని తోటవారి వీధి, విజయ ఆస్పత్రి రోడ్డులో పర్యటించి ఓటర్లను ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.


సిద్ధార్థ అకాడమీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కేశినేని శ్వేత


పటమటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కేశినేని హైమ, దేవినేని క్రాంతి

మేమంతా వైఎస్సార్ సీపీ వెంటే...

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఎన్నికల ప్రచారంలో దేవినేని అవినాష్ దూసుకుపోతున్నారు. రామలింగేశ్వరనగర్‌లోని కరకట్ట ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 15వ డివిజన్ యనమలకుదురు మసీద్ రోడ్డు మలుపు నుంచి స్క్రూబ్రిడ్జి వరకు ప్రచారం జరిగింది. మహిళలు అడుగడుగునా హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ వెంటే మేమంతా అంటూ మహిళలు ముక్తకంఠంతో నినదించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ విజయవాడ తూర్పులో ఏడివిజన్‌కు పోయినా.. ప్రజల నుంచి స్పందన వస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ అమలు చేసిన నవరత్నాలు...అభివృద్ధి పథకాలే గెలిపిస్తాయన్నారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ లో ఇప్పటి వరకు గడప గడపకు ఏడు సార్లు తిరిగామని తెలిపారు. ప్రజలు వైఎస్సార్ సీపీ జెండా వెంటే ఉన్నారన్నారు. కరకట్ట ప్రజలు గత కొన్ని ఏళ్ల నుంచి మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పైపులైను వేసి నీటి కనెక్షన్ ఇచ్చామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ డివిజన్‌ను దత్తత తీసుకొని ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందని ధ్వజమెత్తారు. అంతే కాకుండా రూ.33 కోట్లతో ఈ డివిజన్‌లో రోడ్లు, డ్రైయినేజీ, క్రైస్తవుల శ్మశానవాటికతో పాటు పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే బ్రహ్మరథం పడతారన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఆళ్ల చెల్లారావు, వెంకటరెడ్డి డివిజన్ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అవినాష్‌కు హారతి పడుతున్న కరకట్ట ప్రజలు


బ్యాలెట్ లోని ఫ్యాన్ గుర్తును మహిళలకు చూపిస్తున్న అవినాష్


లబ్బీపేటలో మైనార్టీలను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న దేవినేని అవినాష్

లబ్బీపేటలో అవినాష్ ప్రచారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ విజయవాడతూర్పు అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్ శుక్రవారం లబ్బీపేటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చయ్యవీధిలోని చిన్న మసీదు, మసీదు వీధిలోని పెద్ద మసీదుల వద్ద ముస్లింలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ముస్లిం మైనార్టీలకు తగిన గుర్తింపు, గౌరవం ఇచ్చింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, రాజకీయంగా కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలువురికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, ఎండీ నాహీద్ , ఎండీ అబీద్‌తో పాటు పలువురు మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు నగరాలు మద్దతు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నగరాలంతా మద్దతుగా నిలబడాలని ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాయన బాబూజీ(బాబ్జి) పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరాల సీతారామ స్వామి మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం గుర్తించని వెనుకబడిన నగరాల సామాజికవర్గాన్ని గుర్తించి, బీసీ హోదా కల్పించిన ఘనత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిదేన్నారు. ప్రస్తుత జగన్ పాలనలో నగరాలకు పెద్దపీట వేసి అనేక కీలక పదవులు అందించారని చెప్పారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం చైర్మన్ పదవిని, నగర మేయర్ పదవులు అందించారని తెలిపారు. అలాగే నగరాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. శ్రీశైలంలో నగరాల అన్న సత్రం నిర్మాణానికి 50 సెంట్ల స్థలం, మధురవాడలో మరో 50 సెంట్ల స్థలం కేటాయించారని వెల్లడించారు. నాలుగు జిల్లాలకే పరిమితమైన బీసీ హోదాను రాష్ట్రం మొత్తం వర్తింపజేసి నగరాల కులానికి ఎంతో మేలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో విజయవాడలో వైఎస్సార్ సీపీ తరుపున పోటీ చేస్తున్న కేశినేని నాని, షేక్ ఆసిఫ్, వెలంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్‌లకు నగరాల కులస్తులందరూ తమ ఓటును వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మహేష్, భాను, శ్రీను పార్టీ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫ్‌ను సత్కరిస్తున్న బాయన బాబ్జీ ఇతర నగరాల కులస్తులు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన ఉమామహేశ్వర కళాక్షేత్రంకు చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శుక్రవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై కందికట్టు వాసుదేవరావు శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని రాజగోపురం వద్దకు విచ్చేసిన భక్తులు కళావేదికపై జరుగుతున్న నృత్య ప్రదర్శనను ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం నృత్య ప్రదర్శన ఇచ్చిన కళాకారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందచేశారు.

సహాయ మాత ఆలయ స్వర్ణోత్సవాలు ప్రారంభం

మైలవరం: మేరీమాత మధ్యస్థ ప్రార్థన సహాయం విశ్వాసులపై ఎల్లవేళలా ఉంటుందని అతిథి గురువు, విజయవాడ రేడియో మరియమాత డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ బి. జాన్‌పీటర్ అన్నారు. మైలవరం శాంతినగర్‌లోని క్రైస్తవ సహాయమాత దేవాలయం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం చర్చి ప్రాంగణంలో స్వర్ణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఫాదర్ జాన్ పీటర్ మాట్లాడుతూ అవసరంలో ఉండి ప్రార్థించిన విశ్వాసులకు వారి అవసరాలు తీరుస్తున్నారని చెప్పారు.

అధికారులు పారదర్శక సేవలు అందించాలి

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రంలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పారదర్శకంగా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. పోస్టల్ ఓటింగ్‌కు అర్హులైన వారు శనివారం నుంచి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. కేంద్రీకృత ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రంలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. కేంద్రంలో విధులు నిర్వర్తించే పోలింగ్ ఆఫీసర్లకు నిర్దేశించిన విధులపై అవగాహన కల్పించారు. వివరాల పరిశీలన, అనుబంధం–5లో సంతకం తీసుకోవడం, చేతి వేలుపై ఇంక్ మార్కు చేయడం, పోస్టల్ బ్యాలెట్ ఇష్యూ చేయడం తదితర అంశాలను వివరించారు. అదేవిధంగా ఫారం-13ఏ, ఫారం-13బీ, ఫారం-13సీ, ఫారం-13డీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వరుస క్రమంలో వివరించారు. ప్రతి విషయంలోనూ అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. డీఎస్‌ఈఓ యామీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, గ్రామ వార్డు సచివాలయాల సమన్వయ అధికారి కె.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

- భవానీపురం:నగరంలోని సూర్యారావు పేట పోలీస్ స్టేషన్‌లో హోమ్ గార్డ్ (హెచ్‌జీ 670)గా పని చేస్తున్న దాసుకు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. దీంతో ఆయన ఆంధ్రా హాస్పటల్‌లో చేరటంతో వైద్యులు శుక్రవారం హార్ట్ సర్జరీ చేశారు. ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు, హెడ్ కానిస్టేబుల్ జాజుల నాగరాజు హాస్పటల్‌కు వెళ్లి దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరుపున రూ.10 వేలు అందించారు.

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న వలసలు



వల్లభనేని వంశీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత రాజేశ్వరి, మహిళలు

గన్నవరం: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. టీడీపీ మహిళా విభాగం మండల ఉపాధ్యక్షురాలు మోదుగుమూడి రాజేశ్వరి నేతృత్వంలో 30 మంది మహిళలు శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి వంశీమోహన్ పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల పేరున నివేశన స్థలాలను పంపిణీ చేసి రూ.లక్షల విలువైన ఆస్తికి హక్కుదారులను చేసిందని గుర్తుచేశారు. మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనతో పాటు ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు మోదుగుమూడి వెంకటేశ్వరరావు, దారం దుర్గా వరప్రసాద్, లుక్కా సురేష్, ముతకన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరేందుకు ముందుకు రావడం చాలా ఆనందంగా ఉందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. 17వ డివిజన్ రాణిగారితోటలో గుడ్ మార్నింగ్ హోటల్ సమీపంలో శుక్రవారం రాత్రి స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అవినాష్ సమక్షంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన యువనాయకులు సత్తిబాబు, ప్రశాంత్, నాగరాజు ఆధ్వర్యంలో వారి మిత్రబృంద కుటుంబ సభ్యులు సుమారు 200 మంది పార్టీలో చేరారు. వారందరికీ అవినాష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే నియోజకవర్గంలో, డివిజన్‌లోనూ అభివృద్ధి జరిగిందని, అదంతా క్లారుటే కనిపిస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న జనరంజక పాలనకు మద్దతు తెలుపుతూ ఇటీవల కాలంలో వైఎస్సార్ సీపీలోకి చేరికలు బాగా పెరిగాయన్నారు. భవిష్యత్‌లో అందరికీ సముచిత స్థానం కల్పించి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో అందరి మద్దతుతో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ చైర్మన్ బొడ్డు అప్పల కొండమ్మ, శాప్ డైరెక్టర్ కె.దామోదర్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎలక్షన్ క్యాంపెయిన్ పరిశీలకుల నియామకం చేపట్టారు.

- మైలవరం, విజయవాడ వెస్ట్ నియోజకవర్గాల ఎలక్షన్ క్యాంపెయిన్ పరిశీలకుడిగా తిరుపతి జిల్లాకు చెందిన పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు.
- ఎన్నారై స్టేట్ కో ఆర్డినేటర్ (ఎలక్షన్స్)గా యార్లగడ్డ వెంకట రమణ చౌదరిని నియమించారు.
- జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన ఇంటూరి రాజగోపాల్ (చిన్నా)ను రాష్ట్ర కార్యదర్శి (ఎలక్షన్స్)గా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

- విస్తరిస్తున్న పట్టణీకరణ
- వ్యవసాయరంగానికీ తగ్గని ప్రాధాన్యం
- విద్యా హబ్‌గా 'పెనమలూరు'
- జిల్లా రాజకీయాలకు కేంద్ర బిందువు

రియల్ స్పీడ్.. అభివృద్ధి జోష్

నగరానికి దీటుగా పెనమలూరు

నియోజకవర్గ ముఖచిత్రం పెనమలూరు



యనమలకుదురులోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం

కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గం జిల్లాలో అత్యధిక ఓటర్లు కలిగిన నియోజకవర్గం. విజయవాడకు కూతవేటు దూరంలో ఉన్న ప్రాంతం. పునర్విభజన ప్రక్రియతో 2009లో ఏర్పాటైన నియోజకవర్గం. ఇప్పటివరకూ 2009, 2014, 2019లో మూడు పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఈ ఏడాది నాలుగో పర్యాయం ఎన్నికలు జరుగుతున్నాయి.

నియోజకవర్గ స్వరూపం ఇదీ..

నియోజకవర్గంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలు ఉన్నాయి. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ, ఉయ్యూరు నగర పంచాయతీ ఉన్నాయి. మూడు మండలాల్లో 37 గ్రామాలు ఉన్నాయి. నియోజకవర్గం మొత్తం విస్తీర్ణం 68,208 ఎకరాలు. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారికి ఇరువైపులా విస్తరించి ఉన్న నియోజకవర్గం. అన్ని ప్రాంతాలకు రవాణా సదుపాయాలు ఉన్నాయి. నిత్యం విజయవాడ–మచిలీపట్నం, విజయవాడ–ఏలూరు, అవనిగడ్డ, గన్నవరం, గుడివాడ ప్రాంతాలకు రవాణా సదుపాయాలు ఉన్నాయి. నియోజకవర్గం గుండా ప్రధానంగా బందరు, రైవస్ కాలువలు, వాటికి అనుబంధ కాలువలు ప్రవహిస్తున్నాయి. కృష్ణానది ఏటిపాయ కూడా పెనమలూరు, కంకిపాడు మండలాలలో ఐదు గ్రామాల వెంబడి ప్రవహిస్తుంది. సాగునీరు వ్యవస్థ అందుబాటులో ఉంది. ప్రధానంగా బోర్లు, కాలువ నీటిపై ఆధారపడి సాగు జరుగుతుంది. వ్యవసాయాధారిత గ్రామాలు ఎక్కువ.

రెండు నియోజకవర్గాలు కనుమరుగు

కంకిపాడు, ఉయ్యూరు నియోజకవర్గాల రద్దుతో పెనమలూరు నియోజకవర్గం ఏర్పాటైంది. 1952లో కంకిపాడు నియోజకవర్గం, 1955లో ఉయ్యూరు నియోజకవర్గం ఏర్పాటయ్యాయి. నియోజకవర్గాల పునర్విభజనతో ఈ రెండు నియోజకవర్గాలు కనుమరుగయ్యాయి. కంకిపాడు నియోజకవర్గం, ఉయ్యూరు నియోజకవర్గాలు 2004 తరువాత రద్దయ్యాయి. కంకిపాడుకు 13 పర్యాయాలు ఎన్నికలు జరగ్గా, ఉయ్యూరు నియోజకవర్గానికి 12 సాధారణ ఎన్నికలు, ఒక ఉప ఎన్నిక జరిగాయి. కంకిపాడు నియోజకవర్గం తొలుత కమ్యూనిస్టులకు, తరువాత కాంగ్రెస్‌కు, టీడీపీ ఆవిర్భావం తరువాత టీడీపీకి కంచుకోటగా నిలిచాయి. ఉయ్యూరు నుంచి ఉక్కు కాకాని వెంకటరత్నం మూడు పర్యాయాలు గెలుపొందారు. 2009లో పెనమలూరు నియోజకవర్గం ఏర్పాటైంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన కొలుసు పార్థసారథి తన ప్రత్యర్థి చలసాని వెంకటేశ్వరరావు(పండు)పై 177 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్, తన ప్రత్యర్థి వైఎస్సార్ సీపీ అభ్యర్థి కుక్కల విద్యాసాగర్‌పై 31,150 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కొలుసు పార్థసారథి, తన ప్రత్యర్థి బోడె ప్రసాద్‌పై 11,317 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నియోజకవర్గంలో ప్రధానంగా 52 వేలు వరకూ కమ్మ, 75 వేలకు పైగా బీసీలు, ఎస్సీ ఓటర్లు ఉన్నారు. కాపు ఓటర్ల ప్రభావం కంకిపాడు, ఉయ్యూరు ప్రాంతాల్లో ఉంటుంది. కమ్మ, కాపుతో పాటు గౌడ, ముస్లిం, యాదవ సామాజిక వర్గాలు అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపుతాయి.

వేగంగా పట్టణీకరణ

విజయవాడ పట్టణానికి కూత వేటు దూరంలో నియోజకవర్గం ఉంది. ప్రధానంగా పెనమలూరు, కంకిపాడు గ్రామాల్లో పట్టణీకరణ శరవేగంగా సాగుతుంది. విజయవాడ పరిసరాల్లో అన్ని సౌకర్యాలు ఉన్న ప్రాంతం కావటంతో ప్రజలు ఇక్కడి గ్రామాల్లో స్థిర నివాసం ఏర్పాటుచేసుకునేందుకు మక్కువ చూపుతున్నారు. పట్టణ వాతావరణం కావాల్సిన వారు పెనమలూరు పరిసరాల్లోనూ, గ్రామీణ వాతావరణం కావాలనుకున్న వారు కంకిపాడు పరిసరాల్లోనూ స్థలాలు, పొలాలు కొనుగోలు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొనుగోళ్ల భూమ్‌తో రియల్ వ్యాపారం స్పీడ్‌గా సాగుతుంది. నియోజకవర్గం వ్యాప్తంగా వందల సంఖ్యలో రియల్ వెంఛర్లు ఏర్పాటు కావటం, వేగంగా గృహ నిర్మాణాలు సాగటమే ఇందుకు నిదర్శనం. దీంతో పాటుగా సాగునీరు సదుపాయం ఉండటంతో వ్యవసాయం కూడా ప్రాధాన్యతరంగంగా ఉంది.

ఎడ్యుకేషన్ హబ్..

అంతే కాకుండా విద్యా పరంగా ఎంతో ప్రగతి సాధిస్తోంది. ప్రధాన కార్పొరేట్ విద్యాసంస్థలు నియోజకవర్గం కేంద్రంగా విద్యాసంస్థలను స్థాపిస్తున్నారు. ప్రధానంగా పాఠశాల, ఇంటర్, సాంకేతిక విద్యాపరంగా ప్రాధాన్యం ఇస్తూ సంస్థలను నెలకొల్పుతున్నారు. న్యాయ, వైద్య విద్య కూడా అందుబాటులో ఉంది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి విద్యార్థులు ఇక్కడి పరిసరాల్లో ఉన్న విద్యాసంస్థల్లో చేరి విద్యనభ్యసిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

నియోజకవర్గంలో ప్రముఖులు

ప్రముఖ ఇంజినీర్ డాక్టర్ కానూరు లక్ష్మణరావు కంకిపాడుకు చెందిన వారే. కంకిపాడు పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసించారు. ఉన్నత విద్య పూర్తి చేసి దేశంలోనే ప్రఖ్యాత ఇంజినీర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. నదుల అనుసంధాన్ని ప్రతిపాదించిన తొలి వ్యక్తి. నీటిపారుదల శాఖలో కేంద్ర మంత్రిగానూ విశిష్ట సేవలు అందించి జలప్రదాతగా నిలిచారు. సినీ కళాకారులకు, రంగస్థల కళాకారులకు ఎందరికో ఈ ప్రాంతం నిలయం. ఈ ప్రాంతంలో పుట్టిపెరిగి ఆయా రంగాల్లో రాణిస్తూ గుర్తింపు తెచ్చుకున్న కళాకారులు ఎందరో ఉన్నారు. దర్శక, నిర్మాతలు కూడా ఉండటం గమనార్హం. విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించింది ఈడుపుగల్లు గ్రామానికి చెందిన వీర మాచనేని మధుసూదనరావు(విక్టరీ మధుసూదన్‌రావు). దర్శకేంద్రుడుగా పిలిచే కె.రాఘవేంద్రరావుది కోలవెన్ను. అంతేకాకుండా సినీ నిర్మాణ రంగంలో ఉన్న అడుసుమిల్లి దుర్గాప్రసాద్, ఏవీ సుబ్బారావు ఈ ప్రాంత వాసులే. కళాకారులుగా గుర్తింపు పొందిన కోటా శ్రీనివాసరావు, కోటా శంకరరావు, అన్నపూర్ణమ్మ వంటి ఎందరో కళాకారులకు ఈ గడ్డ పుట్టినిల్లు.

జాతిపితతో అనుబంధం

జాతిపిత మహాత్మాగాంధీతో ఈ ప్రాంతానికి ప్రత్యేక అనుబంధం ఉంది. స్వాతంత్య్ర ఉద్యమంలో భాగంగా ఇక్కడి గ్రామాల్లో విరాళాలను సేకరించి ప్రజానీకాన్ని స్వాతంత్య్ర సంగ్రామంలో భాగస్వాములను చేశారు. 1929 ఏప్రిల్ 11న ఖద్దరు నిధికి కానుకలు సేకరించే క్రమంలో పెనమలూరు మండలం పోరంకి, ఈడుపుగల్లు, పునాదిపాడు, గొడవర్రు, నెప్పల్లి, ఉయ్యూరు మండలం ఆకునూరు, గండిగుంట గ్రామాల్లో నిధిని సేకరించారు. ఆ రోజుల్లో అత్యధికంగా ఈడుపుగల్లులోనే రూ.887 రూపాయలు విరాళం ఇచ్చి దేశం మీద ఉన్న అభిమానాన్ని ఇక్కడి ప్రజలు చాటుకున్నారు. మరలా 1933లో డిసెంబరు 16న గాంధీజీ మరోమారు ఈడుపుగల్లు విచ్చేశారు. గ్రామస్తులు బాపూజీని ఘనంగా సన్మానించారు. రూ.150 నగదుతో పాటు సన్మానపత్రాన్ని అందించారు. అస్పృశ్యతా నిర్మూలనకు విరాళాలను సేకరిస్తున్నట్లు గాంధీజీ ప్రకటించారు. నాలుగేళ్ల వయస్సు గల బాలిక సరాసరి బాపూజీ దగ్గరకు వెళ్లి తన లోలాకులను అందించిందని నేటికీ గ్రామస్తులు గుర్తు చేసుకుంటున్నారు. స్వాతంత్య్ర ఉద్యమంలో సుంకర సత్యనారాయణ, సుంకర వెంకట సుబ్బారావు, సుంకర రామచంద్రయ్య, కోటమ్మ, సుంకర వీరభద్రరావు, కంభంపాటి వెంకటరత్నం, వీరమాచనేని రామకోటయ్య, సుంకర బలరామకృష్ణయ్యలు ఈడుపుగల్లు వాసులే.

నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన ప్రాంతాలు..



- పెనమలూరు నియోజకవర్గం ఆధ్యాత్మికంగానూ ప్రాధాన్యత కల ప్రాంతం.
- యనమలకుదురు గ్రామంలో వేంచేసిన రామలింగేశ్వర స్వామి దేవస్థానం వేయి మునుల కుదురుగా ప్రసిద్ధి చెందినది. ఏటా జరిగే మహాశివరాత్రి, దసరా ఉత్సవాల ఏర్పాట్లు ప్రత్యేకమైనవి. శివరాత్రి ఉత్సవాలకు సాగే ప్రభల ఊరేగింపును తిలకించేందుకు లక్షల్లో భక్తులు హాజరవుతారు.
- చోడవరం గ్రామంలో వేంచేసి ఉన్న నాగేంద్రస్వామి దేవస్థానంలో నాగుల చవితి పర్వదినం వైభవంగా సాగుతుంది.
- ఉయ్యూరు పట్టణంలోని శ్రీకనక చింతయ్య సమేత వీరమ్మతల్లి తిరునాళ్లు ఏటా మాఘశుద్ధ ఏకాదశి నుంచి 15 రోజులు పాటు తిరునాళ్లు జరుగుతుంది. ఉత్సవాల్లో ఊయల ఉత్సవం, శిడిబండి మహోత్సవం ప్రత్యేకమైనవి.
- గోదావరి జిల్లాలకు దీటుగా నియోజకవర్గంలో సంక్రాంతి కోడిపందేలు సాగుతాయి. ఆ మూడు రోజులు పాటు సుమారు రూ.130 కోట్లు చేతులు మారుతుంది.
- జిల్లాలోనే వ్యవసాయ పనులు ముందుగా ప్రారంభమయ్యే నియోజకవర్గం ఇది. అన్ని రకాల పంటలు సాగు జరుగుతాయి. వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తూ రైతులు, కూలీలు జీవనం సాగిస్తున్నారు.
- విద్యా హబ్‌గా గుర్తింపు సాధించింది. పాఠశాల, ఇంటర్, సాంకేతిక, వైద్య, న్యాయ, వ్యవసాయ విభాగాల విద్యాసంస్థలు స్థానికంగా అందుబాటులో ఉండి విద్యా హబ్‌గా గుర్తింపు పొందింది.

పెనమలూరు నియోజకవర్గంలో జూన్ 2019 నుంచి 2023 వరకూ వివిధ పథకాలతో జరిగిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
వైఎస్సార్ ఆసరా	46,950	169.90
అమ్మ ఒడి	63,153	204.57
అర్చక సాయం	112	5.60(లక్షలు)
జగనన్న చేదోడు	2,705	5.73
కోవిడ్‌సాయం	77,053	7.70
పంటల బీమా	7,579	25.08
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	2,544	6.72
హౌసింగ్ (నేరుగా చెల్లింపు)	4,882	45.55
ఇమామ్స్ సాయం	14	0.70
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	8,320	8.88
జగనన్న తోడు	4,504	19.92(లక్షలు)
జగనన్న వసతి దీవెన	17,643	20.20
జగనన్న విద్యాదీవెన	19,455	66.64
వైఎస్సార్ కల్యాణమస్తు	84	69.50(లక్షలు)
వైఎస్సార్ కాపునేస్తం	2,884	9.54
వైఎస్సార్ లా నేస్తం	20	12.00(లక్షలు)
వైఎస్సార్ మత్స్యకార భరోసా	553	1.31
నేతన్న నేస్తం	44	34.56(లక్షలు)
పాస్టర్లకు సాయం	287	14.35(లక్షలు)
వైఎస్సార్ పింఛను కానుక	43,197	392.40
వైఎస్సార్ రైతుభరోసా	23,238	102.96
సున్నా వడ్డీ పంట రుణాలు	6,639	1.68
సున్నా వడ్డీ	60,367	13.17
వైఎస్సార్ వాహన మిత్ర	2,752	8.16
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	7,348	5.40
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	12,104	55.26
వైఎస్సార్ బీమా	881	13.54
వైఎస్సార్ చేయూత	20,395	89.90
మొత్తం	4,35,707	1190.27

నాన్ డీబీటీ కింద జరిగిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
జగనన్న గోరుముద్ద	12,640	12.52
ఇళ్ల స్థలాలు	16,223	365.12
జగనన్న తోడు(రుణాలు)	7,741	14.41
బియ్యం కార్డులు	84,964	185.59
ట్యాబ్‌లు	1,828	2.41
జగనన్న విద్యా కానుక	12,461	8.84
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	6,077	11.38
మొత్తం	1,41,934	600.30 కోట్లు

ఉయ్యూరు షుగర్ ఫ్యాక్టరీ



పెనమలూరు నియోజకవర్గ ఓటర్ల సమాచారం...


మండలం/మున్సిపాలిటీ	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం ఓటర్లు
వైఎస్సార్ తాడిగడప	67,016	70,282	1	1,37,299
పెనమలూరు	18,625	20,393	0	39,018
కంకిపాడు	26,367	29,042	1	55,410
ఉయ్యూరు పట్టణం	15,927	17,133	0	33,060
ఉయ్యూరు రూరల్	14,414	15,727	0	30,141
మొత్తం	1,42,349	1,52,577	2	2,94,928

పెనమలూరు నియోజకవర్గానికి విజయవాడ తూర్పు, గన్నవరం, పామర్రు నియోజకవర్గాలు సరిహద్దులుగా ఉన్నాయి. విజయవాడ తూర్పుకు సంబంధించి ఆటోనగర్, పటమట, గన్నవరం నియోజకవర్గ పరిధిలోని రామవరప్పాడు, నిడమానూరు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, కేసరపల్లి, పామర్రు నియోజకవర్గంలోని రొయ్యూరు, పమిడిముక్కల మండలం, పెద పారుపూడి మండలాలకు చెందిన గ్రామాలు ఉన్నాయి.



నియోజకవర్గ ఓటర్ల వివరాలు..

- మొత్తం ఓటర్లు: 2,94,928
- పోలింగ్ కేంద్రాలు: 304
- పురుషులు: 1,42,349
- మహిళలు: 1,52,577
- ఇతరులు: 2



వణుకూరులోని జగనన్న కాలనీ



వైఎస్సార్ తాడిగడప మున్సిపల్ కార్యాలయం

బిల్డప్ బొండాను చూసి తమ్ముళ్ల బెంబేలు

- తనని కలిసి మాట్లాడాలంటే వాకీ టాకీ సిబ్బంది అనుమతి తీసుకోవాల్సిందే
- వారు అందులో చెప్పి అటు నుంచి ఓకే అంటేనే ఉమాను కలవాలట
- మనకే ఇలా అవమానాలు ఎదురైతే.. ఇక జనాల పరిస్థితి ఇంకెంత హీనంగా ఉంటుందోనంటూ తమ్ముళ్ల గుసగుస

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆలూ లేదు.. చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం అన్నాడట వెనకటి కొకడు అనే సామెత మాదిరి తయారైంది సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమా తీరు. మొన్న కనీసం ఎన్నికల తేదీ కూడా ప్రకటించకముందే నేను 25 వేల ఓట్లతో గెలిచేశానురా... మీరు నా మెజార్టీ కోసమే పనిచేయండ్రా అంటూ.. అహంతో మాట్లాడిన ఆయన ఇప్పుడు ఏకంగా నేను మినిస్టర్‌ను అయిపోయానని చెప్పుకుంటూ.. ఏకంగా ఓ ఇద్దరు వ్యక్తులకు వాకీటాకీలు ఇచ్చి మరీ తన వద్ద పెట్టుకొని పట్టపగలే 'ఎన్ని కల'లు కంటున్నాడని ఆ పార్టీ కార్యకర్తలే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ బొండా బిల్డప్‌లు చూస్తున్న తెలుగు తమ్ముళ్లంతా ఏమీ లేని ఇప్పుడే ఆయన మనల్ని ఇలా అవమానపరుస్తుంటే రేపు ఎవరైనా జనాలు కలవడానికి వస్తే వారి దుస్థితి ఎలా ఉంటుందోనని గుసగుసలాడుతున్నారు.

మమ్మల్నే ఆపుతారా.. ఎవర్రా మీరంతా...

సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో ఉన్న బొండా ఉమాను కలుసుకునేందుకు టీడీపీ సీనియర్ నాయకులు వెళ్లారు. ఇంతలో వారిని ఓ వ్యక్తి లోపలకు వెళ్లకుండా ఆపేసి మీ పేర్లేంటి.. ఎందుకు కలవాలని నిలదీశారు. దీంతో కంగుతిన్న వారు మమ్మల్నే ఆపుతారా.. ఎవర్రా మీరంతా అంటూ ప్రశ్నించారు. అయినప్పటికీ ఆయన వాళ్లను ససేమిరా వెళ్లనిచ్చేది లేదని చెప్పి వాకీ టాకీలో వచ్చిన వ్యక్తుల పేర్లను బొండాకు చెప్పాడు. కాసేపటికి సరే పైకి పంపండని పిలుపు రావడంతో వారు భవనం పైనున్న బొండా ఉమాను కలుసుకోడానికి వెళ్లాల్సివచ్చింది. ఇలానే వచ్చిన మరి కొంతమంది నాయకులు వాకీ టాకీ బ్యాచ్‌తో గొడవ పడి కొట్టేంత పనిచేశారు.

'బూత్'ల కోసం బూతు పురాణం

ఎన్నికల సమయంలో బూత్‌లు కేటాయించి వారికి కొంత డబ్బులు ఇస్తుంటారు. అయితే టీడీపీ నాయకులు కొందరు ఈ బూత్‌ల కోసం బూతు పురాణాలతో కొట్లాటకు దిగుతున్నారు. ఇన్నేళ్లూ పార్టీలో ఉన్న తమను కాదని కొత్త వారికి ఆ బూత్‌లు అప్పగించడం ఏమిటంటూ 63వ డివిజన్‌కు చెందిన నాయకులు ఘర్షణ పడ్డారు. దాదాపు అన్ని డివిజన్‌లలో ఇదే పరిస్థితి.

నెరవేరిన చిరకాల వాంఛ



విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని మధురానగర్ వాసుల చిరకాల వాంఛ ఫలించింది. ఇక్కడ నిర్మించిన ఆర్‌యూబీతో ట్రాఫిక్ సమస్యలు తొలగడంతో పాటు సెంట్రల్ నియోజకవర్గ రూపురేఖలు మారనున్నాయి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇచ్చిన మాట ప్రకారం ఆర్‌యూబీని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కోవిడ్, సాంకేతిక కారణాలతో పనుల్లో జాప్యం జరిగినప్పటికీ నాణ్యతా ప్రమాణాలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రూ.22 కోట్ల వ్యయంతో పనులు పూర్తి చేశారు. వర్షం వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా మోటార్లు ఏర్పాటు చేయనున్నారు.

– కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రిజర్వేషన్ రద్దు చేస్తామంటున్న బీజేపీకి కొమ్ము కాస్తారా?

- సుజనా విదిల్చే చిల్లర కోసం చిల్లర వేషాలేయొద్దు
- వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు గౌస్ మొహిద్దీన్, జీఎంసీ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్ మొహిద్దీన్, జీఎంసీ బాషా

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకువచ్చిన 4 శాతం రిజర్వేషన్ విధానాన్ని తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని ప్రకటించిన బీజేపీకి కొమ్ము కాసే టీడీపీ మైనార్టీలు సిగ్గుపడాలని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జీఎంసీ బాషా అన్నారు. విజయవాడ విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తొలుత గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఒక్క ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన మంత్రి లేడని, ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా లేడన్నారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి చంద్రబాబు బడ్జెట్‌లో కేవలం రూ.1000 కోట్లు కేటాయిస్తే, సీఎం జగన్ ప్రభుత్వం 2021–22 బడ్జెట్‌లో రూ.3,122 కోట్లు, 2022–23లో రూ.3,662కోట్లు, 2023–24లో రూ.4,203 కోట్లు కేటాయించారని వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో గుంటూరులో జరిగిన నారా హమారా సభలో తమ హక్కుల కోసం ముస్లిం యువకులు ప్రశ్నిస్తే వారిపై దేశ ద్రోహం కేసు బనాయించిన ఘనుడు చంద్రబాబు అన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీకి ముస్లింలను ఓటు అడిగే హక్కు లేదని మండిపడ్డారు. బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరి విదిల్చే చిల్లర కోసం చిల్లర వేషాలు వేయవద్దని టీడీపీ ముస్లిం నాయకులకు హితవు పలికారు.

నిజాయతీపరుడైన ఆసిఫ్‌పై ఆర్థిక నేరగాడు సుజనా పోటీయా?

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జీఎంసీ బాషా మాట్లాడుతూ సామాన్యుడు, నిజాయతీపరుడైన షేక్ ఆసిఫ్‌పై ఆర్థిక నేరగాడైన సుజనా చౌదరిని పోటీ చేస్తున్నాడని, సుజనా చౌదరి నామినేషన్ రోజునే అతని దివాలాకోరు తనాన్ని ఎస్‌బీఐ బయటపెట్టిందని గుర్తు చేశారు. మతతత్వ పార్టీ బీజేపీకి ఓటేస్తే పశ్చిమంలో మతవిద్వేషాలకు నాంది పలికినట్లేనని హెచ్చరించారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ నాయకులు పఠాన్ కరీం ఖాన్, బాషీ, హబీబుల్లా, న్యాయవాది కరిముల్లా, సల్మా సుల్తానా, సయ్యద్ నాసర్, మీరా హుస్సేన్, మంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని హంతకుడని ఎలా ముద్ర వేస్తారు?

షర్మిల, సునీత, బీటెక్ రవిని నిలదీసిన హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి: వైఎస్ వివేకా హత్య ఐదేళ్ల క్రితం జరిగితే ఇప్పుడెందుకు దాని గురించి ఇంతలా మాట్లాడుతున్నారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, వివేకా కుమార్తె సునీత, టీడీపీ నేత బీటెక్ రవిని హైకోర్టు ప్రశ్నించింది. ఈ కేసుకు ఎందుకు మసాలా జోడిస్తున్నారని నిలదీసింది. కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న కేసు గురించి ఎలా మాట్లాడతారని ప్రశ్నించింది. ఓవైపు కేసు విచారణలో ఉంటే నిందితుడిగా ఉన్న వ్యక్తిని హంతకుడని ఎలా చెబుతారని నిలదీసింది. అలాగే హంతకుడిని ముఖ్యమంత్రి రక్షిస్తున్నారని ఎలా అంటారని ప్రశ్నించింది. ఇలా చెప్పడం తప్పు కాదా? నేరపూరిత చర్యల కిందకు రాదా? అని నిలదీసింది. అలాంటప్పుడు కడప కోర్టు అంత అత్యవసరంగా ఎందుకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని బీటెక్ రవి తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు ప్రశ్నించారు. దీనికి హైకోర్టు ఘాటుగా స్పందించింది. కోర్టును నిందించవద్దని హెచ్చరించింది. వివేకా హత్య గురించి మాట్లాడొద్దని, అలాగే తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారం చేయొద్దంటూ ఇచ్చిన



మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ బీటెక్ రవి తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై వీలైనంత త్వరగా విచారణ ముగించాలని కడప జిల్లా కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 8లోపు నిర్ణయం వెలువరించాలని స్పష్టం చేసింది. తద్వారా కడప జిల్లా కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ సునీత, బీటెక్ రవి, షర్మిల దాఖలు చేసిన వ్యాజ్యాలను పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వివేకా హత్య కేసుకు మసాలా ఎందుకు కలుపుతున్నారు..?

ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని హంతకుడని ఎలా ముద్ర వేస్తారని ప్రశ్నించింది. అలా హంతకుడని చెప్పడం కోర్టు ధిక్కారమే అవుతుందని వైఎస్సార్‌సీపీ తరఫు సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి తెలిపారు. తిరిగి ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ఫలానా వ్యక్తి (ముఖ్యమంత్రి) నిందితులను రక్షిస్తున్నారని ఎలా చెబుతారని నిలదీసింది. వివేకా హత్య కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్ పబ్లిక్ డాక్యుమెంట్ అని, తాము మాట్లాడుతోంది అందులో అంశాలనేనని మురళీధరరావు చెప్పారు. ధర్మాసనం స్పందిస్తూ.. వివేకా హత్య కేసుకు ఎందుకు మసాలా కలుపుతున్నారని ప్రశ్నించింది. తాము అలాంటిదేమీ చేయడం లేదని గత ఎన్నికల్లో వివేకా హత్య కేసును నారాసుర రక్తచరిత్ర అంటూ ఎన్నికల్లో వాడుకున్నారన్నారు. అదే తాము మాట్లాడుతుంటే తప్పుపడుతున్నారన్నారు. సునీత తరఫు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో నేతల వ్యాఖ్యలపై అభ్యంతరాలుంటే ఎన్నికల కమిషన్ వద్దకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అలాంటిదేమీ చేయకుండా నేరుగా కోర్టులో వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఈ నెల 8 తేదీలోపు బీటెక్ రవి తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై నిర్ణయం వెలువరించాలని కడప జిల్లా కోర్టును ఆదేశించింది.

సునీత తదితరుల వ్యాజ్యాలకు విచారణార్హతే లేదు..

వైఎస్సార్‌సీపీ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ సునీత, తదితరులు దాఖలు చేసిన వ్యాజ్యాలకు విచారణార్హతే లేదన్నారు. కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ బీటెక్ రవి తదితరులు అక్కడే పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. వాటిపై కడప జిల్లా కోర్టులో విచారణ జరుగుతోందన్నారు. మళ్లీ ఇదే అంశంపైనే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, ఇది ఏమాత్రం సరికాదన్నారు. తాము పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని గడువు ఇవ్వాలని కోరారు. బీటెక్ రవి తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. వైఎస్సార్‌సీపీ పిటిషన్‌లో ప్రతివాదులుగా ఉన్న తమ వాదనలు వినకుండానే కడప జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

అవినాశ్ బెయిల్ రద్దుకు నో

దస్తగిరి పిటిషన్‌ను కొట్టేసిన తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. కిరాయి హంతకుడు (అప్రూవర్, ఏ–4) దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. దస్తగిరి ఆరోపిస్తున్నట్లు అవినాశ్ సాక్షులను బెదిరించినట్లు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేసింది. అవినాశ్ బెయిల్ రద్దుచేయాలని కోరుతూ ఇదే కేసులో నిందితుడైన దస్తగిరి తెలంగాణ హైకోర్టులో మార్చిలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారించిన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం తీర్పు చెప్పారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ అప్రూవర్‌గా మారిన కిరాయి హంతకుడు పిటిషన్ వేయడం వెనుక రాజకీయ దురుద్దేశాలున్నాయని సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి అంతకుముందు వాదనల్లో పేర్కొన్నారు. ఈ అంశంలో ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు ఆదేశాలతో దస్తగిరి ఈ పిటిషన్ దాఖలు చేశాడని చెప్పారు. ఓ పక్క కేసు విచారణ సాగుతుండగా.. కడప నుంచి పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి, వైఎస్ వివేకా కూతురు.. అవినాశ్‌ను హంతకుడిగా చిత్రీకరించేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. ఇక్కడ రెండు ఆరోపణలు చేస్తున్నారని.. ఒకటి దస్తగిరి తండ్రిపై దాడి, రెండోది జైల్లో దస్తగిరిని చైతన్యరెడ్డి కలిశారన్నది.. ఈ రెండు ఆరోపణలకు ఒక్క ఆధారమూ లేదని చెప్పారు. సీబీఐ వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేసిన న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు.

క్లుప్తంగా...

జగన్‌ను జైల్లో పెట్టించిన కాంగ్రెస్‌కు ఎలా మద్దతిస్తారు?

సునీతను ప్రశ్నించిన మహిళా ఆర్థిక సంస్థ మాజీ చైర్మన్ క్రిష్ణమ్మ

పోరుమామిళ్ల : ఈ ఎన్నికల్లో వైఎస్ కుమార్తె షర్మిలకు మద్దతివ్వాలని, అవినాష్‌రెడ్డిని ఓడించాలని.. కాంగ్రెస్ విజయానికి సహకరించాలంటున్న వివేకా కుమార్తె సునీతకు చుక్కెదురైంది. పోరుమామిళ్లలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మహిళానేత, మహిళా ఆర్థిక సంస్థ మాజీ చైర్మన్ క్రిష్ణమ్మ ఇంటికి వెళ్లి సునీత మద్దతు కోరారు. ముందుగా వివేకాను తలచుకుని క్రిష్ణమ్మ కన్నీరు పెట్టుకున్నారు. సునీతకు జవాబిస్తూ వైఎస్ కుటుంబంతో 4 దశాబ్దాలుగా తమకు అనుబంధం ఉందన్నారు. 16 నెలలు జగన్‌ను జైల్లో పెట్టించిన కాంగ్రెస్‌ను తిట్టిన షర్మిల.. ఈ రోజు అదే పార్టీలో ఎలా చేరిందంటూ సునీతను ప్రశ్నించారు. చంద్రబాబు మాటలు వల్లెవేయడం ఎంతవరకు సబబని నిలదీశారు. క్రిష్ణమ్మ మాటలకు సమాధానం చెప్పలేక సునీత వెళ్లిపోయారు.

కడప టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డిపై కేసు

కడప అర్బన్: వైఎస్ వివేకా హత్యకేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కడప అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి సోషల్ మీడియాలో వీడియోను ప్రచారం చేసేందుకు విడుదల చేశారు. దీనిపై డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, సెక్టార్–8 బృందం అధికారి వెంకటాచలం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) నిబంధనల ఉల్లంఘన కింద కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. కడప వన్‌టౌన్ ఎస్‌ఐ రంగస్వామి కేసు నమోదు చేశారు.

ఎన్ని ఓట్లు వచ్చాయన్నది కాదు.. దమ్ముగా పార్టీ నడిపాం

గిద్దలూరు, కైకలూరు సభల్లో పవన్‌కళ్యాణ్



బేస్తవారిపేట/కైకలూరు : తాను దశాబ్దకాలంగా పార్టీ నడుపుతున్నానని.. బలం ఉండి, గిద్దలూరులో ఒంటరిగా పోటీచేసే సత్తా ఉండి కూడా, ఐదు కోట్ల ప్రజల కోసం తగ్గి టీడీపీ అభ్యర్థిని పెట్టానని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ టీడీపీ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు అందరూ భయపడుతుంటే తాను రాజమండ్రి జైలుకు వెళ్లి మద్దతిచ్చానన్నారు. తనకు ఒంటరిగా పోటీచేసే సత్తాలేక కాదని, పోయినసారే 153 స్థానాల్లో పోటీచేశామని.. ఎన్ని ఓట్లు వచ్చాయని కాదు, దమ్ముగా పార్టీని నడిపామా లేదా అన్నది ముఖ్యమని ఆయనన్నారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు, ఏలూరు జిల్లా కైకలూరులో శుక్రవారం పవన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తాను నెల్లూరులో చదివానని.. ఒంగోలు, కనిగిరిలో పెరిగానని.. 7, 8వ తరగతి నుంచి మాగుంట శ్రీనివాసులరెడ్డి తెలుసునని.. చాలాసార్లు తన తండ్రితో కలిసి మాగుంటను కలిశానని చెప్పుకున్నారు. కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్‌ను ఉద్దేశిస్తూ.. 'దూల ఎక్కి కొట్టుకుంటున్నాడు' అంటూ నోటికొచ్చినట్టు మాట్లాడారు. గిద్దలూరు సభలో పవన్ అభ్యర్థుల పేర్లు మర్చిపోయి గందరగోళంగా మాట్లాడారు.

అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన సీఎం జగన్

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

చాపాడు/మైదుకూరు/ఖాజీపేట/దువ్వూరు/కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : సీఎం జగన్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, రైతులను పట్టించుకోలేదని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయలేదని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. శుక్రవారం ఆమె వైఎస్సార్ జిల్లా చాపాడు, మైదుకూరు, ఖాజీపేట, దువ్వూరులలో రోడ్ షోలో మాట్లాడారు. ఏటా సంక్రాంతికి జాబ్ కేలండర్ అని చెప్పి.. ఉద్యోగాలివ్వలేదని, ఎన్నికలకు ముందు డీఎస్సీ ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో నాసిరకమైన మద్యం అమ్ముతున్నారని.. ఫలితంగా 25 శాతం మంది ప్రజలు అనారోగ్యం పాలయ్యారని ఆరోపించారు. కడపలోని డీసీసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయడం లేదన్నారు.

వైఎస్ భాస్కర్‌రెడ్డికి బెయిల్

- తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు
- పలు షరతుల విధింపు
- హియర్ సే ఎవిడెన్స్ సాక్ష్యంగా చెల్లదు
- గూగుల్ టేకవుట్ ప్రామాణికం కాదని ఆ సంస్థే చెబుతుంది
- వాదనలు వినిపించిన పిటిషనర్ తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి
- కావాలనే సీబీఐ విచారణను జాప్యం చేస్తోంది
- ఈ వాదనలతో ఏకీభవించిన కోర్టు.. బెయిల్‌కు అంగీకారం
- ఇదే కేసులో గజ్జల ఉదయ్‌శంకర్‌రెడ్డి, సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్లు కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా పలు షరతులు విధించింది. ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా ఏపీలోకి ప్రవేశించొద్దని ఆదేశిస్తూ కోర్టుకు పాస్‌పోర్టు, రూ.2 లక్షల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని, ఇద్దరు ష్యూరిటీలు ఇవ్వాలని సూచించింది. ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య హైదరాబాద్ సీసీఎస్‌లో హాజరు కావాలని ఆదేశించింది. విచారణలో జోక్యం చేసుకోవద్దని, సాక్షులను బెదిరించొద్దని ఆదేశించింది. వైఎస్ వివేకా హత్య కేసులో గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి, సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. సీబీఐ దర్యాప్తు పక్షపాత వైఖరితో సాగుతోందని, కావాలనే ఈ కేసులో తమను ఇరికించారని తమకు వ్యతిరేకంగా సాక్ష్యం లేదని.. బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డితో పాటు సునీల్ యాదవ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై



భాస్కర్‌రెడ్డి

విచారించిన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం తీర్పు చెప్పారు.

అరెస్టు సమర్థనీయం కాదు

నాకు మరొకరు చెప్పారని సాక్ష్యం చెప్పడం (హియర్ సే ఎవిడెన్స్) చట్టప్రకారం సాక్ష్యంగా చెల్లదని వైఎస్ భాస్కర్ రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. గూగుల్ టేకవుట్ ప్రామాణికమని ఆ సంస్థే ధృవీకరణ ఇవ్వదన్నారు. ఇలాంటి సాక్ష్యాలతో వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి అరెస్టు సమర్థనీయం కాదన్నారు. 'మూడో చార్జిషీట్ (ఈ కేసులో 2వ మధ్యంతర చార్జిషీట్) దాఖలు చేసే వరకు పిటిషనర్లపై ఎలాంటి ఆరోపణలు లేవు. ఆ తర్వాత నిందితులుగా చేర్చడంలో కుట్ర కోణం దాగి ఉంది. వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించినవారు కిరాయి హంతకుడు దస్తగిరి (ఏ–4) యథేచ్ఛగా తిరగడానికి మాత్రం సహకరిస్తున్నారు. హత్య వెనుక వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి ఉన్నారని గంగిరెడ్డి తనకు చెప్పారని దస్తగిరి వాంగ్మూలం ఇచ్చినా గంగిరెడ్డి తాను అలా చెప్పలేదని పేర్కొన్నారు. దస్తగిరి చెప్పిన విషయానికి అంత ప్రాధాన్యమిస్తున్న సీబీఐ ఇతరుల వాంగ్మూలాలను మాత్రం పట్టించుకోవడం లేదు' అని నిరంజన్ రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు.

తండ్రి తన కుమారుడికి ఫోన్ చేయడం కూడా కుట్రేనా?

'రెండున్నర నెలలు ఢిల్లీలో సీబీఐ కస్టడీలో ఉన్నానని దస్తగిరి చెప్పాడు. ఆ తర్వాతే అప్రూవర్‌గా మారి పిటిషనర్ల పేర్లు చెప్పాడు. దస్తగిరి బెయిల్‌కు సీబీఐ పూర్తిగా సహకరించింది. నాటి దర్యాప్తు అధికారి రాంసింగ్‌పై తీవ్ర ఆరోపణలున్నాయి. ఈయనపై సుప్రీంకోర్టులో పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. దీంతో అత్యున్నత న్యాయస్థానం కేసు దర్యాప్తు బాధ్యత నుంచి ఆయనను తప్పించి.. మరొకరిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. హత్య జరిగిన రోజు వైఎస్ అవినాశ్‌రెడ్డికి ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి ఫోన్ చేయడాన్ని కూడా సీబీఐ కుట్ర కోణంగా పేర్కొనడం సమంజసం కాదు. తండ్రి తన కుమారుడికి ఫోన్ చేయడం కూడా కుట్రేనా? కావాలనే ట్రయల్ కోర్టులో సీబీఐ విచారణను సాగదీస్తోంది' అని నిరంజన్‌రెడ్డి న్యాయమూర్తికి నివేదించారు.

వీటిని పరిగణనలోకి తీసుకుని బెయిల్ ఇవ్వాలి..

''పిటిషనర్లపై ఉన్నది ఆరోపణలు మాత్రమే సాక్ష్యాలు లేవు. వైఎస్ భాస్కర్‌రెడ్డి వయసు 72 ఏళ్లు. ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోకపోవడంతో ట్రయల్ కోర్టు పలుమార్లు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అత్యవసరమైతే 30 నిమిషాల్లో నిపుణులైన వైద్యుల వద్దకు చేర్చాల్సి ఉంటుంది. జైలులో ఉంటే అదెలా సాధ్యం? ఆయనకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు? ఆయన ఏడాదిగా జైలులో ఉంటున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని భాస్కర్‌రెడ్డితోపాటు ఉదయ్‌కుమార్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేయాలి. ఇదే హైకోర్టు శివశంకర్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది. వీరికి కూడా అదే వర్తిస్తుంది. సరైన సాక్ష్యాలు లేనప్పుడు నెలల తరబడి నిందితులను జైలులో ఉంచడం వారి హక్కులను హరించడమే అవుతుందని సుప్రీంకోర్టు చెప్పింది' అని నిరంజన్‌రెడ్డి గుర్తు చేశారు. ఆ తర్వాత సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు పూర్తి కావడంతో న్యాయమూర్తి గత నెలలో తీర్పును రిజర్వ్ చేసి శుక్రవారం తీర్పు చెప్పారు.

పింఛన్లపై లోకేశ్ మాట్లాడొద్దన్నాడు

ఏం మాట్లాడినా నెగిటివ్ అవుతుందన్నాడు • గుంటూరు ఎంపీ అభ్యర్థి అనుచరుడితో టీడీపీ కార్యాలయ ఉద్యోగి సంభాషణ లీక్

సాక్షి, అమరావతి :ఇంటి వద్ద పింఛన్ల పంపిణీని అడ్డుకుని వృద్ధులను 45 డిగ్రీల ఎండలో నడిరోడ్డున పడేసిన టీడీపీ ఇప్పుడు దానిపై ఏంచేయాలో తెలీక లబోదిబోమంటోంది. టీడీపీ అభ్యర్థులు, నేతలను పింఛనుదారులు ఎక్కడికక్కడ నిలదీస్తుండడం, తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టడంతో వారు బెంబేలెత్తిపోతున్నారు. ఈ వ్యవహారంలో టీడీపీ దొంగ రాజకీయం బయటపడిపోవడంతో ఏం మాట్లాడొద్దని చంద్రబాబు తనయుడు లోకేశ్‌బాబు పార్టీ కేడర్‌కు సూచించారు. దీనిపై ఏదో ఒకటి చేయాలని పార్టీ అభ్యర్థులు టీడీపీ కార్యాలయంలో పనిచేసే వారికి ఫోన్లుచేసి బతిమలాడుతున్నారు. కానీ, వారు తామేం చేయలేమని, తప్పు టీడీపీదేనని, దీనిపై ఏం మాట్లాడకుండా ఉండాలని చెబుతూ చేతులెత్తేశారు. దీంతో ఎల్లో మీడియా, సోషల్ మీడియా వృద్ధుల ఏడుపులపై దొంగ ప్రచారానికి దిగింది. చంద్రబాబును, టీడీపీని అడ్డగోలుగా వృద్ధులు తిడుతుంటే దాన్ని వక్రీకరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నట్లు చిత్రీకరించి తాము దిగజారుడులో మాస్టర్స్‌మని నిరూపించుకున్నారు. ఈ నేపథ్యంలో.. గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రధాన అనుచరుడు ఒకరు టీడీపీ కార్యాలయ ముఖ్య ఉద్యోగితో మాట్లాడుతున్న సంభాషణ వింటే (ఆడియో లీకైంది) పింఛన్లపై టీడీపీ ఏడుపు ఏమిటో అర్థమవుతుంది.

ఇదీ సంభాషణ..

పెమ్మసాని అనుచరుడు : హలో.. ఏమ్మా రఘు ఎక్కడున్నావ్?

టీడీపీ కార్యాలయ ఉద్యోగి : అన్నా ఇక్కడే అన్నా.. ఆఫీసులో

అనుచరుడు : ఏమ్మా ఎట్లా ఉన్నావు?

ఉద్యోగి : బానే ఉన్నా.. మీరెట్లా ఉన్నారన్నా..

అనుచరుడు : బావున్నా.. ఏంలేదు పెన్షన్ ఇష్యూ బాగా వైరల్ అయిపోతోందంట. బ్యాడ్ నేమ్ వస్తోంది. మార్నింగ్ కూడా మన పెమ్మసాని గారు క్యాంపెయిన్‌కి వెళ్లినప్పుడు ఎక్కడపడితే అక్కడ ముసలోళ్లు గోలచేస్తూ సార్ దగ్గరికి వచ్చి నిలదీస్తున్నారు. ఆయన ఫుల్ హార్ష్ మీద ఉన్నాడు. ఏంటసలు.. వీళ్లు ఏం చేస్తున్నారో కనుక్కోమన్నాడు. అందుకే కాల్‌చేశా..

ఉద్యోగి : అన్నా నాకర్థమైంది. నాకూ ఉదయం నుంచి ఇదే విషయం మీద 40–50 కాల్స్ వచ్చాయి.

అనుచరుడు : ఎందుకని మీరేం చేయలేకపోతున్నారు? అసలు ఏంటిది?

ఉద్యోగి : చెప్పి చెప్పి విసిగిపోయామన్నా..

అనుచరుడు : ఏంది విసిగిపోయేది.. వాళ్లేమో మన మీద అంత అగ్రెసివ్‌గా ఉంటున్నారు. నిమ్మగడ్డ రమేష్ మనోడే అంటున్నారు. దాని మీద మనం ఏమీ కౌంటర్ ఇవ్వలేకపోతున్నాం ఎందుకని?

ఉద్యోగి : కౌంటర్ కాదన్నా.. అసలు విషయం ఏంటంటే.. యాక్చువల్‌గా మిస్టేక్ మనదే ఉంది. పబ్లిక్ ఏమనుకుంటున్నారంటే.. నిమ్మగడ్డ రమేష్‌తో పెద్దాయనే (చంద్రబాబు) ఇదంతా చేయించారు. పిటిషన్ వేయించి ఎన్నికల కమిషన్‌తో ఇట్లా చేయించారని బాగా స్ప్రెడ్ అయిపోయింది.

అనుచరుడు : దానిపై కౌంటర్ ఇవ్వలేమా?

ఉద్యోగి : దీని గురించి లోకేశ్ అన్నకు చెప్పాం. మీరెవ్వరూ దీనిపై ఎట్టి పరిస్థితుల్లో రెస్పాండ్ అవ్వొద్దు అని చెప్పారు. 60–70 నియోజకవర్గాల నుంచి దీనిపై కాల్స్ వచ్చాయి.

అనుచరుడు : కాదమ్మా రఘు.. ఇప్పటికే మన పరిస్థితి వరస్ట్‌గా ఉంది. పెమ్మసాని గారు ఇంత ఖర్చుపెట్టి కష్టపడుతున్నారు.. ఆయనే అన్నాడు.. దీనిపై ఇంతమంది ఇలా అడుగుతున్నారు.. మనవాళ్లు ఏం చేస్తున్నారో కనుక్కోమన్నారు.

ఉద్యోగి : కాదన్నా.. ఇది ఒక పెమ్మసాని గారి విషయం కాదు. స్టేట్ మొత్తం ఇది ఉంది. లోకేశ్ గారు దీనిపై మాట్లాడవద్దన్నారు. ఒకవేళ దీనిపై రెస్పాండ్ అయితే మళ్లీ మన మీదకే మిస్‌ఫైర్ అవుతుంది, ఏ యాక్షన్ వద్దు అని చెప్పారు.

అనుచరుడు : డ్యామేజి కంట్రోల్ ఎట్లా మరి? ఏం చేస్తారో ప్లాన్ ఏమీ చెప్పలేదా?

ఉద్యోగి : లోకేశ్ అన్న చెప్పింది ఏమిటంటే అవసరమైతే పార్టీ వాళ్లతో ప్రెస్‌మీట్లు పెట్టిద్దాం. ఇప్పుడు మాత్రం ఇన్వాల్వ్ అవ్వొద్దని చెప్పారు. అందుకే మన వాళ్ల నుంచి దీనిపై ఒక్క పోస్టు కూడా రాలేదు.

అనుచరుడు : ఏదో ఒకటి చేయండయ్యా.. ఇప్పటికే మనవాళ్లు చాలా డీమోరలైజ్ అయిపోయారు. లక్ష మంది అట్లా ఉంటే పోనీలే అనుకోవచ్చు. 72-73 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. అందులో మనకి ఇంకో 10 రోజులే ఉంది. మనకి ఏదైనా తేడాపడితే..

ఉద్యోగి : చూసుకుంటారన్నా మనవాళ్లు..

అనుచరుడు : కొంచెం యాక్టివ్‌గా ఉండండి..

ఉద్యోగి : కేడర్ డీమోరలైజ్ అవకుండా చూడాలన్నా.. అది మీరే చేయాలి.

అనుచరుడు : నీకూ తెలుసు. పెమ్మసాని గారు ఎంత ఖర్చు పెడుతున్నారు, ఏం చేస్తున్నారని.. మాకు మీరు కొంచెం సపోర్ట్ చేయండి.

ఉద్యోగి : ముసలోళ్లతో ఏముంది గానీ.. రెండు, మూడ్రోజులైతే అయిపోతుంది..

పెమ్మసాని అనుచరుడు : 2, 3 రోజులు కాదు. ఇంకా పది రోజులే టైముంది. ఏం చేయాలో?

ఉద్యోగి : లోకేశ్ అన్న ప్రెస్‌మీట్లు పెట్టిద్దామన్నారు. మాట్లాడిస్తారు.

వివేకా హత్యకేసులో కోర్టు ఉత్తర్వులు లెక్కచేయడంలేదు

- ప్రతివాదులపై చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కోర్టును ఆశ్రయించిన వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ సురేష్‌బాబు

కడప సెవెన్‌రోడ్స్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు హైదరాబాద్ నాంపల్లి సీబీఐ కోర్టులో విచారణలో ఉన్నందున ఎవరూ దానిపై ఆరోపణలు, విమర్శలు చేయరాదంటూ గత నెల 16వ తేదీ వైఎస్సార్ జిల్లా న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ప్రతివాదులు లెక్కచేయడంలేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కె.సురేష్‌బాబు వైఎస్సార్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కోర్టును ఆశ్రయించారు. ఈ ఉత్తర్వులపై పూర్తి అవగాహన ఉన్నప్పటికీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, డాక్టర్ నర్రెడ్డి సునీత, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని తెలిపారు. కడప లోక్‌సభ స్థానం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డిని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్న వీరిని మూడునెలలకు మించకుండా నిర్బంధంలో ఉంచాలని సురేష్‌బాబు తన న్యాయవాదులు ఎస్.నాగిరెడ్డి, కె.సుదర్శన్‌రెడ్డి ద్వారా కోర్టును అభ్యర్థించారు.

చెప్పుతో కొడతా!

మహిళపై విరుచుకుపడ్డ టీడీపీ నేత గోరంట్ల బుచ్చయ్య

రాజమహేంద్రవరం రూరల్:'జోడిచ్చుకుని కొడతా' నంటూ ఓ మహిళపై రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి విరుచుకుపడ్డారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 27వ డివిజన్ దుర్గాలమ్మ గుడి వీధిలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ డివిజన్‌లో తన పెద్ద కుమార్తె కంఠంనేని శిరీష, టీడీపీ శ్రేణులతో కలిసి గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దుర్గాలమ్మ గుడి వీధిలో ప్రచారం చేస్తున్న సమయంలో పిల్లల నాగమణి అనే మహిళ 'ఎన్నికలప్పుడే మీకు ప్రజలు గుర్తొస్తారా?' అని మహిళ నిలదీసింది. 'ఓయ్ అమ్మాయ్.. ఆగు' అంటూ గోరంట్ల ఆమెను అడ్డుకోబోయారు. అయినా.. నాగమణి నిలదీయడం ఆపకపోవడంతో నిగ్రహం కోల్పోయిన గోరంట్ల ఒక్కసారిగా కోపోద్రిక్తుడై 'జోడిచ్చుకుని కొడతాను' అంటూ రెచ్చిపోయారు. దీంతో అక్కడున్న మహిళలంతా ఒక్కసారిగా తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్కడి నుంచి పార్టీ శ్రేణులతో కలసి బుచ్చయ్య వెనుతిరిగారు.

ఓటమి భయంతోనే ఫ్రస్ట్రేషన్

పదేళ్లుగా రాజమండ్రి రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రజల సమస్యలు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఆయన ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి స్పందన కరువవుతోంది. దీంతో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులందరినీ తాను తిరిగే గ్రామం లేదా డివిజన్‌కు తీసుకుని వచ్చి ప్రచారం చేస్తున్నారు. ఒకవైపు ప్రజల నుంచి స్పందన లేకపోగా.. ప్రచారంలో మహిళలు నిలదీస్తుండటంతో గోరంట్ల ఫ్రస్ట్రేషన్‌కు గురవుతున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.



గోరంట్లను నిలదీసిన ప్రజలపై దౌర్జన్యానికి దిగుతున్న టీడీపీ నేత కురుకూరి కిషోర్

అడుగడుగునా నిలదీతలే

అంతకు ముందు కూడా ఓ ఇంటివద్ద నలుగురు వ్యక్తులు.. 'ఎన్నికల సమయంలోనే తమరికి ప్రజలు గుర్తొస్తారా' అంటూ గోరంట్లను నిలదీశారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా పట్టించుకోలేనప్పుడు ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. దీంతో కోపోద్రిక్తుడైన గోరంట్ల.. తమకు ఓట్లు వెయ్యవద్దని నోరు పారేసుకున్నారు. అలాంటప్పుడు ప్రచారం ఎందుకు చేస్తున్నారని అక్కడి వారు అడగడంతో గోరంట్ల, ఆయన అనుచరుడు కురుకూరి కిషోర్ ప్రజలపై దౌర్జన్యానికి దిగారు. వారిని స్థానిక నేతలు, టీడీపీ నాయకులు పక్కకు తీసుకుని వెళ్లడంతో వివాదం సద్దుమణిగింది. గోరంట్ల కుమార్తె శిరీష 27వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించినప్పుడు అక్కడి మహిళలు నిలదీయడంతో ఆమె అక్కడి నుంచి జారుకున్నారు.

సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు అందించాలి

- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు
- నెల్లూరులో బాబు సమక్షంలో పవన్ మళ్లీ సీఎం జగన్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు

మార్కాపురం/నెల్లూరు సిటీ : రాష్ట్రంలో 1.50 లక్షల మంది సచివాలయ ఉద్యోగులున్నారని.. ఒక్కొక్కరు 40 మందికి చొప్పున పింఛన్లను ఇంటి వద్దనే ఇవ్వవచ్చునని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు చెప్పారు. కానీ, ఈ ముఖ్యమంత్రి ఇంటి వద్ద పింఛను ఇవ్వకుండా, సచివాలయం ద్వారా ఇవ్వకుండా ఎండల్లో ముసలివాళ్లను బయటకు తిప్పి చంపేసే పరిస్థితికి వచ్చారని ఆరోపించారు. ప్రకాశం జిల్లా పొదిలిలో శుక్రవారం ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ ఎప్పుడూ సానుభూతి కోసం పాకులాడతారని విమర్శించారు. అప్పట్లో వెలుగొండను ప్రారంభించింది తానేనని.. తాను సీఎంగా ఉండి ఉంటే 2020లో దీనిని పూర్తిచేసి ఈపాటికే నీళ్లు ఇచ్చుండేవాడినన్నారు. జగన్ ప్రాజెక్టును ప్రారంభించాడు కానీ నీళ్లులేవన్నారు. సీఎం ఒక అహంకారి, ఒక సైకో, ఒక విధ్వంసకారుడు అంటూ వ్యాఖ్యానించారు. ఇక చంద్రబాబు సభ ఫ్లాప్ షోగా మిగిలిపోయింది. సమీప గ్రామాల నుంచి బస్సులు, ట్రాక్టర్ల ద్వారా జనాన్ని తరలించినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రజలు రాకపోవడంతో బాబు స్థానిక టీడీపీ నేతలపై



అసహనం వ్యక్తంచేశారు. ఆయన మాట్లాడుతుండగానే అందరూ వెనుదిరిగారు.

నెల్లూరులో బాబు, పవన్ రోడ్‌షో..

మరోవైపు.. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇద్దరూ నెల్లూరు సిటీలో రోడ్‌షో నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ.. మూడు పార్టీలు కలిసిన తరువాత ఎవడైనా ఉంటాడా.. అడ్డం వస్తే తొక్కుకుంటూ పోతామన్నారు. వైఎస్సార్‌సీపీని చిత్తుచిత్తుగా ఓడించి బంగాళాఖాతంలో వైసీపీకి అంత్యక్రియలు చేయాలన్నారు. పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ.. తాము దండంపెట్టి మాట్లాడుతుంటే.. జగన్ సిద్ధమా అని భయపెట్టే విధంగా మాట్లాడుతున్నారన్నారు. గ్లాసు పగిలేకొద్దీ పదునెక్కుతుంది.. నమస్కారం పెట్టడం నేర్చుకో జగన్ అంటూ ముఖ్యమంత్రిని బెదిరించే ధోరణిలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన మొదట్లో ఇతర రాష్ట్రాలకు పారిపోతామని చాలామంది అన్నారని.. కష్టమొచ్చినా, జగన్ వచ్చినా, జగన్ అమ్మమొగుడు వచ్చినా పారిపోం అని అన్నారు. ఇక్కడ కూడా చంద్రబాబు మాట్లాడుతుండగానే జనం వెళ్లిపోవడం గమనార్హం. పవన్ ఏం మాట్లాడుతున్న తీరుపై ప్రజలు అసహనం వ్యక్తంచేశారు.

కుటుంబంలో చిచ్చుపెట్టారు

అయినా భయపడేది లేదు

- కుమార్తెతో ఆమె మామ, జనసేన నేతలు మాట్లాడించారు
- పెళ్లయ్యాక మెట్టినింటి మనిషి
- జగన్‌కు తోడుగా ఉండటానికే వైఎస్సార్‌సీపీలో చేరా
- సీఎం సంక్షేమ పథకాలు పేదలకు ఊపిరి పోశాయి
- కుమార్తె క్రాంతి విడుదల చేసిన వీడియోపై ముద్రగడ



సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాజకీయాల కోసం కుటుంబంలో చిచ్చుపెట్టి తనను బెదిరిస్తే బెదిరేది లేదని కాపు ఉద్యమ నేత, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా కుమార్తె క్రాంతి విడుదల చేసిన వీడియోపై ఆయన శుక్రవారం పిఠాపురంలో మీడియా సమావేశంలో స్పందించారు. వివాహమైన రోజు నుంచే తన కుమార్తె మెట్టినింటి మనిషయ్యిందన్నారు. పెళ్లి గాక ముందు వరకే తమ మనిషి అని, ఇప్పుడు మెట్టినిల్లే ఆమెకు ప్రపంచమని పేర్కొన్నారు. తన కుమారులు మాత్రమే తన మనుషులన్నారు. తన కుమార్తె మామ, జనసేన నాయకులు ఆమెతో తనపై దుష్ప్రచారం చేయిస్తున్నారని, ఎవరు బెదిరించినా బెదిరేది లేదని చెప్పారు. ఇలా తిట్లు తిట్టించడం వల్ల తనకు బాధ లేదని, అయితే రాజకీయం రాజకీయమే అని తెలిపారు. కుటుంబంలో చిచ్చుపెట్టిన వారికి ఆ భగవంతుడే సరైన సమయంలో సరైన శిక్ష విధిస్తాడని చెప్పారు. తాను 2009లో ఎమ్మెల్యేగా పోటీచేసినప్పుడు కూడా తన కుమార్తె మామ ప్రజారాజ్యం పార్టీలో పని చేశారని గుర్తుచేశారు. నాటినుంచి నేటివరకు వారు తనకు ఏ విషయంలోను, ఏ రోజూ సహకరించలేదని తెలిపారు.

పదవుల కోసం ఏనాడూ పాకులాడలేదు

తాను 40 సంవత్సరాలకుపైగా రాజకీయాల్లో ఉన్నానని, ఇటువంటి బెదిరింపులు, కుట్రలను ఎదుర్కోవడం తనకు కొత్తేమీ కాదని చెప్పారు. రాజకీయాల్లో ఇటువంటివన్నీ అలవాటయ్యాయన్నారు. తన తండ్రి ఎప్పుడూ ధైర్యంగా, నిజాయితీగా ఉండాలని ఇచ్చిన పిలుపుతో ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకుని రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. అందుకే తాను ఈ రోజుకీ ఎవ్వరికీ భయపడకుండా, ఎవరి చేతి కిందా బతకకుండా ఉంటున్నానన్నారు. తాను ఎప్పుడూ ఎవరి దగ్గరకు వెళ్లి పదవులు కావాలని, ఉన్నతస్థానాలు, హోదాలు కల్పించాలని అడగలేదని చెప్పారు. పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పిఠాపురంలో పవన్‌కళ్యాణ్‌ను ఓడించాలని తాను వైఎస్సార్‌సీపీలో చేరినప్పటి నుంచీ తనవంతు కష్టపడుతూనే ఉన్నట్లు తెలిపారు. ఈ సమయంలో ఇటువంటి కుట్రలు పన్నడం రాజకీయాల్లో సహజమేనన్నారు.

ఇటువంటి పథకాలు ఇచ్చే నాయకుడు భవిష్యత్‌లో పుట్టడు

తాను ఒకసారి వైఎస్సార్‌సీపీలో చేరాక, ఇక పక్కచూపులు చూసేదిలేదని ముద్రగడ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా ఉండటానికే తాను రాజకీయాల్లోకి తిరిగి వచ్చానన్నారు. ఎవరెన్ని అనుకున్నా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పునరుద్ఘాటించారు. జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరుపేదలకు, మధ్యతరగతి వర్గాలకు ఊపిరి పోస్తున్నాయన్నారు. వైఎస్ తనయుడు జగన్ పేదల పెన్నిధిగా తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారని తెలిపారు. రాజశేఖరరెడ్డి కుటుంబం నిత్యం పేదల కోసం పాటుపడేదన్నారు. పేదల కోసం ఇటువంటి సంక్షేమ పథకాలు అమలు చేసే నాయకుడు భవిష్యత్తులో పుట్టడన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, పారదర్శక పాలన కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజల కోసం నిత్యం పరితపించే జగన్‌కు తోడుగా అన్ని వర్గాలు నిలవాలని కోరారు. కూటమి ప్రజాసేవ కోసం వస్తున్నది కాదని, కేవలం అధికార దాహం తీర్చుకునేందుకు మాత్రమే వస్తోందని చెప్పారు. షూటింగ్‌ల కోసమే పవన్‌కు ఎమ్మెల్యే పదవి కావాలని ఎద్దేవా చేశారు. కాపులు అంటే నోట్ల కోసం అమ్ముడుపోయే కులమని పవన్‌కళ్యాణ్ అన్న మాటలు గుర్తుంచుకోవాలని ఆయన కోరారు.

158 ట్యూటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో కొత్తగా ప్రారంభించిన 5 వైద్య కళాశాలల్లో 158 ట్యూటర్ పోస్టుల నియామకానికి శుక్రవారం ఏపీ మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ జారీ చేసింది. కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టుల భర్తీ చేపట్టనున్నట్టు బోర్డ్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పూర్తి నోటిఫికేషన్‌ను https://dme.ap.nic.in/ https://apmsrb.ap.gov.in./msrb/ ల్లో అందుబాటులో ఉంచామన్నారు. అర్హులైనవారు https://dme.ap.nic.in లో ఈ నెల 4–15వ తేదీలోగా సమర్పించాలని పేర్కొన్నారు.

పారదర్శక ఎన్నికలకు సమాయత్తంకండి

ఈసీ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌వ్యాస్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికలకు సమాయత్తం కావాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను, ఎస్పీలను భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌వ్యాస్ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, ఎన్నికల సాధారణ, పోలీస్, వ్యయ పరిశీలకులతో న్యూఢిల్లీ నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నితీష్ వ్యాస్ మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ హింసకు, అల్లర్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించాలని చెప్పారు.

241 మంది ఎస్ఆర్‌ల నియామకానికి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2024–25 విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రారంభిస్తున్న పాడేరు, మార్కాపురం, మదనపల్లె, ఆదోని, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 20 స్పెషాలిటీల్లో 241 మంది సీనియర్ రెసిడెంట్ (ఎస్ఆర్)ల నియామకానికి డీఎంఈ డాక్టర్ నరసింహం శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 5 నుంచి 12 మధ్య ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి 2024

జైత్రయాత్ర

శనివారం
మే, 4





గుసగుస

పిక్చర్ పర్‌ఫెక్ట్



మీరు ఎంత ఆఫ్ సెంటరున్నా.. 'ఫ్యాన్'ఎప్పుడూ సెంటరాఫ్ అట్రాక్షన్‌గానే ఉంటుంది.. పిక్చర్ పర్‌ఫెక్ట్! టీవీ చానళ్లు, యూట్యూబ్, సోషల్ మీడియాలో ఈ స్లోగన్ వింటున్న ప్రతిసారీ టీడీపీ, జనసేన నేతలు సూపర్ స్పీడ్‌తో తిరుగుతున్న ఫ్యాన్ కింద కూర్చున్నా.. లోలోపల కుతకుత ఉడికిపోతూ.. చెమటలు కక్కుతున్నారట. ఇదేదో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార స్లోగన్ అనుకునేరు సుమా..! అదేం కాదు. మార్కెట్లో ఓ ఫ్యాన్ కంపెనీ యాడ్‌లో వస్తున్న స్లోగన్. వేసవి మండుటెండలు కావడంతో వాటి కొనుగోళ్ల సీజన్ కూడా ఇదే. దీంతో నెల రోజులుగా ఈ అడ్వర్టైజ్‌మెంట్ అన్ని భాషల్లో, అన్ని చానళ్లలో వస్తోంది. దీన్ని చూసిన ప్రతి సారీ టీడీపీ, జనసేన శ్రేణులకు మంటెక్కుతోందట.

పవ'నిల్'



రౌండప్ చేసి కన్ఫ్యూజ్ చేయొద్దు.. కన్ఫ్యూజన్‌లో ఎక్కువ కొట్టేస్తాను.. సూపర్ స్టార్ మహేష్‌బాబు బిజినెస్‌మెన్ సినిమా డైలాగ్ ఇది. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ మాత్రం కన్ఫ్యూజన్‌లో నిజాలు కక్కేస్తున్నారు. అదే ఇపుడు పవన్ ఫ్యాన్స్‌ను తీవ్ర గందరగోళంలోకి నెట్టేస్తోందట. విశాఖ పర్యటనలో ఆయన మాట్లాడుతూ.. తను గెలుస్తానో.. లేదో? పదవి వస్తుందో.. రాదో? అన్న వ్యాఖ్యలు ఇప్పటికే పుట్టి మునిగిన పార్టీని భూస్థాపితం చేసేలా ఉన్నాయని గగ్గోలు పెడుతున్నారు. పైపెచ్చు పొత్తు పార్టీలు ఓడిపోతే మీరు రాజకీయంగా ఎదుర్కోగలరా? అనడంపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఓడిన వెంటనే పవన్ తన పార్టీని బంగాళాఖాతంలో కలిపేస్తారని నర్మగర్భంగా చెప్పినట్లుందని గుసగుసలు పోతున్నారు.

వద్దంటే వినరుగా!



కర్ర ఇచ్చి మరీ పళ్లు రాలగొట్టించుకున్నట్లు ఉందట.. లోకేశం యువగళం ప్రచారం. ఆయన ప్రచారానికి ఏర్పాట్లు చేయాలని కొన్ని జిల్లాలకు టీడీపీ ఆఫీస్ నుంచి ఆదేశాలు వెళ్లాయి. అయితే ఎవరూ పెద్దగా స్పందించలేదట. కోస్తాంధ్ర అభ్యర్థులైతే.. అబ్బెబ్బే.. మా తిప్పలేవో మేమే పడతాం అని చెప్పేశారట. దీంతో పార్టీ కార్యాలయ పెద్దలే రంగంలోకి దిగాల్సి వచ్చింది. మంగళగిరిలో లోకేశం ప్రచారంతో పెద్దగా ఒరిగేదేమీ లేదని, బ్రాహ్మణి ప్రచారం చేస్తే పరువైనా దక్కుతుందనుకున్నారట.లోకేశాన్ని ఖాళీగా కూర్చోబెడితే.. ఎక్కడ ప్రచారంలో వేలెడతారేమోనని, రాయలసీమ నియోజకవర్గాలకు పంపిస్తున్నారట. అక్కడే మార్చి 3వ తేదీన ఓటేయాలంటూ సెలవిచ్చారు! దీంతో లోకేశం ప్రచారం మాకొద్దని చెప్తే వినరు కదా? అని అభ్యర్థులు ఆక్షేపిస్తున్నారట.

గోల 'చిన్నమ్మ'

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి(చిన్నమ్మ)పై సోషల్ మీడియా ట్రోల్స్‌తో హోరెత్తుతోంది. రాజమండ్రి ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆమె ఓటమిలో హ్యాట్రిక్ నమోదు చేస్తారని చాలెంజ్‌లు చేస్తున్నారు. అందుకు అనపర్తి అసెంబ్లీ స్థానం సెంటిమెంట్‌ను లింక్ చేస్తున్నారు. గత కొన్ని ఎన్నికలుగా అనపర్తిలో వచ్చే మెజార్టీయే రాజమండ్రి ఎంపీ అభ్యర్థి గెలుపును నిర్ణయిస్తోంది. అయితే ఈసారి అనపర్తి సీటును చంద్రబాబుతో చిన్నమ్మకు ఉన్న లోపాయికారీ ఒప్పందాల వల్ల టీడీపీ అభ్యర్థినే బీజేపీలోకి తీసుకొచ్చి, మరీ కేటాయించారు. ఇది బీజేపీ శ్రేణులతోపాటు, స్థానికుల్లోనూ తీవ్ర చర్చకు దారి తీసింది. ఇంతటి లేకి రాజకీయాలకు చెక్ పెట్టాల్సిందేనంటూ అనపర్తి ప్రజలు గట్టి నిర్ణయానికే వచ్చారట.

భజనసేన మాకొద్దు!

- జనసేనను వీడేవారేగాని వచ్చేవారేరీ?
- తెగేసి చెబుతున్న ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు
- సంస్థాగతంగా తొలి నుంచీ పట్టించుకోలేదు
- పరిమిత జిల్లాల పార్టీగా మిగిల్చారు
- ప్రశ్నిస్తామంటూ జవాబే లేకుండా చేశారు
- మేధావులు, సీనియర్లు ముందే మేల్కొన్నారు
- పవన్‌తో మేలెంతంటూ టీడీపీలోనూ మదనం



నాయకుడు అంటే ఎలా ఉండాలి..


తన వెనకున్న వారికి గుండె ధైర్యాన్నిచ్చేలా ఉండాలి.. నమ్మిన వారి కోసం ఎందాకైనా పోరాడే పటిమ కలిగి ఉండాలి..

పవర్ స్టార్ అని పేరుగాంచిన పవన్ కల్యాణ్‌లో ఆ లక్షణాలేవీ కనిపించడం లేదని జనసేన శ్రేణులు ఉసూరుమంటున్నాయి. పిఠాపురంలో పవన్ పవర్ పని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా చెబుదామనుకుంటే కయ్యి.. మంటున్నారని, దగ్గరకే రానివ్వడం లేదని మండిపడుతున్నారు. టీడీపీ నేతలను నమ్ముకుని కోట్లు కుమ్మరిస్తున్నారని వాపోతున్నారు.

-వివరాలు IIIలో

భూములు లాక్కున్నది ఈ పెద్దమనిషి, ఇతని ముఠానే

- ప్రపంచమే ఆశ్చర్యపోయేలా అమరావతి భూముల కుంభకోణం
- పచ్చని పొలాలను భూ సమీకరణ పేరుతో దోచుకున్న చంద్రబాబు ముఠా
- అసైన్డ్ రైతుల కడుపుగొట్టి వేల ఎకరాలను కొల్లగొట్టిన పచ్చ గద్దలు
- విశాఖలో టీడీపీ భూ దాహానికి సామాన్యులు విలవిల
- లక్ష ఎకరాల భూముల రికార్డులు మాయం చేసిన టీడీపీ నేతలు
- బాబు తీరుతో చిక్కుల్లో 4.5 లక్షల ఎకరాల చుక్కల భూములు
- ఈ కుంభకోణంలో గంటానే ప్రధాన సూత్రధారి
- షరతుల గల పట్టా భూముల రైతులకు అన్యాయం చేసింది టీడీపీయే
- 22ఏ జాబితాలో లక్షల ఎకరాల భూములు
- 35 లక్షల ఎకరాలను ఆంక్షల జాబితా నుంచి తొలగించిన వైఎస్ జగన్ ప్రభుత్వం .. భూముల సమస్యలు పరిష్కరించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అడ్డగోలుగా అభాండాలు



సూత్రధారి, పాత్రధారి బాబే

సాక్షి, అమరావతి

భూములకు సంబంధించి కొద్దిరోజులుగా చంద్రబాబు ఆయన పరివారం నడుపుతున్న హైడ్రామా దొంగే దొంగ దొంగ అని అరిచిన చందంగా తయారైంది. తన గత పాలనలో కనీవినీ ఎరుగని భూ కుంభకోణాలు చేసి అభాసుపాలైన వృద్ధ నేత ముఠా ఇప్పుడు ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని భూతంలా చూపిస్తూ భూములు దోచేస్తున్నారనే తప్పుడు ప్రచారాన్ని ముమ్మరంగా చేస్తోంది. కేంద్రం సిఫారసు మేరకు వందేళ్ల తర్వాత వచ్చిన మంచి చట్టం గురించి ఇంత దారుణంగా చేస్తున్న వ్యతిరేక ప్రచారాన్ని చూసి రెవెన్యూ నిపుణులే విస్తుపోతున్నారు. కేవలం భూములు దోచుకోవడానికే ఈ చట్టం చేశారంటూ చంద్రబాబు నుంచి ఆయనకు మద్దతిచ్చే ఎల్లో మీడియా, సోషల్ మీడియా బరితెగించి చేస్తున్న అబద్ధపు ప్రచారంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో భూములకు సంబంధించి జరిగిన విప్లవాత్మకమైన మార్పులు ఇతర రాష్ట్రాలకు దిక్సూచిలా మారాయి. అదే సమయంలో 2014–19 మధ్య చంద్రబాబు పాలనలో భూముల వ్యవస్థను మరింత అస్తవ్యస్థం చేసేలా నిర్ణయాలు తీసుకున్నారు. అంతే కాదు ఆయన హయాంలో ప్రపంచమే నివ్వెరపోయేలా భూ కుంభకోణాలు జరిగాయి. రాజధాని అమరావతి కుంభకోణం అవినీతి కేసులకు కేస్ స్టడీగా మారింది. రాజధాని పేరుతో ఒక అంతర్జాతీయ భూముల కుంభకోణాన్ని చేసిన చంద్రబాబు ఇప్పుడు నంగనాచిలా తాను మళ్లీ వస్తే ప్రజల భూములు రక్షిస్తానని చెప్పడం విడ్డూరంగా కనిపిస్తోంది. విశాఖపట్నంలో లక్ష ఎకరాలకు సంబంధించిన భూముల రికార్డులను మాయం చేసి వేల కోట్ల విలువైన భూములు దోచేసిన చరిత్ర టీడీపీది. చుక్కల భూములను కొల్లగొట్టేందుకు ఇష్టం వచ్చినట్లు నిర్ణయాలు తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఎకరాలను 22ఏ జాబితాలో పెట్టి పేద రైతుల జీవితాల్లో నిప్పులు పోసిన వ్యక్తి చంద్రబాబు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక చంద్రబాబు సృష్టించిన చుక్కల భూముల సమస్య, షరతుగల పట్టా భూముల సమస్య నుంచి లక్షల మంది రైతులకు విముక్తి కల్పించింది. ప్రజలను భూముల సమస్యల్లో ఇరికించి అష్టకష్టాలు పెట్టిన చంద్రబాబు ఇప్పుడు తప్పుడు ప్రచారాలతో వారిని భయపెట్టి, తాను వస్తే న్యాయం చేస్తానంటూ వృద్ధ నారీ మహా పతివ్రతలా మాట్లాడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రాజధాని ముసుగులో రూ.2 లక్షల కోట్ల దోపిడీ

రాజధాని పేరు చెప్పి చంద్రబాబు కనీవినీ ఎరుగని భూ కుంభకోణాలకు పాల్పడ్డారు. భూ సమీకరణ ముసుగులో భూ దోపిడీ... అసైన్డ్ భూములు, ప్రభుత్వ

-వివరాలు IVలో



క్లీన్ స్వీప్ ఖాయం

చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన

- ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు
- అర్హతే ప్రామాణికం.. వివక్ష, లంచాలకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ
- విప్లవాత్మక సంస్కరణలతో విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో ప్రగతి
- గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థతో ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలు
- 2019 ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం

టైమ్స్ నౌ గ్రూప్ ఎడిటర్‌–ఇన్‌–చీఫ్ నవికా కుమార్ ఇంటర్వ్యూలో సీఎం వైఎస్ జగన్

గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉన్నదున్నట్లు మాట్లాడారు.. 'ఇంట్లో' పాలిటిక్స్ గురించి కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.. పొత్తు రాజకీయాల్లో మతలబును తేల్చి పారేశారు.. చంద్రబాబు చేతిలోనే కాంగ్రెస్ పార్టీ రిమోట్ కంట్రోల్ ఉందంటూ ఉదాహరణ సహితంగా వివరించారు.. రాహుల్, నరేంద్ర మోదీలపై తన అభిప్రాయాలను స్పష్టంగా, సూటిగా వెల్లడించారు.. దమ్ము, ధైర్యం, ప్రేమ, ఆప్యాయత కలబోసిన అరుదైన నేత వైఎస్ జగన్.. అని ఎందుకంటారో తెలుసుకోవాలంటే ఈ ఇంటర్వ్యూ చదవాల్సిందే.

వివరాలు VIలో

అన్నదాత ఇంట సిరుల పంట

గతం కంటే అధిక దిగుబడులు..

రైతు మోములో చిరునవ్వులు


- ఆర్బీకేలతో నూతన శకం
- సకాలంలో రుణాలు, విత్తనాలు, ఎరువుల అందజేత
- అడుగడుగునా అండగా ప్రభుత్వం
- వైపరీత్యాలెదురైనా మొక్కవోని అన్నదాత
- ఫలించిన పొలం బడులు.. దిగుబడుల్లో పెరిగిన నాణ్యత
- బాబు ఐదేళ్ల పాలనలో సగటున 153.95 లక్షల టన్నులు
- గడిచిన 58 నెలల్లో సగటున 162.04 లక్షల టన్నులు

సాక్షి, అమరావతి: ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడే అన్నదాతకు గడిచిన ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. విత్తు నుంచి విక్రయం వరకు గ్రామ స్థాయి యూనిట్‌గా చేయిపట్టి నడిపించడంతో రైతులు విపత్తులకు సైతం ఎదురొడ్డి సిరుల పంట పండించారు. దాదాపు నాలుగేళ్ల పాటు సాధారణానికి మించి వర్షం కురవడంతో ప్రాజెక్టులు నిండు కుండలను తలపించాయి. అడుగంటిన భూగర్భ జలాలు ఎగసిపడ్డాయి. ఒకటి రెండు సీజన్‌లలో అధిక వర్షాలు, తుపాన్‌లు విరుచుకుపడిన సందర్భాల్లో 80 శాతం సబ్సిడీపై విత్తనాలివ్వడం, సకాలంలో పరిహారం ఇవ్వడం వంటి చర్యల ఫలితంగా రైతులు మొక్కవోని ధైర్యంతో మళ్లీ సాగు చేసి రికార్డు స్థాయి దిగుబడులను సాధించగలిగారు.



అదను దాటకుండా సాగు ఉత్పాదకాలు

ఆహార ధాన్యాల దిగుబడులిలా.. (లక్షల టన్నుల్లో)



రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో తీసుకొచ్చిన ఆర్బీకే వ్యవస్థ అన్నదాతల పాలిట వరంగా మారింది. ఆయా సీజన్లలో అదను దాటక ముందే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వంటి సాగు ఉత్పాదకాలను ఆర్బీకేల ద్వారా రైతుల ముంగిట చేర్చారు. అత్యాధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులపై పొలంబడుల ద్వారా శిక్షణ ఇప్పించారు. ఫలితంగా పెట్టుబడి ఖర్చులు ఆదా అయ్యాయి. 2019–20లో హెక్టార్‌కు ఖరీఫ్‌లో 5,250 కిలోలు, రబీలో 6,868 కిలోల చొప్పున రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడులు వచ్చాయి. ఆ తర్వాత మూడేళ్లలో అధిక వర్షాలు, విపత్తులు కాస్త ఇబ్బంది పెట్టినా రికార్డు స్థాయి దిగుబడులనే సాధించారు. 2023–24 వ్యవసాయ సీజన్‌లో మాత్రమే దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో రాష్ట్రంలో కాస్త సాగు విస్తీర్ణం తగ్గింది. అయినప్పటికీ ఐదేళ్ల సగటుకు మించే దిగుబడులు నమోదయ్యాయి.

గణనీయంగా పెరిగిన ఉత్పాదకత

ప్రభుత్వ చర్యల ఫలితంగా గడిచిన ఐదేళ్లుగా వ్యవసాయ పంటల ఉత్పాదకత గణనీయంగా పెరిగింది. వరి సహా ప్రధాన పంటలకు సంబంధించి హెక్టార్‌కు సగటు దిగుబడులు పెరిగాయి. ఆర్బీకేల ద్వారా సమగ్ర పంట నిర్వహణ పద్ధతులపై శిక్షణ ఫలితంగా సాగు వ్యయంలో 6–17 శాతం ఆదా కాగా, 9–20 శాతం మేర దిగుబడులు పెరిగినట్టుగా గుర్తించారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి బాబు హయాంలో గరిష్టంగా 2017–18లో 167.22 లక్షల టన్నుల దిగుబడులు నమోదు కాగా, గడిచిన ఐదేళ్లలో 2019–20 సీజన్‌లో

-మిగతా IIIలో



మరిన్ని పేజీల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

సతీమణి పేరిట నాథుని లీలలు

టీడీపీ హయాంలో అప్పటి మంత్రి అక్రమాలెన్నో!

- చేతికి మట్టి అంటకుండా కమీషన్ల దందా
- మంత్రి అయ్యాక భారీగా పెరిగిన ఆస్తులు
- భార్య పేరిట వెలసిన పలు కంపెనీలు
- 'కియా'లో ఏజెన్సీలు కట్టబెట్టడంపై విమర్శలు
- ఏపీఐఐసీ భూ కేటాయింపుల్లో తప్పని దోపిడీ
- ఎంఎస్‌ఎంఈలోనూ తన అనుచరులతో వసూళ్లు
- అప్పట్లో పనులన్నీ తన బినామీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకే!
- ఇదీ టీడీపీ చిత్తూరు జిల్లా పెద్దగా చెప్పుకునే మాజీ మంత్రి తీరు

సాక్షి టాస్క్‌ఫోర్స్: 2014 ఎన్నికల్లో ఆయన వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. విలువలకు తిలోదకాలిచ్చి, మంత్రి పదవి కోసం టీడీపీలో చేరారు. ఏడాదిన్నర పాటు మంత్రిగా వెలగబెట్టారు. 2014 ఎన్నికల్లో ఆయన చర, స్థిరాస్తులు రూ.5.70 కోట్లు. అప్పు రూ.2.42 కోట్లు. ప్రస్తుత ఎన్నికల అఫిడవిట్‌లో ఏకంగా ఐదురెట్లు ఆస్తులు పెరిగినట్లు అధికారికంగానే పేర్కొన్నారు. చర, స్థిరాస్తులు కలిపి రూ.28.87 కోట్లుగా చూపించారు. లెక్కల్లో చూపని, బినామీల పేరిట ఉన్న ఆస్తులైతే లెక్కపెట్టలేనంత.

భార్య పేరిట కంపెనీలు

ఈ మాజీ మంత్రి భార్య పేరిట గ్రానైట్స్, షెల్టర్స్, ప్రాపర్టీస్ ప్రాజెక్ట్స్ తదితర కంపెనీలున్నట్లు చూపారు. వీటిలో గంగవరం మండలం గండ్రాజుపల్లి వద్దనున్న గ్రానైట్స్ కంపెనీకి నాలుగెకరాల స్థలాన్ని అడ్డగోలుగా పొందారు. అక్కడ ఓ రేకుల షెడ్ తప్ప, ఎలాంటి పరిశ్రమ లేదు. దీన్ని కూడా మరో కంపెనీ పేరిట 2022లో లీజుకిచ్చినట్లు సమాచారం. ఇవిగాక కర్ణాటకలో ఆమె పేరిట ఉన్న కంపెనీల పరిధిలో మరెన్ని ఆస్తులున్నాయో, వాటి

-మిగతా IIIలో

II సాక్షి జాతీయం
ఎలక్షన్ 2024
శనివారం మే. 4

ఇద్దరు లాలు ప్రసాద్‌లు... అయితే ఏంటి?

- పోటీ చేయొద్దని చెప్పలేం
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ



ఈవీఎంపై ఇద్దరు రాహుల్ గాంధీలు కనిపిస్తే? ఎవరికి ఓటేయాలి? ఇది ఎంతో కొంతమంది ఓటర్లను అయోమయానికి గురి చేసే అంశమే. కీలక అభ్యర్థుల పేర్లను పోలిన వారిని ప్రత్యర్థి పార్టీలు బరిలో దించి ఓట్లను చీల్చడం పరిపాటి. కొన్నిసార్లు అభ్యర్థుల గెలుపోటములనే ప్రభావితం చేసే ఈ పోకడకు చెక్ పెట్టాలంటూ 'సాబు స్టీఫెన్' అనే వ్యక్తి ఏకంగా సుప్రీంకోర్టులోనే పిల్ వేశారు! అదే పేరుతో మరొకరు పోటీలో ఉండడం వల్ల వెంట్రుకవాసి తేడాతో ఓటమి పాలైన ఉదంతాలను ఉదహరించారు. ''2004 లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో అలప్పుజ స్థానంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన వీఎం సుధీరన్ కేవలం 1,009 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అక్కడ వీఎస్ సుధీరన్ అనే ఇండిపెండెంట్‌కు ఏకంగా 8,282 ఓట్లు పోలయ్యాయి. ప్రత్యర్థి పార్టీలు డబ్బు, తదితరాలు ఎరగా చూపి ఇలాంటి నకిలీలను ప్రోత్సహిస్తున్నాయి. ఈ చర్యలు ప్రజాప్రాతినిధ్య చట్ట నిబంధనలకు వ్యతిరేకం'' అని వాదించారు. ''ప్రముఖ అభ్యర్థుల పేరును పోలిన వారు బరిలో ఉంటే వారి నేపథ్యాన్ని కూలంకషంగా విచారించాల్సిందిగా ఎన్నికల సంఘాన్ని ఆదేశించండి. నకిలీలని తేలితే పోటీ నుంచి నిషేధించేలా చూడండి'' అని కోరారు. కానీ, ఈ పిల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఒకే తరహా పేర్లున్నంత మాత్రాన ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకోవడం సరికాదని న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ''రాహుల్ గాంధీ, లాలు ప్రసాద్ యాదవ్ వంటి ప్రముఖుల పేర్లున్న వారిని పోటీ చేయొద్దందామా? తల్లిదండ్రులు ఆ పేర్లు పెట్టిన కారణంగా ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంచగలమా? పిల్లలకు ఏ పేరు పెట్టుకోవాలనేది తల్లిదండ్రుల హక్కు'' అని పేర్కొంటూ పిల్‌ను కొట్టేసింది! - న్యూఢిల్లీ

దేశానికి ఆయువుపట్టయిన ఢిల్లీని కొల్లగొట్టిన వారే ఎర్రకోటలో జెండా ఎగరేయడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ, ఆపై బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ఢిల్లీని క్లీన్‌స్వీప్ చేసి కేంద్రంలో అధికారం చేపట్టాయి. గత రెండు ఎన్నికల్లో రాజధానిలోని మొత్తం 7 ఎంపీ సీట్లనూ కైవసం చేసుకున్న బీజేపీ ఈసారి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తోంది. ఎంపీలపై వ్యతిరేకతను అధిగమించేందుకు ఏకంగా ఆరుగురు సిట్టింగులను పక్కన పెట్టేసింది! ఇక కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొన్న ఆప్.. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు తాలూకు సానుభూతిని అనుకూలంగా మార్చుకోవాలని యోచిస్తోంది. కేజ్రీవాల్ భార్య సునీత పార్టీ ప్రచార బాధ్యతలను తన భుజానికెత్తుకున్నారు. - సాక్షి, న్యూఢిల్లీ

స్టేట్ స్కాన్

ఢిల్లీ గల్లీలు... ఎవరివో!

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిగా భిన్నమైన తీర్పు ఇవ్వడం ఢిల్లీ ఓటర్లకు కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. దశాబ్దాలుగా ఢిల్లీ రాజకీయాలను శాసించిన కాంగ్రెస్‌పై 90వ దశకం నుంచి క్రమంగా బీజేపీ ఆధిపత్యం మొదలైంది. ఆ తర్వాత నుండి హస్తినలో అధికారం ఆ రెండు పార్టీల మధ్యే మారుతూ వచ్చింది. 2009లో ఢిల్లీలోని మొత్తం ఏడు లోక్‌సభ స్థానాలనూ కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేయగా 2014, 2019ల్లో అదే ఫీట్‌ను బీజేపీ చేసి చూపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీపై 'చీపురు' తిరగేసిన ఆప్ లోక్‌సభకు వచ్చేసరికి ఒక్క స్థానమూ దక్కించుకోలేకపోయింది. ఓట్లపరంగా కూడా బీజేపీ ఆ రెండు పార్టీలకు అందనంత ఎత్తులో నిలిచింది. కమలం గుర్తుకు 56.86 శాతం ఓట్లు రాగా హస్తానికి 22.51 శాతం, ఆప్‌కు గుర్తుకు 14.79 శాతం పోలయ్యాయి. కాకపోతే అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం బీజేపీకి ఆప్ చేతిలో వరుసగా భంగపాటు తప్పడం లేదు.

కేజ్రీవాల్ అరెస్టు కలిసొచ్చేనా?

నయా రాజకీయాలతో సంచలనం అరవింద్ కేజ్రీవాల్ 2012లో పెట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ నానాటికీ బలపడుతూ వచ్చింది. 2013 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్.. 70 సీట్లకు 28 స్థానాలు సాధించింది. బీజేపీకి 32 సీట్లు రావడంతో హంగ్ ఏర్పడింది. ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ ముందుకు రాకపోవడంతో 8 సీట్లొచ్చిన కాంగ్రెస్ మద్దతుతో కేజ్రీవాల్ తొలిసారి సీఎం అయ్యారు. కానీ 49 రోజులకే రాజీనామా చేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌కు ఒక్క సీటూ రాలేదు. కానీ 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 67 సీట్లతో సంచలనం సృష్టించింది. కేజ్రీవాల్ రెండోసారి సీఎం అయ్యారు. మళ్లీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో చేతులెత్తేసినా 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 62 సీట్లతో ముచ్చటగా మూడోసారి సీఎం అయ్యారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష ఇండియా కూటమి తరఫున సుడిగాలి ప్రచారానికి సన్నద్ధమైన కేజ్రీవాల్ ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై జైలు పాలయ్యారు. ఇది ఆప్‌కు కలిసొస్తుందా, ప్రతికూలంగా మారుతుందా అన్నది ఆసక్తికరం. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం నిమిత్తం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొనడం ఆప్‌కు ఊరటనిచ్చే పరిణామమే. దీనిపై మే 7న కోర్టు వెలువరించబోయే నిర్ణయం కోసం పార్టీ ఉత్కంఠగా ఎదురు చూస్తోంది.



బీజేపీ 'హ్యాట్రిక్' గురి...

ఢిల్లీలో హ్యాట్రిక్ క్లీన్‌స్వీప్ కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ తివారీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ భోజ్‌పురి సూపర్ స్టార్ 2014లో ఇక్కడి నుంచే బీజేపీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో అరంగేట్రం చేశారు. తర్వాత ఢిల్లీ బీజేపీ పగ్గాలు చేపట్టి 7 సీట్లనూ క్లీన్‌స్వీప్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈసారి తివారీ తప్ప మిగతా ఆరుగురు సిట్టింగులనూ బీజేపీ మార్చేయడం విశేషం! ఢిల్లీ మద్యం కుంభకోణాన్ని బీజేపీ ప్రధాన ప్రచారాంశంగా జనంలోకి తీసుకెళ్తోంది. మోదీ ఫ్యాక్టర్‌తో పాటు సీఏఏ, అయోధ్య రామ మందిరం, ఆర్టికల్ 370 రద్దు తదితరాలను నమ్ముకుంది. పూర్వాంచలీలు, ముస్లింల ఆధిపత్యముండే ఈశాన్య ఢిల్లీ స్థానంలో బిహార్‌కు చెందిన ఇద్దరు అభ్యర్థుల మధ్య కీలక పోరు జరగనుంది. హ్యాట్రిక్‌తో మూడోసారి లోక్‌సభలో అడుగుపెట్టాలనుకుంటున్న మనోజ్ తివారీ ఒకవైపు, కాంగ్రెస్ నుంచి కన్హయ్య కుమార్ మరోవైపు బరిలో ఉన్నారు. అభ్యర్థుల ఎంపికలో బీజేపీ సామాజిక సమతూకం పాటించింది. తూర్పు ఢిల్లీ నుంచి పంజాబీ అయిన హరీశ్ మల్హోత్రా, చాందినీ చౌక్ నుంచి బనియా నాయకుడు ప్రవీణ్ ఖండేల్వాల్, దక్షిణ ఢిల్లీ నుంచి గుజ్జర్ నాయకుడు రాంవీర్ సింగ్ బిధూరి, పశ్చిమ ఢిల్లీ నుంచి జాట్ నాయకుడు కమల్జీత్ సెహ్రావత్, ఎస్సీ రిజర్వ్‌డ్ వాయవ్య ఢిల్లీ నుంచి దళిత నాయకుడు యోగేంద్ర చందోలియాలను బరిలో నిలిపింది. కమల్‌జీత్‌తో పాటు న్యూఢిల్లీ నుంచి దివంగత సుష్మా స్వరాజ్ కుమార్తె బాసురీ స్వరాజ్ రూపంలో ఇద్దరు మహిళలకూ అవకాశం ఇచ్చింది.

సునీతా కేజ్రీవాల్ ప్రచారం...

ఢిల్లీలో ఇండియా కూటమి భాగస్వాములుగా ఆప్ 4 స్థానాల్లో, కాంగ్రెస్ 3 చోట్ల బరిలో దిగుతున్నాయి. రాజధానిలో బీజేపీకి ఎలాగైనా ముకుతాడు వేయాలని చూస్తున్నాయి. 'ఢిల్లీ మోడల్'ను కేజ్రీవాల్ ప్రధానంగా ప్రచారం చేశారు. ఆయన జైలుపాలైన నేపథ్యంలో ఆప్ ప్రచార భారాన్ని భార్య సునీతా కేజ్రీవాల్ భుజానికెత్తుకున్నారు. ఆమె సభలకు మంచి స్పందన కూడా లభిస్తోంది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, కార్పొరేట్లతో మోదీ కుమ్మక్కు వంటి అంశాలను ఆప్, కాంగ్రెస్ గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పైనా విమర్శలు గుప్పిస్తున్నాయి. కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో, విపక్షాలపై దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు ఉసిగొల్పుతోందన్న అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి.



పోలింగ్ తేదీ: మే 25

సర్వేలేమంటున్నాయి...

ఢిల్లీలో ఈసారి కూడా బీజేపీ మొత్తం 7 లోక్‌సభ సీట్లనూ క్లీన్‌స్వీప్ చేస్తుందని పలు సర్వేలు అంటున్నాయి. అయితే కేజ్రీవాల్ అరెస్టు తాలూకు సానుభూతి ఆప్‌కు కలిసొస్తే ఆ పార్టీకి ఒకట్రెండు స్థానాలు దక్కే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు.

పోలింగ్ బూత్ గుర్తింపు... మొబైల్ నంబర్‌తో



పోలింగ్ బూత్ ఎక్కడో తెలియడం లేదా? మన ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందో మొబైల్ నంబర్ సాయంతో చాలా ఈజీగా తెలుసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 13న లోక్‌సభకు పోలింగ్ జరగనుండటం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి కూడా అదే రోజు ఎన్నికలు జరగనున్నాయి. ఓటు ఎక్కడుందో తెలుసుకోవడానికి ఓటర్ ఐడీ కార్డు సాయంతో సులువుగా తెలుసుకోవచ్చు. ఓటరు ఐడీలో ఇంగ్లిష్ అక్షరాలు, 10 అంకెలతో కూడిన ఎపిక్ ఐడీ పోలింగ్ బూత్‌ను గుర్తించడానికి కీలకమవుతుంది. ఏ కారణంతోనైనా కార్డు అందుబాటులో లేని వారు ఆన్‌లైన్‌లోనే ఎపిక్ నంబర్ గురించి తెలుసుకోవచ్చు.

ఇలా చేస్తే సరి

ఎపిక్ నంబర్ కోసం ఈసీ పోర్టల్ (voters. eci.gov.in)ను సందర్శించాలి. అందులో కుడివైపు కనిపించే సర్వీసెస్ విభాగంలో 'ఈ–ఎపిక్ డౌన్‌లోడ్' ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. తర్వాత వచ్చే పేజీలో సైనప్‌ను ఎంపిక చేసుకోవాలి. మొబైల్ నంబర్, ఈ మెయిల్ అడ్రస్ ఇచ్చి క్యాప్చా ఎంటర్ చేసి, కంటిన్యూ చేయాలి. తర్వాత పేరు నమోదు చేసి, పాస్‌వర్డ్ ఎంపిక చేసుకోవాలి. మొబైల్‌కు వచ్చే ఓటీపీని ఎంపిక చేస్తే అకౌంట్ క్రియేట్ అవుతుంది. అప్పటికే ఖాతా ఉన్న వారు సైనప్ చేయనవసరం లేదు. మొబైల్ నంబర్ లేదా ఈమెయిల్ ఐడీ, పాస్‌వర్డ్‌తో ఖాతాలోకి లాగిన్ అవడం ద్వారా ఈ–ఎపిక్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలా ఎపిక్ నంబర్ తెలిసిపోతుంది. తర్వాత సైట్ హోం పేజీలో కుడివైపున ఉన్న 'సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్' ఎంపిక చేసుకోవాలి. వచ్చే ప్రత్యేక పేజీలో ఎపిక్ నంబర్ నమోదు చేయాలి. రాష్ట్రం ఎంపిక చేసుకుని క్యాప్చా కోడ్ నమోదు చేసి సెర్చ్ బటన్ ఓకే చేయాలి. మీ పోలింగ్ బూత్‌తో పాటు పోలింగ్ స్టేషన్ ఆఫీసర్ తదితర వివరాలు కూడా లభిస్తాయి. ఇదే పోర్టల్ నుంచి ఫిర్యాదులు సైతం దాఖలు చేయవచ్చు. ఎపిక్ నంబర్ ఉన్న వారు నేరుగా సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్ ఆప్షన్‌కు వెళ్లవచ్చు. - సాక్షి, నేషనల్ డెస్క్

కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల పోరు పశ్చిమ యూపీ నుంచి యాదవ భూమికి చేరింది. బ్రజ్, రోహిఖండ్ ప్రాంతాల్లోని 10 లోక్‌సభ స్థానాలకు 7న మూడో విడతలో పోలింగ్ జరగనుంది. యాదవులు, ముస్లింలు ఒక్కటైతే అక్కడ వారి తీర్పే ఫైనల్. వారి ఓట్లపైనే ఆశలు పెట్టుకున్న సమాజ్‌వాదీ పార్టీకి మూడో విడత అగ్నిపరీక్ష కానుంది. యూపీలో తొలి రెండు విడతల్లో జాట్ బెల్ట్‌గా భావించే పశ్చిమ యూపీలోని 16 స్థానాలకు పోలింగ్ ముగియడం తెలిసిందే... - సాక్షి, నేషనల్ డెస్క్

యాదవ భూమిలో ఎస్పీకి అగ్నిపరీక్ష

యూపీలో మూడో దశలో 10 చోట్ల పోలింగ్
యాదవులు, ముస్లింల ప్రాబల్య ప్రాంతాలే

సంభల్


• జియావుర్ రెహమాన్

యాదవ ఆధిపత్య స్థానమిది. దివంగత ఎస్పీ దిగ్గజం ములాయం సింగ్ యాదవ్ 1998, 1999ల్లో ఇక్కడి నుంచే లోక్‌సభకు వెళ్లారు. 2004లోనూ ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్ గెలిచారు. 2014లో మాత్రం బీజేపీ నేత సత్యపాల్ సింగ్ సైని గెలిచారు. 2019లో ఎస్పీ నేత షఫీకుర్ రెహమాన్ బార్క్ భారీ విజయం సాధించారు. ఆయన అనారోగ్యంతో కన్నుమూయడంతో ఈసారి మనవడు, సిట్టింగ్ ఎమ్మెల్యే జియావుర్ రెహమాన్‌కు ఎస్పీ టికెటిచ్చింది. బీజేపీ మళ్లీ ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన పరమేశ్వర్ లాల్ సైనీనే రంగంలోకి దింపింది. బీఎస్పీ నుంచి షౌలత్ అలీ పోటీ చేస్తున్నారు.

ఫతేపూర్ సిక్రీ


• రాజ్‌కుమార్ చాహర్

2009లో ఈ స్థానాన్ని బీఎస్పీ సొంతం చేసుకుంది. గత రెండు ఎన్నికల నుంచి మాత్రం బీజేపీదే విజయం. 2019లో ఆ పార్టీ అభ్యర్థి రాజ్‌కుమార్ చాహర్ ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి రాజ్ బబ్బర్‌కు 1.72 లక్షల ఓట్లు పోలైతే, చాహర్ ఏకంగా 6.67 లక్షల ఓట్లు సొంతం చేసుకున్నారు! దాంతో ఈ విడత కూడా చాహర్‌కే బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి రామ్‌నాథ్ సికర్‌వార్, బీఎస్పీ నుంచి రామ్‌నివాస్ శర్మ పోటీలో ఉన్నారు. ఎస్పీ మాజీ నేత భగవాన్ శర్మ (గుడ్డూ పండిట్) స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉండటం కాంగ్రెస్‌కు ప్రతికూలం కానుంది.

ఫిరోజాబాద్


• విశ్వదీప్ సింగ్

ఇదీ ఎస్పీ ఆధిపత్యమున్న స్థానమే. 2009లో ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, 2014లో ఆయన సోదరుడు అక్షయ్ యాదవ్ విజయం సాధించారు. 2019లో మాత్రం ఫిరోజాబాద్ బీజేపీ పరమైంది. ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ చంద్రసేన్ జదాన్ 28 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో ఎస్పీ అభ్యర్థి అక్షయ్ యాదవ్‌పై గెలిచారు. ఈసారి ఎస్పీ నుంచి మళ్లీ అక్షయ్ బరిలో ఉన్నారు. బీజేపీ మాత్రం సిట్టింగ్ ఎంపీని మార్చి విశ్వదీప్ సింగ్‌కు టికెటిచ్చింది.

హథ్రస్


• అనూప్ ప్రధాన్

ఈ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం 1991 నుంచీ బీజేపీ కంచుకోట. కాంగ్రెస్ అయితే 1971 తర్వాత ఇక్కడ ఎన్నడూ గెలవలేదు! ఇక ఎస్పీ, బీఎస్పీ ఈ స్థానంలో ఒక్కసారి కూడా గెలుపు ముఖమే చూడలేదు! 2009లో బీజేపీతో పొత్తు పెట్టుకున్న ఆరెల్డీ ఇక్కడ విజయం సాధించింది. 2019లో ఎస్పీ అభ్యర్థి రామ్‌జీ లాల్ సుమన్‌పై బీజేపీ అభ్యర్థి రాజ్‌వీర్ సింగ్ దిలార్ 2.6 లక్షల మెజారిటీతో ఘన విజయం సాధించారు. 66 ఏళ్ల దిలార్ ఏప్రిల్ 24న గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడంతో బీజేపీ టికెట్ అనూప్ ప్రధాన్‌కు లభించింది. ఎస్పీ తరఫున జస్వీర్ వాల్మీకి పోటీ చేస్తున్నారు.

బీజేపీ హవా కొనసాగేనా!?

మూడో విడతలో పోలింగ్ జరిగే 10 స్థానాల్లో ఎనిమిది 2019లో బీజేపీ గెలుచుకున్నవే. ఈసారి కాంగ్రెస్, ఎస్పీ కలిసి బరిలో దిగగా బీఎస్పీ ఒంటరి పోరు చేస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు వాటి మధ్య చీలితే బీజేపీ లాభపడనుంది. ఈ 10 లోక్‌సభ స్థానాల్లో ముస్లింలతో పాటు ఓబీసీలు, ముఖ్యంగా యాదవ్‌ల పాటు ఓట్లు ఎక్కువ. ఎటా, ఫిరోజాబాద్, మెయిన్‌పురి, బుదౌన్, సంభాల్ యాదవ ప్రాబల్య స్థానాలు. సంభాల్, ఆవ్లా, ఫతేపూర్ సిక్రీ, ఆగ్రా, ఫిరోజాబాద్‌ల్లో ముస్లిం ఓటర్లు 13 శాతమున్నారు. బరేలీలోనైతే ఏకంగా 33 శాతం దాకా ఉంటారు! ఇతర లోక్‌సభ స్థానాల్లో లోధ్, కచ్చి, శాక్య, మురావోల ప్రాబల్యమూ ఉంది.

ఎటా


• రాజ్‌వీర్‌సింగ్

ఆది నుంచీ బీజేపీని ఆదరిస్తున్న స్థానమిది. 1999, 2004 ఎన్నికల్లో మాత్రం ఎస్పీ నెగ్గింది. 2009 ఎన్నికల్లో యూపీ మాజీ సీఎం కల్యాణ్ సింగ్ ఇక్కడి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలవడం విశేషం! ఆయన కుమారుడు రాజ్‌వీర్‌సింగ్ 2014, 2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి విజయం సొంతం చేసుకున్నారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. ఎస్పీ తరఫున దవేశ్ శాక్య, బీఎస్పీ నుంచి మహమ్మద్ ఇర్ఫాన్ బరిలో ఉన్నారు.

బరేలీ


• ఛత్రపాల్ సింగ్

కేంద్ర మాజీ మంత్రి సంతోష్ గంగ్వార్ ఇక్కడి నుంచి ఎనిమిదిసార్లు బీజేపీ తరఫున గెలిచారు! ఒక్క 2009 మినహాయిస్తే 1989 నుంచి అన్ని ఎన్నికల్లో గంగ్వార్‌దే గెలుపు! ఈసారి మాత్రం బీజేపీ ఆయన్ను పక్కన పెట్టింది. అదే సామాజిక వర్గానికి చెందిన ఛత్రపాల్ సింగ్ గంగ్వార్‌కు టికెటిచ్చింది. ఎస్పీ నుంచి ప్రవీణ్ సింగ్ అరాన్ బరిలో ఉన్నారు. బీఎస్పీ అభ్యర్థి ఛోటేలాల్ గంగ్వార్ నామినేషన్ తిరస్కరణకు గురవడం ఆ పార్టీకి షాకిచ్చింది. దీంతో ఇక్కడ ద్విముఖ పోటీయే నెలకొంది.

బదాయూ


• ఆదిత్య యాదవ్

ఎస్పీకి కీలకమైన స్థానమిది. 1996 నుంచి 2014 దాకా ఆ పార్టీకి కంచుకోట. 2009, 2014ల్లో ఎస్పీ అభ్యర్థి ధర్మేంద్ర యాదవ్ నెగ్గారు. 2019లో బీజేపీ అభ్యర్థి సంఘమిత్ర మౌర్య ఆయనపై కేవలం 18 వేల మెజారిటీతో విజయం సాధించారు. ఈ విడత దుర్విజయ్ శాక్యను బీజేపీ పోటీలో దించింది. ఎస్పీ కూడా సీనియర్ నేత శివపాల్ యాదవ్ ఒత్తిడితో ఆయన కుమారుడు ఆదిత్యకు టికెటిచ్చింది. ధర్మేంద్ర యాదవ్‌ను పక్కన పెట్టడం దానికి ప్రతికూలంగా మారొచ్చంటున్నారు.

ఆవ్లా


• ధర్మేంద్ర కశ్యప్

1989 నుంచి బీజేపీ ఇక్కడ ఆరుసార్లు గెలిచింది. 2009 నుంచి ఆ పార్టీకే ఇక్కడి ఓటర్లు పట్టం కడుతున్నారు. గత రెండు ఎన్నికల్లోనూ గెలిచిన ధర్మేంద్ర కశ్యప్‌కే ఈసారి కూడా బీజేపీ టికెట్ దక్కింది. ఎస్పీ నుంచి నీరజ్ మౌర్య, బీఎస్పీ తరఫున అబిద్ అలీ పోటీలో ఉన్నారు. ఇక్కడ 2014లో ఎస్పీ, 2019 ఎన్నికల్లో బీఎస్పీ రెండో స్థానంలో నిలిచాయి.

పరిచయం



రచనా బెనర్జీ. అందం, అభినయం కలబోసిన నటిగా దక్షిణాదికి చిరపరిచితం. ఒడిశా సినీ పరిశ్రమలోనూ వెలుగు వెలిగిన బెంగాలీ బ్యూటీ. దీదీ అనగానే తృణమూల్ అధినేత్రి మమతాయే గుర్తొస్తారు. అయితే సూపర్‌హిట్ బెంగాలీ టీవీ షో 'దీదీ నంబర్‌వన్'కు హోస్ట్‌గా అలరిస్తూ రచన దీదీ నంబర్‌వన్ అయ్యారు. తృణమూల్ నుంచే రాజకీయ అరంగేట్రమూ చేస్తున్నారు...! - సాక్షి, నేషనల్ డెస్క్

దీదీ కాదు...
దీదీ నంబర్‌వన్

నటిగా ప్రయాణం..

1974 అక్టోబర్ 2న కోల్‌కతాలో జన్మించిన రచన అసలు పేరు ఝుంఝుమ్ బెనర్జీ. కోల్‌కతా సౌత్ సిటీ కాలేజీలో డిగ్రీ చేశారు. 1990లో సెకండియర్లో ఉండగానే మిస్ కలకత్తా టైటిల్ గెలుచుకున్నారు. 1994లో మిస్ ఇండియా పోటీల్లోనూ పాల్గొన్నారు. ఆకర్షణీయమైన ముఖం, అందమైన చిరునవ్వు ఆమెకు బోలెడు సినీ అవకాశాలు తెచ్చిపెట్టాయి. బెంగాలీ చిత్రం 'డాన్ ప్రాటిడాన్'తో తొలిసారి వెండితెరపై కనిపించారు. బెంగాలీతో పాటు దక్షిణాదిలోనూ వరుసగా సినిమాలు చేశారు. కన్యాదానం సినిమాతో తెలుగువారికి పరిచయమయ్యారు. అమితాబ్ బచ్చన్, చిరంజీవి, మిథున్ చక్రవర్తి వంటి సూపర్ స్టార్లతో కలిసి పనిచేశారు. ఒరియా నటుడు సిద్ధాంత మహాపాత్రతో కలిసి ఏకంగా 40 సినిమాలు చేశారు. ప్రసేన్‌జిత్ ఛటర్జీతోనూ 35 బెంగాలీ సినిమాల్లో నటిస్తే వాటిలో 32 సూపర్ డూపర్‌హిట్లే! సినిమాలు చేస్తూనే వ్యాపారవేత్తగానూ ఎదిగారు. సామాజిక మాధ్యమాల్లో కూడా యాక్టివ్‌గా ఉంటారు. ఇన్‌స్టాగ్రాం, ఎక్స్‌లో రచనకు లక్షల్లో ఫాలోవర్లున్నారు.

రాజకీయాల్లోకి...

సినిమాలకు గుడ్‌బై చెప్పాక రచన టీవీపై దృష్టి సారించారు. సూపర్‌హిట్ బెంగాలీ టీవీ షో దీదీ నంబర్ వన్‌కు ముఖ్య అతిథిగా ఆహ్వానించడానికి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీని కలిశారు. రాజకీయాల్లోకి వెళ్తారని అప్పుడే ప్రచారం జరిగినా కొట్టిపడేశారు. బీజేపీకి బెంగాల్లో బలం పెరుగుతుండటం, పలువురు టీఎంసీ నేతలపై ఆరోపణల నేపథ్యంలో ఈ ఎన్నికల్లో బలమైన కొత్త ముఖాన్ని తెరపైకి తేవాలని మమత భావించారు. ఆ మేరకు భారీ ర్యాలీలో రచనను హుగ్లీ నుంచి లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించారు. అక్కడి బీజేపీ సిట్టింగ్ ఎంపీ లాకెట్ చటర్జీ కూడా సినీ నటే. పైగా రచనకు మంచి స్నేహితురాలు కూడా. అదంతా వ్యక్తిగతమని, పోటీ పోటీయేనని అంటున్నారు రచన.

వంద శాతం ఇస్తా...

తృణమూల్ కాంగ్రెస్‌లో చేరాల్సిందిగా మమత అడిగినప్పుడు కాస్త ఆలోచించి అంగీకరించినట్టు చెప్పారు రచన. ''దీదీ నాకు ఎన్నో ఏళ్లుగా తెలుసు. జీవితంలో ప్రతి దశలోనూ కొత్త అవకాశం వస్తుంది. దాన్ని అందిపుచ్చుకోవాలి. అందుకే లోక్‌సభకు దీదీ నా అభ్యర్థిత్వాన్ని ప్రకటించినప్పుడు పొంగిపోయా. నాన్న ఉంటే ఎంతో సంతోషించేవాడు. నా నిర్ణయంతో అమ్మ సంతోషంగా ఉంది. గతంలో లైవ్ స్టేజ్ షోల కోసం రెండు మూడుసార్లు హుగ్లీ వెళ్లా. ఇక నుంచి అదే నా అడ్డా. జీవితంలో ఏం చేసినా 100 శాతం చిత్తశుద్ధితో కష్టపడ్డా. అదే స్ఫూర్తితో నాయకురాలిగానూ రాణించి దీదీ నమ్మకం నిలబెడతా'' అన్నారు.



ఇవిగో నవరత్నాల వెలుగులు

సమస్యల నుంచి గట్టెక్కి హాయిగా జీవనం



మా ఆయన శ్రీనివాస్ పదేళ్ల క్రితమే కన్నుమూశారు. రజక వృత్తి చేసుకుని జీవించే మా పరిస్థితులు తల్లకిందులయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణం, మావుళ్లమ్మపేటలో ఇద్దరు కుమారులతో కుటుంబాన్ని నెట్టుకు రావడానికి నేనే ఇస్త్రీ పనిచేయడం ప్రారంభించాను. తరువాత పెద్ద కొడుకు దుర్గా ప్రసాద్ కూడా ఇస్త్రీ పని చేస్తున్నాడు. రెండో కొడుకు రాజు పెయింటింగ్ పని చేస్తున్నాడు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి సాయం అందక రెక్కల కష్టంతోనే ఎన్నో సమస్యలకోర్చి జీవించాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మా పరిస్థితుల్లో మార్పు వచ్చింది. జగనన్న చేదోడు పథకం కింద నాకు ఏటా రూ.10 వేలు, వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.18,750 చొప్పున, వైఎస్సార్ ఆసరా కింద రూ.4,500 చొప్పున 4 సార్లు వచ్చింది. నా పెద్ద కొడుక్కు జగనన్న చేదోడు కింద రూ.10 వేలు అందింది. నా మనవరాలు కీర్తనకి అమ్మఒడి పథకం వచ్చింది. ఇంటి స్థలం కూడా అందించారు. ఇంటి నిర్మాణానికి రుణం కూడా మంజూరైంది. మా జీవితాలు మార్చిన జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

–సజ్జవరపు వెంకటలక్ష్మి, మావుళ్లమ్మపేట

ఆపదలో ఆదుకున్న సర్కార్



మా ఆయన వీరభద్రరావు చర్చి పాస్టర్. మా కుమారులు అనిల్, చందు డిగ్రీ చదువుతున్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ఉంటున్న మాకు మా ఆయన సంపాదనే ఆధారం. ఆదాయం అంతంతమాత్రంగానే ఉండటంవల్ల పిల్లల చదువులపై ఎప్పుడూ భయం ఉండేది. వారిని ఎలా తీర్చిదిద్దాలనే నిరంతరం సతమతం అయ్యేవాళ్లం. గత ప్రభుత్వంలో మాకు ఎలాంటి సాయం అందలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మా పరిస్థితుల్లో మార్పు వచ్చింది. పిల్లల చదువుకు ఫీజు రియింబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం రూ.70 వేలు ఆర్థిక సహాయం అందించింది. మా ఆయనకు నెలకు రూ.5 వేలు వంతున గౌరవ వేతనం లభిస్తోంది. ఏడాది క్రితం ఆయన ఆరోగ్యం క్షీణిస్తే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద గుండెకు శస్త్ర చికిత్స ఉచితంగా చేశారు. దానికిగాను ప్రభుత్వం రూ.లక్షకు పైగా అందించింది. అన్ని విధాలుగా మా కుటుంబానికి అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– పెదపాటి సుజాత, ప్రత్తిపాడు

భజనసేన మాకొద్దు!

తెగేసి చెబుతున్న ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు

తాను ఎదగాలని ఏ రోజూ కోరుకోలేదని మొన్న కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని ఇంద్రపాలెం, సామర్లకోట సభల్లో పవన్ కళ్యాణ్ స్వయంగా వల్లె వేశారు. తాను కులాలకు అతీతమంటూనే కాపులకు ప్రాధాన్యమేదని ప్రశ్నిస్తారు. రాష్ట్ర మంతా జల్లెడ పట్టి ఆ సామాజిక ఓటర్లు అధికంగా ఉన్న పిఠాపురం నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు. ఇతర కులాల పట్ల విద్వేష పూరితంగా మాట్లాడతారు. గతంలో టీడీపీని పలుమార్లు తూర్పారబట్టిన పవన్.. ఇప్పుడు అదే పార్టీ అడుగులకు మడుగులొత్తుతూ తన ఫ్యాన్స్ నుంచే ప్యాకేజీ స్టార్‌గా గుర్తింపు పొందారు. బీజేపీని తీవ్రంగా నిందించిన ఆ నోటితోనే అత్యద్భుతమని పొగుడుతారు. మాటలో నిజాయితీ, వ్యవహారంలో స్థిత ప్రజ్ఞత, మనిషిలో స్థిరత్వం మచ్చుకైనా కనిపించని పవన్ నాయకత్వంలోని భ'జనసేన'లో ఇక కొనసాగలేమని పలువురు నేతలు ఆ పార్టీని వీడుతున్నారు.


సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: నేను ప్రశ్నిస్తాను.. నిలదీస్తాను.. ఎదిరిస్తాను.. అంతు తేలుస్తాను.. ప్రజల పక్షాన నిలుస్తాను... అంటూ నిత్యం ఊగిపోతూ డాంబికాలు పలికే జనసేనాని పవన్ కళ్యాణ్ తన సొంత పార్టీ నాయకులు, క్యాడర్ ప్రశ్నలకు కనీస స్థాయిలో సమాధానం చెప్పుకునే స్థితిలో లేరనే తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ నేతల నుంచి తమకు ఎదురవుతున్న తీవ్ర అవమానాలు, అసహనాలు, ఈసడింపులు, ఛీత్కారాలను తట్టుకోలేకపోతున్నామని జన సైనికులు ఆవేదన చెందుతున్నారు. జనసేనాని తీరుతోనూ వరుసగా పార్టీని వీడిపోయే వారే తప్ప కొత్తగా వచ్చి చేరే వారు మచ్చుకు ఒక్కరూ కనిపించడం లేదంటున్నారు. జనసేన ఆవిర్భావ సమయంలో ఏదో సాధించేస్తారనే అంచనాలతో పవన్ పక్కన చేరిన మేధావులు, మాజీ ఉన్నతాధికారులు, సీనియర్ నాయకులకు ఆయన తత్వం త్వరగానే బోధపడి తమ దారి చూసుకున్నారు. రాజకీయాలపై ఆసక్తితో, ఏదో ఒకటి చేయకపోతారా, పార్టీని ముందుకు తీసుకెళ్లకపోతారా, మంచి రోజులు రాకపోతాయా? అనే ఆశతో ఇటీవలి వరకు కొనసాగిన వారికి మాత్రం తమ దింపుడు కల్లం ఆశలు ఆవిరై జనసేనకు జెల్లకొట్టి ఇతర పార్టీల్లోకి చేరిపోతున్నారు. కొందరేమో చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభమేంటన్న భావనతో క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటూ తాజా పరిస్థితులను గమనిస్తున్నారు. ఇంకొందరు పదవులపై ఆశలు వదులుకుని రాజకీయాలకు పూర్తిగా దూరమయ్యారు. కూటమిలో సీట్ల సర్దు'పాట్ల'ను చూసిన తర్వాత దాదాపు రోజూ జనసేనలో రాష్ట్ర స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి హోదా కలిగిన నాయకులు 'పవన్.. నీకో నమస్కారం..' అంటూ గుడ్ బై చెబుతూనే ఉన్నారు. చివరకు తోక పార్టీగా మారి సైకిల్ వెనుక తిరిగేలా, టీడీపీకి సేవ చేసుకునే 'సేన'లా జనసేనాని చేసేశారని, కనీస గౌరవ మర్యాదలూ దక్కడం లేదని జనసేన శ్రేణులు మథన పడుతున్నాయని ఆ పార్టీని వీడిన వారు వివరిస్తున్నారు.

ప్రతి అడుగులోనూ తొట్రుపాటే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, టీడీపీలకు ప్రత్యామ్నాయంగా నిలుస్తామనే అంచనాలతో కొణిదెల చిరంజీవి 'ప్రజారాజ్యం' పార్టీని స్థాపించి ఎన్నికల్లో పోటీచేసి ఓటమి చవిచూశారు. కాలక్రమంలో జెండా ఎత్తేసి కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా పదవిని అనుభవించారు. అన్నకు తోడుగా ప్రజారాజ్యంలో యువరాజ్యం చీఫ్‌గా చలామణీ అయిన పవన్ కళ్యాణ్.. 2014 ఎన్నికలకు ముందు 'జనసేన'ను స్థాపించినప్పటికీ ప్రతి అడుగులోనూ తొట్రుపాటే కనిపిస్తోందనేది రాజకీయ విశ్లేషకుల మాట. పార్టీ ఆవిర్భావంలో టీడీపీ, బీజేపీలతో జత కట్టిన పవన్, ఏ ఎండకా గొడుగు అన్నట్లు ఎక్కడి మాటలు అక్కడ మాట్లాడుతూ తన అవసరాలు కానిచ్చేసుకుంటూ వచ్చారు. 2019 నాటికి టీడీపీకి మేలు చేసేలా 'రహస్య ఒప్పందాలు'తో తన జనసేనే ప్రత్యామ్నాయమనే రీతిలో ఎన్నికల బరిలోకి దిగి.. గాజువాక, భీమవరంలో పోటీచేసి ఓటమి పాలయ్యారు. తాజా ఎన్నికల్లోనూ టీడీపీ, బీజేపీలతో కూటమి కట్టిన పవన్.. చంద్రబాబు కోసం నానా ప్రయాసలకు లోనవుతూ తన నటనానుభవాన్ని రంగరించారు. చివరకు 21 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలకు అంగీకరించి ప్రత్యక్ష రాజకీయాల్లో తలపడాలనుకున్న అనేక మంది ఆశావహులపై నీళ్లు చల్లారు. పిఠాపురం నుంచి స్థానికేతరుడిగా బరిలో నిలిచి .. స్థానికురాలు, విద్యావంతురాలు, సీనియర్ రాజకీయవేత్త అయిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వంగా గీతతో పోటీ పడటానికి కిందామీదా పడుతున్నారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

మేధావి వర్గం ముందే మేల్కొని..

తమిళనాడు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా పని చేసిన ఆర్.ఆర్.రామ్మోహన్‌రావు, సీబీఐ మాజీ డైరెక్టర్, ఐపీఎస్ అధికారి జె.డి.లక్ష్మీనారాయణ, ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్, ఐఆర్‌ఎస్ అధికారి చింతల పార్థసారథి, మాదాసు గంగాధరం, ముత్తంశెట్టి కృష్ణారావు, రాఘవయ్య, బైరా దిలీప్, ఆకుల చంద్రశేఖర్ లాంటి వారెందరో పవన్ రాజకీయ పరిజ్ఞానాన్ని, వ్యవహార శైలిని పసిగట్టి పక్కకు తప్పుకున్నారు. రాజకీయాలపై ఆశలున్న వారు పలువురు పార్టీలోకి అడుగిడి రూ.కోట్లు, లక్షలు పోగొట్టుకున్న తర్వాత మేల్కొని దూరమయ్యారు. తాము ఏ విధంగా మోసపోయిందీ ఏకరువు పెట్టారు కూడా. 2019 ఎన్నికల్లో గాజువాక, భీమవరం నుంచి పవన్ ఓడిపోయినా, రాజోలు నుంచి రాపాక వరప్రసాద్ గెలుపొందారు. పలు నియోజకవర్గాల్లో గౌరవప్రదమైన ఓట్లను పొందిన జనసేన అభ్యర్థులకు తాజా ఎన్నికల్లో కూటమి తరఫున సీట్లు సాధించుకోవడంలోనూ పవన్ పూర్తిగా విఫలమయ్యారు. విజయవాడ వెస్ట్‌లో బీసీ వర్గానికి చెందిన పోతిన మహేష్, ఉమ్మడి కృష్ణాలో బండి రామకృష్ణ, బండ్రెడ్డి రామకృష్ణ, గుంటూరు జిల్లాలో బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, చిల్లపల్లి శ్రీనివాసరావు, అప్పారావు, నేరెళ్ల సురేష్, దర్శికి చెందిన ఎన్ఆర్ఐ వెంకట్, తూర్పు గోదావరికి చెందిన తుమ్మల బాబు, శెట్టిబత్తుల రాజబాబు, ముత్తా శశిధర్, పితాని బాలకృష్ణ, పాతంశెట్టి సూర్యచంద్ర తదితరులు జనసేన బాధిత వర్గంగా మిగిలిపోయారు. అవనిగడ్డ సీటు ఆశించిన వారిదీ అధోగతేనని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.



కొన్ని జిల్లాలకే పరిమితం

రాష్ట్ర స్థాయి పార్టీగా ఆవిర్భవించిన జనసేనను పవన్ కళ్యాణ్ తన అపరిపక్వతతో అతి తక్కువ సీట్లతో కొన్ని జిల్లాలకే పరిమితం చేశారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఆ సీట్లు కూడా చాలా మంది టీడీపీ నేతలకే ఇచ్చారు. జనసేన ఆవిర్భవించి దశాబ్ద కాలమైనా సంస్థాగతంగా కనీస స్థాయిలో బలపడలేదు. చివరకు పార్టీ గుర్తునూ సక్రమంగా దక్కించుకోలేని స్థితిలోకి జనసేన దిగజారింది. 'జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మాటలను, ఆయన బంధం వ్యవహారాలను అంచనా వేసుకోలేక అమెరికా నుంచి కుటుంబం మొత్తం వచ్చి పీకల్లోతు కష్టాల్లో ఇరుక్కుపోయాం. కోట్ల రూపాయలు పోగొట్టుకుని నష్టపోయాం. సీటు ఇస్తామంటూ మోసం చేశారు' అని దళిత మహిళ సి.సుభాషిణి ఆవేదనలో జనసేన చేతిలో దెబ్బతిన్న వారందరి గుండె ఘోష వినిపిస్తోంది. జనసేన నాయకులు, కార్యకర్తలు తమ వెంట నడవడానికి, వేదికను పంచుకోవడానికి కూడా పలువురు టీడీపీ నాయకులు అంగీకరించడం లేదంటే పరిస్థితి ఎంతగా దిగజారిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదని జనసేన నేతలు వాపోతున్నారు.

పవర్ లెస్!

పిఠాపురంలో పని చేయని పవన్ మానియా

అందుకే మెగా ఫ్యామిలీని దింపుతున్నారని చర్చ

పలువురు బుల్లితెర నటులు సైతం ప్రచారం

ఇంత మంది వస్తే గానీ నెగ్గలేనని అనుమానం!

తానొక్కడిని గెలిస్తే చాలనుకుంటున్న వైనం

పిఠాపురం: జనసేన అభ్యర్థుల గెలుపుసంగతేమోగానీ, పిఠాపురంలో తాను గెలిస్తే చాలనే స్థితికి వచ్చారు జనసేన అధినేత పవన్ కళ్యాణ్. నాయకుడిగా తాను నిలబెట్టిన వారి గెలుపు సంగతి పక్కనబెట్టి, అధిక సమయం తన కోసమే కేటాయించుకున్నారని ఆ పార్టీ నేతల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తానొక్కడే గెలిచి అసెంబ్లీకి వెళితే చాలన్నట్టుగా ఉంది ఆయన శైలి అని జనసేన శ్రేణులు వాపోతున్నాయి. పవన్ అన్న నాగబాబు నెల రోజులుగా పిఠాపురంలోనే తిష్ట వేశారు. నాగబాబు తనయుడు వరుణ్‌తేజ్ ఇప్పటికే ఇక్కడ ప్రచారం చేశారు. నాగబాబు భార్య సైతం మరిది కోసం ప్రచారంలో పాలు పంచుకున్నారు. పవన్ మేనల్లుడు వైష్ణవ తేజ్ కూడా పిఠాపురంలో తిరగాల్సిన పరిస్థితి. వీరికితోడు జబర్దస్త్ టీం మొత్తం ఇక్కడ వాలిపోయింది. అయినప్పటికీ పిఠాపురంలో ప్రచారం సరిపోదనుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అందువల్లే మెగాస్టార్ చిరంజీవిని పిఠాపురంలో ప్రచారానికి రప్పిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. పదుల సంఖ్యలో తారలు దిగి వస్తున్న తీరు చూస్తుంటే పిఠాపురంలో తన గెలుపుపై పవన్‌కు నమ్మకం లేదనేది స్పష్టమవుతోందంటున్నారు. ప్రచార ఆర్భాటం, మద్యం, డబ్బు లేని ఎన్నికలు రావాలని తెగ గొప్పలు చెప్పిన పవన్.. ఇప్పుడు రూ.కోట్లు వెదజల్లడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ దఫా ఎమ్మెల్యే కాకపోతే ఇక తన రాజకీయ జీవితం ముగిసినట్టే అని అభిప్రాయ పడుతున్నట్టు తెలుస్తోంది. అందుకోసం పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టాలనే నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. ఇందులో మెగా హీరోలు, జబర్దస్త్ ఆర్టిస్టుల స్పెషల్ ఫ్లైట్ చార్జీలు, ఇతర ఏర్పాట్లకు అవుతున్న ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయంటున్నారు. ఒక పాన్ ఇండియా సినిమా బడ్జెట్ అంత ఖర్చుకు సిద్ధమయ్యారని ఇక్కడి ఏర్పాట్లు చూస్తుంటే ఇట్టే అర్థమవుతోంది. ఇంత ఖర్చు పెడుతున్నా అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను ఎదుర్కోవడం కష్టంగా ఉందని జనసేన నేతలు ఒప్పుకుంటున్నారు. కాగా, పిఠాపురంలో చక్రం తిప్పుతున్నానని చెప్పుకుంటున్న టీడీపీ నేత ఖర్చే భారీగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయనకే రోజూ పెద్ద మొత్తంలో చెల్లించుకుంటున్నారని జనసేన నాయకులు చర్చించుకుంటున్నారు.

మీకు తెలుసా?

చంద్రబాబు తన మేనిఫెస్టోలో రూ. 25 లక్షల వరకు ఆరోగ్య బీమా అందిస్తారట...!

ఇప్పటికే సీఎం జగన్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఈ విషయం తెలిసి కూడా నిస్సిగ్గుగా బాబు తన మేనిఫెస్టోలో చోటు కల్పించారు. మీకు తెలుసా?



'ప్రకాశం' తొలి ఓటరు నాగలక్ష్మీబాయి

ప్రకాశం జిల్లాలో మొదటి ఓటరుగా యర్రగొండపాలెం మండలంలోని పాలుట్ల గిరిజన గూడేనికి చెందిన జండావత్ నాగలక్ష్మీబాయి స్థానం సంపాదించుకున్నారు. జిల్లాలో నియోజకవర్గాలు యర్రగొండపాలెం (102) నుంచి ప్రారంభమవుతాయి. యర్రగొండపాలెం మండలంలోని పాలుట్ల గిరిజనగూడెంలో మొదటి బూత్ ఏర్పాటు చేస్తారు. అక్కడి నుంచే ఓటరు జాబితా కూడా ప్రారంభమవుతుంది. దట్టమైన నల్లమల అభయారణ్యంలో ఉన్న పాలుట్ల గిరిజన గూడెం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం. మైదాన ప్రాంతం నుంచి పాలుట్ల చేరుకోవడానికి సరైన రోడ్డు మార్గం లేదు. మొనదేలిన బండ రాళ్లతో కూడిన దారిలోనే అక్కడికి చేరుకోవాలి. పోలింగ్ ముగిసిన తర్వాత రాత్రి వేళ అడవిలో ప్రయాణించడం ప్రమాదకరం కావడంతో 1999లో అప్పటి ప్రభుత్వం హెలికాప్టర్ కేటాయించింది. ఇప్పుడు పాలుట్ల వెళ్లేందుకు ప్రత్యేక కమాండర్ జీపులను వినియోగిస్తున్నారు.

నాటి ఏలికలు బరిలో లేరిక!

తంబళ్లపల్లె అంటే టీఎన్ కుటుంబమే రాజకీయంగా గుర్తొచ్చే పేరు. ఆ కుటుంబం ఒకదశలో రాజకీయాలకు గుడ్‌బై చెప్పగా ఆ స్థానాన్ని కలిచర్ల కుటుంబం భర్తీ చేసింది. వారికి పోటీగా అనిపిరెడ్డి కుటుంబం క్రియాశీలమైంది. ఈ రెండు కుటుంబాలకు వ్యతిరేకంగా చల్లపల్లె నరసింహారెడ్డి ఒంటరి పోరాటమే చేశారు. టీఎన్ కుటుంబం నాలుగుసార్లు కాంగ్రెస్ నుంచి గెలవగా చివరగా ఒకసారి ఇండిపెండెంట్‌గా పోటీచేసి గెలిచారు. టీఎన్ వెంకటసుబ్బారెడ్డి రెండుసార్లు, టీఎన్.అనసూయమ్మ రెండుసార్లు, టీఎన్ శ్రీనివాసులురెడ్డి ఒకసారి గెలిచారు. కలిచర్ల నరసింహారెడ్డి ఒకసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన కుమారుడు కలిచర్ల ప్రభాకర్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా 1989లో విజయం సాధించారు. 2009లో పీఆర్‌పీతో పోటీచేసి ఓటమిపాలై తరువాత పోటీకి దూరమయ్యారు. వారి వారసుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్నారు. ఏవీ ఉమాశంకర్‌రెడ్డి రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరిస్తూ టీఎన్, కలిచర్ల కుటుంబాలను ఎదురొడ్డి నిలబడ్డారు. ఆయన సతీమణి అనిపిరెడ్డి వెంకట లక్ష్మీదేవమ్మ ఆయన వారసత్వాన్ని కొనసాగించారు.

ఈవీఎం మొరాయిస్తే...

పోలింగ్ సమయంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ క్రమం తప్పితే బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు వీవీప్యాట్‌తో కూడిన కొత్త సెట్ ఏర్పాటు చేస్తారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో రిజర్వ్ దశ నుంచి పని చేయని దశ వరకు నమోదైన ఓట్లు, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ బ్యాలెట్ స్లిప్పులు కంపార్ట్‌మెంట్ మెమొరీలో భద్రంగా ఉంటాయి. వీవీప్యాట్ మాత్రమే పనిచేయకుంటే కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లు దాని మెమొరీలో భద్రంగా ఉంటాయి. దీంతో పని చేయని వీవీప్యాట్ స్థానంలో రిజర్వ్‌లో ఉంచిన వీవీప్యాట్‌ను ఏర్పాటు చేసి పోలింగ్ తిరిగి ప్రారంభిస్తారు. ఏదైనా సాంకేతిక కారణాలతో కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లను నిర్ధారించకుంటే కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ స్లిప్పులను లెక్కిస్తారు. ఈవీఎంలకు విద్యుత్ సరఫరా అవసరం లేదు. ఈవీఎం, వీవీప్యాట్‌లకు సొంతంగా బ్యాటరీ/పవర్-ప్యాక్ సౌకర్యం ఉండడంతో విద్యుత్ సరఫరా లేని ప్రాంతాల్లో సైతం వీటిని ఉపయోగించవచ్చు.

అన్నదాత ఇంట సిరుల పంట

▶ మొదటి పేజీ తరువాయి


గరిష్ఠంగా 175.12 లక్షల టన్నుల దిగుబడులు వచ్చాయి. వ్యవసాయ శాఖ చరిత్రలోనే ఇదే గరిష్ఠం. 2014–19 మధ్యలో సగటున 153.95 లక్షల టన్నులుగా నమోదైతే, 2019–24 మధ్య ఇది 162.04 లక్షల టన్నులు. బాబు హయాంతో పోల్చుకుంటే 8 లక్షల టన్నులకు పైగా పెరిగింది.


అన్నదాతకు చేయూత అందిందిలా..

ఆర్బీకేల ద్వారా ఈ–క్రాప్ నమోదు ప్రామాణికంగానే సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు పంపిణీ చేశారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలిచ్చారు. రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకొని ఏడాది లోపు చెల్లించిన వారికి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద వడ్డీ రాయితీ జమ చేశారు. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా 3 విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం, వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఆ సీజన్ చివర్లో పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించారు. నోటిఫై చేసిన పంటలకు మరుసటి సీజన్ ప్రారంభానికి ముందుగానే పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద పరిహారం ఇచ్చారు.

వరుసగా ఐదేళ్లూ పెట్టుబడి సాయం

ఐదేళ్లలో 75.82 లక్షల మందికి రూ.1,380 కోట్ల సబ్సిడీతో కూడిన 45.16 లక్షల టన్నుల విత్తనాలు, 15 లక్షల మందికి రూ.14 కోట్ల విలువైన 1.36 లక్షల లీటర్ల పురుగుల మందులు, 176.36 లక్షల టన్నుల ఎరువులు పంపిణీ చేశారు. 5.13 కోట్ల మందికి రూ.8.37 లక్షల కోట్ల పంట రుణాలు అందించారు. మరొక వైపు వైఎస్సార్ రైతు భరోసా కింద 53.58 లక్షల రైతు కుటుంబాలకు రూ.34,288 కోట్ల పెట్టుబడి సాయం, వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద 54.58 లక్షల మందికి రూ.7,802.05 కోట్లు, ఇన్‌పుట్‌సబ్సిడీ రూపంలో 34.41 లక్షల మందికి రూ.3,261.60 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం కింద 84.67 లక్షల మందికి రూ.2,050.53 కోట్లు అందించారు. ఇలా అన్ని విధాలుగా చేయూతనివ్వడంతో రైతులు విపత్తులు విరుచుకుపడిన దశలోనూ ఆత్మస్థైర్యం కోల్పోకుండా సాగు చేశారు. టీడీపీ ఐదేళ్లలో రూ.40,236.91 కోట్ల విలువైన 2.65 కోట్ల టన్నుల ధాన్యాన్ని 17.94 లక్షల మంది నుంచి కొనుగోలు చేయగా, ఈ ఐదేళ్లలో రూ.65,313.21 కోట్ల విలువైన 3.40 కోట్ల టన్నుల ధాన్యాన్ని 37.81 లక్షల మంది నుంచి కొనుగోలు చేశారు.





సతీమణి పేరిట నాథుని లీలలు

▶ మొదటి పేజీ తరువాయి

విలువ ఎంతో ఎవరికీ తెలియని పరిస్థితి.

బినామీలతో ముడుపుల దందా..

మంత్రిగా ఉన్న సమయంలో తన బినామీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి రోడ్డు పనులు మంజూరు చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో ఆ సంస్థ పనులు చేయలేదు. దీంతో స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి గ్యారిసన్ కంపెనీకి రూ.4.95 కోట్లకు సబ్‌కాంట్రాక్ట్ ఇప్పించారు. ఇందుకు సంబంధించి రూ.3.75 కోట్లు బిల్లు సదరు బినామీ కన్‌స్ట్రక్షన్స్‌కు చేరింది. ఈ నగదును గ్యారిసన్‌కు ఇవ్వకపోవడంతో సదరు సంస్థ ప్రతినిధులు వి.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చేసేదిలేక సదరు కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం 10 శాతం కమీషన్ తీసుకుని, మిగిలిన డబ్బులు గ్యారిసన్‌కు ఇచ్చినట్లు సమాచారం. ఆ కమీషన్‌ను ఈ మాజీ అమాత్యుడే తీసుకున్నట్లు ప్రస్తుత ఎమ్మెల్యే బహిరంగంగానే మీడియాకు వెల్లడించారు.

ఏపీఐఐసీ స్థలాల్లో చేతివాటం

సెజ్ ఏర్పాటు విషయం తెలుసుకుని గంద్రాజుపల్లి వద్ద రైతుల నుంచి డీకేటీ భూమి ఎకరా రూ.70 వేలు, పట్టా భూమి ఎకరా రూ.లక్ష చొప్పున 170 ఎకరాలను కొనుగోలు చేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములను ఎకరా రూ.5.5 లక్షలకు ఎల్ఏలో నిర్ణయించింది. దీనిపై మాజీ మంత్రి కో బ్రదర్ ద్వారా కోర్టుకెళ్లారు. ఈయన మంత్రి అయ్యాక తన శాఖ ఉన్నతాధికారుల సాయంతో 17.5 ఎకరాలను వెనక్కి తెచ్చుకున్నారు. దీని విలువ ఇప్పుడు ఎకరా రూ.కోట్లలో పలుకుతోంది. సెజ్‌లో పెద్ద పరిశ్రమల అనుమతులు, భూ కేటాయింపుల్లోనూ చినబాబుతో కలిసి భారీగా దోచుకున్నట్లు ఆరోపణలున్నాయి. పలమనేరు పట్టణ సమీపంలోని ఎంఎస్ఎంఈ కేటాయింపుల్లోనూ ఆయన అనుచరుల చేతివాటంపై స్థానికులు ఎవరిని అడిగినా కథలు కథలుగా చెబుతారు.

బినామీ కంపెనీ రూటే సెప'రేటు'

గత టీడీపీ హయాంలో
నీరు–చెట్టు, సీసీ, బీటీ రోడ్లు, ఇరిగేషన్ కాంట్రాక్టులు
ఇలా అన్ని రకాల పనులు చేపట్టేందుకు తన సమీప బంధు
వుల ఆధ్వర్యంలో ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ఎస్వీఆర్ కంపెనీలను
ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ పనులు చేపట్టాలన్నా
ఆ సంస్థలకే కేటాయించేశారు. అప్పట్లో నీరు–చెట్టు పథకంలో 520
పనులు కేవలం నామినేషన్ ద్వారా జరిగాయి. ఇందులో 20 శాతం పను
లను అప్పటి అమాత్యుని కంపెనీకే కట్టబెట్టారు. ఈయనకు చెందిన సంస్థే
జన్మభూమి కమిటీల పేరిట బినామీగా ఈ పనుల్ని దక్కించుకుంది. దీని
ద్వారా రూ.కోట్లలో అడ్డగోలుగా దోచేశారు. కౌండిన్య ఎలిఫెంట్ శాం
క్చురీ పరిధిలో ఏనుగులు అడవి దాటి పంట పొలాల్లోకి రాకుండా
అటవీశాఖ నాలుగు విడతలుగా 170 కి.మీ. మేర రూ.5.50
కోట్లతో ఎలిఫెంట్ ట్రెంచ్ పనులు చేపట్టింది. ఇందులో కాలు
వపల్లి బీట్ 28 కి.మీ. పనుల్ని ఈయన అనుయాయులే
దక్కించుకుని, నాసిరకంగా చేపట్టారన్న ఆరోప
ణలు అప్పట్లో వెల్లువెత్తాయి.

నమ్మకం కోల్పోయిన ప్రజలు

టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న సదరు నేత, 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీలో చేరి ఫ్యాన్ గుర్తుపై గెలిచారు. పదవి కోసం పార్టీని వీడారు. 2019లో టీడీపీ నుంచి బరిలో నిలిచినా జనాలు ఛీకొట్టారు. పదవుల కోసం పార్టీలు మారే ఆయన్ని నమ్మేదెలా గబ్బా అంటూ జనాలు చెప్పుకుంటున్నారు. మంత్రి పదవిలో ఉన్నప్పుడు ఆయన్ని కలవాలన్నా.. స్థానికులకు వీలయ్యేది కాదు. తమ కష్టాల్ని చెబుదామని విజయవాడలోని ఆయన ఆఫీసుకు వెళ్లినా.. పీఏలతో మాట్లాడి తిరుగుముఖం పట్టాల్సి వచ్చేది. దీంతో ఇప్పటికీ ఆయన వెంట నడిస్తే.. ఒరిగేదేమీ ఉండదని నియోజకవర్గ ప్రజల మాట.

24 క్రిమినల్ కేసులు

సదరు మాజీ అమాత్యుని పేరిట ముదివేడు, ములకలచెరువు, పలమనేరు, బంగారుపాలెం, నరహరిపేట, తిరుచానూరు, చిత్తూరు 2టౌన్, పూతలపట్టు, బైరెడ్డిపల్లి, గుడుపల్లి, కుప్పం, తాడేపల్లి, రాళ్లబూదుగూరు, వీకోట, చిత్తూరు 1టౌన్, అనంతపూర్ జిల్లా డి.హీరేలాల్ పీఎస్‌లలో మొత్తం 24 క్రిమినల్ కేసులున్నాయి.

నిజమైన లౌకికవాది జగన్



వర్తమాన దేశ రాజకీయాల్లో కుల, మత, ప్రాంత, పార్టీ భేదాల్లేకుండా ప్రజలందరి సంక్షేమం కోసం కృషి చేస్తున్న లౌకికవాది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్లు అందించడం ఎవరూ ఊహించ సాహసించలేనిది. ఆస్పత్రులు, వైద్య కళాశాలలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, నాడు–నేడులో స్కూళ్ల అభివృద్ధిఇలా అన్ని వర్గాల వారికి అవసరమైన ప్రతి ఒక్కటీ అమలు చేయడంలో సీఎం జగన్ చిత్తశుద్ధి చాలా గొప్పది. మళ్లీ మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలి.

- వీఎస్‌వీ ప్రసాద్, ఐక్య టవర్స్, మెయిన్‌రోడ్, తణుకు

మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరే మైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

బూటకపు హామీలను నమ్మం



2014 ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేనలు 650 బూటకపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాయి. ఆ తర్వాత వాటిని నెరవేర్చలేదు. వీరి మోసాన్ని గుర్తించిన ప్రజలు 2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడించారు. అప్పట్లో చంద్రబాబు అండ్ కో చెప్పే అబద్ధాలను ప్రజలు మర్చిపోయారనుకుని, మరోసారి వంచించేందుకు గుంపుగా వస్తున్నారు. జనాలకు అన్నీ గుర్తున్నాయి. వీరికి ప్రజలు తప్పకుండా గుణపాఠం నేర్పుతారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే జగన్‌పైనే ప్రజల నమ్మకం. అందుకే ఎన్నికలు ఏవైనా గెలుపు జగన్‌దే.

- గుర్రాల శివ కోటేశ్వరరావు, గుజ్జనగుండ్ల, గుంటూరు సిటీ

సంక్షేమానికి జై



- ఇంటికి పెద్దకొడుకులా అన్నింటా అండగా నిలిచారు
- సీఎం జగన్ పాలనపై అన్ని వర్గాల సంతృప్తి
- ఆయన రాకపోతే పథకాలు ఆగిపోతాయోమనే అందోళన
- సాక్షి రోడ్డుషోలో ఓటర్ల మనోగతం

ఆయన మేలును జన్మలో మరువలేం... జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు మా జీవితాల్లో వెలుగులు నింపాయి. మహిళలకు అనేక పథకాలతో చేయూతనిచ్చి అన్నలా, తమ్ముడిలా ఆదుకొన్నారు. నాణ్యమైన ఇంగ్లిష్ విద్యతో పాటు స్కూళ్ల రూపురేఖలు మార్చేశారు.. డాక్టరు ఇంటికే వచ్చి వైద్యం చేస్తున్నాడు.. ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఇంటికే అన్ని సర్టిఫికెట్లు అందిస్తున్నారు.. వివిధ పథకాలతో అన్ని వర్గాలకు అండగా నిలిచారు.

ఉమ్మడి కృష్ణా జిల్లా 'సాక్షి రోడ్‌షో'

మళ్లీ జగన్ పాలన రావాలి అని.. కృష్ణా జిల్లా 'సాక్షి రోడ్‌షో'లో ఓటర్లు తమ మనోగతాన్ని పంచుకున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 75 కిలోమీటర్ల పరిధిలో రోడ్‌షో బృందం పర్యటించింది. సాక్షి అని చెప్పకుండా.. సర్వే అని చెప్పి మాట్లాడించే ప్రయత్నం చేశాం. నగరాలు, పట్టణాలు, పల్లెల్లో రచ్చబండలు, బస్టాండులు, మార్కెట్ సెంటర్లలో మహిళలు, వృద్ధులు, రైతులు, చేతివృత్తిదారులు, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ముఠా కూలీలు, వ్యాపారులు, యువత ఇలా అన్ని వర్గాలతో బృందం ముచ్చటించింది. విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, మైలవరం, గన్నవరం, పెనమలూరు, పామర్రు, విజయవాడ తూర్పు నియోజకవర్గాల్లో సాగిన రోడ్‌షోలో ఎవరికి ఎందుకు ఓటేస్తామో ఓటర్లు స్పష్టం చేశారు.

- ఓబుల్‌రెడ్డి వెంకట్రామిరెడ్డి, సాక్షి ప్రతినిధి, విజయవాడ

విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో..

ఉదయం 6.30 గంటలు: విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్.. ముఠా కార్మికులు, హోటళ్లలో పని చేసే రోజు వారీ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, తోపుడు బళ్లపై కూరగాయలమ్మే వ్యక్తులు, ఆటో కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులతో సందడిగా కనిపించింది. పలువురు ప్రైవేటు ఉద్యోగులతో సాక్షి బృందం ముచ్చటించింది.

సాక్షి బృందం: మరో పదిరోజుల్లో ఎన్నికలున్నాయి కదా.. ఈ సారి ఓటెవరికి వేస్తారు.. వెంటనే ముఠాకూలీ వెంకటనారాయణ స్పందిస్తూ.. ప్రస్తుత ప్రభుత్వ పాలన బాగానే ఉంది. అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా పథకాలు ఆదుకుంటున్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో చదువులు బాగున్నాయని సమాధానమిచ్చాడు. వెంటనే భవన నిర్మాణ కార్మికురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ.. నా పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్నారు. ఈ ప్రభుత్వ పాలనలో చదువులు బాగున్నాయని సమాధానమిచ్చింది. అక్కడే మెహరాజ్‌ను పలకరించగా..పేదల అవసరాలు తీర్చేలా జగన్ పాలన ఉందని మెచ్చుకున్నాడు. అక్కడే కబేళా సెంటర్‌లో ఆటోకార్మికుల్ని పలకరించాం.



నున్న గ్రామంలో ప్రజల మధ్య రాజకీయ చర్చ

ఎక్కువ శాతం **జగన్ పాలన బాగుంది.. మళ్లీ** ఆయనే వస్తే బా**గుంటుందని చెప్పారు.** విజయవాడ పశ్చిమ **నియోజకవర్గంలోని వాగు సెంట**ర్‌లో చినవీరోజిని **పలకరించాం.. 'అభివృద్ధి లేదని** టీడీపీ నాయకులు **దుష్ప్రచారం చేస్తున్నారు.** పేదలు అభివృద్ధి **చెందడం అభివృద్ధి కాదా. పాలన** అంటే ఏంటో జగ**న్‌ను చూసి నేర్చుకోవాలి. ఈసారి** జగనే వస్తాడు' **అంటూ నమ్మకం వ్యక్తం చేశారు.** పేదలకు అవసర**మైన విద్య, వైద్యం ఉచితంగా** అందించడంతో **పాటు అనేక సంక్షేమ పథకాలతో** ప్రభుత్వం ఆదు**కుంటుందని విజయవాడ తూర్పు** నియోజకవర్గం **పటమటకు చెందిన ఓ కార్మికుడు** సంతోషం వ్యక్తం **చేశాడు.**

పామర్రు నియోజకవర్గంలో..

'ఇదిగో చూడండి దాళ్వాలో ఎకరానికి 49 బస్తాలు పండించాను' ఇదిగో సాక్ష్యం అంటూ రొయ్యూరులో సంచుల్లోకి ఎత్తిన ధాన్యాన్ని రైతులు చూపించారు. వైఎస్సార్‌సీపీకే ఓటని తోట్లవల్లూరులో ఒక రైతు చెప్పగా.. జగన్ ప్రభుత్వంలోనే పేద, మధ్య తరగతి ప్రజలు హాయిగా జీవిస్తున్నారని చోడవరంలో ఒక బడ్డీ కొట్టు యజమాని పేర్కొన్నాడు. తాను టీడీపీ అని అయితే తమకు అన్ని పథకాలు అందాయని రొయ్యూరు గ్రామంలో లుక్కా శ్రీదేవి చెప్పుకొచ్చింది. ఐదేళ్లు రైతు భరోసా ఇచ్చారని, అమ్మ ఒడి, ఆసరా పథకాల నగదు ఇచ్చారని పేర్కొంది.



లుక్కా శ్రీదేవి

అక్కడ నుంచి తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం వెళ్లగా.. అక్కడ రైతులు జగన్ పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. రైతు కాటూరి శివప్రసాద్ ఈ ప్రభుత్వంలో తనకు అందిన లబ్ధిని వివరించారు. 'ఈ ఐదేళ్లలో మా కుటుంబానికి రూ.7 లక్షలకు పైగా ఆర్థిక సాయం అందింది. జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం' అని ధీమా వ్యక్తం చేశాడు.

పెనమలూరు నియోజకవర్గం..

ప్రభుత్వం రైతులకు చేస్తున్న మేలు కళ్ల ముందే కనిపిస్తుందని పెనమలూరు నియోజకవర్గం ఉప్పులూరు రైతులు చెప్పారు. తమకు జగన్ హయాంలో జరిగిన మేలును ఏకరువు పెట్టారు. 'గతంలో పంట నష్టపోతే వెంటనే పరిహారం ఇచ్చేవారు కాదు. ఇప్పుడు వెంటనే ఇస్తున్నారు' అని ఆనందం వ్యక్తం చేశారు. కంకిపాడులో ఒక యువకుడిని పలకరించగా.. 'గత ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధి చెందలేదని విమర్శిస్తున్నారు. ఏదైనా ఒక్క గ్రామాన్ని పరిశీలిస్తే గ్రామ స్వరాజ్యమంటే ఏంటో కనిపిస్తుంది' అని చెప్పుకొచ్చాడు. రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, సచివాలయం, అన్ని వసతులతో స్కూళ్లు, ఆస్పత్రులతో గ్రామాలు కళకళలాడుతున్నాయని నియోజకవర్గంలోని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు.

మైలవరం నియోజకవర్గంలో..

వైఎస్సార్ కాలనీ సెంటర్‌లో ఇద్దరు విద్యార్థులు కనిపించారు. స్వరూప్, పవన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ సాయంతో ఇంజినీరింగ్ పూర్తయ్యింది. ఉన్నత చదువుల కోసం త్వరలో విదేశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాం. ఈ ప్రభుత్వం విద్యార్థులకు చాలా మంచి **చేసింది. ఈ సారి జగన్ గెలుస్తాడని అనుకుంటున్నాం అని చెప్పారు. చేయూత పథకం డబ్బులతో చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుని హాయిగా బతుకుతున్నానని ఒక మహిళ చెప్పగా.. సంక్షేమ పథకాల వల్ల ఆర్థిక** ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నామని ఆటో డ్రైవర్ సంతోషం వ్యక్తం చేశాడు.

గన్నవరం నియోజకవర్గం

గన్నవరం నియోజకవర్గం నున్న గ్రామంలో వృద్ధుడు నాగేశ్వరరావును పలకరించాం.. 'పింఛన్ కోసం పోయిన నెలలో ఇబ్బంది పడ్డాం. జగన్ సీఎం అయ్యాక ప్రతి నెలా ఒకటో తారీఖున ఇంటికే తీసుకొచ్చి పింఛన్ ఇచ్చేవారు. చంద్రబాబు వల్లే మాకు ఈ కష్టాలు' అని ఆగ్రహంగా చెప్పాడు. 'ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలతో రైతులకు మేలు జరుగుతుంది' అని యువ రైతు శివశంకర్ మెచ్చుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంట్లో మగ్గిపోయాం. జగన్ సీఎం అయ్యాక సొంతింటి కల నెరవేరిందని నున్నలో షేక్ మీరాబీ ఆనందంగా చెప్పింది. రైతు బొట్టా రామ్మోహన్ రెడ్డి తారసపడగా ఓటెవరికి? అని పలకరించాం.. రైతులు చాలా సంతోషంగా ఉన్నారని, ధాన్యానికి వెంటనే డబ్బు అందుతుందని చెప్పారు.

నెల్లూరు జిల్లా రోడ్ షో

ఈ ప్రభుత్వంలో సంక్షేమం బాగుందని, అక్కడక్కడా కొన్ని ఇబ్బందులున్నా మళ్లీ జగన్ వస్తేనే బాగుంటుందని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా 'సాక్షి రోడ్‌షో'లో ఓటర్లు అభిప్రాయపడ్డారు. ఎక్కడా 'సాక్షి' టీం అని చెప్పకుండా ప్రజల మనోగతాన్ని తెలుసుకున్నాం. చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై ప్రారంభమైన రోడ్ షో.. నగర ప్రాంతాల నుంచి నియోజకవర్గ కేంద్రాలు, మండలకేంద్రాలు, పల్లెలు, తీర ప్రాంత మత్స్యకార గ్రామాల మీదుగా 70 కిలోమీటర్లు సాగింది. ఈ మధ్యలో అనేక మందితో మాటలు కలిపాం. క్షేత్రస్థాయిలో ప్రజల గుండెలోతుల్లోని అభిప్రాయాలను, పరిశీలించిన అంశాలను గ్రౌండ్ రిపోర్టుగా మీ ముందు ఉంచుతున్నాం.

చిలకా మస్తాన్‌రెడ్డి, సాక్షి ప్రతినిధి, నెల్లూరు

నెల్లూరు సిటీ భగత్‌సింగ్‌కాలనీ..

ఉదయం 8.30 గంటలు.. షేక్ మస్తాన్ అనే యువకుడు కనిపిస్తే.. ఏపీలో ఎవరు గెలుస్తారని పలకరించాం. తాను ఆదాయపు పన్ను చెల్లించడం వల్ల పథకాలు రావని చెప్పాడు. జగన్ పాలనపై మాత్రం సంతృప్తి వ్యక్తం చేశాడు. కొద్ది దూరం వెళ్లాక మరో వ్యక్తిని పలకరించాం. ఈ సారి ఎవరు గెలుస్తారని అడగ్గా.. జగన్ గెలిచే అవకాశముందని చెప్పాడు. 'ఈ ప్రభుత్వం అందరికి మంచి చేస్తుంది. నాన్నకు పింఛన్ వస్తుంది.. అమ్మఒడి వస్తుంది.. పిల్లకాయలు చదువుకునేందుకు అన్నీ ఇస్తున్నాడు.. ఇక నాకేం కావాలి' అని చెప్పాడు. గ్రామనికి చెందిన మార్తమ్మ కూడా జగన్ వస్తే బాగుంటుందని, తమ ఇంట్లో అన్ని పథకాలు అందాయని చెప్పింది.



మార్తమ్మ

కోవూరు నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని గంగవరం వెళ్లాం. బస్సు కోసం ఎదురు చూస్తున్న పులిమి విజయలక్ష్మితో మాట్లాడితే.. 'మా ఆయనకు పింఛన్ వస్తుంది.. మేము కాపోళ్లం.. కాపు నేస్తం ఇస్తున్నారు. పిల్లలు చదువుకునేందుకు సాయం చేస్తున్నాడు' అని చెప్పింది. పాటూరు గ్రామానికి వెళ్లి షేక్ బేగంతో మాట్లాడితే జగన్ పాలనపై సంతృప్తి వ్యక్తం చేసింది. 'నా భర్తకు పింఛన్ వస్తుంది. ఆసరాతో ప్రతి సంవత్సరం వడ్డీ డబ్బులు పడుతున్నాయి' అని చెప్పుకొచ్చింది. విడవలూరు మండలం చవటపాళెంలో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్న దక్కా పద్మావతితో మాటలు కలిపాం. 'మా ఊర్లో రెండు వైపులా ఉన్నారు. ఎక్కువగా వైసీపీ అంటున్నారు.. మా ఊర్లో అందరికి అన్ని పథకాలు వచ్చాయి' అని చెప్పుకొచ్చింది.



దక్కా పద్మావతి

కావలి నియోజకవర్గంలో..

బీరంగుంట గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి మాటలు కలిపాం. 'జగన్‌మోహన్‌రెడ్డి బాగా చేస్తున్నాడు' అని చెప్పారు. చంద్రబాబు వస్తే సూపర్ సిక్స్ పథకాలంటున్నారని అడగ్గా.. మాకు జగనే కావాలి.. ఆయన చెప్పిన పథకాలు కచ్చితంగా వచ్చాయని చెప్పారు.. 'చంద్రబాబు ప్రభుత్వంలో జీతాలు సక్రమంగా వచ్చేవి కాదు. ఇప్పుడైతే నెలనెల వస్తున్నాయని చెప్పారు. అల్లూరు మండలం నార్త్ మోపూరులో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న జంపాని మమతతో మాట్లాడగా.. చెప్పేందుకు మొహమాటపడింది. ఆ తర్వాత తనకు అమ్మ ఒడి, ఆసరా, రైతు భరోసా, అత్తకు పింఛన్ వస్తున్నాయని ఏకరువు పెట్టింది. అల్లూరు మండల కేంద్రంలో కొందరు యువకులతో మాట్లాడితే.. తొలి ఓటు జగన్‌కు వేయాలని ఎదురుచూస్తున్నామంటూ ఉత్సాహంగా చెప్పుకొచ్చారు. 'మా ఇంట్లో మా అమ్మ వాళ్లకు పొదుపు డబ్బులు, రైతు భరోసా డబ్బులు వస్తున్నాయి. మా అవ్వ, తాతకు పింఛన్లు ఇస్తున్నారు. స్కూళ్ల అభివృద్ధి చేశారు.

మధ్యాహ్న భోజనం బాగుంది. విద్యాదీవెన, వసతి దీవెన అందుతుంది' అని తెలిపారు. మత్స్యకార గ్రామం ఇస్కపల్లిలో మత్స్యకారుడు శీనయ్య మాట్లాడుతూ.. 'గతంలో టీడీపీకి అనుకూలంగా ఉండేవాళ్లం.. జగన్ వచ్చాక చాలా మంచి చేశాడు. మత్స్యకార భరోసా పెంచాడు. రూ.10 లక్షలు బీమా వచ్చేలా చేశాడు. డీజిల్‌కు సబ్సిడీ ఇస్తున్నాడు. 90 శాతం వైఎస్సార్‌సీపీనే అంటున్నారు' అని చెప్పుకొచ్చాడు.



కె.శీనయ్య

ఉదయగిరి నియోజకవర్గంలో..

బోగోలు మండలం కోవూరుపల్లికిలో రవీంద్రరెడ్డి, మోహన్‌రెడ్డితో పాటు కొందరు రైతులతో మాట్లాడాం. చంద్రబాబు మేనిఫెస్టో సాధ్యం కాదని.. ఈ సారి జగన్ వస్తారని, రుణమాఫీ చేసుంటే బాగుండేదని అన్నారు.

సూత్రధారి, పాత్రధారి బాబే


మొదటి పేజీ తరువాయి

భూములు, లంక భూముల స్వాహా... ఇన్నర్ రింగ్‌రోడ్డు పేరిట అవినీతి మలుపులు... సింగపూర్‌తో ఒప్పందం పేరిట బురిడీ... స్విస్ చాలెంజ్ ముసుగులో దోపిడీ... అస్మదీయులకు యథేచ్ఛగా భూ పందేరాలు... ఒకటేమిటి... ఎన్ని రకాలుగా భూ దోపిడీకి పాల్పడవచ్చో అన్ని రకాలుగా బరితెగించి అమరావతిపై చంద్రబాబు ఆయన బినామీలు ఏకంగా రూ.2 లక్షల కోట్ల విలువైన భూముల దురాక్రమణకు పాల్పడ్డారు. ఒక పథకం ప్రకారం అక్కడ రాజధాని, ఇక్కడ రాజధాని అంటూ వేర్వేరు ప్రాంతాల పేర్లను ప్రచారం చేసి సామాన్య రియల్టర్లు, ప్రజలను మాయ చేశారు. కానీ ముందస్తుగా తాము భూములను కొనుగోలు చేసిన అమరావతిలో తమ బినామీలతో భూ మాఫియాను తయారు చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో రాజధాని అంటూ లీకులు ఇచ్చిన చంద్రబాబు పక్కా పన్నాగంతో ముందుగా గుంటూరు జిల్లాలోని తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల పరిధిలోని 29 గ్రామాల్లోనూ చుట్టు పక్కల తనతోపాటు తన సన్నిహితులు, బినామీలతో అతి తక్కువ ధరలకు వేలాది ఎకరాలను కొనుగోలు చేయించారు. ఆ తర్వాత ఆ ప్రాంతాన్ని రాజధానిగా ప్రకటించారు.

దీంతో ఆ ప్రాంతంలో భూముల ధరలు అమాంతంగా పెరిగాయి. కేవలం రాజధాని ప్రకటనతోనే చంద్రబాబు రూ.లక్ష కోట్ల భూదోపిడీకి పాల్పడ్డారు. ఇక రాజధాని కోసం రైతుల నుంచి భూసమీకరణ పేరిట చంద్రబాబు బరితెగించి రైతుల భూములపై దండయాత్రకు పాల్పడ్డారు. రైతులను మభ్య పెట్టి వారి భూములను కొల్లగొట్టారు. అసైన్డ్ భూములు అడ్డగోలుగా దోచేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేశారు. లంక భూములు ఆక్రమించేశారు. యథేచ్ఛగా జరిగిన ఈ భూ దోపిడీ మరో రూ.లక్ష కోట్లకుపైనే. అమరావతి పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను భయభ్రాంతులకు గురి చేసి వారి అసైన్డ్ భూములను చంద్రబాబు ముఠా కొల్లగొట్టింది. పీఓటీ(ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) చట్టం ప్రకారం ఈ భూములను సేకరించ కూడదని తెలిసినా సేకరించారు.

విశాఖను అల్లాడించిన ఎల్లో భూ మాఫియా

ఐదేళ్ల చంద్రబాబు హయాంలో విశాఖపట్నంలో జరిగిన భూ దోపిడీ అంతా ఇంతా కాదు. లక్ష ఎకరాల భూ రికార్డులను మాయం చేసిన టీడీపీ పెద్దలు గద్దల్లా విశాఖను నంజుకుని తినేశారు. అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ కుంభకోణంలో ఉన్నట్లు మరో మంత్రి అయ్యన్నపాత్రుడు వెల్లడించి సంచలనం సృష్టించారు. ప్రభుత్వ భూములను తనఖా పెట్టి గంటా శ్రీనివాసరావు తన బంధువు పరుచూరి భాస్కరరావు పేరు మీద రుణాలు తెచ్చుకున్నట్లు రూఢీ అయింది. భీమిలి ప్రాంతంలో గంటా శ్రీనివాసరావు రైతుల పేరుతో ఉన్న భూములను తన బంధువుల పేరున మార్పించుకున్నట్లు తేలింది. భీమిలి, ఆనందపురం, విశాఖ రూరల్, పెందుర్తి మండలాల్లో వేలాది ఎకరాలను కొల్లగొట్టారు. పెందుర్తి మండలం సౌభాగ్యపురం, ఆనందపురం మండలం దుర్వంధ, విశాఖ రూరల్ కొమ్మాదిలో రైతులు ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చిన భూములను టీడీపీ నేతలు కొల్లగొట్టారు. కశింకోట, భీమిలి, పెదగంట్యాడ, గాజువాక ప్రాంతాల్లో వక్ఫ్ భూములను టీడీపీ నేతలు మింగేశారు. ఈ కుంభకోణంపై అప్పటి బీజేపీ విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్ చేశారు. ఈ కుంభకోణం మొత్తం చంద్రబాబు ఆయన కొడుకు లోకేష్ కనుసన్నల్లో జరిగింది. విశాఖలో భూ వివాదాలు పెరిగిపోవడానికి చంద్రబాబు ఆయన పరివారమే కారణం. విశాఖ దసపల్లా హిల్స్‌లోని రెండు వేల గజాల ప్రభుత్వ భూమిని లీజు పేరుతో టీడీపీ కబ్జా చేసి ఏకంగా పార్టీ కార్యాలయాన్నే నిర్మించింది.



ఆ తర్వాత అసైన్డ్ భూములకు పరిహారం ఇవ్వరని భయపెట్టి ఆ భూములను కారుచౌకగా వారి నుంచి లాగేసుకున్నారు. తమ చేతుల్లోకి భూమి వచ్చాక భూ సమీకరణ ప్యాకేజీ ప్రకటించి ముఖ్యమంత్రి హోదాలోనే పేద రైతుల నోట్లో మట్టి కొట్టారు. దాదాపు 1,500 ఎకరాల అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, లంక భూముల దోపిడీకి పాల్పడ్డారు. అలాగే రాజధాని ప్రాంతంలో స్టార్టప్ ఏరియా అభివృద్ధి పేరిట సుప్రీంకోర్టు అభ్యంతరం తెలిపిన స్విస్ చాలెంజ్ విధానం ద్వారా భారీ కుంభకోణానికి చంద్రబాబు తెగబడ్డారు. సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం అని చెబుతూ... తన సన్నిహితుడైన సింగపూర్ మంత్రికి చెందిన ప్రైవేటు కంపెనీతో వ్యవహారం నడిపారు. సింగపూర్ కంపెనీ ముసుగులో తమ కుటుంబం గుప్పిట్లోనే స్టార్టప్ ఏరియా ఉండేలా చంద్రబాబు కుతంత్రం రచించి రూ.66 వేల కోట్ల దోపిడీకి పన్నాగం పన్నారు. కట్టని రాజధాని అమరావతిలో నిర్మించని ఇన్నర్ రింగ్(ఐఆర్ఆర్) రోడ్డు పేరిట చంద్రబాబు, నారాయణ ద్వయం తమ భూముల ధరలను అమాంతంగా పెంచేలా చేసుకున్నారు.

గీతంకు వందల ఎకరాలు ధారాదత్తం

విశాఖలో గీతం యూనివర్సిటీకి చంద్రబాబు వందల ఎకరాలు కట్టబెట్టి తన బంధుప్రీతిని చాటుకున్నారు. రుషికొండలో 35 ఎకరాలను గీతం ఎంవీవీఎస్ మూర్తికి కేటాయించారు. ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో గీతం యూనివర్సిటీ 55 ఎకరాలను కబ్జా చేసినట్లు అధికారులే ధ్రువీకరించారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు కేటాయించిన భూములనూ గీతం వర్సిటీ యాజమాన్యం ఆక్రమించింది.

ఇందుకోసం లింగమనేని రమేశ్ కుటుంబంతో క్విడ్‌ప్రోకోకు పాల్పడ్డారు. లింగమనేని, చంద్రబాబు, నారాయణ కుటుంబాలకు చెందిన భూములను ఆనుకుని నిర్మించేలా ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను అష్టవంకర్లు తిప్పారు. దీనివల్ల కృష్ణా నదికి అటు వైపు ఇటువైపు ఉన్న తమ భూముల విలువ రూ.2 వేల కోట్లకు పైగా పెరిగేలా స్కెచ్ వేసింది. లింగమనేని కుటుంబానికి అడ్డగోలుగా ప్రయోజనం కల్పించినందుకు... ఆ కుటుంబం నుంచి చంద్రబాబుకు కరకట్ట నివాసం, హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములను పొంది క్విడ్‌ప్రోకోకు పాల్పడ్డారు. రైతులను మభ్యపెట్టి తీసుకున్న అమరావతిలోని భూములను చంద్రబాబు తమ అస్మదీయులకు అడ్డగోలుగా కేటాయించేశారు. టీడీపీకి సన్నిహితులైన ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు మాత్రం కారుచౌకగా భూములు కేటాయించడం విస్మయపరిచింది. అమరావతిలో ప్రభుత్వ భూములను చంద్రబాబు ముఠా దర్జాగా కబళించేసింది. 29 గ్రామాల పరిధిలోని ప్రభుత్వ స్థలాలన్నీ తమ బినామీలైన ప్రైవేటు వ్యక్తుల అనుభవంలో ఉన్నాయని తప్పుడు రికార్డులు సృష్టించి వాటిని గుప్పిటపట్టారు. ఏకంగా 328 ఎకరాల ప్రభుత్వ భూమిని 522 మంది బినామీల పేరిట చూపిస్తూ హస్తగతం చేసుకున్నారు. భూ సమీకరణ ప్యాకేజీ కింద రూ.760.25 కోట్లు కొల్లగొట్టారు. అమరావతి భూ దోపిడీపై సీఐడీ దర్యాప్తులో అసైన్డ్ భూ కుంభకోణం ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చింది.

సదావర్తి సత్రం భూముల దోపిడీకి పన్నాగం

వెయ్యి కోట్ల విలువైన సదావర్తి సత్రం భూములను చంద్రబాబు గ్యాంగ్ కొట్టేయడానికి ప్రయత్నించింది. అమరావతిలోని సదావర్తి సత్రానికి చెన్నైలో ఉన్న భూములను రక్షించే పేరుతో భోగస్ వేలం పాట నిర్వహించి టీడీపీ నేతలు దక్కించుకునే ప్రయత్నం చేశారు. అప్పటి పెదకూరపాడు ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఈ భూముల వేలానికి సహకరించగా, కాపు కార్పొరేషన్ నేతగా పని చేసిన చలమలశెట్టి రామానుజ వేలంలో కొనుగోలు చేశారు. అయితే దీనిపై ఆందోళనలు వెల్లువెత్తడం, కోర్టు ఆదేశాలతో కోట్ల విలువైన ఆ భూమి వేలం రద్దయింది.

బాబు 'చుక్కలు' చూపిస్తే.. జగన్ వాటికి విముక్తి కల్పించారు

చుక్కల భూములను కొల్లగొట్టేందుకు టీడీపీ నేతలు విశ్వప్రయత్నాలు చేసి చివరికి ఆ భూములను వివాదాస్పదంగా మార్చేశారు. రాష్ట్రంలో 4.5 లక్షల ఎకరాల భూములను క్రమబద్ధీకరించే పేరుతో చంద్రబాబు తీసుకున్న నిర్ణయం వారి జీవితాలను తారుమారు చేసింది. చుక్కలున్నా ఆ భూములపై ఆంక్షలు లేకపోవడంతో రైతులు వాటిని అమ్ముకోవడం, వాటిపై రుణాలు తీసుకోవడానికి అభ్యంతరం ఉండేది కాదు. కానీ చంద్రబాబు ఇచ్చిన జీవోతో 4.50 లక్షల ఎకరాల చుక్కల భూములు 22ఏ జాబితాలో చేరిపోయాయి. సుమారు రెండున్నర లక్షల మంది రైతులు వాటిని అమ్ముకోలేక అష్టకష్టాలు పడ్డారు. ఇదే అదనుగా పలు జిల్లాల్లో స్థానిక టీడీపీ నేతలు రైతులపై ఒత్తిడి తెచ్చి ఆ భూములను స్వాహా చేసేందుకు ప్రయత్నించారు. కొన్నిచోట్ల తక్కువ ధరకే తమ పేరు మీద ఆ భూములను స్వాధీనం చేసుకున్నారు. 2019లో వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ఈ భూముల సమస్యలను పరిష్కరించేందుకు నడుం బిగించారు. క్రమపద్ధతిలో ఎంజాయ్‌మెంట్ సర్వే చేయించడంతోపాటు పాత రికార్డులను పరిశీలించి 2.06 లక్షల ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీంతో ఆ రైతులంతా ఇప్పుడు వాటిని స్వేచ్ఛగా అనుభవిస్తున్నారు. షరతులు గల పట్టా భూములను ఇలాగే చంద్రబాబు 22ఏ జాబితాలో చేర్చగా దాదాపు 50 వేల మంది రైతులు వాటిపై హక్కులు కోల్పోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాటిని 22ఏ జాబితా నుంచి తీసివేయడంతో వారికి మళ్లీ సర్వ హక్కులు లభించాయి. అనాదీనం భూములను ఇలాగే ఆంక్షల చట్రం నుంచి విముక్తి కల్పించారు. అసైన్డ్ భూములకు 20 ఏళ్ల తర్వాత యాజమాన్య హక్కులు కల్పించడంతో 27 లక్షల ఎకరాలకు చెందిన రైతులు వాటిపై హక్కులు పొందారు. మొత్తంగా 35 లక్షల ఎకరాలపై వైఎస్ జగన్ ఆంక్షలు తొలగించి వాటిని మార్కెట్‌లోకి తీసుకువచ్చి లక్షల మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు. అలాంటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల భూములు లాగేసుకుంటుందంటూ వారిని నట్టేట ముంచిన చంద్రబాబు పరివారం ప్రచారం చేయడాన్ని ఏమనాలి. రాష్ట్రంలో చంద్రబాబు భూముల సమస్యలను అత్యంత క్లిష్టంగా మారిస్తే వైఎస్ జగన్ ఎంతో చాకచక్యంగా వాటిని పరిష్కరించారు.

స్వాతంత్య్ర సమరయోధుడి భూమిని స్వాహా చేసిన బొండా

విజయవాడ నగరం నడిబొడ్డున మొగల్రాజపురంలో రూ.50 కోట్ల విలువైన 5.16 ఎకరాల స్వాతంత్య్ర సమరయోధుడి భూమిని టీడీపీ నేత, అప్పటి విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్వాహా చేశారు. తప్పుడు పత్రాలతో ఆ భూమిని ఆయన తన భార్య సుజాత పేరు మీద రిజిస్టర్ చేయించారు. తమ భూమి ఎమ్మెల్యే స్వాధీనంలో ఉండడంతో స్వాతంత్య్ర సమరయోధుడు సూర్యనారాయణ వారసులు పోలీసులను ఆశ్రయించడంతో ఈ భూ మాయ బయటకు వచ్చింది. కేసు పెట్టిన వారిని బొండా అనుచరులు బెదిరించి దౌర్జన్యం చేశారు.

పోరాట యోధుడు జగన్



అలుపెరగని పోరాట యోధుడు, పేద ప్రజల ఆశాజ్యోతి జగన్. గత ముఖ్యమంత్రుల కన్నా జగనన్న అందించిన పరిపాలన ప్రత్యేకం. ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు కనీవినీ ఎరుగని రీతిలో ప్రవేశపెట్టారు. పథకాల లబ్ధి ప్రతి గడపకి చేరేలా వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. అందుకే జగనన్న ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరు. మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావడం తథ్యం.

- జీవీవీ రామారావు, ఆర్‌బీ కొత్తూరు, పెద్దాపురం, కాకినాడ

ఎల్లకాలం ప్రజల్ని మభ్యపెట్టలేరు



రాజకీయ పార్టీలు ఎల్లకాలం ప్రజల్ని మోసం చేయలేవు. ఇచ్చిన హామీలు నెరవేర్చే నాయకులనే కోరుకుంటారు తప్ప, అధికారమే ధ్యేయంగా మోసపూరిత హామీలు గుప్పించేవారిని విశ్వసించరు. అనుభవం పేరిట జనాల్ని మోసం చేసేవారు, సొంత అజెండా లేకుండా పొత్తు రాజకీయాల కోసం పాకులాడేవారిని జనాలు ఛీ కొడతారు. మాట తప్పని, మడమ తిప్పని నాయకుడిని ప్రజలు ఎప్పటికీ వదులుకోరు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే మళ్లీ పట్టం కడతారు.

- కురిమినేని అప్పలనాయుడు, విశ్రాంత ప్రిన్సిపాల్, విజయనగరం

జగన్ అంటే భరోసా



జగన్ అంటే ఏపీ ప్రజలకు ఓ భరోసా. రాష్ట్ర దశ, దిశ మార్చగలిగిన వ్యక్తి ఆయన. ఒకసారి చెబితే తప్పకుండా చేస్తాడన్న నమ్మకం ప్రజలకు ఉంది. ప్రజలకు ఏం చేస్తే బాగుంటుందో.. దాని కోసం ఎన్ని ఆటంకాలొచ్చినా ఎదురొడ్డి నిలబడగలిగే శక్తి జగన్. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ఒక్కటంటే ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేసిన దాఖలాల్లేవు. రాష్ట్రాభివృద్ధి కోరుకునేవారు తప్పక జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ గెలిపిస్తారు.

- బి.మధుసూదన్‌రెడ్డి, నెల్లూరు టౌన్

విజయపథం.. అభివృద్ధే నినాదం

ఐదేళ్లుగా ప్రకాశం జిల్లాలో ప్రగతి పరుగులు

- **నాడు–నేడులో 1,992 పాఠశాలల అభివృద్ధికి రూ.369.16 కోట్లు మంజూరు**
- **591 సచివాలయాలకు రూ.226 కోట్లు వెచ్చించిన సర్కార్**
- **593 ఆర్‌బీకేలకు రూ.129.27 కోట్లు మంజూరు**
- రూ.861 కోట్లతో 492 వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు
- రూ.364 కోట్లతో 228 డిజిటల్ లైబ్రరీలు
- మార్కాపురం వైద్య కళాశాలకు రూ.475 కోట్లు
- జలవనరుల శాఖలో పనుల కోసం రూ.212.7 కోట్లు కేటాయింపు
- పారదర్శకంగా లబ్ధిదారులకే నేరుగా నగదు అందజేత
- నవరత్నాల అమలుతో లక్షలాది మందికి ఆర్థిక ప్రయోజనం



మార్కాపురంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ

మార్కాపురం వైద్య కళాశాలకు విడుదలైన నిధులు

కళాశాల కోసం కేటాయించిన నిధులు	విడుదలైన నిధులు	కేటాయించిన నిధులు
రూ.475 కోట్లు	రూ.30 కోట్లు	రూ.861 కోట్లు

మంజూరైన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	పూర్తయిన క్లినిక్‌లు
492	226 భవనాలు



గొట్టిపడియ వద్ద నిర్మాణంలో ఉన్న వాటర్ గ్రిడ్

రైతు కోసం ఎదురొడ్డిన సర్కార్

రైతులకు సకాలంలో రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీలు అందించడమే కాకుండా ప్రకృతి విపత్తులకు నష్టపోయిన రైతులను ఆదుకుంటున్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులు నష్టపోకుండా ప్రభుత్వమే పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ అండగా నిలబడుతోంది. వైద్య రంగంలో వైద్యుల నుంచి పారా మెడికల్ సిబ్బంది వరకు కొరత లేకుండా పోస్టులను భర్తీ చేయడమే కాకుండా ఆస్పత్రులను నాడు–నేడు కింద ఆధునికీకరించి అవసరమైన వైద్య పరికరాలు ఏర్పాటు చేసి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది. విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాలతో వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోంది. జిల్లాలో వీటితో నవరత్నాల పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక సహాయం అందిస్తోంది. సంక్షేమంతో పాటు వేలాది కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వ్యవస్థ ఏర్పాటు చేసినటప్పటి నుంచి ఇప్పటి వరకు 29 శాఖలకు సంబంధించి 39,99,700 ప్రభుత్వ సేవలు ప్రజలకు అందజేశారు.



నాడు-నేడులో భాగంగా రూపుదిద్దుకున్న మురారిపల్లి మోడల్ స్కూలు

ఒంగోలు అర్బన్:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎన్ని కష్టనష్టాలు వచ్చినా ఇచ్చిన మాట మేరకు అన్ని పథకాలు అమలు చేస్తూ సంక్షేమానికి పెద్ద పీట వేసింది. మహమ్మారి కోవిడ్ కష్టకాలంలోనూ మెరుగైన సేవలు అందించి ప్రజలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలబడింది. మరో పక్క వేలాది కోట్లు కేటాయించి అభివృద్ధి పనులను పరుగులు తీయిస్తోంది. జిల్లాలో లక్షలాది మంది లబ్ధిదారులకు నవరత్నాల పథకంలో వేలాది రూపాయల ఆర్థిక సహాయం అందింది. కుల, మత, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అర్హులకు నేరుగా ప్రభుత్వం అందించింది. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ఆయా రంగాలను అభివృద్ధి చేసి ప్రజలకు ఉపకరించేలా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం సఫలీకృతమైంది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని ఏపీలో సాధ్యం చేశారు. ప్రతి పేద కుటుంబంలో పిల్లలు చదువుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు మించి ఆధునికీకరించడంతో పాటు విద్యార్థులకు బూట్లు, యూనిఫాం, పుస్తకాలతో పాటు నాణ్యమైన పోషకాహారం అందిస్తున్నారు. అమ్మఒడి పథకంలో భాగంగా విద్యార్థులను బడికి పంపే తల్లుల ఖాతాల్లో ఏడాదికి రూ.15 వేలు నగదు జమ చేస్తూ కుటుంబాలకు అండగా నిలబడుతున్నారు.

జిల్లాలో సాధించిన ప్రగతి ఇదీ..

- మంజూరైన సచివాలయాలు - 591, విడుదలైన నిధులు - రూ.226.20 కోట్లు
- పూర్తయిన భవనాలు - 411 (68.21శాతం)
- ఆర్బీకేలకు మంజూరైన భవనాలు - 593 భవనాలు,
- ఇందుకు కేటాయించిన నిధులు - రూ.129.27 కోట్లు
- పూర్తయిన ఆర్బీకేలు - 367 భవనాలు (63.27 శాతం)
- ఎక్కడెక్కడ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు నిర్మించారు - గిద్దలూరు, సింగరాయకొండ
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కోసం మంజూరైన భవనాలు - 492
- ఇందుకు కేటాయించిన నిధులు రూ.861 కోట్లు
- పూర్తయిన భవనాలు - 226 (48.5 శాతం)
- మంజూరైన డిజిటల్ లైబ్రరీలు- 228, ఇందుకు మంజూరైన నిధులు - రూ.364 కోట్లు
- మంజూరైన పాలశీతలీకరణ కేంద్రాలు - 161, ఇందుకు మంజూరైన నిధులు - రూ.28.44 కోట్లు

సంక్షేమ ఫలాలు అందుతున్న తీరు

- జిల్లా వ్యాప్తంగా పింఛన్ పొందుతున్నవారి సంఖ్య - 2,80,452
- ప్రతి నెలా కేటాయిస్తున్న నగదు - రూ.78 కోట్లు
- వసతి దీవెన పథకంలో లబ్ధిపొందుతున్న దళిత విద్యార్థులు - 12,341
- ఏడాదికి కేటాయిస్తున్న నిధులు రూ.11 కోట్లు
- మూడు దశల్లో అందించిన లబ్ధి - రూ.35.10 కోట్లు
- లబ్ధిపొందుతున్న ఎస్టీ విద్యార్థులు - 1,103 మంది
- ఏడాదికి కేటాయిస్తున్న నిధులు - రూ.4 కోట్లు
- రైతు భరోసాలో లబ్ధిపొందుతున్న రైతులు - 2,84,113
- మత్స్యకార భరోసాలో లబ్ధిపొందే రైతులు - 5,260
- ఏడాదికి అందించే లబ్ధి - రూ.5.26 కోట్లు
- వైఎస్సార్ ఆసరా పథకంలో లబ్ధిపొందుతున్న వారి సంఖ్య - 3,08,052
- వారికి లభించిన లబ్ధి - రూ.908 కోట్లు
- అమ్మఒడి పథకంలో లబ్ధిపొందుతున్న వారి సంఖ్య - 2,03,623
- ఏడాదికి కేటాయిస్తున్న నిధులు - రూ.101.81 కోట్లు

నాడు - నేడుకు విడుదలైన నిధులు

- మొదటి దశలో 1,015 పాఠశాలలకు రూ.209.42 కోట్లు
- రెండవ దశలో 977 పాఠశాలలకు రూ.159.74 కోట్లు
- మొత్తంగా రెండు పనుల్లో పాఠశాలలకు నూతన భవనాలు
- ఇరిగేషన్ శాఖలో అభివృద్ధి పనులకు గడిచిన నాలుగేళ్లలో రూ. 212.7 కోట్లు పైగా కేటాయింపు
- 2019-20 సంవత్సరానికి రూ.1,578.87 లక్షలు,
- 2020-21లో రూ. 95.77 లక్షలు,
- 2021-22లో రూ. 195.65 లక్షలు,
- 2022-23 లో రూ. 257.66 లక్షలు కేటాయింపు



వెలిగొండ ప్రాజెక్టు వ్యూ

ఎలక్షన్ రీల్



చేయగలిగేదే జగన్ చెప్తారు: డిప్యూటీ సీఎం బూడి

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు మధ్య పాలనలో ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలంతా గుర్తించి ఈ ఎన్నికల్లో ఓటు వేయాలని డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని ఇరువాడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఏమి చేయగలుగుతారో అవే చెప్తారన్నారు. చంద్రబాబు మాదిరిగా మోసపూరిత హామీలివ్వడం జగన్‌మోహన్‌రెడ్డికి తెలియదన్నారు. కూటమి ఎంపీగా బ్యాంకులను దోపిడీ చేసి, మోసాలకు పాల్పడిన స్థానికేతరుడైన సీఎం రమేష్‌ను కడప నుంచి దిగుమతి చేసుకున్నారన్నారు.

గూడెంలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి

తాడేపల్లిగూడెం అర్బన్: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో రూ.300 కోట్లతో చంటిపిల్లల మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను నిర్మించేందుకు ఫైల్ వర్క్ పూర్తయిందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పట్టణంలో శుక్రవారం పలు వార్డుల్లో భారీ బైక్ ర్యాలీతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రూ.3 వేల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పాలనను కాపీ కొట్టి తానూ అలాగే చేస్తానని చంద్రబాబు అనడం సిగ్గుచేటన్నారు. జగన్‌కు మించి పాలన చేస్తానని చెప్పే ధైర్యం ఆయనకు లేదని ఎద్దేవా చేశారు.

చిత్రం సాక్షిగా

విజయనగరం జిల్లా బాడంగి మండలంలోని ముగడ గ్రామం అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు దూసుకుపోతోంది. ఈ గ్రామంలో 4,500 జనాభా ఉండగా 2,700 పైచిలుకు ఓటర్లున్నారు. ఈ గ్రామానికి రాజకీయ చైతన్యం గ్రామంగా గుర్తింపు ఉంది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు పుట్టినిల్లుగా చెప్పకుంటారు. అయినప్పటికీ ఇక్కడ అభివృద్ధి ఎక్కడివేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయిందన్న విమర్శలున్నాయి. చిన్న తరహా పనులు కూడా నోచుకోకపోవడమే ఈ విమర్శలకు కారణం. వైసీపీ సర్కారు వచ్చిన అనంతరం రూ.3 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశారు. రూ.పది కోట్లకుపైగా సంక్షేమ పథకాలు ఈ గ్రామస్తులకు అందాయి. దీంతో ఈ గ్రామ జీవన విధానం...ముఖచిత్రం మారిపోయింది.

– బాడంగి







రూ.90 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలు







రూ.23.22 లక్షలతో జగనన్న కాలనీ నిర్మాణం

నాడు దైన్యం..నేడు ధైర్యం

గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల అరాచకాలు అన్నీ, ఇన్నీ కావు. సంక్షేమ పథకాల అమలే అరకొర. దానికి తోడు తమ అనుచరులకు, అనుకూలురకు మాత్రమే ఆ కాస్త లబ్ధి చేకూరేది. దీంతో అసలైన అర్హులకు అన్యాయం జరిగేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదల బతుకుల్లోకి వెలుగులు వచ్చాయి. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేశారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటికే వచ్చి, వివరాలు నమోదు చేసుకుని మరీ సంక్షేమ లబ్ధి అందించారు. అలా లబ్ధి పొందిన కుటుంబాల్లో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని ఓబులేసు కుటుంబం కూడా ఒకటి.



కుటుంబ సభ్యులతో లొడుగోళ్ల ఓబులేసు, గంగాదేవి దంపతులు

దశ తిరిగింది

వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని లొడుగోళ్ల ఓబులేసు కుటుంబానికి చంద్రబాబు ప్రభుత్వంలో ఏ ఒక్క పథకం అందలేదు. జన్మభూమి కమిటీల వారే ఉద్దేశపూర్వకంగా తమకు పథకాలు వర్తించకుండా చేశారని ఆ కుటుంబ సభ్యులు ఆవేదన. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వారి బతుకుల్లో వేదన తొలగింది. ఎవరి చుట్టూ తిరగాల్సిన పనిలేకుండానే గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్ సాయంతో అర్హతలున్న పలు సంక్షేమ పథకాలు మంజూరయ్యాయి. వీరి ఆర్థిక ఇబ్బందుల్ని చాలా వరకు తొలగించాయి.

అర్హత ఉన్న ప్రతి పథకం మంజూరైంది

మాదిగ కులానికి చెందిన ఓబులేసు చర్మకారుడు. దరఖాస్తు చేసుకోవడంతో ఏడాది నుంచి ఈయనకు చర్మకారుల పింఛన్ రూ.3 వేలు అందుతోంది. ఈయన భార్య గంగాదేవికి 45 ఏళ్లు పూర్తికావడంతో రెండేళ్లుగా వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 బ్యాంకు ఖాతాలో జమ అవుతోంది. చిల్లర అంగడి నిర్వహించే గంగాదేవికి జగనన్న చేదోడు పథకంలో ఏటా రూ.10 వేలు చొప్పున రెండేళ్లు లబ్ధి చేకూరింది. శరీరం సహకరించకపోవడంతో ప్రస్తుతం వ్యాపారం చేయట్లేదు. లక్ష్మీ స్వయం సహాయక సంఘం(డ్వాక్రా)లో సెకండ్ లీడర్‌గా ఉన్న ఈమెకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఏటా రూ.10,300 చొప్పున నాలుగేళ్లపాటు రూ.41,200 వచ్చింది. పెద్ద కుమార్తె శివదుర్గ బీకాం కంప్యూటర్స్ థర్డ్ ఇయర్ చదతోంది. జగనన్న విద్యాదీవెన తొలి ఏడాదిలో రూ.9,500 మంజూరైంది. కుమారుడు నరసింహ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్, మరో కుమారుడు శివచంద్ర అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నారు. శివచంద్రకు అమ్మఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు అందుతోంది. ఈ కుటుంబానికి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఓబులేసు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కంటి ఆపరేషన్ చేయించుకున్నారు. ఆరోగ్య ఆసరా రూ.5 వేలు జమయింది.

(కుడుముల వీరారెడ్డి, ఆర్‌సీ ఇన్‌చార్జ్, ప్రొద్దుటూరు)

'పసుపు కుంకుమ' కూడా అందలేదు

లక్ష్మి డ్వాక్రా గ్రూపు సెకండ్ లీడర్‌ను నేను. గత ప్రభుత్వంలో పసుపు కుంకుమ డబ్బు కూడా అందలేదు. తీసుకున్న రుణాలపై ఒత్తిడి ఉండేది. జగనన్న ప్రభుత్వంలో వైఎస్సార్ ఆసరా ద్వారా ఏటా రూ.10,300 చొప్పున రుణమాఫీ జరిగింది. ఇంటి వద్దకే బియ్యం వస్తున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యాన్నే వండుకుని తింటున్నాం. వీధిలో కొత్త సిమెంటు రోడ్లు వేశారు. మా కుటుంబానికి గత ప్రభుత్వంలో రూపాయి లబ్ధి కూడా చేకూరలేదు. ఏ ప్రభుత్వ పథకమూ అందలేదు. జన్మభూమి కమిటీలో ఉన్న నాయకులు కావాలనే మాకు పథకాలు రాకుండా చేశారు. ఈ ప్రభుత్వంలో మాకెంతో మేలు జరిగింది.



– లొడుగోళ్ల గంగాదేవి, ప్రొద్దుటూరు.

సంక్షేమ పథకాల వర్తింపుతో ఆనందం రెట్టింపు

జగనన్న వచ్చాకే ఓబులేసు కుటుంబానికి సంక్షేమం

నవికా: మరి మీ చెల్లి వాళ్లతో పనిచేస్తోంది. పవర్ పాలిటిక్స్‌లో ఆమె ఏ విధంగా రాణిస్తుందనుకుంటున్నారు? షర్మిలకు సునీత కూడా తోడయ్యారు.
సీఎం జగన్: వాళ్లకు వాళ్ల వ్యక్తిగత కారణాలున్నాయి. అయితే వాళ్లు ఎంచుకున్న మార్గం, సమయం రెండూ సరైనవి కావు. ప్రతి కుటుంబంలో ఒక జనరేషన్‌లో ఒకరు మాత్రమే రాజకీయాలను లీడ్ చేస్తారు. మిగిలిన వాళ్లు లీడ్ చేసే వారికి మద్దతుగా నిలుస్తారు. రెండో జనరేషన్ రాజకీయాల్లోకి రాకూడదు. దీన్ని నమ్ముతాను. ఈ క్రమంలో వారిని రాజకీయాల్లోకి రావద్దనే సూచించాను. వ్యాపారాలు, ఇంకా వాళ్లకు ఇష్టమైన రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాను. రాజకీయాల్లోకి వచ్చి కుటుంబంలో సంబంధాలు దెబ్బతినేలా చేయొద్దని కోరాను. రాజకీయాల్లోకి వస్తే ప్రత్యర్థులు దీన్ని అవకాశంగా మలుచుకుని మన మధ్యే చిచ్చుపెట్టి సంబంధాలను కలుషితం చేస్తారని చెప్పాను. మనలో మనమే ప్రత్యర్థులుగా మారిపోతామని తెలియజేశాను.

నవికా: వారి వెనకాల చంద్రబాబు ఉన్నారని మీరు నమ్ముతున్నారా?
సీఎం జగన్: అవును. నమ్మాల్సిన పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. చంద్రబాబు వాళ్లను ప్రోత్సహిస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయాల్లో ఉన్నప్పుడు విలువలు, సిద్ధాంతాలు ఉండాలి. పార్టీకి ఎంతో విధేయుడిగా ఉన్న నా తండ్రి పేరును కాంగ్రెస్ పార్టీ చార్జిషీట్‌లలో పెట్టింది. అక్రమ కేసులు పెట్టి నన్ను జైలు పాలు చేసింది. నాపై కేసులు పెట్టింది కూడా కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ నాయకులే. ఈ కేసులో కో పిటీషన్ వేసింది టీడీపీ. నా తండ్రి బతికి ఉన్నన్ని రోజులు, నేను ఆ పార్టీలో ఉన్నన్ని రోజులు నేను నిజాయితీపరుడిని. నేను ఆ పార్టీ వీడిన వెంటనే నా తండ్రి, నాపైనా అవినీతి మరక వేశారు. నన్ను పార్టీ నుంచి బయటకు పంపేశారు. ఈ రోజుకూ వారు నాపై మోపిన తప్పుడు కేసులపై పోరాటం **చేస్తున్నాను.**

నవికా: అందుకే చంద్రబాబు నాయుడిని జైలుకు పంపించారా?
సీఎం జగన్: చంద్రబాబు నాయుడు చేయకూడని పని చేశారు. స్కిల్ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించారు. అలా అతను చేసి ఉండకూడదు. ఆయన స్కామ్‌లో ప్రమేయం ఉందనడానికి పూర్తి ఆధారాలు ఉన్నాయి. కోర్టుల్లోనూ చంద్రబాబుకు వ్యతిరేకంగా తగిన సాక్ష్యాలతో వాదనలు జరిగాయి. అందుకే కటకటాల వెనక్కి వెళ్లాడు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన సాక్ష్యాలతో కోర్టులు ఏకీభవించాయి. అందుకే అతను 52 రోజులు జైలులో ఉన్నాడు.
నవికా: చివరికి బెయిల్ వచ్చింది కదా?
సీఎం జగన్: బెయిల్ పొందడం అనేది హక్కు. అది జైలులోకి వెళ్లిన ఎవరికైనా.. ఎప్పుడో ఒకప్పుడు రావాల్సిందే. అంతేగానీ, సరైన సాక్ష్యాలు లేకుంటే చంద్రబాబు జైలుకి వెళ్లేవారు కాదేమో! **చంద్రబాబుపై కేసుల్లో ఎక్కడా రాజకీయ కోణంలో వ్యవహరించలేదు.**





క్లీన్ స్వీప్ ఖాయం

టైమ్స్ నౌ గ్రూప్ ఎడిటర్-ఇన్-చీఫ్ నవికా కుమార్ ఇంటర్వ్యూలో సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి :

'రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా సుపరిపాలన అందించాం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశాం. అర్హతే ప్రామాణికంగా, వివక్ష చూపకుండా.. అవినీతికి తావులేకుండా.. అత్యంత పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాం. దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ చేశాం. విప్లవాత్మక సంస్కరణలతో విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ప్రగతి సాధించాం. గ్రామ, వార్డు సచివాలయాలు-వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం వల్ల మంచి జరిగి ఉంటేనే ఓటు వేసి ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్నాం' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ప్రజల్లో తమ ప్రభుత్వంపై ఉన్న విశ్వసనీయత, నమ్మకమే.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడానికి దారితీస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో, దేశంలో రాజకీయ పరిణామాలపై సీఎం వైఎస్ జగన్‌ను టైమ్స్ నౌ గ్రూప్ ఎడిటర్-ఇన్-చీఫ్ నవికా కుమార్ ఇంటర్వ్యూ చేశారు. ఇంటర్వ్యూ వివరాలు ఇలా ఉన్నాయి.

నవికా: రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఒకవైపు టీడీపీ, బీజేపీ, జనసేన.. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నుంచి మీ చెల్లెళ్లు మీ మీద పోరాటానికి వస్తున్నారు. ఈ క్రమంలో ఎవరితో పోరాడేందుకు మీరు సిద్ధంగా ఉన్నారు?
సీఎం జగన్: మా ప్రభుత్వంపై పోరాటానికి వస్తున్న ప్రతి ఒక్కరితో పోరాటానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఇక్కడ ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే కాంగ్రెస్ పార్టీ రిమోట్ కంట్రోల్ కూడా చంద్రబాబు చేతుల్లోనే ఉంది. రేవంత్‌రెడ్డి ద్వారా చంద్రబాబు నా చెల్లెలు షర్మిలను ప్రభావితం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో నా చెల్లిని అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ ఓటర్లలో చీలిక తెచ్చి లబ్ధి పొందాలని వాళ్లు భావిస్తున్నారు. మా ప్రభుత్వంపై ప్రజల్లో ఎక్కడా వ్యతిరేకత లేదు. ప్రజాస్వామ్యంలో 50 శాతానికి పైగా ఓట్లతో గెలిచాం. చెప్పినవి చేసి చూపించాం. అందువల్ల ప్రజలు మాతోనే ఉన్నారు. దేవుడి దయతో మేం స్వీప్ చేయబోతున్నాం.

> **నవికా:** మీపై ప్రతిపక్షాలు అవినీతి ఆరోపణలు చేస్తున్నాయి.. దానికి మీరేమంటారు?
> **సీఎం జగన్:** దాదాపు 2.70 లక్షల కోట్ల రూపాయలు నేరుగా (డీబీటీ) ప్రజల ఖాతాల్లో జమ చేశాను. ప్రజల ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలతో సహా ఆధారాలు ఉన్నాయి. మరి అవినీతి చేశానని వారు ఎలా అంటారు? 90 శాతం కుటుంబాలకు మేలు జరిగింది.

నవికా: కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబుతో చేతులు కలిపారని మీరు అంటున్నారు. ఈ విషయం బీజేపీకి తెలియదంటారా?
సీఎం జగన్: ఈ ప్రశ్న మీరు ఆ పార్టీ వాళ్లను అడగాలి.

నవికా: మీరు పరాజయం పాలవ్వబోతున్నారనే బీజేపీ మీతో పొత్తు పెట్టుకోలేదా? టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకుందని మీరేమైన నిరాశకు గురయ్యారా?
సీఎం జగన్: పొత్తు పెట్టుకుంటానని నేను ఏ పార్టీని కోరలేదు. గొప్ప పరిపాలనను మేం అందించాం. ఈ క్రమంలో మేం పొత్తులు పెట్టుకుని ఎన్నికలకు పోవాల్సిన అవసరం లేదు. మా రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ ఈ రెండు జాతీయ పార్టీలు అప్రధానం. వాళ్ల పార్టీ, వాళ్లకు ఇష్టం వచ్చినట్టు పొత్తులు పెట్టుకున్నారు. మా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే కొన్ని సందర్భాల్లో ఎన్‌డీఏ ప్రభుత్వానికి కొన్ని బిల్లుల విషయంలో మద్దతు ఇచ్చాం. ప్రజల ప్రయోజనాలకు ఇబ్బంది అనిపించినప్పుడు ఆ బిల్లులకు మేం మద్దతు ఇవ్వలేదు. ఉదాహరణకు మైనార్టీల హక్కులకు విఘాతం కలిగించే బిల్లులకు మేం మద్దతు ఇవ్వలేదు. సీఏఏకు వ్యతిరేకంగా మేం అసెంబ్లీలో తీర్మానం కూడా చేశాం.

> **నవికా:** మీరు రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నాకే మిమ్మల్ని టార్గెట్ చేశారా?
> **సీఎం జగన్:** నేను ఎంపీ అయ్యి 100 రోజులు కూడా పూర్తవకుండానే నా తండ్రి చనిపోయారు. ఆ తర్వాత ప్రతి ఒక్కరితో పోరాడాల్సి వచ్చింది.

నవికా: రాష్ట్రానికి ప్రత్యేక **హోదా సాధించడం** కోసమే మీరు ఎన్‌డీఏ **ప్రభుత్వానికి మద్దతు** ఇచ్చారనే వాదన ఉంది. **ఈ క్రమంలో హోదా అంశంపై ఏదైనా భరోసా లభించిందా?**
సీఎం జగన్: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఒప్పుకుంది. కానీ.. అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదా కల్పించే అంశాన్ని విభజన చట్టంలో చేర్చకుండా అన్యాయం చేసింది. పార్లమెంట్‌లో కేంద్రం చేసిన ప్రకటన మేరకు ప్రత్యేక హోదా రాష్ట్రానికి వస్తుందని మేం నమ్మాం. కానీ.. చంద్రబాబు ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించి, ప్రత్యేక హోదాను కేంద్రానికి తాకట్టు పెట్టేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించే విషయంలో బీజేపీ, కాంగ్రెస్ రెండు జాతీయ పార్టీలు చెలగాటం ఆడాయి. ప్రత్యేక హోదాను సాధించడమే ప్రధాన అజెండాగా మేం అడుగులు ముందుకు వేశాం, వేస్తున్నాం. మా మీద ఆధారపడిన ప్రభుత్వం కేంద్రంలో వస్తే కచ్చితంగా ప్రత్యేక హోదాను సాధిస్తాం.

నవికా: పూర్తి మెజార్టీతో కాకుండా కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వస్తేనే హోదా వస్తుందని భావిస్తున్నారా?
సీఎం జగన్: ఇది నిజం. అందరికీ ఇది తెలిసిన అంశమే.

నవికా: మెజార్టీ లేక సంకీర్ణం.. కేంద్రంలో ఏ ప్రభుత్వం రాబోతుందని మీరు భావిస్తున్నారు?
సీఎం జగన్: జాతీయ స్థాయిలో రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నాయో అంచనా వేయడం సాధ్యం కాకపోవచ్చు. జాతీయ మీడియా చేసిన సర్వేలు కొన్ని సార్లు నిజం కావచ్చు. కాపోవచ్చు.

నవికా: రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని మీరు అనుకుంటున్నారా?
సీఎం జగన్: రాహుల్ గాంధీ, నరేంద్ర మోదీ ఇద్దరిని నేను దగ్గరగా చూశాను. వ్యక్తిగతంగా రాహుల్ గాంధీ, మోదీతో పోల్చి చూస్తే.. మైనార్టీలకు వ్యతిరేకం అని తప్పితే మిగతా అంశాల్లో మోదీనే మంచివారు. కాంగ్రెస్ పార్టీకి ఎంతో విధేయుడిగా ఉన్న నా తండ్రి మరణించాక నా కుటుంబాన్ని ఏ విధంగా వేధింపులకు గురి చేశారో అందరికీ తెలుసు. ఆ వేధింపులకు నేనే సాక్షి. ఈ క్రమంలో ఏ విధంగా రాహుల్ గాంధీ మంచివాడని అనాలి?

నవికా: రాజకీయాల్లో ఉన్నత ఆశయాలు ఉన్నాయని చెబుతున్నారు మీరు.. అందుకే మీ చెల్లెళ్లు మీ నుంచి దూరమయ్యారా? మీరు పార్టీలోకి రానివ్వకపోవడంతోనే వేరే పార్టీల వైపు వెళ్లారా?
సీఎం జగన్: వాళ్లను తీసుకొస్తే అది కుటుంబ రాజకీయంగా మారిపోతుంది. ఒకే కుటుంబంలోని ఒక జనరేషన్ నుంచి ఎక్కువ మంది రాజకీయాల్లో ఉంటే అది పార్టీ అవ్వదు. మరేదో అవుతుంది. నాకు స్పష్టమైన విజన్ ఉంది. పార్టీ వారసత్వానికి వచ్చిన ఇబ్బంది లేదు. ప్రజలకు మంచి చేసేందుకు నాకు సుదీర్ఘ భవిష్యత్తు ఉంది. వారసత్వం అనేది వేరే ప్రస్తావన. కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు ఎలా ఉండాలంటే.. ఎవరైనా వస్తే సంతోషంగా మాట్లాడుకోగలగాలి. అందరూ కలిసి ఒకేచోట కూర్చుని సరదాగా ఉండాలి. అంతేగానీ ప్రతి చోట రాజకీయం అంటే ఎలా? ఒక కుటుంబం నడిపే పార్టీ ఎప్పటికీ బతకదు.

నవికా: మీ చెల్లెలితో మీ అనుబంధం ఎలా ఉండేది?
సీఎం జగన్: దురదృష్టవశాత్తు ఆమె చంద్రబాబుతో కలిసింది. ఆయన చెప్పినట్టే రాజకీయాలు చేస్తోంది. మా కుటుంబానికి తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీలో చేరి.. ఆ పార్టీకి రాష్ట్రంలో నాయకత్వం వహిస్తోంది. (నవికా: ఆమె మీ కుటుంబమే కదా..) మా కుటుంబ సభ్యురాలు అయి ఉండి కూడా.. బయటకు వెళ్లడం, రాజకీయ శత్రువులతో చేతులు కలపడం నాకు బాధ కలిగిస్తోంది.

నవికా: మీ ఇద్దరి విషయంలో.. రెండు వైపులా మీ తల్లి ఎలా మేనేజ్ చేస్తున్నారు?
సీఎం జగన్: ఈ రోజు రాజకీయాల్లో ఎవరు పోటీ చేస్తున్నారు.. ఎవరు చేయట్లేదు అనేది కాదు. రాష్ట్రంలో మా ప్రభుత్వం చేసిన మంచిని మేము చెబుతున్నాం. ఇక్కడ జగన్ ఒక వైపు.. మిగిలిన వారందరూ మరో వైపు ఉన్నారు. ప్రజలు ఓటు ద్వారా తమ మద్దతు తెలుపుతారు. అలాంటి రాజకీయమే నడుస్తోంది. కుటుంబ రాజకీయాలు ఇక్కడ పని చేయవు.

నవికా: చంద్రబాబు చెప్పినట్టే.. ఆయనకు ఏమి అవసరమో అదే.. మీ చెల్లెలు చేస్తున్నారని ఎలా చెబుతున్నారు? కాంగ్రెస్ పార్టీలోని సభ్యులు ఆమెకు ఆశలు కల్పించి ఉండొచ్చుకదా?
సీఎం జగన్: ఇక్కడ వాస్తవం ఏమంటే.. ఏమి జరుగుతుందో నాకు స్పష్టంగా తెలుసు. (నవికా: మీరేమైనా ఫోన్ ట్యాపింగ్ చేశారా? తెలంగాణలో **కేసీఆర్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేశారని చెబుతున్నట్టు) ఎవరైనా ఎందుకు ఫోన్ ట్యాపింగ్ చేయాలి. ఆమె నా సొంత చెల్లెలు. అందుకే ఏం జరిగిందో ఏం జరుగుతోందో నాకు** తెలుసు. ఎవరు ఆడిస్తున్నారో.. ఎవరు నీచ రాజకీయాలు చేస్తున్నారో నాకు తెలుసు.

నవికా: నారీ శక్తిని విశ్వసిస్తున్న దేశంలో.. తండ్రి వారసత్వం వాటా కొడుకులకు మాత్రమే కాదు.. కూతుళ్లకు వర్తిస్తుందంటే మీరు ఏమంటారు?
సీఎం జగన్: దీనినే సరిగా అర్థం చేసుకోవాలి. ఇక్కడ వారసత్వం కోసం పోరాటం జరగట్లేదు. మా నాన్న 2009లో అందరినీ విడిచి వెళ్లిపోయారు. మనం 2024లో మాట్లాడుకుంటున్నాం. దాదాపు 15 ఏళ్లు అవుతుంది నాన్న వెళ్లిపోయి. ఇక్కడ ముఖ్యమంత్రిగా నా ఐదేళ్ల పాలనను ప్రజలు చూశారు. నా పాలనను విశ్వసిస్తే వారే ఓటు రూపంలో నాకు మద్దతుగా నిలుస్తారు. లేకుంటే వేరే వైపు చూస్తారు. ఆ పోరాటమే నడుస్తోంది గానీ, వారసత్వం ఎక్కడి నుంచి వస్తుంది?



నవికా: ఏపీలో కాంగ్రెస్, ఎన్‌డీఏ, జగన్ ముక్కోణపు పోటీలో ఉన్నారు? ఏమైనా మీ ఓటు బ్యాంకుపై ప్రభావం చూపుతారా?
సీఎం జగన్: ఈ రోజు నేను చెప్పే మాటలను (మార్క్) గుర్తు పెట్టుకోండి. ఎన్నికలు ముగిసిన తర్వాత మళ్లీ రండి. కాంగ్రెస్‌కు నోటా కంటే ఒక్క ఓటు కూడా ఎక్కువ రాదు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతృత్వంలోని కూటమి మధ్యే పోటీ.

నవికా: 2019 ఎన్నికల్లో మీరు రికార్డు విజయం సాధించారు. 175 శాసనసభ స్థానాల్లో 151 స్థానాలు, 25లో 22 పార్లమెంట్ స్థానాలు గెలుచుకున్నారు. ఇప్పుడు ఎన్ని స్థానాలను మీరు గెలవబోతున్నారు?
సీఎం జగన్: ఎన్నికల్లో 50 శాతం ఓట్లు సాధించడం అనేది ముఖ్యమైనది. గత ఎన్నికల్లో మేము 49.96 శాతం ఓట్లు సాధించాం. ఈ సారి దేవుడి దయతో 2019లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ తెచ్చుకుంటామని నాకు బలమైన నమ్మకం ఉంది. మీరు మంచి విశ్లేషణ చేస్తారు.. మీరే ఆ రోజు టీవీలో నంబర్లు చూస్తారు.

నవికా: దేశంలో ప్రత్యర్థి పార్టీలు ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్నాయి? దీనిపై మీరు ఏమంటారు?
సీఎం జగన్: నేను దేశంలో ప్రజాస్వామ్యం బతికి ఉందని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. అలాంటప్పుడు వేరే విషయాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

నవికా: ఏపీలో బీజేపీ పొత్తును మీరు టార్గెట్ చేశారు. 2014లో కలిసి పోటీ చేసిన వాళ్లు.. తిరిగి 2024లో వస్తున్నారు? మీరు దీనిని అవకాశవాద పొత్తుగా ఎందుకు చూస్తున్నారు?
సీఎం జగన్: ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి పార్టీ మేనిఫెస్టో ప్రకటిస్తుంది. అదే పార్టీ విజన్‌ను ప్రజల దగ్గరకు తీసుకెళ్లే మార్గదర్శకంగా ఉంటుంది. పాలనా పని తీరును కూడా మేనిఫెస్టోలో చెప్పిన అంశాలతో నేరవేర్చామా లేదా అని పోల్చి చూడాలి. ఇదే ఎన్నికల్లో ప్రజల దగ్గరకు వెళ్లి ఓట్లను అడిగేందుకు మన అర్హతను నిర్ణయిస్తుంది. ఇప్పుడు కూటమిగా వస్తున్న వాళ్లే.. గతంలో చంద్రబాబు సంతకంతో రకరకాల హామీలతో కరపత్రం ముద్రించి 2014లో ప్రతి ఇంటికీ పంపించారు. కూటమి నాయకుల ఫొటోలతో ముద్రించారు. ఇదే విషయాన్ని నా ప్రతి బహిరంగ సభలోనూ ప్రజలకు చెబుతున్నాను. వాళ్ల మేనిఫెస్టోను చూపించి.. అందులోని వాగ్దానాలను చదివి.. ఇవన్నీ 2014 ఎన్నికల తర్వాత అమలు చేశారా? లేదా? అంటూ ప్రజలనే అడుగుతున్నాను. **అందులో నెరవేర్చిన ఒక్క హామీనైనా చెప్పమంటున్నాను. చెప్పడానికి అందులో ఒక్కటంటే ఒక్కటీ లేదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. అప్పట్లో ఆ కూటమి ప్రజలను మోసం చేసింది.** అందుకే 2019 ఎన్నికల్లో చంద్రబాబు అధికారం నుంచి తుడిచి పెట్టుకుపోయాడు. 151 ఎమ్మెల్యే, 22 ఎంపీ స్థానాల్లో మేము గెలిచాం. మళ్లీ అదే కూటమి.. అదే చంద్రబాబు.. కొత్త మేనిఫెస్టోతో వచ్చారు.

నవికా: ఐదేళ్ల మీ పాలనను ప్రజలు చూశారు. చంద్రబాబు కంటే మీరు మెరుగైన పాలన అందించారని ప్రజలు నమ్ముతారని అనుకుంటున్నారా?
సీఎం జగన్: చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు. కానీ మేం 2019లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను త్రికరణశుద్ధితో అమలు చేశాం. మా మేనిఫెస్టోను ప్రతి సంవత్సరం ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజలకే ఇచ్చి.. అందులో వారికి ప్రభుత్వం నుంచి ఏమేం అందాయో టిక్ చేయమని చెప్పాం. మొదటి ఏడాదిలోనే దాదాపు 86, 87 శాతం హామీలు అమలు చేస్తే.. ఇప్పటికి 99 శాతం హామీలు అమలు చేశారని ప్రజలే చెబుతున్నారు. అది మా ప్రభుత్వం, మా పార్టీపై ప్రజలకున్న విశ్వసనీయత. అదే మా నమ్మకం.

నవికా: చంద్రబాబు జైలుకు వెళ్లి, బెయిల్‌పై బయటకు వచ్చాక సభలు నిర్వహించారు. అదే సమయంలో మీరూ సిద్ధం సభలు పెట్టారు. చంద్రబాబుకు ప్రజల నుంచి సానుభూతి రాకూడదనే మీరు సిద్ధం సభలు నిర్వహించారని ప్రతిపక్షాలు అంటే మీరేమంటారు?
సీఎం జగన్: (నవ్వుతూ..) నేను సిద్ధం సభలు పెట్టినట్టే వారూ రాజకీయ సభలు పెట్టారు. కానీ జగన్ సిద్ధం సభలకు ప్రజలు భారీగా తరలి వచ్చారు. వారి సభలకు ఎవరూ రాలేదు. దానికి నేనేం చేయగలను.. ఈ ప్రశ్న వారినే అడగాలి. జగన్ అంత జనాన్ని ఎలా ఆకట్టుకుంటున్నాడు.. మీరెందుకు ప్రజలను ఆకట్టుకోలేకపోయారని వారినే అడగండి.

నవికా: మీ చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య మీ కుటుంబంలో వివాదాస్పదంగా మారింది. ఆ హత్య కేసులో ఆయన భార్య, మీ చెల్లెళ్లు కూడా గత ఐదేళ్లుగా కేసు దర్యాప్తులో న్యాయం జరగలేదంటున్నారు.
సీఎం జగన్: ఈ అంశం మా కజిన్స్ మధ్య ఉంది. మా కజిన్ సిస్టర్ ప్రస్తుతం ఎంపీగా ఉన్న మరో కజిన్ బ్రదర్‌పై ఆరోపణలు చేస్తోంది. ఆరోపణలు కజిన్‌పై చేస్తున్నారు. దురదృష్టం ఏమిటంటే ఘటన జరిగినప్పుడు ఇవేమీ లేవు. కానీ సడెన్‌గా ఈ మార్పు ఎందుకు వచ్చింది? దీనికంతటికీ కారణం చంద్రబాబే.

నవికా: ప్రతి సమస్యకు చంద్రబాబుతో సంబంధం ఉంటుందా?
సీఎం జగన్: ఇక్కడ జరుగుతున్నది జగన్, చంద్రబాబు మధ్య పోరాటం. జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక చంద్రబాబు నా కుటుంబాన్నే నాకు వ్యతిరేకంగా మార్చాలని చూస్తున్నారు. జగన్ ఎప్పుడూ ఒంటరి కాదు.. నా వెనుక ప్రజలున్నారు. ఇలాంటప్పుడు నాపై వ్యతిరేకత ఎందుకొస్తుంది! ప్రజలకు అవసరమైనవన్నీ చేస్తున్నాను. ఇలాంటప్పుడు ఇతర పార్టీల అవసరం ఏముంది?

> **నవికా:** వన్ నేషన్. వన్ ఎలక్షన్‌కు మీరు మద్దతిస్తారా?
> **సీఎం జగన్:** కచ్చితంగా మద్దతిస్తాం. ఇప్పటికే మద్దతిచ్చాం

నవికా: రాజకీయ ప్రతీకారంతో అనుకోండి, లేదా మరేమైనాగానీ మీపై ఉన్న సీబీఐ కేసుల గురించి ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయి.. అవి మీ ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారతాయనుకుంటున్నారా?
సీఎం జగన్: నాపై ఉన్న కేసులు నా ప్రభుత్వంలో, నా పాలనలో నమోదైనవి కాదు. మా నాన్న చనిపోయినప్పుడు.. నేను రాజకీయంగా వారికి ఎక్కడ అడ్డు తగులుతానో అని భయపడి చంద్రబాబు, కాంగ్రెస్ కలిసి కుట్రతో పెట్టిన కేసులు. **అత్యంత దురదృష్టకరమైన విషయం ఏంటంటే.. నాపై అక్రమ కేసులు బనాయించడానికి చేసిన ఆరోపణలు ఏ కాలానికి సంబంధించినవి? అప్పటికి నేను ఎమ్మెల్యేను కాను, ఎంపీనీ కాను.** పైగా అప్పట్లో నేను హైదరాబాద్‌లో కూడా లేను. ఆ సమయంలో నేను ఏ ఒక్క మంత్రితోగానీ ఏ ఒక్క ఐఏఎస్ ఆఫీసర్‌తోగానీ ఏ ఒక్క ఐపీఎస్ అధికారితో గానీ ఎప్పుడూ మాట్లాడలేదు. ఇది వాస్తవం.

నవికా: కాంగ్రెస్ నుంచి బయటకు రావడంతోనే ఇబ్బందులు మొదలయ్యాయా?
సీఎం జగన్: అవును, నిజానికి నా జీవితంలో 16 నెలలు ఎవరు చెల్లిస్తారు? నన్ను జైల్లో పెట్టారు, కారణం ఏంటి?

నవికా: కేంద్రంలోని బీజేపీ తన ప్రతిపక్షాలను దెబ్బ తీసేందుకు కేంద్ర ఏజెన్సీలను పావుగా వాడుకుంటోందని కాంగ్రెస్ చెబుతోంది, మీరేం చెబుతారు?
సీఎం జగన్: అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఏం చేసింది? నాపై నమోదు చేసిన కేసులే అందుకు ఉదాహరణ. 2004 నుంచి 2009 వరకు నా తండ్రి ముఖ్యమంత్రి. ఇప్పుడు 2024 వచ్చింది. కాంగ్రెస్ ఏం చేసింది.. అధికారంలో ఉన్నవారు తమ అధికారాన్ని చెడు కోసం వాడుకుంటున్నారు. ఇలా చేయడం దురదృష్టకరం. ఒక వేలు ఒకరి వైపు చూపిస్తే.. నాలుగు వేళ్లు మనవైపే చూపిస్తాయి, అది అర్థం చేసుకోవడం లేదు.

నవికా: ఎన్‌డీఏ, ఇండియా కూటమిలో మీరు భాగస్వామ్యం కాలేదు ఎందుకు? రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, మమతా బెనర్జీ వంటి ప్రతిపక్ష నేతలు ఉండటం వల్ల ఇండియా కూటమి మీకు అంత అనుకూలం కాదనుకున్నారా?
సీఎం జగన్: ఈ రెండు జాతీయ పార్టీలూ ఆంధ్రప్రదేశ్‌లో అప్రధానమైనవి అనేది మనం ముందుగా గుర్తించాలి. ఎవరైనా వాటితో కలిసి ఎందుకు పోటీ చేయాలనేది ప్రాథమిక ప్రశ్న. రాష్ట్ర ప్రయోజనాలు, సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అంశాలవారీగా కేంద్రానికి వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తుంది. దేనికి మద్దతివ్వాలి.. దేనికి ఇవ్వకూడదనేది మేం ఆలోచించుకుంటాం.

నవికా: ఒకవేళ ఎన్ఆర్‌సీ వస్తే మద్దతిస్తారా?
సీఎం జగన్: మద్దతు ఇవ్వం.

నవికా: జగన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎలాంటి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా తనకంటూ సొంత గుర్తింపుతోనే ముందుకు వెళ్లాలనుకుంటోందా? దానికి మీరు పూర్తిగా కట్టుబడి ఉన్నారా?
సీఎం జగన్: కచ్చితంగా. విశ్వసనీయత, నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్నాం. రాజకీయాలలో విశ్వసనీయత ప్రధానమైనదని నేను గట్టిగా నమ్ముతాను. ప్రజల కోసం ఎవరితోనైనా పోరాటం చేయడానికి సిద్ధం.

నవికా: ప్రధాని నరేంద్ర మోదీ గురించి ఏమనుకుంటున్నారు. చాలా సమావేశాల్లో ఆయనతో కలిసి మీరు పాల్గొన్నారు. ఈ మధ్య ఆయన చాలా పొత్తులు పెట్టుకున్నారు. మీరెలా భావిస్తున్నారు?
సీఎం జగన్: రాజకీయాల్లో మోదీని, రాహుల్ గాంధీలను చూశాం. అయితే మైనార్టీలకు వ్యతిరేకం వంటి కొన్ని విషయాల్లో మోదీతో మేం విభేదించవచ్చు. కానీ ఆయన మంచి నాయకుడే.

నవికా: రాహుల్ గాంధీ గురించి చెప్పాలంటే ఏం చెబుతారు. మీరొక భారతీయ పౌరుడిగా చెప్పండి.
సీఎం జగన్: నేను ఇప్పటికే ఈ విషయంపై చెప్పాను. ఒక వేళ రాహుల్ మంచి నాయకుడైతే ప్రజలే ఓట్లేసి గెలిపిస్తారు. కాంగ్రెస్ పార్టీ నాకు చేసిన అన్యాయాన్ని బట్టి రాహుల్‌పై నా అభిప్రాయం నాకుంది. నాకైతే రాహుల్ అంటే వ్యక్తిగతంగా ఇష్టం లేదు.

నవికా: మూడు రాజధానుల అంశం గురించి ఏమంటారు?
సీఎం జగన్: ఆ నిర్ణయం ఇప్పటికే జరిగిపోయింది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. విశాఖ పరిపాలన రాజధాని, అమరావతి శాసన రాజధాని, కర్నూలు న్యాయ రాజధానిగా ఉంటాయి. 2024 ఎన్నికల్లో విజయం సాధించి.. సీఎంగా నేను ప్రమాణ స్వీకారం కూడా విశాఖలోనే చేస్తాను.

నవికా: వారసత్వ రాజకీయాలకు కాలం చెల్లిందని మోదీ అన్నట్టు.. రాజకీయాలు, కుటుంబం మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాయా?
సీఎం జగన్: ఆయన ఏ సందర్భంగా అన్నారో నాకు తెలియదుగానీ మోదీ అన్న మాటలను నేను బలంగా నమ్ముతున్నాను. కుటుంబాన్ని బేలెన్స్‌గా చూసుకోవాలన్నది నా బలమైన నమ్మకం. అయితే కుటుంబంలో సమస్యలు వచ్చినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కోలేకపోతే పార్టీని నడపలేం. అలాంటప్పుడు అప్రమత్తంగా లేకపోతే పార్టీ నష్టపోతుంది. పులివెందులలో నేను నామినేషన్ వేసినప్పుడు ఈ అంశంపై స్పష్టంగా చెప్పాను. కడప నుంచే ఆమె (షర్మిల) ఎంపీగా పోటీ చేస్తోంది. ఇదే స్థానం నుంచి నా కజిన్ ఎంపీగా ఉండి నా పార్టీ తరఫున పోటీలో ఉన్నారు. ముఖ్యమంత్రిగా నేను ఉన్నానంటే అది దేవుడి దయ. ఈ పదవి అణగారిన, వెనుకబడిన వర్గాలు, అగ్రవర్ణ పేదలకు మేలు చేయడానికి లభించిన అవకాశం. నేను డబ్బు సంపాదించుకోవడానికో లేక నా కుటుంబ సభ్యులను కోటీశ్వరులను చేయడానికో కాదు. వారు నా నుంచి అలాంటివి ఆశలు పెట్టుకోకూడదు. ఇదే విషయాన్ని బహిరంగంగానే చెప్పాను.



నవికా: ఇప్పుడున్న పరిస్థితుల్లో చంద్రబాబు మీకు ఎన్నికల్లో పోటీదారు అనుకుంటున్నారా? చంద్రబాబు జైలుకెళ్లి వచ్చిన తర్వాత ప్రజల ఆలోచనలో మార్పు వచ్చిందనుకుంటున్నారా? లేక ఉచిత పథకాలు ఫలితాలిస్తాయని అనుకుంటున్నారా?
సీఎం జగన్: ఇవన్నీ కాదు. మా ఐదేళ్ల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. ప్రజలకు ఇస్తున్నవి ఉచిత పథకాలుగా చూడకూడదు. అవి సామాజిక పెట్టుబడి. పరిపాలన, విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో గొప్ప సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ స్కూళ్లన్నీ ఇంగ్లిష్ మీడియం స్కూళ్లుగా మారాయి. స్కూల్స్ అప్‌గ్రేడ్ అయ్యాయి. మూడో తరగతి నుంచే పిల్లలు టోఫెల్ గురించి ఆలోచిస్తున్నారు. ఆరో తరగతి నుంచే డిజిటల్ క్లాస్ రూమ్స్ వచ్చాయి. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చాం. ఐబీ సిలబస్ అందిస్తున్నాం. మా రాష్ట్రంలో 2025 నుంచి ఒకటో తరగతిలోనే ఐబీ సిలబస్ బోధిస్తాం. 2035 నుంచి మా పిల్లలు ఐబీ సర్టిఫికెట్ పొందుతారు. ఇవన్నీ ప్రజల కళ్ల ముందు కనిపిస్తున్నాయి. ప్రతి గ్రామంలో మార్పు వచ్చింది. ఏ గ్రామానికి వెళ్లినా దాదాపు 600 రకాల సేవలు ఇంటి వద్దకే అందుతున్నాయి. ప్రతి సర్టిఫికెట్, ప్రతి సంక్షేమ పథకం, ప్రతి సేవ.. వలంటీర్ ద్వారా ఇంటి గుమ్మం ముందుకే వస్తున్నాయి. విలేజ్ క్లినిక్, రైతుల కోసం రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే), ఇంగ్లిష్ మీడియం స్కూల్, నవీకరించిన పాఠశాలలు, నవీకరించిన సిలబస్.. ఇలాంటివేవీ గతంలో లేవు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్యలో చాలా మార్పు వచ్చింది. ముఖ్యంగా పాలనలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. నేను అధికారంలోకి రాక ముందు, ఇవన్నీ చేయక ముందు ఏదైనా సంక్షేమ పథకంలో ప్రభుత్వం నుంచి ఒక రూపాయి ప్రజలకు ఎలాంటి అవినీతి లేకుండా, వివక్ష చూపకుండా అర్హులందరికీ చేరుతుందంటే ఎవరూ నమ్మే వారు కాదు.

> **నవికా:** యూనిఫాం సివిల్ కోడ్‌కు మద్దతిస్తున్నారా?
> **సీఎం జగన్:** మేం మద్దతివ్వడం లేదు. సీఏఏను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం కూడా చేశాం.

నవికా: ఎన్నికల్లో మీకెన్ని అసెంబ్లీ సీట్లు వస్తాయనుకుంటున్నారు? 151 సంఖ్యను దాటుతామని అనుకుంటున్నారా? బీజేపీకి, టీడీపీకి ఎన్ని సీట్లు వస్తాయని అనుకుంటున్నారు?
సీఎం జగన్: మా పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. నన్ను నమ్మండి. నంబర్స్ చూస్తూ ఉండండి.

నవికా: ప్రధాన మంత్రి ఎవరవుతారని అనుకుంటున్నారు?
సీఎం జగన్: అది ఎన్నికల్లో ప్రజలు నిర్ణయిస్తారు. అందరూ చెబుతున్నది, టీవీల్లో చూస్తున్నదానిని బట్టి మోదీ మళ్లీ అధికారంలోకి వస్తారని అన్పిస్తోంది. ఎవరు అధికారంలోకి వస్తారు.. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక ఎన్నికల్లో ఏం జరుగుతుందో చెప్పడానికి నేనేమీ సెఫాలజిస్ట్(విశ్లేషకుడు)ను కాదు. ఒక వేళ ఎవరైనా ఏదైనా చెబితే అది కేవలం ఒక అంచనా మాత్రమే.

నవికా: మీరు మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఇంత కంటే గొప్పగా ఏం చేస్తారు?
సీఎం జగన్: మేనిఫెస్టోలో చెప్పిన ప్రతిదీ పెద్ద హామీయే. అవన్నీ చేస్తాం.

నవికా: మీ సోదరిని మిస్ అవుతున్నారా?
సీఎం జగన్: కచ్చితంగా మిస్ అవుతున్నాను(భావోద్వేగంతో). దురదృష్టవశాత్తు ఆమె బయటకు వెళ్లింది. కానీ ప్రేమలు ఎక్కడికిపోతాయి?

నవికా: ఆమె విషయంలో అంతా మంచి జరుగుతుందని ఆశిస్తున్నారా?
సీఎం జగన్: దురదృష్టవశాత్తు ఆమె ఆ మార్గాన్ని ఎంచుకుంది. ఈ పరిస్థితి మారచ్చు.. మారకపోవచ్చు.

> **నవికా:** రాష్ట్రం ఫిస్కల్ హెల్త్ (ఆర్థిక పరిస్థితి) గురించి ఏమంటారు?
> **సీఎం జగన్:** చంద్రబాబు పాలనలో కంటే ప్రస్తుతం చాలా చాలా గొప్పగా ఉంది రాష్ట్రం. దానికి సంబంధించిన లెక్కలన్నీ అందుబాటులో ఉన్నాయి.



డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్

సిజేరియన్లను తగ్గించడమే లక్ష్యం...

"ప్రసవం స్త్రీకి పునర్జన్మ లాంటిది. ఆ మరుజన్మ ఆమెకు ఎంతో ఆనందకరమైన అనుభూతిగా జీవితాంతం మిగిలిపోవాలి. అందుకోసమే నా కృషి' అన్నారు హైదరాబాద్‌లోని ఫెర్నాండేజ్ హాస్పిటల్స్ చెయిర్‌పర్సన్, ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ఎవిటా ఫెర్నాండేజ్. ప్రసవ సమయంలో కీలకమైన మంత్రసానుల ఆవశ్యకతను గుర్తించి చేపట్టిన శిక్షణా కార్యక్రమాలతో పాటు గర్భిణులకు ప్రీ చైల్డ్ బర్త్ అవేర్‌నెస్ క్లాసులను నిర్వహిస్తున్నారు. భారతదేశంలో మిడ్‌వైఫరీ వ్యవస్థకు నాయకత్వం వహిస్తున్న ఈ డాక్టర్ 2011లో తెలంగాణలో మొట్టమొదటి ప్రొఫెషనల్ మిడ్‌వైఫరీ సర్వీసెస్ ప్రారంభించారు. మే5 'ఇంటర్నేషనల్ మిడ్‌వైఫ్ డే.' ఈ సందర్భాన్ని పురస్కరించుకొని డాక్టర్ ఎవిటాను కలిసినప్పుడు మాతాశిశు సంరక్షణలో మంత్రసానుల కీలక పాత్ర, గర్భిణులకు అవగాహన కలిగించే ఎన్నో విషయాలను తెలియజేశారు.

"సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి. అవసరం లేని సిజేరియన్స్ శాతాన్ని తగ్గించాలి. మాతా, శిశు సంరక్షణే ధ్యేయంగా పని చేయాలన్నదే మా ప్రధాన ఉద్దేశ్యం. ఈ ఐదేళ్లలో సిజేరియన్ల శాతం బాగా తగ్గించగలిగాం. దీనికి గర్భిణుల్లో అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నాం. మహిళలు తమ శరీరం గురించి అర్థం చేసుకుని, భయాలు తొలగిపోయేలా, ప్రసవానికి సంబంధించి వీలైనంత అవగాహన పెంచుకుంటే ఒత్తిడిని తగ్గించుకొని ఎన్నో సమస్యల నుంచి బయటపడవచ్చు. గర్భం దాల్చిన ప్రతి స్త్రీకి ప్రసవం గౌరవప్రదంగా, ఆనందకరమైన అనుభవంగా మారాలి. అందుకు తగిన ప్రణాళికలు ఎప్పుడూ చేస్తుంటాం.

ప్రసూతి సేవలకు వెన్నెముక

మంత్రసాని వ్యవస్థ స్త్రీ చుట్టూ, స్త్రీల కోసం కేంద్రీకృతమైంది. గర్భవతికి మద్దతు, గోప్యత, విశ్వాసం కలిగిస్తుంది. 2007 నాటికి ఏడాదికి 5వేలకు పైగా డెలివరీ చేసేవాళ్లం. ఎంతోమంది గర్భిణులు ముఖ్యంగా చిన్నవయసు వారిలో ప్రసవ సమయంలో వచ్చే సమస్యలు నన్ను బాగా కలిచి వేసేవి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ప్రసూతి మరణాల గురించి చదవడం, తెలుసుకోవడంపై దృష్టి పెట్టాను. అప్పటిదాకా మేం అనుసరించిన ప్రసవ పద్ధతుల్లో మార్పులు అవసరం అని గ్రహించాను. ఈ క్రమంలో ప్రసూతి మరణాల రేటు తక్కువ ఉన్న దేశాలు మిడ్‌వైఫరీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని తెలిసింది. అయితే, మన దేశంలో ఆ వెసులుబాటు లేదు. ఒకప్పుడు గ్రామాల్లో ఒక అనుభవం ఉన్న మంత్రసాని ఉండేది. తల్లిలా చూసుకునే అనుభవజ్ఞురాలైన మంత్రసాని దేశంలోని అన్ని ఆసుపత్రులలో ఉండటం అత్యవసరం అనిపించింది. దీని ద్వారా ఎక్కువ మంది మహిళలకు అత్యున్నత స్థాయి గల ప్రసూతి సంరక్షణ అవకాశాన్ని కలిగించవచ్చని అనిపించింది. అలాగే, అనవసరమైన సిజేరియన్లు తగ్గించడానికి కూడా ఈ ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుంది.

తెలంగాణలో..

ఈ ఆలోచన చేసిన వెంటనే వెనకడుగు వేయకుండా 2011లో రెండేళ్ల అంతర్గత ప్రొఫెషనల్ మిడ్‌వైఫరీ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ (పిఎమ్ఇటి) ప్రోగ్రామ్‌ను ప్రారంభించాం. మొదట పైలట్ ప్రాజెక్ట్ పూర్తి చేశాం. ఆ తర్వాత ప్రభుత్వంతో కలిసి హెల్త్ కేర్ ఎకో సిస్టమ్‌లో మంత్రసానుల ప్రవేశం మొదలైంది. 2018లో ఫెర్నాండేజ్ ఫౌండేషన్, తెలంగాణ ప్రభుత్వం, యునిసెఫ్ సహకారంతో రాష్ట్ర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ నుండి నర్సుల కోసం మిడ్‌వైఫరీలో 18 నెలల సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించాం. మిడ్‌వైఫ్స్ కోసం రూపొందించిన ఈ కోర్సు తెలంగాణలోనే మొట్టమొదటిది. మొదట తెలంగాణలోని పది మారుమూల ఆసుపత్రుల్లో 30 మంది నర్సులకు మిడ్‌వైఫరీలో శిక్షణ ఇవ్వడం, ప్రసూతి సంరక్షణలో గేమ్ ఛేంజర్‌గా నిరూపించబడింది. ఇప్పుడు తెలంగాణలో సహజ ప్రసవాల శాతం పెరుగుతుంది. ఈ పని ద్వారా ఎంతో సంతృప్తి కలుగుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో..

ఇటీవలే పీఎమ్‌టీ ప్రోగ్రామ్ ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రారంభించాం. యునిసెఫ్, డబ్ల్యూహెచ్‌వో, బర్మింగ్‌హమ్ యూనివర్శిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం. మొదటగా తెనాలిలో ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యింది. తర్వాత సి-సేఫ్ ప్రాజెక్ట్స్ జిజిహెచ్ రాజమహేంద్రవరం, జిజిహెచ్ ఏలూరు, జిజిహెచ్ మచిలీపట్నం, డిహెచ్ అనకాలపల్లిలో చేయబోతున్నాం.



● శిక్షణా కార్యక్రమంలో...

విస్తరణ వైపుగా...

నవాబుల కాలంలో హైదరాబాద్‌లో మా అమ్మ నాన్నలు లెస్లీ, లౌర్డెస్ ఫెర్నాండెజ్‌లు రెండు పడకలతో ఫెర్నాండెజ్ ఆసుపత్రిని ప్రారంభించారు. ఆ రోజుల్లో మాతా, శిశు మరణాలను చూసి వాటిని అడ్డుకోవాలనే సదాశయంతో ఏర్పాటు చేసిన ఆసుపత్రి ఆ తర్వాత నేను బాధ్యతలు తీసుకునే నాటికి 30 పడకలకు పెరిగింది. స్త్రీ వైద్య నిపుణురాలిగా, నిర్వాహకురాలిగా నా బాధ్యతలను విస్తరిస్తూ వస్తున్నాను. ఫలితంగా ఫెర్నాండేజ్ హాస్పిటల్స్ నేడు 300 పడకల సామర్థ్యంతో మూడు ఆసుపత్రులు, రెండు ఔట్ పేషెంట్ క్లినిక్‌లు, నర్సింగ్ స్కూల్‌కి పెరిగింది. ఈ క్రమంలో వారి ఆశయాన్ని నిలబెట్టడానికి ఎంతో కృషి జరిగింది. మాతా, శిశు సంరక్షణపై దృష్టి సారించి వారి ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్య, పరిశోధన వైపుగానూ విస్తరించింది'' అని వివరించారు.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: మోర్ల అనీల్‌కుమార్

పవర్‌ఫుల్ ఉమెన్

గోద్రెజ్ సైనిక... నైరిక

వ్యాపార విభజనతో గోద్రెజ్ కంపెనీ వార్తల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో 'గోద్రెజ్ అండ్ బోయ్స్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆ కంపెనీ ఫ్యూచర్ మేనేజింగ్ డైరెక్టర్ క్యాండెట్ నైరికా హోల్కర్‌పై ప్రత్యేక దృష్టి పడింది. 'గోద్రెజ్'లో న్యూ జనరేషన్ ప్రతినిధిగా భావిస్తున్న నైరికా హోల్కర్ లీడర్‌షిప్ ఫిలాసఫీ గురించి....

గోద్రెజ్ కుటుంబంలో నాల్గవ తరానికి చెందిన నైరికా హోల్కర్‌కు నేర్చుకోవాలనే తపన. ఆఫీసులోని సీనియర్ల నుంచి ఇంట్లో చిన్న పిల్లల వరకు కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఎలాంటి ఇబ్బందీ పడదు. 'వినడం వల్ల కలిగే ఉపయోగాలు, కమ్యూనికేషన్స్ స్కిల్స్ నా కూతురి నుంచి నేర్చుకున్నాను' అని వినమ్రంగా చెబుతుంది నైరిక. ఐడియా రాగానే ఆ క్షణానికి అది గొప్పగానే ఉంటుంది. అందుకే తొందరపడకుండా తనకు వచ్చిన ఐడియా గురించి అన్నీ కోణాలలో విశ్లేషించి ఒక నిర్ధారణకు వస్తుంది. 'నా అభిప్రాయమే కరెక్ట్' అని కాకుండా ఇతరుల కోణంలో కూడా ఆలోచించడం అలవాటు చేసుకుంది.

'యూనివర్శిటీ ఆఫ్ లండన్'లో లా చదివిన నైరిక కొలరాడో కాలేజీలో (యూఎస్)లో ఫిలాసఫీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్ చదువుకుంది. లీగల్ ఫర్మ్ 'ఏజెడ్‌బీ అండ్ పార్ట్‌నర్స్'తో కెరీర్ ప్రారంభించిన నైరిక మన దేశంలో పెట్టుబడులు పెట్టాలనుకునే విదేశీ కంపెనీలకు సలహాలు ఇవ్వడంలో ప్రత్యేక ప్రతిభ సాధించింది. గోద్రెజ్ అండ్ బోయ్స్ (జీ అండ్ బి)లోకి అడుగు పెట్టి డిజిటల్ స్ట్రాటజీ నుంచి కంపెనీ లీగల్ వ్యవహారాలను పర్యవేక్షించడం వరకు ఎన్నో విధులు నిర్వహించింది. ఆమె నేతృత్వంలో కంపెనీ ఎన్నో ఇంక్యుబేటెడ్ స్టార్టప్‌లతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది.

మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇచ్చే నైరిక 'పవర్' అనే మాటకు ఇచ్చే నిర్వచనం...

'అర్థవంతమైన మార్గంలో ప్రభావం చూపే సామర్థ్యం'

'నాయకత్వ లక్షణాలకు చిన్నా పెద్ద అనే తేడా ఉండదు. చిన్న స్థాయిలో పనిచేసే మహిళలలో కూడా అద్భుతమైన నాయకత్వ సామర్థ్యం ఉండవచ్చు. అలాంటి వారిని గుర్తించి నాయకత్వ బాధ్యతలు అప్పగించడం నా ప్రాధాన్యతలలో ఒకటి' అంటుంది నైరిక.

కోవిడ్ కల్లోల కాలం నుంచి ఎంతోమంది లీడర్స్ లాగే నైరిక కూడా ఎన్నో విషయాలు నేర్చుకుంది.

'మాలాంటి కంపెనీ రాత్రికి రాత్రే డిజిటల్‌లోకి వచ్చి రిమోట్ వర్కింగ్‌లోకి మారుతుందని చాలామంది ఊహించలేదు' అంటున్న నైరిక సిబ్బంది వృత్తి నైపుణ్యాలను మరింతగా మెరుగుపరచడంపై దృష్టి పెట్టింది. 'స్ప్రింట్' పోగ్రాం ద్వారా కొత్త ఐడియాలను ప్రోత్సహించడం నుంచి ప్రయోగాలు చేయడం వరకు ఎన్నో చేసింది.

'నైరిక ఎవరు చెప్పినా వినడానికి ఇష్టపడుతుంది. ఒక ప్రాజెక్ట్‌లో భాగంగా సమర్థులైన ఉద్యోగులను ఒకచోట చేర్చే నైపుణ్యం ఆమెలో ఉంది. న్యూ జనరేషన్ స్టైల్ ఆమె పనితీరులో కనిపిస్తుంది' అంటారు గోద్రెజ్‌లోని సీనియర్ ఉద్యోగులు.



'గోద్రెజ్ అండ్ బోయ్స్' చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ జంషెడ్ గోద్రెజ్ సోదరి స్మితా గోద్రెజ్ కూతురే నైరికా హోల్కర్. ఇండోర్ రాజ కుటుంబానికి చెందిన యశ్వంత్‌రావు హోల్కర్‌ను ఆమె పెళ్లి చేసుకుంది.

దశాబ్ద కాలానికి పైగా ఇంజనీరింగ్-ఫోకస్డ్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీలో కీలక బాధ్యతలు తీసుకొని రాణించడం అంత తేలికేమీకాదు. ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. ఆ సవాళ్లను తన సామర్థ్యంతో అధిగమించి గోద్రెజ్ మహాసామ్రాజ్యంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకుంది నైరికా హోల్కర్.

గ్లోబల్ లీగల్ స్ట్రాటజీ నుంచి స్త్రీ సాధికారతకు పెద్ద పీట వేయడం వరకు కంపెనీలో తనదైన ముద్ర వేసింది.

2030 నాటికి...


కోవిడ్ తరువాత కొత్త ప్రాధాన్యత రంగాలను... ఉత్పత్తులు, సేవలను మెరుగు పరిచే అవకాశాలను గుర్తించాం. కార్బన్ తీవ్రతను తగ్గించాలనుకుంటున్నాం. ఎనర్జీ ప్రొడక్టివిటీని రెట్టింపు చేయాలనుకుంటున్నాం. పర్యావరణ హిత ఉత్పత్తుల నుంచి 32 శాతం ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. రాబోయే కాలంలో కంపెనీ ఆదాయాన్ని రెట్టింపు చేయాలనేది మా లక్ష్యం.

– నైరికా హోల్కర్

ప్రయాణ కథనం

గమ్యాలు చెప్పే కథలు

వేసవి వస్తే ప్రయాణాలు గుర్తుకు వస్తాయి. విమానం ఎక్కితే మొబైల్ ఫోన్‌ను ఎయిర్‌ప్లేన్ మోడ్‌లో ఉంచాలి. కాని ఈ ప్రయాణాల వెనుక చాలా రాజకీయాలు ఉంటాయంటోంది షెహనాజ్ హబీబ్. అమెరికాలో ప్రొఫెసర్‌గా ఉన్న ఈ కేరళ వనిత స్థానిక సంపదను 'డిస్కవరీ' చేయడానికే సామ్రాజ్యవాదులు ప్రయాణాలు చేశారని చెబుతుంది. సగటు మనిషి ప్రయాణాలకు ఎన్ని అడ్డంకులున్నాయో ఆమె పుస్తకం 'ఎయిర్‌ప్లేన్ మోడ్' విశదంగా తెలియజేస్తోంది. ట్రావెల్ రైటర్ షెహనాజ్ పరిచయం.





షెహనాజ్ హబీబ్

'ప్రయాణాల్లో కూడా వివక్ష ఉంటుంది' అంటుంది షహనాజ్ హబీబ్. 'మీ ఒంటి రంగు, మీ పాస్‌పోర్ట్ రంగు మీ ప్రయాణం సులభం చేయవచ్చో, జటిలం చేయవచ్చో నిర్ణయిస్తాయి' అంటుందామె.

అమెరికాలోని బే పాత్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేసే షహనాజ్ హబీబ్ కేరళలోని ఎర్నాకుళంలో ఒక సామాన్య కుటుంబంలో జన్మించింది. కాని ఆమె నేర్చిన ఇంగ్లిష్ భాష, ఆమె వ్యక్తీకరణ ఆమెకు విశేషమైన గుర్తింపు తెచ్చి పెట్టింది. అమెరికాలోని వ్యాసకర్తల్లో ఆమెకు గుర్తింపు ఉంది. న్యూయార్క్ టైమ్స్‌లో షహనాజ్ హబీబ్ వ్యాసాలు వస్తాయి. కేరళ రచయిత బెన్యమిన్ రాసిన ఒక నవలను 'జాస్మిన్ డేస్' పేరున షహనాజ్ మలయాళంలో అనువదిస్తే ప్రతిష్టాత్మక 25 లక్షల రూపాయల జె.సి.బి. పురస్కారం లభించింది. కవిత్వం, కథలతో పాటు ట్రావెలోగ్స్ కూడా రాసే షహనాజ్ ఇటీవల వెలువరించిన యాత్రా కథనం 'ఏరోప్లేన్ మోడ్'. అమెరికాలోనూ ఇండియాలోనూ విడుదలైన ఈ పుస్తకం యాత్రల విషయంలో కొత్త చూపును కలిగిస్తోంది.

'ప్రపంచ దేశాల పర్యటనలు తెల్లవాళ్లకు ఒక రకంగానూ రంగు తక్కువ ఆసియా, ఆఫ్రికా దేశాల వారికి ఒక రకంగానూ జరుగుతాయి. అమెరికా, యూరప్ దేశాల వారి తెల్లరంగు చూడగానే వారి ప్రయాణాలకు ఒక విలువ, గౌరవం ఉన్నాయని భావిస్తారు. వారిని అధికారులు చూసే పద్ధతి వేరుగా ఉంటుంది. అదే బ్రౌన్, బ్లాక్ కలర్ ఉన్నవారికి అన్నీ ఆటంకాలే. ఇక అమెరికా పాస్‌పోర్ట్ ఉండి, వారు తెల్లవారైతే వారికి వీసా క్యూలన్నీ లేనట్టే. అమెరికా పాస్‌పోర్ట్ ఉంటే చాలా దేశాలకు అసలు వీసాయే అక్కర్లేదు. అంటే ఒక మనిషికి ప్రయాణ గౌరవం పాస్‌పోర్ట్ వల్లే వస్తోందన్న మాట. దీనినే నేను పాస్‌పోర్టిజమ్ అంటాను' అంటుంది షహనాజ్.

సంస్కృతి, సంపదల కోసం..

'17, 18 శతాబ్దాల్లో యాత్రీకులకు యూరప్ ప్రభుత్వాలు నిధులు ఇచ్చేవి. అలా ఇచ్చేది యాత్రికులను గౌరవించడానికి కాదు. వారు దేశ దేశాలు తిరిగి అక్కడి సంస్కృతులు, పంటలు, డబ్బు, బంగారం, వస్త్రాలు, మతాలు... వీటన్నింటి గురించి సమాచారం తెస్తే ఏ దేశాన్ని ఏ విధంగా కబళించవచ్చో ఆ ప్రభువులకు తెలిసేది. ఖండాలు, దేశాలు వాటిలోని ప్రజలు అనాదిగా జీవిస్తున్నా ఈ యూరోపియన్ యాత్రికులు వారిని 'డిస్కవరీ' చేశామని చరిత్రలు రాసుకున్నారు. కాని ఆ చరిత్రల్లో స్థానికులను ఏ విధంగా తుడిచి పెట్టారో ఉండదు. అలాగే ఇప్పుడు బ్రిటన్, యూరప్, ఆస్ట్రేలియా, జపాన్‌ల నుంచి ప్రపంచం తిరిగే పర్యాటకులకు వారి దేశాల్లోని పాఠ్య పుస్తకాల్లో తమ దేశాలు ఏయే దేశాలను ఎలా ఆక్రమించాయి, ఎలా దోచుకున్నాయో తెలియజేయరు. యాత్రల వెనుక చాలా చరిత్ర ఉంటుంది. అది తెలుసుకోవడం అవసరం' అంటుంది షహనాజ్.

ఎన్నో అందాలు..

'టూరిజమ్‌ను ఒక వ్యసనంగా మార్చారు. దీని వెనుక చాలా వ్యాపార ఎత్తుగడ ఉంది. కొత్త ప్రాంతాలు చూడకపోతే వెనుకబడతారనే భావజాలం సృష్టించారు. మా నాన్న ఎక్కడికీ తిరగడానికి ఇష్టపడే వాడు కాదు. మా అమ్మకు కొత్త ప్రాంతాలు చూడటం ఇష్టం. ఇద్దరూ కరెక్టే. ఈ టూరిజమ్‌లో కూడా తెల్లవారి దేశాలకే గిరాకీ ఎక్కువ. కాని ఆఫ్రికాలో ఎన్నో అందమైన దేశాలు ఉన్నాయి. ఇథియోపియాలోని అండర్ గ్రౌండ్ చర్చ్‌లను చూస్తే మతి పోతుంది. కాని వాళ్లకు ప్రమోట్ చేసుకోవడానికి డబ్బు లేదు. ప్రతి దేశంలో సాంస్కృతిక చిహ్నాలుంటాయి. వాటి ఘన చరిత్ర ఉంటుంది. అయితే దానిని వర్తమానంలో ప్రతీకారాలకు ఉపయోగించకూడదు' అంటుందామె.

కిచెన్ టిప్

● బంగాళాదుంపతో చేసే ఫ్రెంచ్ ఫ్రై స్ ఎక్కువ సమయం కరకరలాడుతూ ఉండాలంటే రెండు దఫాలుగా వేయించాలి. మొదటి దఫా ఒక మోస్తరుగా (తెల్లగా ఉండగానే) వేయించి తీసి ఒక పాత్రలో వేసి



చల్లారిన తర్వాత మూత పెట్టి ఫ్రీజర్‌లో పెట్టాలి. నాలుగు గంటల తర్వాత ఫ్రీజర్ నుంచి తీసి మరోసారి (ఎర్రగా వచ్చేవరకు) వేయించాలి.



పనీర్ స్వచ్ఛమైనదేనా?

ఏం కొంటున్నామో! ఏం తింటున్నామో!!

పనీర్‌తో ఎన్ని రకాలు వండవచ్చో తెలుసా! అలాగే ఒక కేజీ పనీర్ తయారు కావాలంటే ఎన్ని పాలు కావాలో తెలుసా? పాలను విరగ్గొట్టి నీరు మొత్తం కారిపోయే వరకు బరువు పెట్టి ఎదురు చూసే సమయం ఎవరికీ ఉండడం లేదు. పైగా మనం ఇంట్లో తయారు చేసే పనీర్ మెషీన్‌లో చేసినట్లు క్యూబ్స్‌గా రావడం కష్టం. రెస్టారెంట్‌లో తిన్న పనీర్‌లాగ ముక్కలుగా ఉంటే తప్ప పిల్లలు ఇష్టపడరు. ఇంకేం చేస్తాం... రెడీమేడ్‌గా మార్కెట్‌లో దొరికే పనీర్ తెచ్చుకుని సింపుల్‌గా వండేస్తాం.

పనీర్ ఆరోగ్యానికి మేలు చేస్తుందని తెలిసిన తర్వాత ఇటీవల పనీర్ వాడకం పెరిగింది. అయితే వాడకం పెరిగినంత వేగంగా పనీర్ తయారీ పెరుగుతోందా? పనీర్ లభ్యత పెరుగుతోంది కానీ సహజమైన పనీర్ తయారీ జరగడం లేదు. మార్కెట్‌లో దొరికే పనీర్‌లో అసలు కంటే నకిలీ ఎక్కువ. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఇటీవల ఢిల్లీ- ముంబయి ఎక్స్‌ప్రెస్ హైవే మీద ఉన్న ఫుడ్ స్టాల్స్‌ను తనిఖీ చేసినప్పుడు 13వందల కిలోల నకిలీ పనీర్ దొరికింది. దొరికింది గోరంతే, నిజానికి నకిలీ పనీర్ వ్యాపారం కొండంత జరుగుతోంది. మనం ఇంట్లో వండుకోవడానికి కొనుక్కున్న పనీర్ అసలుదా కల్తీదా అని తెలుసుకోవడానికి ఇంట్లోనే పరీక్షించుకోవడానికి మూడు పద్ధతులను తెలియచేసింది ఎఫ్ఎస్ఎస్ఏఐ.

● పనీర్ కొద్దిగా ఒక పాత్రలోకి తీసుకుని నీరు పోసి వేడి చేసి అందులో నాలుగైదు చుక్కల అయోడిన్ వేయాలి. పనీర్ నీలం రంగులోకి మారితే అది కల్తీ అని అర్థం. అసలైన పనీర్ అయితే రంగు మారదు.

● పనీర్‌ని నీటిలో ఉడికించిన తర్వాత చల్లటి నీటిలో వేయాలి. అదే నీటిలో కందిపప్పు పది గింజలు వేయాలి. పది నిమిషాల సేపు కదిలించకుండా ఉంచాలి. నీరు లేత ఎరుపు రంగులోకి మారితే ఆ పనీర్ కల్తీ అని అర్థం. రంగు మారకపోతే నిర్భయంగా ఆ పనీర్‌ను వాడుకోవచ్చు.

● ఇంత ప్రక్రియ లేకుండా వాసన ద్వారా కూడా పనీర్ స్వచ్ఛతను గుర్తించవచ్చు. కంపెనీ ప్యాకింగ్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్ర లేకుండా లూజ్‌గా అమ్ముతుంటారు. ఆ పనీర్‌ను కొద్దిగా చేతిలోకి తీసుకుని వాసన చూడాలి. పాల వాసన వస్తే అది మంచి పనీర్. అప్పుడు రుచి చూడవచ్చు. మెత్తగా పాల రుచిని గుర్తు చేస్తుంటే కొనుక్కోవచ్చు. అలా కాక నమిలినప్పుడు రబ్బర్‌లాగ సాగుతుంటే దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ కొనవద్దు. అలాగే పాలతో చేసిన పనీర్ అయినా సరే పుల్లటి వాసన వస్తుంటే అది సహజమైనదే అయినా తాజాగా లేదని అర్థం. దానిని కూడా కొనకూడదు.

● నిర్ధారిత అధీకృత ముద్ర, కంపెనీ ప్యాకింగ్ ఉన్న పనీర్ కొనేటప్పుడు కూడా దాని కాల పరిమితిని సరి చూసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్ చూడకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ కొనకూడదు.

పాల ఉత్పత్తిని మించిన పాల ఉత్పత్తులు మార్కెట్‌లో రాజ్యమేలుతున్నాయి. పాల వ్యాపారులు ఒకప్పుడు పాలను కల్తీ చేసేవాళ్లు. ఇప్పుడు నకిలీ పాలను తయారు చేస్తున్నారు. మనం ఏం తింటున్నామో? ఎక్కడ తింటున్నామో? ఎల్లవేళలా జాగ్రత్తగా ఉండాలి. మన గురించి మనమే నిశితంగా పరిశీలించుకోవాలి, పరీక్షించుకోవాలి.

సాక్షి బిజినెస్

శనివారం
4-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
733	172
73,878	22,475

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,141	△	300
డోజోన్స్	38,646	△	421
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,213	△	41
డాక్స్	18,002	△	105
హాంగ్‌సెంగ్ (శుక్రవారం ముగింపు)	3,105	▽	8
నికాయ్ (గురువారం ముగింపు)	38,236	▽	38

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,191	▽	136
బంగారం (99.5 స్వచ్ఛత)	70,906	▽	135
వెండి (కేజీ)	79,989	△	270

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఛార్జీలతో	81.84	85.13
£	బ్రిటన్ పౌండ్	ఛార్జీలతో	102.36	106.93
€	యూరో	ఛార్జీలతో	87.44	91.55
¥	జపాన్ ఎన్ (100)	ఛార్జీలతో	43.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఛార్జీలతో	52.71	56.97
S$	సింగపూర్ డాలర్	ఛార్జీలతో	59.29	63.53
SAR	సౌదీ రియాల్	ఛార్జీలతో	21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	ఛార్జీలతో	21.85	23.62
¥	చైనా యువాన్	ఛార్జీలతో	10.39	12.39

ఎంఆర్‌ఎఫ్ డివిడెండ్ రూ. 194

క్యూ4 లాభం రూ. 396 కోట్లు



న్యూఢిల్లీ: టైర్ల తయారీ దిగ్గజం ఎంఆర్‌ఎఫ్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 16 శాతం ఎగసి రూ. 396 కోట్లను అధిగమించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,842 కోట్ల నుంచి 8 శాతం పుంజుకుని రూ. 6,349 కోట్లకు చేరింది. వాటాదారులకు తాజాగా షేరుకి రూ. 194 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇప్పటికే రూ. 3 చొప్పున రెండుసార్లు డివిడెండ్లు చెల్లించింది. వెరసి గతేడాదికి మొత్తం రూ. 200 డివిడెండ్ ఇచ్చినట్లయ్యింది. కాగా.. పూర్తి ఏడాదికి ఎంఆర్‌ఎఫ్ నికర లాభం రూ. 769 కోట్ల నుంచి రూ. 2,081 కోట్లకు దూసుకెళ్లింది. మొత్తం ఆదాయం రూ. 23,008 కోట్ల నుంచి రూ. 25,169 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో శుక్రవారం ఎంఆర్‌ఎఫ్ షేరు బీఎస్‌ఈలో 4 శాతం పతనమై రూ. 1,28,500 వద్ద ముగిసింది.

టైటన్ నికర లాభం ప్లస్

రూ. 771 కోట్లుగా నమోదు ● షేరుకి రూ. 11 డివిడెండ్



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ డైవర్సిఫైడ్ దిగ్గజం టైటన్ కంపెనీ లిమిటెడ్ చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతం పుంజుకుని రూ. 771 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది (2022–23) క్యూ4లో రూ. 736 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా రూ. 9,419 కోట్ల నుంచి రూ. 11,472 కోట్లకు ఎగసింది. నిర్వహణ లాభం(ఇబిటా) 6 శాతం మెరుగై రూ. 1,109 కోట్లకు చేరింది. ఇబిటా మార్జిన్లు 0.9 శాతం నీరసించి 9.9 శాతానికి పరిమితమయ్యాయి. ఇక పూర్తి ఏడాదికి టైటన్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 3,274 కోట్ల నుంచి రూ. 3,496 కోట్లకు బలపడింది. మొత్తం ఆదాయం రూ. 38,675 కోట్ల నుంచి రూ. 47,501 కోట్లకు జంప్‌చేసింది. వాటాదారులకు షేరుకి రూ. 11 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.

టైటన్ షేరు బీఎస్‌ఈలో 1 శాతం నష్టంతో రూ. 3,535 వద్ద ముగిసింది.

గోద్రెజ్ ప్రాపర్టీస్ రికార్డ్

రూ. 471 కోట్లు లాభం ● బుకింగ్స్‌లోనూ కొత్త రికార్డ్



న్యూఢిల్లీ: రియల్టీ రంగ దిగ్గజం గోద్రెజ్ ప్రాపర్టీస్ మార్చి త్రైమాసికంలో 14 శాతం వృద్ధితో రూ. 471 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఒక త్రైమాసికానికి ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికంకాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 1,839 కోట్ల నుంచి రూ. 1,915 కోట్లకు బలపడింది. అమ్మకాల బుకింగ్స్ రెట్టింపై రూ. 9,519 కోట్లను తాకాయి. ఇక పూర్తి ఏడాదికి సైతం నికర లాభం రూ. 571 కోట్ల నుంచి రూ. 725 కోట్లకు జంప్ చేసింది. మొత్తం ఆదాయం రూ. 3,039 కోట్ల నుంచి రూ. 4,334 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో లాభాలతోపాటు.. బుకింగ్స్‌లో సరికొత్త రికార్డ్ సాధించినట్లు ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ ఫిరోజ్‌షా గోద్రెజ్ పేర్కొన్నారు. బుకింగ్స్ 84 శాతం దూసుకెళ్లి రూ. 22,527 కోట్లను తాకినట్లు వెల్లడించారు. ఈ బాటలో 2024–25 రూ. 27,000 కోట్ల విలువైన బుకింగ్స్ సాధించే వీలున్నట్లు అంచనా.

గోద్రెజ్ ప్రాపర్టీస్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.5 శాతం లాభంతో రూ. 2,570 వద్ద ముగిసింది.

అదానీ గ్రీన్ నేలచూపు

లాభం 39 శాతం క్షీణత ● రూ. 310 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీ చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 39 శాతం క్షీణించి రూ. 310 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,977 కోట్ల నుంచి రూ. 2,806 కోట్లకు నీరసించింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 2,053 కోట్ల నుంచి రూ. 2,379 కోట్లకు పెరిగాయి. దీంతో లాభాలు ప్రభావితమయ్యాయి. కార్యకలాపాల సామర్థ్యం 35 శాతం ఎగసి 10,934 మెగావాట్లకు చేరగా.. పునరుత్పాదక విభాగం నుంచి 2,848 మెగావాట్లు జత కలిశాయి. వీటిలో సోలార్ 2,418 మెగావాట్లు, విండ్ 430 మెగావాట్లు చొప్పున ఉన్నాయి. వెరసి దేశీయంగా 10,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం కలిగిన తొలి కంపెనీగా అదానీ గ్రీన్ ఎనర్జీ ఆవిర్భవించింది.

అదానీ గ్రీన్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.6 శాతం బలపడి రూ. 1,797 వద్ద ముగిసింది.

రికార్డు గరిష్టం నుంచి నిఫ్టీ వెనక్కి..

అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాలు ● 74 వేల స్థాయి దిగువకు సెన్సెక్స్



ముంబై: ఆరంభ లాభాలు కోల్పోయిన స్టాక్ సూచీలు శుక్రవారం భారీ నష్టాలతో ముగిశాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్(–2%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(–1%), భారతీ ఎయిర్‌టెల్(–2%), ఎల్‌అండ్‌టీ (–3%) క్షీణించి సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. వారాంతాపు రోజున సెన్సెక్స్ 733 పాయింట్లు పతనమై 73,878 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 172 పాయింట్లు నష్టపోయి 22,475 వద్ద నిలిచింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 484 పాయింట్లు పెరిగి 75,095 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 147 పాయింట్లు బలపడి 22,795 జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్టం (75,095) నుంచి 1630 పాయింట్లు కోల్పోయి 73,465 వద్ద, నిఫ్టీ ఆల్‌టైం హై స్థాయి (22,795) నుంచి 447 పాయింట్లు క్షీణించి 22,348 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చింది.

● సెన్సెక్స్ ఒకశాతం పతనంతో బీఎస్‌ఈలో రూ.2.25 లక్షల కోట్లు హరించుకుపోయాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం విలువ రూ.406 లక్షల కోట్లకు దిగివచ్చింది.

భారత్‌లో యాపిల్ జోరు

మార్చిలో రెండంకెల వృద్ధి నమోదు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ దిగ్గజం యాపిల్ భారత్ మార్కెట్లో జోరు కొనసాగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా మార్చి త్రైమాసికంలో కంపెనీ 90.8 బిలియన్ డాలర్ల ఆదాయం సాధించింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 4% తగ్గినప్పటికీ భారత్‌లో మాత్రం బలమైన రెండంకెల వృద్ధితో సరికొత్త రికార్డు నమోదు చేయడం విశేషం. అంతర్జాతీయంగా మార్చి త్రైమాసికంలో ఐఫోన్ల విక్రయాలు 10.4 % క్షీణించి 45.9 బిలియన్ డాలర్లకు వచ్చి చేరాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-5-2024	
విశాఖ	460–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	450–00
విజయవాడ	450–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	445–00
వరంగల్	447–00
రిటైల్ ధర	5.50

అతి నియంత్రణలతోనే వాహనాల రేట్లకు రెక్కలు

బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్

పుణే, బిజినెస్ బ్యూరో: కాలుష్యాన్ని కట్టడి చేసే పేరిట అతి నియంత్రణలు, అధిక స్థాయి జీఎస్‌టీలను అమలు చేయడం వల్లే వాహనాల రేట్లకు రెక్కలు వచ్చాయని బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ వ్యాఖ్యానించారు. బ్రెజిల్ వంటి దేశాల్లో మోటార్‌సైకిళ్లపై పన్నులు 8–14 శాతం శ్రేణిలో ఉండగా దేశీయంగా మాత్రం అత్యధికంగా 28 శాతం జీఎస్‌టీ ఉంటోందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో వాహనాల ధరలను తగ్గించే పరిస్థితి ఉండటం లేదని, దీంతో నిర్వహణ వ్యయాలైనా తగ్గే విధంగా వాహనాలను రూపొందించడం ద్వారా కొనుగోలుదారులకు కొంతైనా ఊరటనిచ్చే ప్రయత్నం జరుగుతోందని బజాజ్ చెప్పారు. 125 సీసీ పైగా సామర్థ్యం ఉండే స్పోర్ట్స్ మోటార్‌సైకిళ్ల విభాగంలో తమకు ముప్పై రెండు శాతం మేర వాటా ఉందని, దీన్ని మరింతగా పెంచుకునే దిశగా డబుల్ ఇంజిన్ సర్కార్ నినాదం తరహాలో డబుల్ ఇంజిన్ కారోబార్ (కార్యకలాపాలు) వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు రాజీవ్ చెప్పారు.



బజాజ్ ఆటో తాజాగా పల్సర్ ఎన్‌ఎస్ 400జీ మోటార్ సైకిల్‌ను ఆవిష్కరించింది. ప్రారంభ ఆఫర్ కింద దీని ధర రూ. 1,85,000గా (ఢిల్లీ ఎక్స్‌షోరూం) ఉంటుంది. డెలివరీలు జూన్ మొదటివారం నుంచి ప్రారంభమవుతాయని సంస్థ ఎండీ రాజీవ్ బజాజ్ తెలిపారు. స్పోర్ట్స్ సెగ్మెంట్‌లో తమ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు ఇది తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు పల్సర్ బైకులు 1.80 కోట్ల పైచిలుకు అమ్ముడైనట్లు బజాజ్ వివరించారు. పరిమిత కాలం పాటు వర్తించే ఆఫర్ కింద కొత్త పల్సర్‌ను రూ. 5,000కే బుక్ చేసుకోవచ్చు. నాలుగు రంగుల్లో ఇది లభిస్తుంది. శక్తివంతమైన 373 సీసీ ఇంజిన్, 6 స్పీడ్ గేర్ బాక్స్, ఎలక్ట్రానిక్ థ్రోటిల్ తదితర ప్రత్యేకతలు ఇందులో ఉంటాయి.

> సీఎన్‌జీ మోటార్‌సైకిల్‌ను జూన్ 18న ఆవిష్కరించనున్నామని రాజీవ్ చెప్పారు. ఇది ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ బైక్ అన్నారు.



సెలెక్ట్ మొబైల్స్ మెగా సేల్ ఆఫర్లు

హైదరాబాద్: మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ సంస్థ 'సెలెక్ట్ మొబైల్స్' ఆరవ వార్షికోత్సవం సందర్భంగా మెగా సేల్ ఆఫర్లు ప్రకటించింది. ప్రతి మొబైల్ కొనుగోలుపై ఉచిత బహుమతి పొందవచ్చు. స్మార్ట్ ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై ప్రత్యేక ఆఫర్లు అందిస్తుంది. ఎస్‌బీఐ కార్డుపై 7.5% తక్షణ డిస్కౌంట్, బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలుపై రూ.4000 తక్షణ క్యాష్ బ్యాక్ ఇస్తుంది. సెలెక్ట్ మొబైల్స్ స్టోర్లలో ఈ మెగా సేల్ ఆఫర్లు జూన్ 4 వరకు అందుబాటులో ఉంటాయని సంస్థ సీఎండీ వై.గురు తెలిపారు.

సినిమా

కన్నప్పకి బై బై


● విష్ణు మంచు, అక్షయ్ కుమార్

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ 'కన్నప్ప'కి బై బై చెప్పారు. తన పాత్రకి సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేసిన ఆయనకి చిత్ర యూనిట్ వీడ్కోలు పలికింది. విష్ణు మంచు హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్‌బాబు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన షెడ్యూల్‌లో అక్షయ్ కుమార్ జాయిన్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా తన సీన్లకు సంబంధించిన షూట్‌ను ఆయన పూర్తి చేశారు. ''అక్షయ్ కుమార్‌గారి నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ ప్రయాణం ఎంతో విలువైనది'' అని సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు విష్ణు మంచు. ''ధైర్యవంతుడైన యోధుడు, శివ భక్తుడైన కన్నప్ప కథతో ఈ చిత్రం అద్భుతంగా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది'' అన్నారు మేకర్స్.


● నయనతార

టాక్సిక్‌లో..?

యశ్ 'టాక్సిక్' సినిమాలో నయనతార భాగం కానున్నారా? అంటే అవుననే టాక్ కన్నడ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. యశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'. మలయాళ నటి–దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ, శ్రుతీహాసన్ వంటి స్టార్స్ పేర్లు వినిపించాయి. అలాగే యశ్‌కు సోదరి పాత్రలో కరీనా కపూర్ నటిస్తారనే ప్రచారం జరిగింది. దీనికి తోడు తాను సౌత్ సినిమా అంగీకరించినట్లు ఆ మధ్య కరీనా స్వయంగా వెల్లడించారు. అది 'టాక్సిక్' సినిమానే అనే ప్రచారం సాగింది. అయితే తాజాగా షూటింగ్ కాల్షీట్స్ సర్దుబాటు చేయలేని కారణంగా ఈ ప్రాజెక్ట్ నుంచి కరీనా కపూర్ తప్పుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ ప్లేస్‌లో నయనతారను తీసుకోవాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. 2010లో ఉపేంద్ర నటించిన 'సూపర్' కన్నడలో నయనతారకు తొలి సినిమా. వార్తల్లో ఉన్న ప్రకారం నయనతార 'టాక్సిక్' సినిమా చేస్తే.. పద్నాలుగేళ్ల తర్వాత ఆమె కన్నడ సినిమా చేసినట్లవుతుంది.


● అమితాబ్ బచ్చన్ ● రజనీకాంత్

ముంబైలో వేట్టయాన్

ముంబైలో అమితాబ్ బచ్చన్‌ను కలిశారు వేట్టయాన్. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వేట్టయాన్' (వేటగాడు). అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా ఇతర లీడ్ రోల్స్‌లో దుషారా విజయన్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం ఇది. తాజాగా 'వేట్టయాన్' చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన 'వేట్టయాన్' షూటింగ్ షెడ్యూల్‌లో రజనీ, అమితాబ్ కాంబినేషన్ సీన్స్ తీశారు. ఇప్పుడు ముంబైలో వీరిద్దరి కాంబినేషన్ సీన్స్‌ను తీస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్.

వినోదాల పతంగ్


● ప్రీతి పగడాల

ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించారు. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్‌పై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను డైరెక్టర్ బుచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈ సినిమా కాంటెస్ట్ విజేతలకు సిరిసిల్ల మాజీ ఎంపీ రాజయ్య బహుమతులు అందించారు. బుచ్చిబాబు సానా మాట్లాడుతూ– ''ఈ మూవీ కంటెంట్ చూస్తుంటే 'హ్యాపీ డేస్' సినిమాలా ఘన విజయం సాధిస్తుందనిపిస్తోంది'' అన్నారు. ''తొలిసారి పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'' అన్నారు ప్రణీత్ ప్రత్తిపాటి. ''వేసవిలో మా సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అన్నారు సంపత్ మక. ప్రణవ్ కౌశిక్, ప్రీతి పగడాల, వంశీ పూజిత్, క్రియేటివ్ నిర్మాత నాని బండ్రెడ్డి పాల్గొన్నారు.


● మెరిల్ స్ట్రీప్

ఈ పురస్కారం నాకో గౌరవం

హాలీవుడ్ ప్రముఖ నటి మెరిల్ స్ట్రీప్ ఆనందంలో ఉన్నారు. ఈ నెల 14 నుంచి 25 వరకు ఫ్రాన్స్‌లో 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ చలన చిత్రోత్సవాల్లో ప్రతిష్టాత్మకమైన పామ్ డి ఓర్ గౌరవ పురస్కారానికి మెరిల్ స్ట్రీప్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆమె ఆనందానికి కారణం ఇదే. ఈ ఏడాది మెరిల్ స్ట్రీప్‌కు, జపాన్‌కు చెందిన యానిమేషన్ 'స్టూడియో ఘిబ్లి' నిర్వాహకులకు, హాలీవుడ్ దర్శక–నిర్మాత జార్జ్ వాల్టన్ లూకాస్ జూనియర్ (స్టార్ వార్స్, ఇండియానా జోన్స్' ఫేమ్)కు పామ్ డి ఓర్ పురస్కారాన్ని అందజేస్తారు. ఈ సందర్భంగా మెరిల్ స్ట్రీప్ మాట్లాడుతూ – ''ఈ అవార్డుకు ఎంపిక కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. అంతర్జాతీయ నటీనటులు, ఫిల్మ్ మేకర్స్ భాగస్వామ్యులైన కాన్స్ వేదికగా నేను ఈ అవార్డును గెలుచుకోవడం అనేది ఫిల్మ్ మేకింగ్ రంగంలో నాకు దక్కిన ఓ అద్భుత విజయంగా భావిస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు. గతంలో హాలీవుడ్ స్టార్స్ టామ్ క్రూజ్, మైఖేల్ డగ్లస్, హారిసన్ ఫోర్డ్ వంటివారికి పామ్ డీ ఓర్ అవార్డు దక్కింది.

లక్ష్మీ కటాక్షం ఫిక్స్


● 'లక్ష్మీ కటాక్షం' పోస్టర్


సాయికుమార్ లీడ్ రోల్‌లో సూర్య దర్శకత్వం వహించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం: ఫర్ ఓట్'. ఆమని, వినయ్, అరుణ్, దీప్తీ వర్మ, చరిష్మా శ్రీకర్, హరి ప్రసాద్, సాయికిరణ్ ఏడిద కీలక పాత్రల్లో నటించారు. యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న రిలీజ్ కానుంది. ''పొలిటికల్ సెటైరికల్ డ్రామా, కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలో ఓటర్లే వారి ఓటుకు ఒక రేటు నిర్ణయించుకుని నాయకులని ముప్పు తిప్పలు పెట్టే సీన్లు ప్రేక్షకులను నవ్విస్తాయి'' అన్నారు మేకర్స్.

ఎమోషనల్ సత్య

సమాజంలో తన వల్ల తన తల్లిదండ్రులకు ఏ మాత్రం ఇబ్బంది కలగకూడదని ఆలోచించే ఓ కొడుకు కథతో రూపొందిన చిత్రం 'సత్య'. హమరేశ్, ప్రార్థనా సందీప్ జంటగా నటించిన ఈ చిత్రానికి వాలీ మోహన్‌దాస్ దర్శకుడు. శివమ్ మీడియా పతాకంపై శివ మల్లాల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా వాలి మాట్లాడుతూ– ''సత్య' సినిమా హిట్ అయి, యూనిట్‌కి మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. ఈ నెల 10న తెలుగు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో సినిమాను విడుదల చేయనున్నాం'' అన్నారు శివ మల్లాల.


● హమరేశ్, ప్రార్థన

1980లో ఏం జరిగింది?


● రాకేష్ వర్రె

'ఉయ్యాలా జంపాలా, మజ్ను' చిత్రాల ఫేమ్ విరించి వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. రాకేష్ వర్రె హీరోగా నటించారు. వైశాలీ రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాశ్ ఇతర పాత్రల్లో నటించారు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా విరించి వర్మ మాట్లాడుతూ– ''1980లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా పొలిటికల్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించాం. ప్రేమకథలు దర్శకత్వం వహించిన నేను 'జితేందర్ రెడ్డి' లాంటి యాక్షన్ మూవీ చేయడంతో క్రేజ్ నెలకొంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వీఎస్ జ్ఞాన శేఖర్, సంగీతం: గోపీ సుందర్.

సూపర్ డీలక్స్...


● అషు రెడ్డి

'బిగ్ బాస్' ఫేమ్ అషు రెడ్డి, చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, జై భారత్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నవదీప్, పవన్ గోపరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో హారిక పాత్ర చేస్తున్న అషు రెడ్డి లుక్‌ను విడుదల చేశారు. ''మహిళా సాధికారతను చాటి చెప్పే నేపథ్యంలో 'యేవమ్' ఉంటుంది. నా బాడీ సూపర్ డీలక్స్ అని అషు రెడ్డి కిక్ ఇచ్చే పాత్రలో ఎందుకు కనిపించబోతున్నారో తెలియాలంటే 'యేవమ్' విడుదల వరకు ఆగాల్సిందే. కొత్త కథతో వైవిధ్యమైన నరేషన్‌తో ఈ సినిమా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

ఏమయ్యిందే...


● అశోక్ గల్లా, మానస

అశోక్ గల్లా, వారణాసి మానస జంటగా నటిస్తున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. 'హనుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'ఏమయ్యిందే..' అంటూ సాగే తొలి పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సురేష్ గంగుల రాసిన ఈ పాటని ఈశ్వర్ దాతు పాడారు.